# ఐ లవ్ యు రా..కన్నా!

నవల

## ఆర్.దమయంతి



కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 55

1 

# ఐ లవ్ యు...రా..కన్నా!!
## - ఆర్.దమయంతి

## ప్రోలోగ్..

సముద్రం ఎప్పటిలా లేదు.

తదేకంగా అటే చూస్తున్న ఆమెకి సిక్స్త్ సెన్స్ చెబుతోంది...ఏదో జరగకూడనిది జరగబోతున్నట్టు..

ఒక చిన్న సంద్రపుటల కదిలింది. చాలా సాధారణంగా...కాని కాదు. అది అల కాదు.

సిస్మిక్ .. సీ వేవ్.. విధ్వంసాన్ని మోసుకొస్తూ..

తన జీవితంలో జరిగిన చిన్న సంఘటనలా.....

సముద్ర గర్భం పగులుతోందా..తన గుండె లానె?!

లేక..

ఇంకా ఇంకా.. లోతులనుంచి అగ్ని పర్వతాలు బద్దలౌతున్నాయా!?..

వాల్కనొ!?!!

జ్వాలాముఖి అయ్యిందా!?.

సముద్రగర్భం నుంచి కదిలిన  అల.. హాఫ్ మీటర్ కంటె మించదేమో! కాని దాని ప్రవాహ వేగం మాత్రం ఊహించలేం.  ఐదు వందల మైళ్ళ స్పీడ్‌తో ముందుకొస్తూ..ముంచుకొస్తోంది..క్షణంలో శిఖరమంత ఎత్తు ఎగసి.. భూమిని విరిచి ఒక భయంకర బీభత్సాన్ని సృష్టించడానికి సిధ్ధమౌతూ....

ఆమెకి అర్థమైపోయింది..!

అది మామూలు సముద్రపు పోటు కాదు..కనీ వినీ ఎరుగని విపత్తు...

సునామి.జల.ప్రళయ సృష్టి..కాదు లయ..

తన జీవితంలో తన ప్రమేయం లేకుండా జరిగిన ఒక చిన్నతప్పుకి  దేవుడు వేసే శిక్ష కూడ ఇలాగే వుంటుందా.. శాపం- చివరికిలాగే విధ్వంసమే మిగిల్చి పోతుందా...!?

అయిపోయింది..సముద్రం రెండుగా చీలింది..ఒకటి కుంగుతూ..మరొకటి పొంగుతూ..

కను రెప్పపాటులో అనూహ్యంగా జరిగిపోయిన దుర్ఘటనలో అప్పటికే సగం జనం కొట్టుకుపోయారు...

మిగిలిన జనం పరుగులు తీస్తూ కల్లోలెత్తిపోతున్నారు..హాహాకారాలతో భీతిల్లుతున్నారు..ప్రాణ భయంతో పరుగులు తీస్తున్నారు..

తరుముతున్న మృత్యువంత వేగంగా అతను పరిగెత్తలేక.. భయంతో పడిపోయాడు. రెండుకాళ్ళూ తడి ఇసుకలో లోతుకల్లా ఇరుక్కుపోయాయి..పైకి లాగుదామన్న అతని ప్రయత్నాలన్ని బెడిసికొట్టాయి...

*ఆమె అలాగే చూస్తోంది..*

*వెనకనుంచి. జలమృత్యువు అతన్ని కబళించబోయే ఆఖరి క్షణంలో అతడి కళ్ళల్లొ కనిపించిన చావు చూపు ఎంతగా ఒళ్ళు గగుర్పాటుగా వుందో అంటే-సునామి కంటేనూ భయానకంగా వుంది..*

*వెన్ను జలదరించింది. ..ఆమె లేచి నిల్చుంది నిదారుగా..అడుగులేస్తోంది - స్థిరంగా*

*ఐతే - సముద్రానికి- దూరంగా మాత్రం కాదు.*

*అభిముఖంగా!*

*సునామిని తనలోకో..*

*తనలోని సునామిలోకో...*

*ఆహ్వానించుకుంటూ..*

*లిప్త పాటు కాలానికి సైతం అచట తావు లేదిక....*

*అంతకంటె ముందే.కప్పేస్తూ..కాదు..కాటేస్తూ- సముద్రం.*

*తర్వాత-*

*ఇప్పుడక్కడ ఎవ్వరూ లేరు- అతను కాని.. ఆమె కానీ..జనం కాని..*

*ఏవీ లేవు-- భూమి కానీ, ఆకాశం కానీ..అణువు కాని, పరమాణువు కానీ.*

*ఇక అక్కడ ఏమీ మిగల్లేదు-.*

*ఎటుచూసినా..*

*సముద్రం తప్ప..!!*

*****

# నవలలోకి

'మనిషి గొప్ప కాల జ్ఞాని

-సంతోషం.

కానీ,

క్షణంలో ఏం జరిగేదీ చెప్పలేడు

-విషాదం.'

అదో అందమైన ఇల్లు. చిన్న విల్లా లాంటి ఇల్లు.

ఆ ఇంటి వైభవమంతా..చుట్టూ పరచుకున్న ఆకుపచ్చదనానిదే...

ఎలా అంటే- వెయ్యి గజాల స్థలంలో-

ఇల్లు కట్టింది మాత్రం కేవలం మూడొందల గజాలలో మాత్రమే అంటే ఆశ్చర్యంగా వుండొచ్చు..

కాని మనిషి ప్రకృతికి ఎంత దగ్గరగా బ్రతకాలో నేర్పుతుంది ఇల్లూ, ఇంటి పచ్చదనమూను.

గేటు తీయగానే-

కుడి ఎడమలుగా - మనిషంత ఎత్తులో రంగురంగుల క్రోటన్ మొక్కలు.. తీరుగా నిలబడి చూస్తూ రండి రండంటూ - ఆప్యాయంగా ఆహ్వానిస్తూ వుంటాయి..యజమాని ప్రకాష్లా..

వాటి ముందు వరసలో నేలబారుగా..చిన్నచిన్న రంగురంగుపూలమొక్కలు.. కల్మషమెరుగని నవ్వులు నవ్వుతూంటాయి.. ఇంటి ఇల్లాలు దేవకిలా..

అక్కడనుంచి ఇంట్లోకి తివాచీ పరిచినట్టుగా..లాన్..

మెట్ల మీద ఎత్తైన..వసారా ఇల్లు అది. వసార నిండుగా చిన్న, పెద్దా కుండీల నిండా ఆకుపచ్చని మొక్కలే కనిపిస్తాయి....

వసారా స్తంభాలని చుట్టుకుని, చిత్రమైన లతాంగులు, విచిత్రమైన పూలు పూసుకుంటూ..పైపైకి ఎగబాకి పోతూ వుంటాయి..

ప్రాంగణంలో విరబూసిన గులాబీల అందాలు కళ్ళు తిప్పుకోనీవు..చేమంతులు సిరులొలకబోస్తూ..మందారాలు ముగ్ధత్వాన్ని ఒలకబోస్తూ..ముచ్చట చేస్తాయి..

మరో ప్రత్యేకత ఏమిటంటె- ఇల్లెప్పుడూ ఇంటా, బయటా ఏసీ వేసినట్టుంటుంది.

ఐతే, చల్లదనమంతా కేవలం ఇంటి ముందటి- ఈ చిన్ని గార్డెనింగ్తో రాలేదు.

ఇంటి వెనకున్న అసలైన తోటవల్ల అని తెలుస్తుంది చూస్తే...

ఐదొందల గజాల విశాలమైన పెరటి తోటలో-.

జామా మామిడి,కొబ్బరి, సపోట, నిమ్మ, దానిమ్మ,పనస చెట్లు అనీ ఒక క్రమశిక్షణలో మిలిటరీ డిసిప్లిన్లో పెరుగుతున్నట్టు కనిపిస్తాయి..

వేప చెట్టు ఏపుగా పెరిగి కొమ్మలార్చుకునుంటుంది.....!

మారేడు ఎప్పటికప్పుడు కొత్త దళాలేసుకుంటూ బిజీగా అయిపోతూంటుంది...మామిడి పూతలు ఘుమాయిస్తూ, కొబ్బరి చెట్లు వింజామరిస్తూ..కొమ్మలు వీస్తూ..రెమ్మలు తలలూపుతూ..మొత్తానికి అక్కడి పవనాలు ఏవో కొత్త రాగాలు కట్టుకుంటూ సరికొత్త గొంతులతో గానాలు పోతూ వుంటాయి.. ఒక పక్కగా సంపంగి- బలమైన మానుమీద ఒరిగి, నవ్వుతూ పరిమళిస్తూంటుంది...

తీగమల్లి భద్రంగా పందిరిని అల్లుకునుంటుంది...

సన్నజాజి, విరజాజి పూలు పూసిపూసి రాలిపడిపోతూంటాయి....

మరో పక్కన ఆకు కూరల మడి..

ఆనుకునే కాయగూరల మొక్కలు..

గోడ వారగా చాటంత ఆకులేసుకుని పిచి పిచ్చిగా ఒకదాని కొకటి చిక్కులు పడిపోతూ పాకిన గుమ్మడి, దోస తీగలు..

ఏ తీగకా తీగగా, ఏ మొక్కకామొక్కగా, ఏ చెట్టుకా చెట్టుగా.. దేని అందం దానిదే అన్నంత అందంగా, తీరుగా వుంటుంది. చక్కని క్రమశిక్షణకి అబ్బురమేస్తుంది చూపరులకి.

అనుభవజ్ఞుడైన తోటమాలి పనితనానికి ప్రతీకగా కనిపిస్తుందీ తోట...

ఈశాన్య మూలగా పెద్ద బావి. దాని చుట్టూ విశాలంగా- సిమెంట్ చేసిన చప్టా వుంది. అక్కడే కూర్చుని నింపాదిగా బావి నీళ్ళ స్నానం చేసుకోడానికన్నట్టు...నల్లరాయి గట్టు కూడా వుంది..

కొంచెం దూరంగా ఇటుక రాళ్ళ పొయ్యి మీద ఎర్రగా మెరుస్తూ రాగి కాగు కనిపిస్తుంది. పొయ్యి కింద-మధ్యకు చీల్చిన ఎండు కట్టెలు.. మన పూర్వీకుల పెరటిని తలపుకు తెస్తూ వుంటాయి..

ఒక ఎథెనిక్ లుక్ కోసమని కాదు కానీ, స్టైల్‌కి మాత్రం ఇదొక గుర్తు అనే చెప్పాలి.

తోట మధ్యలో-

ఆర్టిస్టిక్ గా చెక్కిన నల్ల చెక్క ఫ్రేండ్ ప్లాంక్...వుడెన్ ఊయ్యల కనిపిస్తుంది.మెత్తటి పరుపు మీద..అద్దాలు గలీబులు దిళ్ళూ.. అమరికతో మరింత అందంగా..చూడంగానే వెళ్ళి కూర్చుందామనేంత టెంప్‌టింగ్ గా వుందా ఊయ్యాల!

ఎదురుగా, ఎత్తైన గోడ మీంచి ఏటవాలుగ కట్టిన రాక్ వాటర్ ఫాల్ ...తెల్లవెన్నెల కాంతులతో..... తోట జలపాతపు అందం రాత్రిళ్ళు మరింత ద్విగుణీకృతం చేస్తూ వుంటుంది..

ఆ తోటలోకి ఎవరు వెళ్ళినా తిరిగి రావడానికి ఇష్టపడరు.

ఇక్కడ కొన్ని క్షణాలు గడిపినా చాలు జీవితం మీద కొత్త ప్రేమ పుట్టుకొస్తుంది. జీవితంలో విజయాన్ని సాధించాలి అన్నంత ప్రేరణ కల్పిస్తుంది- తోట.

ఇక ఇంటి డాబా మీద బెంగుళూరు పెంకు పరిచిన ఒకే ఒక్క పెద్ద వసారా గది.మిగిలిందంతా గార్డెనే. టెరస్ గార్డెన్ .. గది పక్కనుంచి పైకి మెలికల మెట్లు.. ఎక్కి వెళితే-రూఫ్ గార్డెనే పరుచుకుని కనిపిస్తూ..

గార్డెన్ హౌస్!

మొత్తానికి ఇల్లు అందమైన సుందర వనంలా వుంటుంది!

అందరూ కలలు కనే ఇలాటి ఇల్లు చాలా తక్కువమందికే సాధ్యమౌతుంది నిజంలోకి.

అసలు ఇల్లెప్పెడూ వనంలోనే వుండాలి. కాని దురదృష్టమేమిటంటే, గజం స్థలాన్ని సైతం డబ్బుతో కొలుస్తున్నారు..అది చదరపుటడుగులలో కోట్లవుతున్నయి.. ప్రాణం లేని కాగితాల గుట్టల్లో మునిగే వాడికి ఊపిరినిచ్చే ఆక్సిజన్ ఏదీ?

ప్రకాష్‌ని ఎంతోమంది బిల్డర్స్ వొచ్చి అడిగేవారు..కాళ్ళు పట్టుకున్నంత పని చేసేవారు..ఒక పాలెస్ కట్టి, సగం ఇస్తామన్నారు.

ప్రకాష్ ససేమిరా నో అనేసాడు. ఒక్కో స్క్వేర్ ఫీట్‌కి ఒక్కో కోటి ఇస్తామన్నా ఇవ్వనన్నాడు.

వాళ్ళ వేధింపులు భరించలేక..ఒకానొక టైంలో ఐతే, ఇంటి బయట ఒక నోటీస్ బోర్డ్ కూడా పెట్టాడు. దయచేసి బిల్డర్స్ ఎవరూ సంప్రదించి, తన కాలాని వృథా చేయొద్దని..

చాలమంది చెబితే వింటూంటం - బిల్డర్ అపార్ట్‌మెంట్‌కి ఇమ్మని వెంటపడ్డాడనీ,..ఇక కాదనలేక ఇచ్చామని అంటుంటారు. అక్కడికి తామేదొ దయా గుణంతో అయాచితంగా స్థలాన్ని (బడికో, గుడికో) దానం చేసినంత పోజు పెట్టి మరీ చెబుతూంటారు.

నువ్వు డబ్బుకు వొంగో, లొంగో ఐతే తప్పు..నీ చోటెవరు లాక్కుంటారు? నీ స్థలంలొ నీ సొంత ఇంటి కల పరచుకున్నా, కాంక్రీట్‌తో నింపుకున్నా అంతా నీ చేతిలోనె వుంటుంది..అంటాడు ప్రకాష్.

భూమిని అమ్ముకోక, ఇప్పటిదాక అలా వూరికే వదిలేయడం వల్ల అతనెంతగా నష్టపోతోందీ చెప్పె వాళ్ళకి అతను ఘాటుగా జవాబిస్తాడు. తల్లినీ, పెళ్ళాన్నీ తాకట్టు పెట్టి చేసే వ్యాపారాలలో కూడా డబ్బుంది.

ప్రపంచాన్ని కొనేంత డబ్బుంది. అలా అని బిజినెస్ చేస్తామా? ఇదీ అంతే..భూమి కూడా తల్లి లాంటిదే. అని అంటాడు. చెంపమీద కొట్టినట్టు. ఎవరూ మళ్ళీ నోరెత్తకుండా..

అతను మట్టిని ప్రేమిస్తాడు. మొక్కల్ని ప్రేమిస్తాడు. ఇంటిని ప్రేమిస్తాడు. ఇల్లాలిని ప్రేమిస్తాడు. అందుకే కామోసు..నిత్యానందభరితుడిలా కనిపిస్తాడు.

వూరికే అన్నా రా మరి పెద్దలు?

చిన్నచిన్న ఆనందాలే- పెద్దపెద్ద అనుభూతులవుతాయని!?

ప్రకృతి వొళ్ళో జీవించడం ఒక వరం. అందరికీ దొరకని అవకాశం. ఈ మహానగరాలలో కోటికొకరికైనా దక్కని సౌభాగ్యం..ప్రకాష్, దేవకీలకి దక్కిందంటే ఎంత గొప్ప అదృష్టమో కదూ!

నిజమే. వాళ్ళిద్దరికీ అన్నీ వున్నయి, కానీ, అన్నీ ఇచ్చిన దేవుడే- అసలైనదేదో ఇవ్వకుండా ఏడిపిస్తూ వుంటాడు. ఆయనదొక స్ట్రాటెజీ. ఎవరెంత తలబద్దలు కొట్టుకున్న ఆయన మారడు. ఆయన తీరూ మార్చుకోడు. ఆ మాటకొస్తే మనకసలు అర్థమే కాదు. మరే! అదే గనక ఐతే ఆయన లీలా సూత్రధారి ఎలా అవుతాడు!? మనమెలా పాత్రాధారులవుతాం!?

ఆయనొక అద్భుతమైన ప్లే రైటర్..అందులో గొప్ప గొప్ప సన్నివేశాలుంటాయి..

అందుకే చెబుతారు.

చదవగలిగితే జీవితమంత మంచి కావ్యం కాని,

చూడగలిగితే- ఉత్కంఠభరితమైన నాటకం కాని మరోటి వుండదని.

ఒక అనుకోని సంఘటనతో, జీవితాలని కుదిపేయడమో..మనిషిని నిలువెల్లా కదిపేయడమో...

లేదా..

అర్థం కాని ఒక పాత్రని హఠాత్తుగా ప్రవేశపెట్టి మనసుల్ని అతలాకుతలాం చేసి పడేయడమొ..

ఏమొ, ఇది మోదమో ఖేదమో తెలీని.తెలుసుకోనీయని..ఒక మాయాజాలం చేసే మాంత్రిక దర్శకుడు అదృశ్యుడు .

ఆయన ఆడిస్తున్నవింత నాటకంలో..

ఒక విషాద ఘట్టంలో నలిగిపోతున్నారు ఇప్పుడా ఇద్దరూనూ...

****

సూది పడితే వినిపించేంత నిశ్శబ్దంగా వుందా గది.

విశాలమైన మంచం మీద నిద్రపోతున్న దేవకిని తదేకంగా చూస్తూ కూర్చున్నాడు ప్రకాష్.

అప్పటికి రెండు రోజులనుంచి ఈ లోకంతో సంబంధం లేదన్నట్టు.. అలా నిద్రపోతూనే వుందామె...

అది మామూలు నిద్ర కాదు. గాఢమైన మత్తు ప్రభావం వల్ల పోతున్న నిద్ర.

రెండురోజులుగా ఆమెది అదే పరిస్థితి.

నిద్ర..నిద్ర..నిద్ర..

జాలి లేని లోకాన్ని చూడలేక –కసికొద్దీ..

కక్ష కట్టిన దేవుని మీద జాలి కొద్దీ..

అన్నట్టుగా..

ఒక అసహాయత..ఏమి చేయలేని నిస్సహాయతా..కొండంత దిగులు అన్నీ ఒక్కసారిగా ఆమె మీద దాడి చేసాయి. ఆమెని బేలగా చేసాయి.

అసలే మనసు సున్నితం. అది సొమ్మసిల్లి,, స్పృహ తప్పిపోతూ వుంటుంది.

ఎమోషనల్ ట్రోమా ..

విరహ బాధ పడలేక ఊర్మిళ, వగపు వ్యధ చెందలేక దేవదాసు అందుకేనేమో మత్తుని ఆశ్రయించారు!!

మనసు గాయాలకు మరుపే మందు. దానికి మంచి ఔషధం మత్తు!

అందుకే ఆమెకి రెస్ట్ పేరుతో డాక్టర్లు-

మత్తు బిళ్ళలు, ఇంజెక్షన్లు ఇచ్చి మరీ నిద్రబుచ్చుతున్నారు. దేవుడు చేసే అన్యాయాలను మరచిపోవడం కోసం- మనిషికిచ్చే ట్రీట్‌మెంటే మత్తుమందులివ్వడం, నిద్రబుచ్చడమూ..

మనిషికి నిద్ర ఆరోగ్యం. కానీ, బలవంతపు నిద్ర మాత్రం అశాంతికి సంతకం. తాత్కాలిక మరపుకు అదొక తాయిలం.

ఎవరైనా బాధలో వున్నప్పుడు ఓదార్పుగా ఒక మాట అంటాం.

మర్చిపోవాలి అని.

ఎలా మరుస్తాం?! కొన్ని పోగుట్టుకున్న వాళ్ళని, కొన్నయినా మిగలని జ్ఞాపకాలని, మోసం చేసిన కాలాన్ని, దక్కకుండా పోయిన అనుభూతుల్నీ ఎలా మరచిపోతామనీ..?! ఎలా మరపుకొస్తాయనీ..

జీవమున్నంత కాలం- జ్ఞాపకమూ

హృదయమున్నంత కాలమూ- గాయమూనూ..కాదా!

మనసున్నవారికే బాధలెందుకో!

ఆమె ఎప్పుడెప్పుడు కళ్ళు తెరిచి చూస్తుందా అని అతను ఆత్రంగా ఆమె ముఖంలో ముఖం పెట్టి చూస్తున్నాడు.

"ఆమెకి రెస్ట్ అవసరం" డాక్టర్ మాటలు గుర్తుకొచ్చాయి. ..

"ఆకాష్..నన్ను నిద్రపోనీయవూ!..ఇక ఎప్పటికీ మెలకువ రానీయని నిద్ర పోనివ్వవూ..ప్లీజ్ .." భార్య బేలగా అడుగుతున్నట్టు అనిపించిందతనికి.

గుండెల్ని ఎవరో మెలిపెట్టినట్టయింది.. కదిలిపోతూ..ఆమె చేతిని తన రెండు చేతుల్లో బంధించాడు...

వేళ్ళ కొసల్ని స్పర్శిస్తూ..అరచేతిని తాకుతూ..ఆమె రక్తంలో తన ప్రేమని ఇంకించేస్తూ..అప్రయత్నంగా అతని కళ్ళు నీటి చెలమలవుతున్నయి..

ఎన్ని యుగాల బంధానుబంధాల అనుస్పర్శ అది మరి..

చేతిలో చేయితనం..ఒక చేతనత్వం..

జన్మల తరబడీ తను దేవకి కోసమే పుడుతున్నాడనేంత ప్రేమ....

నిజానికి ఒక్క క్షణమైన తోచదతనికి- ఆమె ఎదురుగా లేకపోతే!

అతనికళ్ళ ముందు కదులుతూండాలి...వెనకనుంచి ఆమె మాటలెప్పుడూ వినిపిస్తూండాలి...

ఆమె నవ్వే అతనికి చలనాచలనాలు..ఆమె వుంటేనే శ్వాసా జీవాలు..

తనంటే ఎవరనీ? ఆమే కదూ!? ..తనువైనా మనసైనా..తనకి దేవకే..

కాని ఆమెకి?

దేవకి వైపునుంచి ఆలోచిస్తే.. ఈ వొక్క విషయంలోనె అర్థం కాదతనికి..

అసలు ఆడది మగాడికెప్పుడూ అర్థం కాదు.

'నువ్వుంటే చాలు నందనవనాలెందుకు, బృందావనాలెందుకంటుంది' కాని, నిజానికి-మగాణ్ణి ప్రలోభ పెట్టె అందమైన అబద్ధం మాత్రమేనేమో అదంతానూ?.

నీ రాకతో నా జీవితం సంపూర్ణం అంటూ శుభం కార్డ్ మొగుడి చేతికిచ్చేయదు.. తర్వాత చాలా చాలానే కోరికలుంటాయి. తీరని అసంతృప్తులూ వుంటాయి.

భర్తతో సమానంగా స్త్రీ ఇచ్చే ప్రయారిటీ కేవలం ఒక్కరికే!

వాళ్ళే పిల్లలు. ! (చాలావరకు భర్తలొప్పుకునే నిజమిది. పిల్లలు పుట్టాక భార్య మారిపోయిందని చిన్న బోయే భర్తలకి ఇదంతా అనుభవైదకమే.)

ఇంకా వివరంగా చెప్పాలీ అంటె-

స్త్రీ పరిపూర్ణత్వాన్ని సిద్ధింపచేసుకోవడంలో భర్త పాత్ర కేవలం చిన్నదేనేమో..

తన లాగానే.

ఆలోచిస్తూ- నిట్టూర్చాడతను. గాఢంగా...

పెళ్ళై పదేళ్ళవుతోంది. ఐదేళ్ళపాటు పిల్లలొద్దనుకున్నారు. తర్వాతనుంచి దేవకి తపన మొదలైంది. మరో ఐదేళ్ళు వేచి చూసింది. తను ప్రొఫెషన్‌లో బిజీ అయిపోయాడు. భవన నిర్మాణాల ప్లానింగుల్లో పగలూ రాత్రి అని లేకుండా గడిపాడు. ఆమె పిల్లలకోసం పడే తపనని ఎప్పటికప్పుడు తేలిగ్గా కొట్టిపడేసేవాడు.

కాని ఆమె ఆ విషయాన్ని అంత తేలికగా తీసుకోలేకపోయింది. కారణం ఒకటె. ఆమె స్త్రీ.

పిల్లల దిగులు రోజురోజుకీ ఎక్కువవుతూ వచ్చింది..ఒంటరిగా కుమిలిపోతూ..కన్నీళ్ళు కారుస్తూ..కాల క్రమేణా..ఆమె గుండెలో చీకటంతా కళ్ళకిందకొచ్చి చేరుతూ..నవ్వినా, విషాదం తొంగిచూస్తూ...

హఠాత్తుగా ఆమెని గమనించిన ప్రకాష్.. చలించాడు..దగ్గరికి తీసుకుని ధైర్యం చెప్పాడు..."ఏమిట్రా ? దిగులేమిటి? అహ్? మనకు కాకపోతె ఎవరికి పుదతారట పిల్లలు? చూడు. నిన్ను తల్లిని చేసే బాధ్యత నాది. సరేనా .." అంటూ నవ్వించే ప్రయత్నాలు చేసాడు. కాని ఆమె నవ్వలేదు.

ఇక విషయాన్ని సీరియస్‌గానే తీసుకోవాల్సి వొచ్చిన పరిస్థితి ఎదురైంది అతనికి...

ఇద్దరూ కలిసి నగరంలో ప్రముఖ గైనకాలజిస్ట్ దంపతులని సంప్రదించారు..అన్ని రకాల పరీక్షలు అయ్యాయి..

దేవకి ఎంతో ఆత్రంగా చూస్తున్న రిజల్ట్స్ వచ్చాయి.

ఆ రోజు..తనే స్వయంగా వెళ్ళాడు ఆసుపత్రికి. రిపోర్ట్ చేతిలోకి తీసుకుని చదివాడు..

బాడ్ న్యూస్....

ఆ రోజు ఇద్దరి జీవితాల్లోనూ చాలా చెడ్డ రోజు..

'పిల్లలు పుట్టడం కష్టం' ..డాక్టర్ మాటలు చెవిలో ఇంకా మార్మోగుతున్నాయి ..అది కాదు అతని అసలు బాధ. ఈ వార్తని- దేవకికి ఎలా చెప్పడం..చెప్పాకా, ఆమె మానసిక పరిస్థితి ఎలా వుంటుంది? వూహించడానికే- అతనికి భయమేసింది.

దేవకికి ఏమీ చెప్పకపోయినా ఫర్వాలేదు..కాని నిజం మాత్రం చెప్పకూడదు.

నిజమే!

జీవితంలో కొన్ని కఠిన సత్యాలు దాగుంటాయి. అవి తెలీయనంతవరకె-జీవితం బాగుంటుంది.. తెలిస్తే విషాదంగా వుంటుంది. మోదాలని ఆమోదించినంత హాయిగా ఖేదాలని కూడా మోసేంతగా...ఈ హృదయాన్ని డిజైన్ చేయలేదెందుకనో దేవుడు!

మట్టిలోంచి మొలుచుకొస్తూ..విత్తనాన్ని ఛేదించుకుంటూ మొలకెత్తుతున్న మొలకని చూసి, తనకోసమే అది పుట్టినంతగా సంబరపడిపోయె దేవకి లాంటి అల్పసంతోషికి..తన గర్భం నుంచి ఒక్క శిశువూ పుట్టదనే సత్యాన్ని తను ఎలా చెబుతాడు..చెప్పటానికి తన నోరెలా వస్తుంది?..

అతని గుండె గొంతులోకి..కన్నీరు కంట్లోకి..

డ్రైవ్ చేస్తున్న చేయ్యే వొణికిందో.. కంటి చూపే చెదిరిందో..లేదా-.ఎదురుగా స్పీడ్‌గా వస్తున్న లారీనే అదుపు తప్పిందో తెలీదు..

క్షణంలో జరిగిందా దుర్ఘటన..

తను గావు కేక పెట్టిన చివరి గుర్తు.

కళ్ళు తెరిచి చూసేసరికి ఆసుపత్రి గదిలో వున్నాడు..బంధువులు..స్నేహితులు..నర్సులు..డాక్టర్లు..అందరూ కనిపిస్తున్నారు..

కాని అక్కడ తన ప్రాణం లేదేమిటి?

"దే..వీ..?"

"వస్తుంది..ఇంట్లో పని..వుంటేనూ..వుండిపోయింది.." కజిన్ అబద్ధం చెబుతున్నాడు..

వీళ్ళకేం తెలుసు దేవకి గురించి?!

తన కంటి చూపు. తన గుండె చప్పుడూ ఐన మనిషి ఇంట్లో ఎలా వుంటుంది? ఏదో జరిగింది.. దేవకికేదో జరిగింది..అతని మనసు కీడు శకిస్తోంది..

ఇంతలో డాక్టర్ వచ్చాడు..పేషెంట్‌కి స్పృహ వచ్చినందుకు వేసిన ఆనందం..క్షణంలొ చప్పున ఆరిపోయిందాయనకు- హార్ట్‌బీట్ చూసి..

పేషెంట్ పరిస్థితిని బట్టి- నిజాన్ని దాచడం కంటేనూ..ఆమెని తీసుకొచ్చి చూపించడమె మంచిదనే అభిప్రాయానికి వచ్చారు.

క్షణాలో..ఆమె అతని పక్కనే కనిపించింది. మామూలు స్థితిలో కాదు. బెడ్ మీద స్పృహ లేకుండా..ముఖాన్ని కప్పేస్తూ ఆక్సిజెన్ మాస్క్‌తో..

అతని గుండె చెదిరింది. అతని కళ్ళవెంబడి నీళ్ళు చూసి చెప్పాడు డాక్టర్..

"మీ భార్యకు ఏమీ కాలేదు. యాక్సిడెంట్ వార్త విని జస్ట్ షాక్ అయ్యారు. అంతే .. ఓ గంటలో మామూలై పోతారు. మీరేం వర్రీ అవ్వొద్దు." ధైర్యం చెప్పాడు..

అవేం వినలేదతను.

మెల్లగా చేయి జాచి ఆమె చేతిని తన గుప్పెట్లోకి తీసుకున్నాడు...

ఆమె వేళ్ళ కొసలనుండి..అరచేతుల్లోంచి..నరనరనరాల్లోకి..ఒక ప్రాణవాయువూదినట్టు..జీవం కదిలి జీవిలోకొచ్చి జేరినట్టు..

నువ్వూ నేనూ ఎన్ని జన్మలనుంచో కలిసే పుట్టినట్టు..ఈ స్పర్శానుబంధం శతసహస్ర జన్మానుబంధం..

మనిద్దరినీ విడదీసేది మరణమే కదూ?! వస్తే రాని..అందులోనూ కలిసే వుందాం....ఇలా ఒకరి చేతిలో ఒకరం చేతులేసుకుని.., నిన్ను నాతో కలుపుకుని, నేను నీతో కలుసుకుని..అదే లోకం కానీయి, మనం ఇద్దరం కాదు ఒకే ఒక్కరం...జన్మజన్మలుగా వుంటూనే వుంటాం..

టన్నుల పేజీలు చెప్పే ఒక ప్రేమ కావ్యం..ఒక చిటికెన వేలి స్పర్శ చెప్పగలదు కదూ..అదీ హృదయానికి సూటిగా అర్థమయ్యేలా..

వన్ టచ్ ఆఫ్ నేచర్ మేక్స్ ద హోల్ వరల్డ్ కిన్ అని అంటాడు షేక్స్పియర్ .

మొన్నటికి మొన్న వార్తల్లో చూడలేదు..మరణించిన శిశువుల్ని గుండెకు హత్తుకున్న తల్లి, తన హృదయ స్పర్శతో పిల్లల్ని సజీవుల్ని చేసుకున్న సంఘటన ఎలా మరచిపోతాం?

టచ్ ఈజ్ ఏ హార్ట్ లాంగ్వేజ్..యూనివర్సల్ లాంగ్వేజ్..

లిఖించలేని లిపి..

భాషకందని స్మృతి..ఒకానొక మధురానుభూతి

ప్రాణం పోసేగొప్ప సంజీవిని..

అప్పుడూ ఇలాగే ఆమెలో మెల్లగా కదలిక వచ్చింది..

గతంలోంచి బయటకొచ్చాడు ఒక్క వులికిపాటుతో!!

దేవకి కళ్ళిప్పి అతని వైపు చూస్తోంది..

అంత నీరసంలోనూ..ఆమె తన గురించి కాకుండా..అతని గురించి..

ఇంత రాత్రి పూట ప్రకాష్ తన పక్కన ఇలా కూర్చోవడమేమిటి?

ఆ పెరిగిన గడ్డం నలిగిన దుస్తులు, చెదిరిన జుట్టు, కళ్ళ నిండా దిగులు..

ఏమైంది? నా ప్రకాష్కి ఏమైందనీ?

ఉద్వేగంతో పైకి లేచే ప్రయత్నం చేస్తోంది..

అతనికి ప్రాణం లేచొచ్చినట్టయింది. భార్యస్పృహలోకి రావడం.

.. చటుక్కున కదిలి, ఆమె పక్కనే చోటు చేసుకుంటూ అన్నాడు.

"ఎలా వుందిరా..?" ముఖంలో ముఖముంచి లాలనగా అడుగుతున్నాడు.

తనకేమైందో..అదంతా గుర్తుకొచ్చింది. ఒక్కసారిగా.

ఔట్ హౌసులో అద్దెకున్న వాళ్ళు ఖాళీ చేసి వెళ్ళడం..అలవాటైన చిన్న పిల్లాడు హఠాత్తుగ మాయమైపోవడం...మనసంతా మంచు చేసేస్తూ కొండంత భారమై పోతూ..ఊపిరందక ఉక్కిరిబిక్కిరౌతూ..సోఫాలో ఒరిగిపోతుంటే..

లోపల్నుంచి లక్ష్మమ్మ పరిగెత్తుకు రావడం .

అంతవరకే తనకు గుర్తుంది..

"పానిక్ ఎటాక్స్...ఇప్పటికైతే ప్రాణ భయమేమి లేదు. కానీ, ఇలాగే తరచూ వస్తే మాత్రం పేషెంట్ కోమాలో కెళ్ళేప్రమాదం వుంతుంది. మళ్ళీ బయట కొచ్చే అవకాశం కొంతమందిలో చాలా తక్కువ కూడా వుండొచ్చు."

డాక్టర్ చెప్పిన ప్రమాద సూచనలు గుర్తుకొచ్చాయి అతనికి.

అప్రయత్నంగా అతని చేతులు ఆమె చెంపల్ని తాకాయి. "ఏమిట్రా ఇదంతా.. ఊఁ..? నువ్విలా వుంటె నాకేమైనా తోస్తుందా? అదంతా పక్కన పెట్టు. నీకేదైనా అయితే నేనిక ప్రాణాలతో వుం.." గొంతు పలకడం లేదు.

ఆమె చటుక్కున భర్త పెదాలని చేత్తో కప్పింది.

ప్రాణంలా చూసుకునే భర్తని మరచి, పరాయి పిల్లడి కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుంటోంది తను. ఎంత తెలివి తక్కువతనం కాకపోతే ఏమిటని? మరెంత మూర్ఖత్వం కాకుంటె!..తన దైవాన్ని ఇంతగ బాధ పెట్టటమేమిటి..

అవును. ప్రకాష్ దేవుడులాంటి వాడు కాబట్టే..తనని ఇలా భరిస్తున్నాడు. ఊరడిస్తున్నాడు.

అదే వేరే మగాడైతె, నీ మతి లేని చేష్టలకి నేనెందుకు సఫర్ అవ్వలంటూ ఛడా మడా చివాట్లేసి పడేయరూ?!

ఆమె రియలైజ్ అవుతోందని గ్రహించాడతను. తను చెప్పదల్చుకున్న రెండు ముక్కలు కూడా ఇప్పుడే చెప్పేయాలనుకున్నాడు.

ఆ తర్వాత ఆమె మూడ్ మారితేచెప్పడం కష్టమౌతుందని అతని బాధ..

"దేవీ..నువ్ చెప్పు. నీకు నేను..నాకు నువ్వు ఏమౌతాం?"

వినంగానే అంత బాధలోనూ ఆమెకి నవ్వొచ్చింది. పిల్లల్లేరని తను దిగులుపడ్డప్పుడల్ల ప్రకాష్ ఇలాగే అడుగుతూంటాడు. జవాబు చెప్పేంత వరకూ వదలడు. ఇప్పుడు కూడా అంతే.

అందుకే ఆమె గొంతు సవరించుకుని మెల్లగ చెప్పింది.

"మనం ఒకరికొకరం పిల్లలం అవుతాం"

"నో" కచ్చితంగా అన్నాడు.

మరి? అన్నట్టు చూసింది.

"నాకు నువ్వు భార్యవి. నీకు నేను భర్తని"

సన్నగా నవ్వింది.

"దేవీ..జరిగింది ఏదో జరిగిందిలే కాని, ఇక మీద జరగకుండా చూసుకుందాం. ఏమంటావ్?"

భర్త ఉపదేశ పర్వంలోకి వెళ్తున్నాడని అర్థమౌతోంది..

"అందుకని నేను ఒక నిర్ణయానికొచ్చాను. మన గెస్ట్ హౌజ్ ఇక ఎవ్వరికీ అద్దెకివ్వబడదు. భవనంలో మనుషులు తిరిగితే మంచిదని, దొంగలు రారని అని ఒక వేళ నువ్వెవరికైనా అద్దెకి ఇచ్చినా.. పిల్లలున్న వారికి.. ఇల్లు ఇవ్వ బడదు. అందులో నువ్వు చటుక్కున ఎత్తుకుని మోస్తావు చూడు..అలాంటి పసిపిల్లలున్న వారికి ఇల్లు అస్సలు..అస్సలంటే అస్సలివ్వబడదు అంతే. ."

అతను సున్నితంగానే చెప్పినా అది శాసనం చేసినట్టె వుంది..

ఇలాంటి సందర్భాలలో అతను చెప్పేది వినడం తప్ప మరో మాటకి ఛాన్స్ వుండదు. ఆమె శిరసావహించాల్సిందే.

ఈసారి, ఆమెకీ అతని మాటలు శాసనాలుగా లేవు. వాటి వెనక అతని మెత్తని మనసు..తనేమై పోతుందా అనే తపన..తన ప్రాణాల పట్ల అతనికున్న ఆర్తి., గుండె కింద తడి, సడి అన్నీ నిలువునా స్పర్శిస్తున్నాయి..అణువణువునూ పులకరింపచేస్తున్నాయి .

తనెన్ని సార్లు మరణిస్తుంటే అన్ని సార్లు అతనొచ్చి కొత్త జన్మనిస్తున్నాడు..ఎండిన మోడుని ప్రేమ వర్షంతో తడుపుతూ....బ్రతుకు పైన ఆశల చివుళ్ళను మొలకెత్తింప చేస్తూ..

ఆమె కళ్ళు కెరటాలౌతున్నాయి..

అది చూసి గుండెకి మరింత దగ్గర చేసుకున్నడామెని.

"ఆకాష్ ..! " అతన్ని కేవలం ఆమె మాత్రమే పిలిచే పిలుపు . అతనికి ప్రియమైన పిలుపు. ప్రేమైన పిలుపు. ఆమె చెబుతోంది.."నిన్ను చాలా కష్టపెట్టాను కదూ..ఇంకెప్పుడూ ఇలా చేయను. సారీ..నిజంగా సారీ" పశ్చాత్తాపంగా చెప్పింది.

"ఇట్స్ఓకె..ఒకే..కాని, నువ్వు నాకొక ప్రామిస్ కూడా చేయాలి. మనకి పిల్లలు పుట్టడం లేదని దిగులు పడటం కూడా మానేయాలి. ఏది? చెయ్యేసి చెప్పు"

చేయి సాచాడు.

ఆమె ఒక్క క్షణం ఆలోచించింది. తను బలహీనతలన్నీ, బలహీనంగా వున్నప్పుడే ఒప్పించి, ఒట్టేయించుకోవాలని అతను పడుతున్న తపన అర్థమైపోయింది..

"అబ్బ. పోదూ" చెయి తోసేసి, అతని నడుం చుట్టేసుకుంటూ చెప్పింది. "నాతో చెప్పించుకోవడం నీకిష్టమని నాకు తెల్సులే..ఐనా, మళ్ళీ మళ్ళీ చెబుతున్నా విను. ఆకాష్! నువ్ చాలు నాకు.ఇంకెవ్వరూ వొద్దు..మన మధ్య..సరేనా?" ఆమె మనస్ఫూర్తిగానే అంది.. మాటల్ని.

అతని పట్ల ఆమె ప్రేమ నిజమే. అనురాగమూ నిజమే. కాని, పిల్లలు లేరన్న దిగులు మాత్రం గొంతులో ఎప్పుడూ ధ్వనిస్తూనే వుంటుంది.

సరిగా ఇలాంటి సందర్భాలలోనే అతనికి చాలా గిల్టీగా వుంటుంది. .

ఎందుకంటే చెప్పలేడు..బహుశా ..నిజం దాస్తున్నందుకా..అబద్ధం చెబుతున్నందుకా? అతనే నిర్ణయించు కోలేకపోతున్నాడు...

ప్రస్తుతానికైతే ఒకందుకు సంతోషిస్తున్నాడు. ఇక పిల్లలెవరూ ఇంట్లోకి రారని..ఆమె మనసుని కదల్చరనీ....నిశ్చింత పడిపోయాడు.

ఐతే, సరిగ్గా అతనలా అనుకుని ఇరవై నాలుగ్గంటలైనా కాకముందే.

ఇంటి గేట్ తెరుచుకుని లోపలకడుగుపెట్టింది ఓ పాతికేళ్ళ అమ్మాయి..

ఆమె చేయి పుచ్చుకుని రెండేళ్ళ చిన్న కూడా..!!

## ౨

**గేట్ తెరుచుకుని లోపలికి రెండు అడుగులు వేసిందో లేదో..**

ఒక దేవవనంలోకి కొచ్చినట్టు..కళ్ళు విప్పార్చుకుని చూసింది...

బయట కాంపౌండ్ పొడుగునా – ఆకాశమే హద్దుగా ఎదిగి నుంచున్న అశోక వృక్షాలు,, యూకలిప్టస్ , మోదుగలు చూసి అబ్బో అనుకుంది కాని, లోపల ఇంత చక్కని గార్డెన్ వుంటుందని తనూహించలేదు.

ఇన్ని వర్ణ పత్రాల క్రోటన్స్ , ఇన్నేసి రంగుల పూలని.. కలిపి ఒకేసారి చూసే సరికి.. ఒక రిలాక్సేషన్ థెరపీ ఏదో తీసుకుంటున్న గొప్ప అనుభూతికి లోనయింది. మనసంతా తెలీని సంతోషంతో నిండిపోయింది. గుండెలనిండా గాలి తీసుకుని వదిలింది..

అక్కడి అందాల్ని ఒకొక్కటిగా, పరిశీలనగా చూడసాగింది..

సాయంత్రం–

నీళ్ళు తాగిన మొక్కలు మెల్లగా తలలూస్తున్నాయి.

జాజులూ, పారిజాతాలూ.. అరవిచ్చుకుని, లేత సుగంధాలు విరజిమ్ముతున్నాయి..

సడిలేని పిల్లతెమ్మెరలొచ్చి, జిల్మంటూ తాకి పోతున్నా యి.

కొద్దిగ తలపైకెత్తి చూస్తే...నీరెండలో మెరుస్తూ కనిపిస్తోంది- చిన్ని భవనం..

సంధ్యాకాంత తన కిరణాలని కుంచెగా చేసుకుని, ఇంటినీ,తోటని కళాత్మకంగా రంగులద్దుతోంది...సప్తవర్ణాల హరివిల్లుని చేస్తోంది.

విశాలమైన నల్లని మెట్లు, వాటి మీద మెలికల తెలుగు ముగ్గులు- ప్రాంగణానికి కొత్త శోభనిస్తున్నా యి..

మెట్లు దాటాక పెద్దపెద్ద ..గ్లాస్ తలుపులు..

గోడలకి పొడుగాటి కిటికీలు..వాటి ఫ్రెంచ్ డోర్లు సగం తెరుచుకునున్నాయి...

దేవతలు మాత్రమే ధరించె..ఒకానొక డెలికేట్ వస్త్రాల్లాంటి కర్టెన్స్ - సన్నగాలికి హాయిలుగా వూగుతూ వుండుండి బైటికి తొంగిచూసి, లోపలకు పారిపోతున్నయి.

ఎత్తైన భవనానికి- అదో గొప్ప హోసుతనాన్నిస్తోంది. .

ఆనందమూ, ఆశ్చర్యమూ, విస్మయమూ, వినూత్నమూ అన్నీకలిపి, ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వింతైన చకితత్వం ఆవహించి, చేతనాపహరణ జరిగిపోయినట్టుగా వుందామె పరిస్థితి.

చలించడం ఇష్టంలేనిదానిలా ..రెప్పలార్పితే- ఎక్కడ ఈ స్వప్నం చెదరిపోతుందా అన్నట్టుగా.. అలా నిలబడిపోయిందామే.. కదలబుద్ధి కావడం లేదు.

చూడంగానే కొంతమంది మనుషుల మీదకు మల్లెనే, కొన్ని ఇళ్ళ మీద కూడా కొత్త మమతలు రేగుతాయి. అనురాగాలు పుట్టించే శక్తి అందరిలోనూ వుండదు.అల్లాగే అన్ని ఇళ్ళూ ఆహ్లాదానుభూతుల్నివ్వవు..

కారణాలడిగితే చెప్పలేం. అలా ముద్ర పడిపోతుంది మనసులో! కొన్ని కట్టడాలతో- మనకి పూర్వ జన్మానుబంధాలున్నట్టు గాఢమైన నమ్మకం ఒకటి పూట్టుకొస్తూంటుంది.

అసలు, ఇళ్ళమాటకొస్తే-

కొన్ని ఇళ్ళు- -ధీటుగా వుంటాయన్నమాటే కానీ, డబ్బుకీ, డాబుకీ- దర్పంగా నిలుస్తాయి. మరి కొన్ని-అర్కిటెక్చర్ పనితనానికి-ప్రతీకలన్నట్టుంటాయి. ఇంకొన్ని మేడలు- ఇరుకిరుకుగా కట్టుంటాయి.. మరికొన్ని బహుళ అంతస్తులైతే - అద్దెకిచ్చే సత్రాలను గుర్తుకు తెస్తూంటాయి. రాజకీయ నాయకుల ఇళ్ళైతే- భవనమెత్తంత ఇనప గేట్లు బిగించి, పకడ్బందీలతో... కారాగార గృహాలకుమల్లే కనిపిస్తాయి.

కొన్ని ఇళ్ళు- ఎంత ధనం పోసి కట్టినా..ఎందుకో తెలీదు కాని, ఇంటి కప్పు మీంచి విషాదం జాలువారుతున్నట్టు.. దిగులుగుంటాయి..

ఎన్నున్నా చాలా కొన్నే.. ప్రత్యేకంగా ఆకర్షిస్తూ, ఆకట్టుకుంటాయి..

ఈ విషయంలో అందరకి తమ తమ ఆరాధనాగృహాలు వాటి తాలుకు తీయని జ్ఞాపకాలు. తప్పనిసరిగా వుంటాయి.

ఎంత గొప్ప దేశాలలో నివసిస్తున్నా అదెలాటి ఓషన్ వ్యూ రాంచ్ హౌసే అయినా...

బాల్యాన్ని గడిపిన - నికుంజాలని మరవగలమా!? ప్రేమించకుండా..వుండగలమా? ఊహు. మనవల్ల కాదు.

ఎందుకంటె-

ఇల్లు- మనసులో గుడి కట్టుకుని వుటుంది. ఈ గూడున్నంత కాలం -అది గుండెలో గుండెవుతుంది.

వూరొదిలి యాభయి యేళ్ళవుతున్నా సరె, పనికట్టుకుని, పుట్టిపెరిగిన ఇంటిని చూడ్డం కోసం వెళ్ళే వాళ్ళు ఎంతమందో ఈనాటికీ వున్నారు..

ఎందుకంటె- అక్కడ జ్ఞాపకమే ఒక పెద్ద ఇల్లు కాబట్టి!.

అందుకే అంటారు - ఎ హౌస్ ఈజ్ నాట్ బిల్ట్ బై బ్రిక్స్ బట్ విత్ హార్ట్స్ అండ్ ఎమోషన్స్ అని.

అలాంటిదే ఇదినూ అన్నట్టు.. ఆమెకీ భవనం విపరీతంగా నచ్చేసింది. ఇప్పుడామె ఒకటే అనుకుంటోంది.

-ఎలాగైనా తనొచ్చిన పని పూర్తి చేసుకుని తీరాలని! .

ఆమె ఆలోచనలకామెని వొదిలేసి..చిన్నా ఎప్పుడోనే అక్కడ్నుంచి జారుకున్నాడు. వాడికివన్నీ చాలా చిన్న విషయాలు మరి.

అక్కడ వాడిని ఆకర్షించిన ఒకేఒక్క విషయమేమిటంటె మెట్ల దగ్గర- పొదలో పడున్న రంగైన బాల్ .

అంత బిగ్‌బాల్ వాడెప్పుడూ చూడలేదు. అసలు ఏ బాల్ కనిపించినా పరిగెత్తుతాడు. బంతి అంటె పిచ్చి. అదుంటె చాలు. ఎంతసేపైనా ఆడతాడు.

అందులో ఇంత పెద్ద బాలంటే వాడిక ఆగుతాడా?

కొంచెం ముందుకెళ్ళి అదందుకోడానికి, బుడిబుడి అడుగులేస్తున్నాడు. దాన్నే చూసుకుంటూ...

దానికెదురుగా.. కేన్ కుర్చీలో కూర్చుని అదే బాల్ వైపు సాలోచనగా చూస్తోంది దేవకి.

రోజూ ఇదే సమయం..అదే బాల్‌తో అద్దెకుండె పిల్లాడు ఆడుకుంటుండేవాడు. తన టీ టైం, వాడు ఆడుకునే టైం రెండూ ఒకటె.

టీ సేవిస్తూ, వాడి ఆటని చూస్తూ...అప్పుడప్పుడూ తనూ బాల్ విసురుతూ, కిక్ కొడుతూ.. చిన్నపిల్లై పోయేది. మురిసిపోతూ వుండేది. ఇవాళ పిల్లాడు లేడు. బాల్ మాత్రం పడుంది.. మూలగా.

ఆమె మనసు మూలిగింది.

బాధగా- నిట్టూర్చింది.

ప్రపంచంలో ఏ సంపదైనా సరే, తమకు లేనిది ఇతరులు కలిగి వున్నప్పుడు, వాటిని వాళ్ళు ఆనందంగా అనుభవిస్తూ కనిపిస్తున్నప్పుడు... మన లోటు మనకు మరింత కొట్టొ చ్చినట్టు కనిపిస్తుంది. ఎవరో అద్దం పెట్టి చూపిస్తున్నట్టు..

అలాంటి సమయాలలో- తెలీకుండానే నిట్టూర్చడం సహజం.

సంపదలనేవి కొందరికి - మెటీరియల్ రూపంలో వుంటె..,మరి కొందరికి- ఇం మెటీరియల్‌గా వుంటాయి. ఏబ్‌స్ట్రాక్ట్ ప్రాపర్టీస్ అనొచ్చు. సహజసిద్ధమైనవై వుంటాయి అవి.

నిజానికి మనిషిని పూర్తిస్తాయిలో సంతృప్తి పరిచేవి రెండే రెండు సంపదలు..

ఒకటి- ఆర్థికం.

రెండు--హార్థికం.

మనిషనేవాడికి-

ఇహ సౌఖ్యాలతో బాటు.., హృదయ సౌభాగ్యాలూ కావాలి. తృప్తిగా బ్రతకడానికి.

అవి-

ఇల్లూ, పిల్లలు, కుటుంబం ప్రేమానురాగాలు. కష్టం పంచుకునే రక్తసంబంధీకులు, నీడలా వుండే ఆత్మీయులు. ఇవన్నీ కూడా సంపదలే..

మనసైనవి. మనవైనవి. నిజమైనవి.

విషాదం ఏమిటంటే- వున్నవాళ్ళు అదృష్టాన్ని గ్రహించలేరు. లేని వారు సంపాదించుకోలేరు..

దేవకి పరిస్థితీ అంతే..సంతానం కోసం తల్లడిల్లే తల్లి-

పిల్లల్ని చూసినప్పుడు...తనకు పిల్లలు లేని లోటు గుర్తొచ్చి నిట్టూరుస్తుంది. ఇదిగో ఇప్పట్లానే..

టీపాయి మీద పెట్టిన బిస్కెట్స్, చాక్లెట్స్, వెక్కిరిస్తూ కనిపించాయి. వెళ్ళిపోయిన పిల్లాడికి దేవకి కంటె, ఆమె ఇచ్చే లంచాలే ఇష్టం..

ఆమెకి చప్పున వాళ్ళ బామ్మ చెప్పిన సామెత గుర్తొచ్చింది.

'పరాయి పిల్లకి గాజులు తొడిగిస్తే పరువునష్టం... పైన పైకం నష్టం' అని.

'కాని, నీ విషయంలో ప్రాణం నష్టం కూడా. జాగ్రత్తా' అని చెప్పి మరీ వెళ్ళాడు ప్రకాష్ .

నిజమే. అద్దె పిల్లల మీద సొంత ప్రేమలు కూడదు మరి!

తన మీద తనే జాలిపడింది..

మళ్ళీ బాల్ వైపు చూడబోయి.. ఒక్కక్షణం- ఉలిక్కిపడింది.. ఆ వెనకే బిత్తరపోతూ.. వెంఠనే నిఠారై కూర్చుంది.

అక్కడ చిన్నవాడు-

నడుం మీద రెండుచేతులేసుకుని, కొంచెం ముందుకొంగి బాల్ వైపు తొంగి చూస్తున్నాడు.

వెన్నెల తునకలా..మెరుస్తూ..పాలబుగ్గలేసుకుని, బొద్దుగా ముద్దుస్తో..

వాడ్ని చూస్తూనే- జీవమొచ్చినట్ట నిపించిందామెకి.

కలా నిజమా అన్నట్టు.. తన కళ్ళని తనే నమ్మలేకపోతోంది.

అక్కడ గేట్ దగ్గర-

ఆమె కూడ. తన కళ్ళని తనే నమ్మలేకపోతోంది.

పరవశంలోంచి తేరుకుని స్పృహలోకొచ్చిపడింది. 'అరె. వీడేడి? ఎక్కడా?' చిన్నా కోసం వెదికాయి కళ్ళు.

కాస్తంత దూరంలో.. వెనకనుంచి చిన్నాని... అప్పుడు చూసింది. అంతే పై ప్రాణం పైనే పోతునట్టు.. కళ్ళు ఇంతింతయ్యాయి.

భయంతో..భీతితో..తెరిచిన నోరు తెరిచినట్టె వుండిపోయింది.

ఎందుకంటే- అక్కడ జరగబోతున్న ప్రమాదం అలాంటిది..

చిన్నాకి సరిగ్గ ఒక్కడుగు దూరంలో- సింహం లాంటి శునకం- మరో సెకనులో వాడిమీద దూకబోతోంది.

చావుదెబ్బ తగిలిన దానిలా.... "చి....న్నా..." ఆమె ఒక్కగావు కేక పెట్టింది.. పరిసరాలు దద్దరిల్లేలా. .

తల్లి పిలుపు విని, వెనక్కి తిరిగిన చిన్న, మీదకొస్తున్న సింహాన్ని చూసి, హడలిపోయాడు. పులిని చూసిన లేడి పిల్లలా గెంతి...ఒక్కసారిగా ముందుకురికి

క్షణంలో..బాణంలా వెళ్ళి దేవకి వొళ్ళోకి దూకాడు. అమాంతం గుండెలకి కరుచుకుపోతూ.. గట్టిగా.

ఊహించనైనా ఊహించని ఘటన.. ఎదమీద వాడి స్పర్శ ..ఆమె మాతృ హృదయాన్ని కదిపేసింది. సితార తీగని లేతగా మీటిన శబ్దం....తొలిసారిగా అమ్మతనపు కమ్మదనం..

పులకింతలతో కదిలిపోయింది.

కలా..నిజమా..లేదా దైవ ఘటనా?..

రోజూ పూజించే దేవుడు తనని కరుణించి, "ఇడుగో. వీణ్ణి తీసుకో" అంటూ ..తన వొళ్ళొ పడిసినట్టు..

వరమిచ్చాడా?!

అపురూపమనుకోమన్నాడా?!

ఏమో, అదెమో తెలీదు కాని..ఆమెకిదంతా అనిర్వచనీయమైన అనుభవాన్నిస్తోంది.

వాణ్ణి తన రెండు చేతులతో అబ్బురంగా చుట్టుకుంది..

మెడ చుట్టూ బిగిసుకున్న చిన్ని చేతులు.. కొమ్మమీద ఆనిన పూరేకుల స్పర్శలా. ఆమెలో అమ్మ పాశాన్ని రేపుతూ.

గుండెకి గుండె తాకి..'మీరిద్దరూ ఇక తల్లీ కొడుకులని' శబ్దిస్తూ...,

ఒక తీగ కణుపులోంచి, పసిడి పిందె పుట్టినట్టు..

దేవకి ఎద మీదే కాదు, ఎదలో కూడా వాడు తొలిబిడ్డలా మారాడు.

ఎండిన మట్టి మీద రాలిన తొలి చినుకులా- చల్లగా

మంచు గడ్డలాటి నిరాశను కరిగిస్తూ-వెచ్చగా..

..చీకట్లో వెలిగిన చిన్నిదీపంలా.. ఆమె ముఖంలో కాంతి వెలిగింది...

చిత్రంగా..ఆమె అమ్మ పాత్రలోకెళ్ళింది. హఠాత్తుగా వాడికి కన్న తల్లైపోతూ ...."భయం లేదు నానా... నేనున్నగా.." అంటూ వాడి జుత్తు సవరిస్తూ, వెన్ను రాస్తూ..ముద్దులు పెడుతో ..సముదాయిస్తోంది.

వాణ్ణి అలా లాలిస్తూనే అక్కడ అసలేం జరుగుతోందో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది.

తను అక్కడ కూర్చుందన్న మాటె కానీ, ఆమె ధోరణిలో ఆమె వుంది. పైగా, వొత్తైన గులాబీ పొదల వెనక కూర్చున్న ఆమెకి లోపలకు ఎవరు వచ్చి వెళ్ళేది కనిపించదు. అవసరం కూడా వుండదు. అన్నీ సింబానే చూసుకుంటుంది.

ఆమె వెంఠనే లేచి, ఎవర్నో పేరుపెట్టి కేకేస్తోంది. చేతిలో చిన్నా విడవకుండా ఏడుస్తూన్నాడు..

ఇటు చూస్తే-

సింహం కోపం నషాణానికెక్కింది.ఎప్పుడైతే ఆమె గావుకేకపెట్టిందో..అప్పుడే అది ... చిన్నానొదిలేసింది. గిరిక్కున తిరిగి -అమె వైపుకి పరుగులంకించుకుంది.

తనకు తెలీకుండా..మరో శత్రువు గేట్ లోపలకు రావడమె? రిమ్మ తిరిగిపోయింది. కంట్లో కొత్తకారం పడ్డదానిలా..గంగవెర్రులెత్తుకుంది...

అది ఎంత ఉగ్రంగా దూకుతోదంటె, నేల మీద కేవలం రెండు కాళ్ళు మాత్రమె ఆనీ ఆననట్టున్నాయి.. మిగిలిన రెండూ గాల్లోనే తేలుతున్నాయి.పెద్ద తుఫానుకి ఊగినట్టు నెత్తి మీద జూలు వూగుతొంది. ఆ క్షణంలో అదెంత ఉగ్రంగా, ఊగిపోతూ వుందంటె, - మనిషిని చీల్చి చెండాడె అచ్చు సింహంలా వుంది.

దాని అరుపులు చాల భయానకంగా వినిపిస్తున్నాయి....

ప్రమాదాన్ని పసిగట్టిన ఆమె గభాల్న, బయటకొచ్చి, గేట్ మూసి, ఘడియ పెట్టేసింది.

అలా వేసిందో.. లేదో, . సింహం దుక్కలాంటి ఇనపగేట్ క్షణంలో విరిగి ముక్కలవుతుందేమో అన్నంత తీవ్రంగా దూకింది. ! అంతెత్తు కాంపౌండ్ వాల్ దభేల్న కూలి పడుతుందేమో!!!.. అన్నంతగా ఉగ్రతాండవమాడుతోందది. ఆ తాండవానికి కాళ్ళ కింద భూమి అదిరిపోతోంది...

అపాయం దాటినా, తప్పిపోయిన ప్రమాదానికి ఆమె చేతులింకా గజగజా.. వొణుకుతున్నాయి. గుండె దడదడా కొట్టుకుంటోంది. వేగంగా. అరిపాదాలతో సహా వొళ్ళంతా ఐసు ముద్దలా ఐపోయింది..

పులి నోట్లోంచి బయట పడటమంటె ఇదేనేమో!

లోపలే వుండుంటె,.ఈపాటికి ఫినిషై పోయేదే. ప్రాణం జలదరించింది..తను సరే, లోపల చిన్నా పరిస్థితి ఏమిటి?

'తనకోసం వాడిటుగానీ పరిగెత్తుకొస్తేనో!?..అమ్మో.' గుండెలమీద చెయ్యేసుకుంది.., 'ఇంకేమైనా వుందా? చీల్చి చెండాడదూ?'

ఆ ఊహకె ఊపిరాగినంత పనైంది.

ఆరిపోయిన పెదాల్ని తడి చేసుకుంటూ..గొంతుపెగల్చుకుని..''హెల్ప్.. హెల్ప్ ప్లీజ్ ..హెల్ప్ '' అంటూ ఆగకుండా.. అరవసాగింది.

దాని భీకర గర్జనల్లో ఆమె గొంతు అస్సలు వినిపించడం లేదు లోపలకి.

అది చేస్తున్న వీరంగానికి... జరుగుతున్న రసాభాసకి.. ఎవరో వొచ్చారని మాత్రం అర్థమైంది దేవకికి. వెంటనే దాన్ని కంట్రోల్ చేస్తూ - ''సింబా..కం బాక్ ..కం బాక్ . ఊ!'' హుకుం జారీ చేసింది..

యజమానురాలి కమాండ్‌కి , మొరగడం ఆపి రొప్పుతూ. దేవకి దగ్గరకొచ్చి ఆగింది.

ఆమె చుట్టూ తిరిగింది.

దాన్ని చూసి చిన్నా ఇంకా భయపడుతున్నాడని,' గో ఇన్సైడ్ ..గో ఇన్సైడ్ .'.అంటూ శాసించింది. క్షణంలో, పిల్లిలా తోక ముడుచుకు పోయింది లోపలకు..

ఇంతలో-వెనక తోటలోంచి పరిగెత్తుకుంటూ వచ్చాడు శివుడు. ఇంట్లో పనిచేసేవాడు.

గబగబా గేట్ దగ్గరకెళ్ళి, సగం తెరచి, ఆమె వివరాలడుగుతున్నాడు.

చిన్నా కూడా రాగం పెడుతూ.. ఆ వైపుగా చూడ్డంతో, అక్కడ వున్నది-చిన్నా తల్లి అని అర్థమైంది ఆమెకి.

''లోపలకి రమ్మను'' చెప్పింది.

లోపలకు రావడం రావడమె..''చిన్నా'' అంటూ పరుగెత్తుకుంటు వచ్చిందామె..

ఆమెని చూస్తూనే వాడు- దేవకి దగ్గర్నుంచి జర్రున జారి, తల్లికెదురుగా పరిగెత్తాడు. మరుక్షణంలో తల్లి చేతుల్లోకెళ్ళిపోయాడు..

తనయుణ్ణి ముద్దిస్తూ- ఆమే..తల్లిని హత్తుకుపోతూ.-వాడు. చక్కని పెయింటింగ్ చూస్తున్నట్టు తన్మయంగా చూస్తోంది దేవకి ఆ దృశ్యాన్ని.

అపురూపంగా తిలకిస్తోంది.. తల్లీ బిడ్డల్ని.

ఈసారి ఆమె నిట్టూర్చలేదు.

-సరిగ్గ కొన్ని క్షణాల ముందు తాను పొందిన అనుభూతే కదూ ఇదినీ! తల్చుకుంటుంటె..తృప్తిగా అనిపించింది.

ఎందుకో తెలీడం లేదు కానీ, ఏ పిల్లల మీద కలగని ఒక వింతైన మమత కలుగుతోంది.. తప్పిపోయిన తన బిడ్డె వీడన్నట్టు తోస్తోంది..తన సొంత సొమ్ము దొరికినట్టు.. కాదు కాదు వాడు. తన సొంతమనే భావం. ఆమెలో మొదటిసారిగా.. చాలా మొట్టమొదటిసారిగా..విత్తనంలా నాటుకుపోయింది మనసులో.

ఫస్ట్ ఇంప్రెషన్స్ ఆర్ నాట్ ఓన్లీ బెస్ట్..బట్ ఆల్సో స్ట్రాంగ్..!

పిల్లాణ్ణి ఎత్తుకుని దేవకి దగ్గరకొచ్చి చెప్పిందామె.

"థాంక్సండి. చాలా థాంక్స్ " కృతజ్ఞతగా పలికిందా గొంతు. వాడు క్షేమంగా వున్నాడన్న తృప్తి, ఆనందం ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కొడుకు తల నిమురుతోంది.. ప్రేమగా..

ఆమే మళ్ళీ చెప్పింది పరిచయం చేసుకుంటూ-

"నా పేరు శైలి. ఇక్కడే ఎమ్మెన్సీలో జాబ్ చేస్తున్నా. వీడొక్కడె నాకు." కుప్తంగా చెప్పింది తన గురుంచి.

దేవకి ఆమె చెప్పేది వింటూనె.. ఆమెని, ఆమె అందాన్ని చూస్తోంది. .

పసిడి బొమ్మలా వుంది. మెడలో సన్నటి గొలుసు, కుడి చేతికి ఫాన్సీ బాంగిల్ , మరో చేతికి స్టీల్ చైన్ మీద తాపడం క్రిస్టెల్స్ స్టోన్స్ చేసిన వాచ్ ధరించింది.

ఆ చేతిలో చిన్నా.. లేకపోతే....కన్నెపిల్లంటే నమ్మేలా వుంది.

ఆమె వేష భాషలని బట్టి గుణాన్ని అంచనా వేస్తోంది

చదువుకున్న చదువో, పెంచిన వారిచ్చిన సద్గుణాల ప్రభావమో..తెలీదు కానీ, ఆ శైలి ముఖ కవళికలలో, మాట్లాడే తీరులో సంస్కారం ఉట్టిపడుతోంది.

అది కాదు-

శైలి వొళ్ళొ కూర్చున్న చిన్నా, వాడు- తనవైపు చూస్తున్న దొంగ చూపులకీ మరీ ముద్దరాలవుతోంది..

వాళ్ళని కుర్చోమని, లక్ష్మమ్మని పిలిచి ఏదో చెప్పింది. ఆమె వంట మనిషి.

పది నిముషాల్లో..వేడి వేడి స్నాక్‌తో బాటు టీ, పాలు కూడా తెచ్చి పెట్టిందామె.

ఈ పది నిముషాల్లో దేవకి అడిగి తెలుసుకుంటోంది శైలి వచ్చిన కారణాన్ని.

"చెప్పండి. ఎవరు కావాలని వొచ్చారు?"

"మీరే. మీరు కావాలనే వొచ్చాను."

"మిమ్మల్నెపుడు చూసిన గుర్తు లేదు. నేను మీకు తెలుసా?"

"తెలుస్తోంది. ఇప్పుడే"

చిన్నగా నవ్వి అడిగింది మళ్ళీ. "చెప్పండి. ఏ పని మీద వొచ్చారు?"

" మీ హెల్ప్ కావాల్సి వొచ్చాను."

"హెల్పా..నేనా..నా వల్ల ఐతె తప్పకుండా చేస్తాను."

"మరి అడగొచ్చంటారా?"

"తప్పకుండా.."

"మీ ఔట్ హౌజ్ అద్దెకి కావాలి. చాలా అవసరంలో వున్నా.." అభ్యర్ధనగా అడిగింది.

వినంగానే, దేవకి మౌనమైపోయింది. మనసు మాత్రం ఎగిరి గంతేసింది. అదే జరిగితే, చిన్నాని రోజూ చూడోచ్చు. మాట్లాడుకోవచ్చు. ఆడుకోవొచ్చు. వాడిక్కడ అటు ఇటూ తిరగాడుటు వుంటె, మళ్ళి వనానికి వెన్నెలొస్తుంది కదూ! వాణ్ణి చూస్తూంటేనే మనసు నిండిపోతోంది..

ఆ వెనకే-

ప్రకాష్ గుర్తొచ్చాడు. అతని శాసనం కూడా. కాని, అదంతా డామినేట్ చేస్తున్నాడు చిన్నా!

సరె అందామంటె- భర్త కనిపిస్తున్నాడు కోపంగా.

నో అంటే- చిన్నా వెళ్ళిపోతూ కనిపిస్తున్నాడు దూరంగా..

మరుక్షణంలో వాడు కనుమరుగైపోతాడంటే - మనసొప్పుకోవడంలేదు..

నో అని కచ్చితంగా చెప్పలేకపోతోంది. అలా అని యెస్సని చెప్పే సాహసమూ చేయలేకపోతోంది.

ఎప్పుడూ లేని చిన్నపాటి సంఘర్షణ మొదలైంది ఆమెలో. దానికి చిన్న కేంద్ర బిందువుగా మారాడు చిన్నా.

కొంతమందితో కొన్ని పాశాలు ఇలానే మొదలవుతాయి. తర్వాతవి బిగుసుకుంటాయి. గాఢంగా.

ఇప్పుడెలా?

ఎటూ తేల్చుకోలేని సందిగ్ధావస్తలొ పడింది. .

ప్రకాష్ వచ్చే టైం అవుతోంది. ఇందుకు ససేమిరా ఒప్పుకోడు. అందులో సందేహం లేదు.

అదే జరిగితే.!? ఆమె ఆలోచనలో పడింది.

శైలీ అదే అనుకుంటొంది.

ఇల్లు ఇవ్వనంటుందా. అదే ఐతే, తన ప్లానంతా తలకిందులవుతుంది. ?.. ఉహు. అలా జరగకూడదు.

ఏం చేయాలి?!

దేవకి మౌనాన్ని భంగం కలిగిస్తూ చెప్పింది.

"నేనీ వూరికి కొత్త. నిన్నటి నుంచి ఇంటి వేటలో వున్నా. నా సామానంతా ట్రాన్స్‌పోర్ట్‌లో వొచ్చేసింది. పొద్దున్నుంచి ఫోన్ చేస్తున్నారు వాళ్ళు. సామాను ఎక్కడ దింపాలని. రాత్రిళ్ళు వర్షం పడుతోంది. తడిస్తే వస్తువులు పాడవుతాయని తొందర పెడుతున్నారు. స్థిమితంగా ఇల్లు వెదుక్కునే వ్యవధి కూడా లేదు నాకిప్పుడు. ఇక్కడా -ఇల్లు దొరకడం ఇంత కష్టమనుకోలేదు.."

ఆమె పరిస్థితి చూసి జాలిపడింది దేవకి. బాధలో వున్నవారి వైపునుంచీ అలోచించడం ఆమెకి అలవాటు. అలా లోచిస్తే అందరి అవస్థలూ అర్థమౌతాయి. అన్ని కథలూ జాలిని పుట్టిస్తాయి.

'అయ్యో' అన్నట్టు చూసి అడిగింది.

"ఇవన్నీ మీరు ఒక్కరే చూసుకోవాలా?" గభాల్న అడిగింది..

శైలి ఒక క్షణం తర్వాత నెమ్మదిగా చెప్పింది.

"అవును ..నేనూ, చిన్న. ఇద్దరమే.. ఇక్కడ వుండేది కూడా ..మేమిద్దరమే వుంటాం." ఇక తనకెవరూ లేరు రారు అన్నంతగా స్థిరంగా చెప్పింది.

ఇతరుల వ్యక్తిగత విషయాలు ఆరా తీయడం దేవకికి అలవాటు లేదు.. వున్నదున్నట్టుగా అమె చెప్పనే చెబుతోంది. అయినా, విననట్టుగా.. 'మీ ఆయన సంగతేమిటి?' అని అడిగేంత చిన్న మనస్కురాలు కాదామె.

కొంతమందీ వుంటారు. మొదటి పరిచయంలోనే పుట్టుపూర్వోత్తరాలన్నీ తిరగేస్తూ, సమాచారాన్ని లాగేస్తూ.. నానా రకాల ప్రశ్నలతో విసిగించేస్తారు.

దేవకి అలా కాదు. వ్యక్తిగతాలకంటె, వ్యక్తిత్వానికి ప్రాముఖ్యమిచ్చే మనిషి. వొచ్చిన వాళ్ళు కేవలం అద్దెవాళ్ళలా కాకుండా, కాసింత కలివిడిగా, సందడిగా..తిరుగుతూండాలని ఆమె కోరిక. శైలి మాటామంచీ అదీ చూస్తూంటే..తన ఆశ తీరుతుందేమో అనిపించిందామెకి. .

ఎవరికివారే, యమునా తీరే అన్నట్టుగా బ్రతుకుతున్న ఈ కాలంలో కూడా దేవకి లాంటి వారూ వుంటారంటె కొంత విడ్డూరంగానే వుంటుంది.

ఆమె మెత్తబడుతోందని గ్రహించి అంది శైలి.

"మీరెలాంటి సందేహాలు పెట్టుకోకండి మీకెలాంటి ఇబ్బందీ ఇవ్వం.. మా చిన్నా అస్సలు అల్లరి చేయడు. పేచీలు పెట్టడు. గట్టిగా ఏడ్వడు.. దూకుడం, పరుగులు పెట్టడం..వంటివి చేయడు. మొక్కల జోలికి వెళ్ళడు. పూలు తెంపడు. పచ్చిక మీదెక్కి తొక్కడు. ఇంట్లోనే ఆడుకుంటాడు. మీకభ్యంతరం ఐతే.. ఈ దరిదాపుల్లోకి కూడా రాడు. అంటే ఆడే వాడే కానీ ఆగడాల వాడు కాడు.."

దేవకి మనసు నొచ్చుకుంది. "పిల్లల్ని అలా అరికట్టకూడదు. నాకలా ఇష్టం వుండదు. అయినా సమస్య చిన్నా కాదు.."

"పోనీ నేనంటారా?" నవ్వుతూ అంది.

కాదంటు తలూపింది దేవకి..తనూ నవ్వుతూ.

"ఐనా, నాగురించి కూడా మీరు తెల్సుకోవాలి...నేనైనా అంతే.. పగలొకసారి ఆఫీస్‌కి వెళ్తే, మళ్ళీ రాత్రి దాకా రాను. శని, ఆదివారాలు ఇంటి పని సరిపోతుంది. హాలిడేస్ లో చిన్నాని బయటకు తీసుకెళ్తాను. సో, మేము ఇంట్లో వున్న శబ్దమే వుండదు." 'నేను చెప్పేది నిజం. నమ్మండి' అన్నట్టుంది ఆ మాట్లాడుతున్న ధోరణి.

దేవకి నవ్వుకుంది శైలి మాట తీరుకి.. ఆమె కలివిడిగా మాట్లాడుతూంటె, ముచ్చటేస్తోంది.. కొన్నాళ్ళకైనా సరే, వీళ్ళకి ఇల్లివ్వాలని ఇప్పుడింకా బలంగా అనిపిస్తోంది. కాని, ప్రకాష్ కెలా చెప్పి ఒప్పించడం?..

చెంపకింద చేయ్యేసుకుని, కళ్ళు వాల్చుకుని, వెనకాముందులాడుతున్న దేవకిని గమనిస్తోంది శైలి. మనిషి శాంతి స్వరూపం.

ఆ నెమ్మదితనం, సౌమ్యం, హుందాతనం చూస్తుంటె.. శైలికి ఎందుకో అనిపించింది. ఇలాంటి ఒక అక్క తనకుంటె ఎంత బావుణ్ను అని.

ఇప్పుడు తనున్న పరిస్థితుల్లో ఈమే కనుక తన అక్క ఐతే..తనని గుండెల్లొ పెట్టుకునేదెమో? బాధలో వున్న మనసు ఓదార్పునిచ్చే వారి కోసం వెదుకుతూందేమో?!

"అక్కా.." అసంకల్పితంగా ఆమె నోటి నుంచి వొచ్చిన పిలుపికి దేవకి ఉలిక్కిపడింది. ప్రసన్నంగా చూసిందామె వైపు.

"ఇలా పిలిస్తే మీకేమీ అభ్యంతరం లేదుగా?" మెత్తగా అడిగింది.

లేదన్నట్టు తలూపింది దేవకి.

"మీరు నాకు ఒక అక్కలా అనిపిస్తున్నారు. అందుకే మరీ మరీ అడుగుతున్నా.. ఈ ఒక్కసారికి హెల్ప్ చేస్తే చాలు. ఎప్పటికీ మీకు నేను.." శైలి గొంతు వొణికింది. ఇక మాటలతో పూర్తి చేయలేని దానిలా.. చేతులు జోడించబోయింది.

చప్పున చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది దేవకి. ఆమె కళ్ళల్లో తడి చూసాక ఆమె కరిగి, కదిలింది.

"అంత మాట ఎందుకులేమ్మా..సరే..అలాగే కానీయి.. కాని.. ఆయనకూ ఒక మాట చెప్పాలి..వచ్చే టైమవుతోంది... ఇంతలో ఒకసారి ఇల్లు చూసి రామ్మా.." అంటు శివుడ్ని పిలిచి, చెప్పింది. ఇల్లు చూపించమని..

సరే అని అన్నదే కాని, ప్రకాష్ గుర్తొచ్చి మళ్ళీ నిరాశ పడిపోతోంది.

ఈ కాసేపట్లోనే ప్రదేశం తనకు బాగా అలవాటై పోయినట్టు చిన్నా బాల్‌తో ఆడుకుంటూ నాలుగువైపులా తిరుగుతున్నాడు. ఇంటి ముంగిట్లోకి జాబిలొచ్చి పొరాడుతున్నట్టు.. దేవకి కళ్ళు కొత్తగా మెరిశాయి..

ఆమెకి వాడితో కలిసి ఆడాలనిపిస్తోంది. ఇవాళే కాదు. రేపు కూడా.. ఆశపడుతూ..మెల్లగా అడుగులేస్తోంది చిన్నా వైపుకి..

'ప్రకాష్ బయల్దేరే వుంటాడు ఈ పాటికి' అనుకుంది.

కాని ప్రకాష్ అప్పటికే బయల్దేరిపోయాడు. ఇంటికి కాదు. ఆసుపత్రికి..!!

*********

## 3

**ఆబిడ్స్ నుంచి తాజ్ కెళ్ళే గల్లి..**

కొంచెం లోపలకల్లా వెళ్తే...మల్టీ స్టోరీడ్ కాంప్లెక్స్ కనిపిస్తుంది. అదొక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి. ప్రతి ఫ్లోర్ లోనూ సూపర్ స్పెషల్ డాక్టర్స్ క్లినిక్స్ , ఆయా సంబధిత శాఖలకు చెందిన అన్ని సౌకర్యాలు అందించే లాబ్‌లు, ఫార్మసీస్ వుంటాయి. ఖరీదైన, లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్‌తో కూడిన ఆపరేషన్ థియేటర్లున్నాయి.

ఒంటి నిండా ఎన్ని నొప్పులున్న సరే, అన్నిరకాల స్పెషలైజెడ్ డాక్టర్స్‌ని ఒకే చోట కలుసుకుని, చక్కని చికిత్సని పొందొచ్చు.

ఇక్కడున్న మరో ప్రత్యేకత ఏమిటంటే-

కస్టమర్ సర్వీస్ సెంటెర్ వుంది. ఒక పీఆర్వో కూడ వుంటాడు. ఏ సందేహమొచ్చినా అడగొచ్చు. సలహాలు పొందొచ్చు. రోగులకు చక్కటి గైడెన్స్ వుంటుంది. అక్కడి మెడికల్ షాప్‌లో దొరకని మందులంటూ వుండవు. ఆపరేషన్ తర్వాత డిస్చార్జ్ అయి వెళ్ళిపోయిన ఇన్‌పేషెంట్స్‌ని ఫోన్‌లో పరామర్శిస్తూంటారు జూనియర్ డాక్టర్లు. రోగికి అదొక నైతిక బలాన్ని, మానసిక స్థైర్యాన్ని ఇస్తుంది.

నాకేదైనా ఐతే, చూసుకోడానికి డాక్టరున్నాడు అనే ధైర్యం వుండాలి మనిషికి. అప్పుడే డాక్టర్ దేవుడిలా కనిపిస్తాడు.

ఇదంతా ఒక ఎన్నారై డాక్టర్ ప్రణాళిక.

ఆస్పత్రికి ఎప్పుడొచ్చినా ఆయన్ని తలచుకుని, చల్లగా వుండాలని దేవున్ని ప్రార్థిస్తూంటాడు మిస్టర్ లూ.

అసలు పేరు వెంకటేశ్వర్లు. డాక్టరేట్ ఇన్ మాథెమెటిక్స్. తన సబ్జెక్ట్ అంటే ఆయనకెంత ప్రేమ అంటె, కలలో కూడా అంకెల్ని, ఈక్వేషన్లని పలవరించేంత..ఒక గొప్ప అబ్‌సెషన్ .

అబ్‌సెషన్ విత్ నంబర్స్ మేక్స్ వన్ క్రేజీ అన్న చందాన .

ఎవర్ని చూసినా అతనికి అంకెలే కనిపిస్తాయి. పెళ్ళాం అందంగా అలంకరించుకున్నప్పుడు పదహారులా వున్నావని, (అంటే ఆయన దృష్టిలో పడుచు అని) పడుకుంటె, రెండులా రొమాంటిక్ అనీ, అలిగినప్పుడు మూడో నంబరనీ..వర్ణిస్తూంటాడు.

అసలు ప్రపంచం అంతా ఒకే ఒక అంకె అని ఆయన అభిప్రాయం. అంకెల వారీగానే మనిషి శరీరం నిర్మాణమై వుంటుందనీ, ఫిక్సేషన్ ఈక్వేషన్స్‌లో ఏ మాత్రం తేడా వొచ్చినా..మానవాకారం వికారమై పోతుందనీ అంటాడు.. ఉదాహరణకి రెండు కళ్ళు, రెండు చెవులు, ఒక ముక్కూ, ఒకనోరూ..ఈ అమరికలో ఒక లెక్క వుందంటాడు.

అల్లాగే-నవ గ్రహాలు, దశావతారాలు, పంచ భూతాలు, సప్తఋషులు నాలుగు దిక్కులు..వారానికి ఏడు రోజులు ఇలా -ఆవకాయనుంచి-అణుబాంబు తయారీ వరకు నీకు లెక్కలు, కొలతలు తప్పవని తేల్చేస్తాడు.

నీ జీతమెంతో పెళ్ళాం లెక్క అడగదూ? నువ్వు లెక్క కట్టే కదా వస్తువుని కొంటావు?

దేశాభివృద్ధికి పట్టుకొమ్మలైన ఆర్థిక, వాణిజ్య రంగాలకి ఆయుపట్టు లెక్కలు, అంకెలు కాకుండా ఇంకోటి ఏం వుందో చెప్పు చూద్దాం అంటూ ఛాలెంజ్ విసురుతాడు..

అంతెందుకు? పాప పుణ్యాలని ఎప్పటికప్పుడు లెక్కకట్టే దేవుని ఐదో వేదమే- మాథ్‌మెటిక్స్ సబ్జెక్ట్ అంటూ కంక్లూజన్ ఇచ్చేస్తాడు. లూ కి తన సబ్జెక్ట్ అంటె అంత ఇష్టం. అంత ప్రేమ, ఆరాధన. దాని మీద ఈగ వాల నీయడు. అతనొక అరిథ్‌మోమెనీయా అనొచ్చు.

తన అంకెల, గణిత విజ్ఞానాన్నంతా పోగుచేసి- ఈమధ్యే పెర్సనాలిటీ డెవలెప్‌మెంట్ పుస్తకమొకటి రాసాడు, టైంస్క్వేర్ అని. రోజులో నీకున్న ఇరవై నాలుగ్గంటలని --నలభై ఎనిమిది గంటలుగా ఎలా మార్చుకోవచ్చు అనేది దాని సారాంశం. దానికి ఒక సైంటిఫిక్ రీజనింగ్ కూడ జోడించాడు. మార్కెట్‌లో గొప్పగా పేలింది. బుక్ సెల్లింగ్‌లో ఇప్పుడది నెంబెర్ వన్ అయ్యింది. ఇంగ్లీష్‌లోకి తర్జుమా కాబోతోంది. త్వరలో లూ పేరు ఇంటర్నేషనల్ లెవెల్‌లో వినిపించబోతోంది. గొప్ప విషయమే. .

మరి మిస్టర్ లూ చిన్నగా కష్టపడ్డాడా ఏమిటి?

ఆ పుస్తకం రాసేటప్పుడు..నిద్రాహారాలు మాని, రీసెర్చి చేసి, రాష్ట్రాలు తిరిగి సమాచారాన్ని సేకరించి, నెట్‌సైట్స్ పెర్చించి, శోధించి..అన్వేషించి..జల్లెడ పట్టి మొత్తానికి ఒక మంచి పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చాడు

అలాంటి లూ కి ఈ మధ్య ఒక పెద్ద సమస్య ఒచ్చి పడింది..

డాక్టర్‌ని తరచుగా కలవాల్సిన అవసరం పడుతోంది..అందుకే ప్రఖ్యాతి గాంచిన, ఫారిన్ రిటర్న్‌డ్ సైకియాట్రిస్ట్‌ని కలవడానికి వస్తూంటాడు.. ఇప్పుడూ అందుకే వొచ్చాడు.

లిఫ్ట్ కోసం వేచిచూసే సహనం లేదతనికి, గబగబా మెట్లెక్కి ఆరో అంతస్తుకొచ్చాడు. పొడుగాటి వాక్ వే కి ఇరువైపులా డాక్టర్స్ కన్సల్‌టేషన్ రూములు వున్నాయి. 9బి కాబిన్ దగ్గర ఆగి.. డాక్టర్ పేరొకసారి చదివాడు. ఎక్కడా పొరబాటు వుండకూడదని. ముందు జాగ్రత్త ఎక్కువ అతనికి.

బి.ఆనంద్ సైకియాట్రిస్ట్ ..

హమ్మయ్య, తను కరెక్టె. అభినందించుకున్నాడు.

రిసెప్షనిస్ట్ దగ్గరకెళ్ళాడు. తనకిప్పుడు డాక్టర్ అపాయింట్‌మెంట్ వుందని చెప్పడానికి.

ఆమె ఫోన్‌లో మాట్లాడుతోంది. ఆమె తీరు చూస్తుంటె, అప్పటికి చాలసేపటినుంచి పేషెంట్‌ని కన్విన్స్ చేస్తున్నట్టుంది. ఇక....చెప్పిచెప్పి విసుగొచ్చిందానిలా..ముఖం పెట్టి తల పట్టుకుంది. "మీకేమైనా పిచ్చా? ఎన్ని సార్లు చెప్పాలి? ఆల్‌రెడీ పేషెంట్స్ వున్నారు. మీరు అడిగిన టైమింగ్స్ కుదరదు..అంతే" కోపంగా ఫోన్ పెట్టేసింది. ఠక్కున. .

మిస్టెర్ లూ మనసు నొచ్చుకుంది.

మానసిక సమస్యలున్న వాళ్ళందర్నీ పిచ్చి వాళ్ళుగానే చూస్తారెందుకో ఈ లోకం?

పెళ్ళాం తనని పిచ్చిమాలోకం అంటూ విసుక్కోవడం గుర్తొచ్చింది.

జాలి పడ్డాడు విసుక్కున్న పేషెంట్ మీద. వెంటనే అతనికి తనేలాగైనా సాయం చేయాలనిపించింది.అవసరమైతే, తను తీసుకున్న డాక్టర్ అపాయింట్‌మెంట్ టైం ని అతని కివ్వాలనేంత జాలేసిపోయింది.

ఆవేశంగా అన్నాడు.

"ఎక్స్‌క్యూజ్మి"

"యస్.. ..కెన్ ఐ హెల్ప్ యు?" అడిగింది. వినయంగా. ఆమె ముఖం ఇప్పుడు ప్రశాంతంగా వుంది.

"యెస్. నా అపాయింట్‌మెంట్ టైంని..ఇప్పుడు మీరు మాట్లాడిన పేషెంట్‌కివ్వండి. ప్లీజ్ ."

లూ ఏమంటున్నాడో ఆమెకి అర్థం కాలేదు.

"నేనంతా విన్నా. ఫర్వాలేదు ఇవ్వండి. లేదంటె ఫోన్ కలపండి. నేనే స్వయంగా మాట్లాడతా ఆ పేషెంట్‌తో.." స్థిరంగా చెప్పాడు.

'ఈ రోజుల్లో కూడా మీలాంటి మంచివాళ్ళున్నారా సార్ ..' అని ఆమె అనలేదు. కాని అతనలా వూహించుకుని పొంగిపోయాడు.

సరె నన్నట్టు తలూపి, ఆమె ఫోన్ కలిపి ఇచ్చింది.

లూ తనని పరిచయం చేసుకున్నాక చెప్పాడు.

"మీకావిడ టైం లేదంది కదూ?"

"అవునండి"

"మీకేం భయం లేదు. నేను ఇప్పిస్తా. మీరొచ్చేయండి."

"కానీ.." సణిగింది అవతల గొంతు.

"ఇక ఎలాటి సందేహాలూ వొద్దు. నా బదులు మిమ్మల్ని పంపుతా. సరేనా.."

"ఎక్కడికి?"

"డాక్టర్ దగ్గరికి"

"ఏ డాక్టరు?"

"డాక్టర్ ఆనంద్. సైకియాట్రిస్ట్ .. ఏం వొద్దా?"

"ఎందుకు?" ఏడుపొక్కటే తక్కువగా వుందా గొంతు.

"ఎందుకేమిటి? మీరు రావాలనుకుంటున్నారు కదా..రండి. తప్పక నయమౌతుంది."

"ఏమిటి నయమయ్యేది?"

"పిచ్చి." కోపంగా చెప్పాడు. తన త్యాగాన్ని గుర్తించి ఎగిరి గంతేస్తాడనుకున్నాడు.

"హమ్మో. ఒక్కసారి ఆమెకివ్వండి.." కంగారుగొంతేసుకు అడిగాడతను.

లూ నుంచి ఫోనందుకున్న రెసెప్షనిస్ట్ ఇక నవ్వాపుకోలేకపోయింది.. అవతల ఫోన్‌లో అతనేమంటున్నడో కానీ,

"..పిచ్చి కుదిరిందా.." అంటూ పడీపడీ నవ్వుతోంది. కళ్ళెంట నీళ్ళొచ్చే దాక అలా నవ్వుతూనే వుంది.

లూ కి వొళ్ళు మండిపోయింది.

"పేషెంట్‌తో అలాగేనా మాట్లాడేది? డాక్టర్‌కి కంప్లయిన్ చేయనా?" బెదిరించాడు.

"చెప్పండి" బెదరలేదామె. "అతను పేషెంట్ అయితేగా..?" .

"కాదా? మరి ఎవరతను?" బిక్క మొహమేసుకుని అడిగాడు.

"నా బాయ్ ఫ్రెండ్ " నవ్వుతూ చెప్పింది. ఫోన్ పెట్టేస్తూ.

ఈమెకి తనెలా కనిపిస్తున్నాడు. పిచ్చాడిలానా??! వొళ్ళు మండిపోయింది లూ కి. "ఐతే ముందెందుకు చెప్పలేదు?" ఉక్రోషంతో ముక్కుమీది కళ్ళజోడు కదిలింది.

"అతని పిచ్చికి మీరే మంచి డాక్టర్ అని.." లూ వంక అభిమానంగా చూసి చెప్పింది.

అది కామెంటో, కాంప్లిమెంటో.. డాక్టరేట్కి అర్థం కాలేదు. అతని కోపమైతే పోయింది కాని..ఇంకా పజిల్గానె వుంది. సరైన ఈక్వేషన్ వేసినా ఆన్సర్ రాని లెక్కలా వుంది. అలవాటుగా బుర్ర మీద వేళ్ళతో టైప్ కొట్టుకుంటు డాక్టర్ కాబిన్లోకి నడిచాడు.

లూ ని చూడగానె డాక్టర్ ఆనంద్ "హెలో" అంటూ.. చదువుతున్న జర్నల్ని పక్కనబెట్టి, .కూర్చోమన్నాడు.

ఆయన కెదురుగా కూర్చున్నాడు లూ.

ఒక్క క్షణం కళ్ళుమూసుకుని తెరిచాడు. డాక్టర్ నవ్వుతూ కనిపించాడు..

"చెప్పండి. ఎలా వున్నారు?" అడిగాడు ఆనంద్ .

"బాగానే వున్నా డాక్టర్. మీరు చెప్పినట్టే..మందులన్నీ వాడుతున్నా..""

"గూడ్ "

"చీకట్లో బయటకెళ్ళడం మానేసా. ఇంటి పట్టునే వుంటున్నా."

"ఊ.."

"ఇప్పుడు పుస్తకాలన్నీ తిరగేసి కాకుండా..సీదాగానే పట్టుకుని చదువుతున్నా...."

"ఊ..ఇంకా.."

"తెలుగు తెలుగుగా..ఇంగ్లీష్ ఇంగ్లీష్గా ఏ భాషకాభాషగా అర్థమవుతోంది..."

"..."

"ఇంతకుముందులా కాకుండా.. పాంట్ షర్ట్, బటన్స్ అన్నీ ఒక పద్ధతిగా వరస క్రమంలోనే పెట్టుకుంటున్నా."

డాక్టర్ అతన్ని శ్రద్ధగా వింటున్నాడు.

"ఇంకా చెప్పాలంటే, అన్నంలోకి- పెరుగనుకుని- సాంబార్, చట్నీ అనుకుని -పప్పూ వేసుకోవడం లేదు. వాటిని వాట్లానే తింటున్నా. మీ దయవల్ల, దేవుని కృపవల్లా అంతా బాగే"

"గూడ్ ....." డాక్టర్ అతన్ని పరిశీలనగా చూస్తున్నాడు. మనిషి కాస్త తెరిపిగానే కనిపిస్తున్నాడు. ఇతని మానసిక స్థితి ఇలాగే వుంటె, మంచిదె ట్రీట్ మెంట్ పనిచేస్తున్నట్టె. అవునూ ఇంతకీ ఇవాళెందుకొచ్చాడీయన?

ఈవారంలో ఇది మూడోసారి కదూ తన దగ్గరికి రావడం? గుర్తొచ్చి అడిగాడు.

"ఇవాళ అప్పాయింట్మెంట్ వుందా మీకు?"

"లేదు. నేనే తీసుకున్నా.."

"ఎందుకు?"

"ఈ కళ్ళజోడు ఇలాగే కంటిన్యూ చేయమంటారా అనీ అడిగి పోదామని.."

గాలి తీసిన వాడిలా అయిపోయాడు.డాక్టర్ "హుష్ .." అయిపోయింది. తను ఎక్కడకొచ్చిందీ, ఎవరితో మాట్లాడుతోందీ మళ్ళీ మర్చిపోయాడీ మహానుభావుడు. అనుకున్నాడు.

"ఈ మధ్య గుండెల్లో దడగా కూడా వుంటోంది..మెట్లెక్కుతూంటె.." బెంగగా చెప్పాడు..లూ

"ఇప్పుడు మెట్లెక్కొచ్చారా?"

"అవును"

"లిఫ్ట్ ఉందిగా?"

"టైం అయిపోతుందేమోనని..టెన్షన్ "

"దేనికి టైం?"

"అవతార్ కి. ఐ మాక్స్ లో! టెక్నికల్ మూవీ. వరల్డ్ రికార్డ్ కలెక్షన్ సినిమా.." సమాచారం ఇస్తూ నవ్వాడు లూ ఆనందంగా.

అన్నీ గుర్తే అసల్ది తప్ప.

నిట్టుర్చాడు డాక్టర్ .

ప్రిస్క్రిప్షన్ పాడ్ తీసుకుని, ఒక్క క్షణం ఆగి, కొన్ని మందులు రాసాడు. కాగితాన్ని అందిస్తూ చెప్పాడు.

"ఇవి వాడి, చెప్పండి. ఎలా వుందీ! సరేనా..?"

దాన్ని గభాల్న లాక్కుని, తన చేతిలో వున్న ఒక లావాటి పుస్తకంలోకి తోసాడు లూ.

"థాంక్సండి. వొస్తా..." అంటు లేచి, ఎటువెళ్ళాలా అని కన్ఫ్యూజ్ అవుతుంటే .. " ఇటు కాదు అటు" అంటూ తలుపు వైపుకి చూపించాడు ఆనంద్ .

చేతిలో రెండు కిలోల బుక్స్‌తో బరువుగా బయట పడ్డాడు..

ఎదురుగా తనని చూసి నవ్వుతున్న ప్రకాష్‌ని చూసి 'తెలిసిన ముఖంలా వుంది..ఎవరబ్బా..' అనుకుంటు ఆలోచించాడు. ఊహు. తట్టడం లేదు.

వెంటనే –బుర్రమీద వేళ్ళతో టైప్ చేసుకుంటూ మెట్లు దిగసాగాడు.

లోపలికొచ్చిన ప్రకాష్ –

"గూడీవినింగ్ డాక్టర్ " అంటూ విష్ చేసి కూర్చున్నాడు కుర్చీలో.

అతన్ని చూసి హాపీగా నవ్వాడు ఆనంద్ ..

"హెల్లో. హౌ ఆర్యు?"

"ఫైన్ ..ఫైన్ .. ..ఐనా సరే, మీరెలా వున్నారని మాత్రం నేనడగను."

"అదేం?"

"మీకు అందరి మనసులు తెలుసి వుంటాయి కాబట్టి..వాటిని బట్టి నడుచుకోవడమే కాబట్టి, మీరు బాగానే వుంటారు. ఇంకా, ఆనందం మీ పేరులోనే వుంది కాబట్టి, హాపీగా కూడా వుంటారు. అందుకు. యామై కరెక్ట్ ఆర్ నాట్ ?.."

అతని మాటలకు నవ్వి వూరుకున్నాడు ఆనంద్. నిజానికి, శారీరక అనారోగ్యలను కనిపెట్టడం కంటె, మానసిక అస్వస్థతలని పసిగట్టడం చాల కష్టం.

"అవునూ..వెంకటేశ్వర్లు గారేంటి ఇలా వొచ్చెళుతున్నారూ?" కాజువల్‌గా అడిగాడు.

"ఆయన. మీకు తెలుసా?"

"భలేవారె. మా కాలనీలోనే వుంటారు. ఫంక్షన్స్‌లో, వాటిల్లో కలుస్తునే వుంటాం. ఈయన మిసెస్ , దేవికి బాగా తెలుసు."

"ఐ సీ. ఐతే, మిమ్మల్ని పలకరించారా?"

"లేదు. నవ్వితే కూడా రెస్పాండ్ కాలేదు.."

"ఆయన సమస్య అదే బాగా మరుపొచ్చింది. మనుషుల్ని, పరిసరాల్ని.. చివరికి మాట్లాడే సందర్భాలని సైతం మర్చిపోతూంటారు. అదీ హఠాత్తుగా క్షణంలో జరిగిపోతుంది."

"ఐతే. ట్రీట్‌మెంట్ కొస్తున్నారా"

"కాదు. నన్ను టెస్ట్ చేయడానికొస్తున్నారు." చాల కూల్‌గా చెప్పాడు.

తర్వాత ప్రకాష్‌తో బాటు తనూ నవ్వేసాడు.

"ఒక్కోసారి అనిపిస్తుంది. డాక్టరవ్వడానికి ఎన్ని పరీక్షలున్నా. మా డాక్టర్లకి వీళ్ళే అసలైన పరీక్షలని.."-. చెప్పాడాయన చనువుగా.

వాళ్ళంత క్లోజ్‌గా మాట్లాడుకోడానికి కారణం -వాళ్ళిద్దరి మధ్య స్నేహం కూడా వుంది. నెలలో రెండు సార్లు తప్పనిసరిగా గోల్ఫ్ ఆడతారు. తరచూ క్లబ్‌లో జరిగే మీటింగ్‌లోనో, సెమినార్స్‌లోనో కలిసి మాట్లాడుకుంటూంటారు.ఇద్దరి ప్రొఫెషన్స్ వేరే అయినా, అభిరుచులు మాత్రం కలుస్తూంటాయి.

ఆనంద్ తన ఫార్మ్ హౌస్ ప్లాన్ ప్రకాష్‌కి అప్పుడెప్పాడు. దాని గురించి కూడా కలిసి మాట్లాడుకోవడం జరుగుతూంటుంది..

అదీ కాకుండా ..దేవకి హెల్త్ విషయంలో ఆయన ఒక డాక్టర్‌లా మాత్రమే కాకుండా స్నేహితుడిలా సలహాలిస్తున్నాడు. అప్పట్నుంచి ఇద్దరూ..ఫామిలీ ఫ్రెండ్స్ అయ్యారు..

"ఎలా వున్నారు దేవకి?"

"ఆ విషయం గురుంచే, మాట్లాడదామని వొచ్చా."

భార్య ప్రసక్తి రాగానె, ప్రకాష్ ముఖంలో దిగులు గమనించి చెప్పాడు. "ప్రస్తుతానికి ఇదే ట్రీట్‌మెంట్ కంటిన్యు చేద్దాం. మెడిసెన్స్ డోసేజ్ మారుస్తా".

మందులు అనగానే, ప్రకాష్‌కి మళ్ళీ ఆమె నిద్ర పోవడం గుర్తొచ్చింది. అది అతనికి నచ్చదు. "మందులు తప్పవంటారా? ఒకవేళ వాడాల్సి వస్తే ఎన్నాళ్ళని వాడాలంటారు?..అసలు వీటితో పనిలేకుండా క్యూర్ అయ్యే అవకాశం వుందంటారా?" గబగబా అడిగేసాడు. తను అడగాలనుకున్న నాలుగు ప్రశ్నలూ.

భార్యంటే- ప్రకాష్‌కెంత ప్రేమో అతనికి తెలుసు. అందుకే వివరంగా చెబుతున్నాడు.

"పిల్లలంటే ఆమెకి ఒకప్పుడు ఇష్టం. తర్వాత అది చాల ఇష్టంగా మారింది. ఇప్పుడు ఆ ఇష్టాన్ని దాటిపోయింది. పెద్ద అబ్సెషన్ గా మారింది"

"అబ్సెషన్.. క్యూరబుల్ కాదా?"

"ది ఓన్‌లీ క్యూర్ టు గెట్ ఓవెర్ ద అబ్‌సెషన్ ఈజ్ టు గెట్ అనదెర్ వన్ " క్యూర్ అంటే అదే అన్నట్టు నవ్వి చెప్పాడు.

"అంటే?"

"ఆవిడ మనసుని పూర్తిగా పిల్లల మీదకు వెళ్ళకుండా చూసుకోవాలి. అంతే ఇష్టాన్ని వేరే విషయాల మీదకు మళ్ళించాలి.. వారి ఇంట్‌రెస్ట్‌లు, హాబీలు ఏమిటో చూసి, ఆ దిశగా ప్రోత్సహించండి...ఆమెకిష్టమైన అలవాట్లలో, పనుల్లో- ఎంత మునిగి తేలితె, అంత తేలికవుతుంది సమస్య! సంగీతం, పెయింటింగ్ , ఫోటొగ్రఫీ, డ్రెస్ డిజైనింగ్ ..ఇలాంటి వాటిలో ఉత్సాహాలేమైనా వున్నాయా?"

"అలాంటివేవి లేవు కానీ, గార్డెనింగ్ ఇష్టం. గ్రీన్ సిటికి మెంబెర్. అప్పుడప్పుడు టీమ్‌తో కాన్వాసింగ్‌కి వెళ్ళి, మొక్కలు నాటే ప్రోగ్రాం చేస్తుంది.."

"గూడ్ ."

"ఒక క్రిస్టీన్ ఆర్గనైజేషన్ వారితో కలసి, స్లమ్స్‌కి వెళ్ళి, అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. సొంతంగా ఒక సేవా సంస్థ ప్రారంభించాలనుకుంటోంది."

"వెరీ ఇంట్‌రెస్టింగ్ ..ఏం చదివారు?"

"ఎం.ఏ. ఇన్ సోషియాలజీ"

"..ఐ సీ..ఇంకేం..ఇలా సేవలో బిజీ అయిపోవచ్చు."

"అదే ప్లాన్ చేయాలి"..

"దానికంటె ముందు.. ఆ వాతావరణం నుంచి కొన్నాళ్ళు బయటకి తీసికెళ్ళండి. ఏదైనా ప్రశాంతమైన చోటుకి.."

"అలాగే. తనకి మైసూర్, కేరళ ప్రకృతి అంటే చాలా ఇష్టం. అక్కడికి వెళ్తాం." చెప్పాడు.

ఆనంద్ , ప్రిస్క్రిప్షన్ పాడ్ తీసుకుని, మందులు రాస్తున్నాడు.

******

కారు లోంచి లోపలకొస్తూ చూశాడు దేవకిని. .

దేవకి పిల్లాడ్ని ఎత్తుకుని, వాడి ముఖంలోకి ముఖం పెట్టి చూసుకుంటూ.. నవ్వుతూ కనిపించింది. కారు శబ్దం సైతం ఆమెకి తెలీడంలేదంటె.. అమెంత పారవశ్యంలో మునిగితేలుతోందో తెల్సుకోవచ్చు. నిజానికి అతని బాధ అదికాదు. అంతగా ఆమె ఇన్వాల్వ్ అవడం. ఆ క్షణంలో ఆమె ఎంతో ఆనందంగా కంపిస్తోంది. నిజమే. కాని, అదే కదా, రేపటి విషాదానికి కారణం.

"అయినా, ఇదెలా జరిగింది? ఎప్పుడు జరిగింది?" వెంఠనే కనుబొమలు ముడుచుకున్నాయి

అతను అక్కడే దిగేసాడు. కార్ పార్కింగ్‌కి వెళ్ళింది. బేస్‌మెంట్‌లోకి.

గేట్ మూసి, వెనకే పరిగెత్తుకొస్తున్న శివని అడిగాడు.

"ఎవర్రా.. ఆ పిల్లడూ?"

"ఔట్ హౌస్‌లో కెవరో కొత్త వాళ్ళొస్తున్నరు సార్ .."

ఔట్ హౌస్‌లోకి కొత్తవాళ్ళా?అదీ పిల్లలున్నవాళ్ళా? తను వొద్దన్న పని చేస్తున్న దేవకి మీద మొట్టమొదటిసారి కోపమొచ్చింది అతనికి.

ఆమెనేమి అనే పర్తిస్థితి కాదు కాబట్టి, సమస్యని ఇటునుంచి కాకుండా.. అటునుంచి తీసేయాలని నిర్ణయించుకున్నాడు.

"ఎక్కడా వాళ్ళు..?" చికాగ్గా అడిగాడు.

"వొచ్చింది ఒక్కామే సార్. ఇల్లు చూస్తోంది.."

వినంగానే ఒక్క ఉదుట్న కదిలాడు. ఎంత అనుకుని వచ్చాడు! ఎన్ని ప్లాన్స్ వేస్తున్నాడు? ఇలాంటి పరిస్థితులు ఆమెకిక ఎదురవ్వకూడదనీ? కానేం జరుగుతోంది? అనుకోనిది జరగబోతోంది..వీల్లేదు. తను అలా జరగనీడు. ఎక్కడ లేని ఆవేశమొచ్చింది ఎప్పుడూలేనంతగా..

నాలుగంగల్లో వెళ్ళి తలుపు మీద ఠకఠకా చప్పుడు చేశాడు. చేస్తూనే..చూశాడు ఆమెని వెనకనుంచి.. పెద్ద జాకెట్ మెడ.. చందమామలా మెరుస్తూ...అద్దమ్మీద సూర్యకిరణం పడి ఎలా తళతళమంటుందో అలా ఒక కాంతి వొచ్చి, అతని ముఖం మీద రెఫ్లెక్ట్ అయినట్టయింది..కళ్ళు జిగేల్మనేలా....

నిప్పుల మీద నీళ్ళు జల్లినట్టు -అతని అగ్ని లాంటి కోపం చప్పున చల్లారిపోయింది..

ఆడవాళ్ళలో మగాడి కోపాన్ని పోగెట్టే లక్షణాలు రెండుంటాయి.

ప్రేయసిలో ఐతే- అందం, భార్యలో ఐతే- అణకువ.

కాని, ఇక్కడ ప్రకాష్ని ఆకర్షించిన విషయం ఒకటే. స్త్రీ ముఖ సౌందర్యం పట్ల తీసుకునేంత శ్రద్ధ ఇక దేని మీదా తీసుకోదు.. అక్కడే అతనికి కోపమొస్తుంది.

నిజానికి స్త్రీ బ్యూటీ కేర్కి రుజువులు - మెడా, పాదాలు.

అతనికివన్నీ ఎలా తెలుసంటే ..అతను-మగాడు అంతే.

అతనికంత టైం ఎక్కడా అనుకోవచ్చు. కొన్ని విషయాలు తెలుసుకోడానికి టైం అక్కర్లేదు కళ్ళుంటె చాలు. అందులో మగకళ్ళు ఐతే మరీనూ..

అతనికి నచ్చిన మరో ఆకర్షణ..ఆమె ఎత్తు. తన భుజాల ఎత్తున్న అందమైన ఆడవాళ్ళంటె అతనికదో క్రేజ్ ..

ఏమిటీ! దేవకి లాంటి భార్య వున్నా, ప్రకాష్కి ఇలాంటి బలహీనతలా అని ఆశ్చర్యమేస్తుంది కాని రుక్మిణి లాంటి సతి ఉన్నా క్రిష్ణయ్య మురళి ఊది మరీ గోపికల్ని రప్పించుకునేవాడట.

పిపాస! సౌందర్య పిపాసకుడు కాని వాడు మగాడు కాదు..దేవుడైనా సుమ్మీనేమో?!..అదేమో కాని,

ఇప్పుడు తలుపు మీద గబగబమంటు బలంగా వినిపించిన నాకింగ్ చప్పుళ్ళకి ఆమె గిరుక్కున ఇటు తిరిగింది.

ఆరడుగుల ఆజానుబాహుడు, అందగాడు..ముఖమంతా అప్రసన్నంగా చేసుకుని, అసహనంగా చూస్తూ కనిపించాడు..

అతను మాత్రం ఆమెని చూసీ చూడ్డంతోనే..విస్తుపోయాడు.

ఒకపాటి షాకింగ్తో..!!

*********

## 4

‘**ఈమె తనెరిగిన మనిషిలా తోస్తోంది.** బాగా గుర్తున్నట్టుగా లేదు? కొంపతీసి, నిరుపమ చెల్లెలైతే కాదు కదా?! పనిమాలా వెతుక్కుంటూ వచ్చిందా? ఒక్క క్షణం గతం మెరిసి, సందేహపెట్టింది.

ఇటు తిరిగిన ఆమె -‘ఇతగాడేమిటీ, అంత వేగంగా తలుపు కొట్టి, ఇంత తాపీగాగుచ్చి గుచ్చి చూస్తున్నాడు ముఖంలోకి? మెడ మీద ఇందాకటి చురుక్కులు ఇతగాని చూపులే కామోసు!‘

ఆమెకి గుప్పున తన అందం గుర్తొచ్చి. ‘ఓ అదా సంగతి!‘ అనుకుంది

ఆమె గురుంచి చెప్పాలీ అంటే-అందంలో చందమామే. డౌట్ లేదు. కాకుంటె, చల్లగా వుండదు.నిప్పురవ్వలా వుంటుంది. చూడంగానే, అగ్గిపుల్లలా రాజుకుంటుంది. ఆమె ఆకృతి అలాంటిది. మగాళ్ళ గుండెల్ని తత్తర పెట్టే గుణమేదో

నడుము మెలికలో! అందులో- బంగారం పోత పోసిన మేని ఛాయేమో, - పగటి కిరణాలకి తళతళమంటూ, రాత్రి చంద్ర రేఖలకి మిలమిలమంటు మెరుస్తూంటుంది.

తనని మొట్ట మొదటి సారిగా చూసిన ఏ మగాడికీ నోట మాట రాదన్న సంగతి ఆ స్టన్నింగ్ బ్యూటీకి తెలుసు. ఎన్ని ఆ రాధనలు పట్టించుకుక్క అకృతీ, ఆమెది!? ఎన్ని కళ్ళ ఫ్లాష్‌లలో చిక్కిన రూపమనీ, ఆ సుందరిదీ!? ఇప్పుడీ అందగాడునూ.. చూపు తిప్పుకోలేకపోడంతో ఒక్కసారిగా..వొంటి మీదకంతా వొచ్చి కూర్చుంది గర్వం.

"యెస్ . చెప్పండి" అంది ధీమాగా.

గొంతు సవరించుకుంటూ అడిగాడు.. "ఇల్లు చూస్తున్నట్టున్నారు?"

"అవును. ఏం?"

"ఏం లేదు. చూడ్డం అనవసరం. ఇల్లివ్వం." ఖచ్చితంగా చెప్పేసాడు. చెపాలనుకున్నదాన్ని, రెండు ముక్కల్లో తేల్చి చెప్పడం అతనికలవాటు.

ఆ ఖరాఖండి తనానికి ఆమెకొళ్ళు మండింది.

"అంటే?"

"ఓ!. మీకు నా తెలుగు అర్థం కావడం లేదనుకుంటా!? మీ.. కు ఇల్లు ఇ వ్వ బ డ దు..సరా?"

రెండు చేతులూ నడుమ్మీదేసుకుని నిఠారుగా నిలబడ్డ మనిషి, అంత పెళుసుగా మాట్లాడ్డం ఆమెకి నచ్చలేదు. కనుబొమలు చిట్లించి అంది..

"అదేమిటి, ఇల్లడిగింది నేను, మాటిచ్చింది ఆమె. కదా!?..ఇంతకీ మీరో..?" అంటూ ఆపేసింది. నిజంగానే మెకి డొటేసింది. అంతవరకు నిజమే. కాని, అడిగిన స్టైల్

అవతల వ్యక్తికి ఎలా అర్థమైందంటె, 'ఆవిడ ఇస్తానంది, నేను తీసుకుంటానన్నా..మధ్యలో నువ్వెవడివి? తోటకూరలో గడ్డిపరకలా..' అన్నట్టుగా ..అక్షరాలా అట్లాగే వినిపించిందతనికి.. అది అతని తప్పు కాదు. ఆమె బాడీ లాంగ్వేజ్ ..అలా వుంది మరి.

చిర్రెత్తి.. విస్సురుగా చూశాడామెని. అసలే అగ్గిలా వున్నాడేమో, ఆమె మాటలు జ్వరంగా మారి, మరింత మంట పుట్టించాయి.

అతని ముఖంలో ఎరుపు చూసి, నవ్వుకుంది. 'మంచిగా అంది.' తనని తాను మెచ్చుకుంటు, లోలోనే సంతోషపడిపోయింది. నిప్పులో ఉప్పవుతుందనీ అప్పటికీ అర్థం కాలేదు..

అతనికిమాత్రం పూర్తిగా అర్థమైంది. ఆ మాటల్లోని అంతరార్థం, ఆమె ఆంతర్యం రెండూనూ. ఆమె స్థానంలో వేరెవరున్నా ఎలా స్పందించేవాడో ఏమో కానీ, ఆ శైలికి మాత్రం ఆమె స్టయిల్లోనె జవాబిచ్చి, నోరు మూయించాలనుకున్నాడు.

"ఓహో! మీకు నేనెవరో చెప్పాలా!?" 'పాపం' అనే వెటకారం ధ్వనిస్తోంది. "ఐతే, వినండీ" మళ్ళీ వ్యగ్యం..

"నా పేరు ప్రకాష్. దేవకి నా భార్య. ఈ ఇల్లు నాది. ఈ ఔట్ హౌస్ కూడా నాదే చాలా ఈ వివరాలు? మీరిక.." 'దయచేస్తారా!?' అన్నట్టు ..కుడి చేతిని బారచాచి - బైటకి చూపించాడు. , బైటకి నడవమని పొలైట్‌గా చెప్పడం అది.

అతనెవరో తెలీడం ఒక షాకైతే, 'గెటవుట్ ' అనిపించుకోడం మరో షాక్. చాచి చెంపమీద కొట్టినా ఆమెకంత బాధ అనిపించేది కాదేమో!

అప్సలూహించని అవమానంతో భరించలేనంత బాధేసింది. ఒక్కసారిగా  ముఖంలోరంగులు మారాయి. రక్తం చిమ్మినట్టయింది. తలకొట్టేసిన దానిలా.. కిందకి వాలిపోయింది.

'అదీ. అలా రా. దార్లోకి.' అనుకున్నాడు కసిగా. ఇప్పుడతనికి హాయిగా వుంది మనసు.' బాగా అన్నానే! ..హమ్మో! లేకపోతే?, తనింటికొచ్చి, తననే నిలేస్తుందే?, నువ్వెవరనీ!? దెబ్బకి దెబ్బ. ఇక సరి.' ఆమె అలా బాధ పడటం అతనికి నందాన్నిస్తోంది. ఆమె మీద విజయం సాధించినంతగా..

ఐతే, ఆమెకి ఆపుకోలేనంత కోపమేసింది.."చూడండి ప్రకాష్ గారూ! ఈ ఇంటి యజమాని మీరే కావొచ్చు. మీరు సర్వాధికారి అయి వుండొచ్చు. కాని, నన్నిక్కడికి అనుమతించింది ఎవరో కాదు. సాక్షాత్తు యజమాని భార్యే. మీకేమైనా అభ్యంతరాలుంటె ఆమెతో చెప్పాలి కాని, ఇలా మీరు నోరు పారేసుకోడం.." మాటలు పూర్తి చేయనీకుండా.. సరిగ్గా అప్పుడక్కడికొచ్చింది

దేవకి. మామూలుగా కాదు. పరుగులాంటి నడకతో..

కాని, ఆ పాటికే అతను సిద్ధమై పోతున్నాడు. ఆమెకి ఘాటుగా... జీవితంలో మర్చిపోలెనంత ఘాటుగా.. జవాబివ్వడానికి.

"ఆకాష్ " అతన్ని చూపుల తోనే వారించింది. "ప్లీజ్.. నువ్వొక్క నిముషం ఇలా రా.." అంటూ.. అతని చేయి పట్టుకుని తీసికెళ్ళిపోతోంది..అక్కణ్ణుంచి.

ముఖమంతా కందగడ్డ చేసుకుని, భార్య వైపు అసహనంగా, శైలి వైపు గుర్రుగా చూస్తూ, , బలవంతంగా వెళ్తున్నాడతను..

శైలికి వాళ్ళిద్దరి మాటలు వినిపిస్తున్నాయి.

"ఎందుకంత కోపం?" లాలనగా అడుగుతోంది.

"కోపం కాదు. ఒళ్ళు మండిపోతొంది.అసలామె నన్నేమడిగిందో తెలుసా?" బిగ్గరగా అంటున్నాడు.

"హుష్ ! లోపలకెళ్ళి మాట్లాడుకుందాం" మూడో మనిషికి తెలీయకూడదని ఆమె మొహమాటం.

వినాలనే అతని అభిమతం.

వాళ్ళమాటలు దూరమైపోయాయి.

తుఫాన్‌లో పిడుగొచ్చి మీద పడకుండా ఒక గాలొచ్చి తోసుకు పోయినట్టు... అతన్ని లోపలికి తీసికెళ్ళిపోయిందామె. కాదు లాక్కెళ్ళిపోయింది.

శైలి ఒంటరిగా మిగిలిపోయింది. చలనం లేక... స్తబ్దుగా..దిక్కు తోచని దానిలా, స్థాణువైపోయింది.

ఇదంతా, ఇలా ఎలా జరిగింది? - మిలియన్ డాలర్ కొశ్చన్ .

'నీ ప్రశ్నలు నీవె, ఎవ్వరూ బదులివ్వరుగా.' గుర్తు చేసాడు సిరివెన్నెల.

..ఒక మగాడు, తనని బయటకు పొమ్మనడం, అదీ మొదటి పరిచయంలోనే..ఇంత ఘోరంగా అవమానించడం.. ఆమె జీవితంలో ఎరగదు. ఇంత మహాపరాభవం ఎదురవడం ఇదే మొదటిసారి ..

ఆమెని రాయిని చేసిన సంఘటన అది కూడా కాదు.

ఆకాశానికేసిన నిచ్చెన జారి పోయినందుకు. ఆశా సౌధం పేక మేడలా కుప్పకూలిపోయినందుకు. బంగారం లాంటి అవకాశం, చేతిలోంచి మాయమైనందుకు..ఇక కాలం కరుణించనందుకు..కదలని నిముషం

కరగనందుకు.

ఒక ఆశా కెరటం ఎగిసి, అంతలోనే విరిగి, ఇసుకలో ఇంకిపోయినట్టు. ఆమె ఒంట్లో శక్తంతా ఎవరో వచ్చి హరించుకుపోయినట్టయింది. రక్తమంతా తోడుకుపోయినట్టు ప్రాణం వ్రేలాడిపోతోంది. నిలబడిలేని దానిలా..తూలుతూ చెట్ల దగ్గర బెంచీ మీద కూలబడిపోయింది. పొద్దున్నుంచి తిండీ తిప్పల్లేక నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి.

నిండా చుట్టుకున్న ఒంటరితనం, గుండెని మింగేస్తూ విషాదం, వెంటాడుతూ దహిస్తున్న అవమానం. అన్నీ ఆమెని శత్రువుని చేసి, ఒక్కసారిగా ముట్టడిస్తున్నాయి.

అశక్తురాలైంది..అసహాయంగా చూసింది.

ఒక కొమ్మ నిస్సహాయంగా చూసింది ఆమె వైపు.

అప్పుడొచ్చింది. దుఃఖం. పొంగుకుంటూ...తెరలు తెరలుగా...గుండె గండి తెగింది. ఇక ఆమె వల్ల కాలేదు.. గబుక్కున రెండు చేతుల్లో ముఖం దాచుకుంది.

కష్టాలకి ఔట్‌లెట్లు- కన్నీళ్ళు!

నిజానికి కష్టాలేసినప్పుడు రావలసినవి కన్నీళ్ళు కాదు. అయినవాళ్ళు!

జీవితంలో అసలైన విషాదం- కష్టాల కంటే, వాట్లని పంచుకునేందుకు ఎవరూ లేకపోవడం.

ఆ దీన వదనం చూసి, మొక్కలన్నీ మౌనమైనాయి. నోళ్ళు తెరుచుకుని పూలు జాలిగా చూస్తున్నాయి. గాలి కదిలి బరువుగా నిట్టూర్పులిడుస్తోంది.

అలా ఎంతసేపైందో, ఏమో..

"శైలీ" చల్లగా పిలిచిందా గొంతు. "ప్లీజ్. ఏడ్వకు." ఆ వోదార్పుకి కొంచెం దుఃఖమాగింది. "నేనున్నా!. నీకెందుకు భయం?" ధైర్యమిస్తోంది నేస్తం.

'ఏ నీడా లేని నాడు నీ నీడే నీకు తోడూ' అన్న ఆరుద్ర మాటల్ని ఆమె అక్షర సత్యాలుగా చేసుకుంది నిజ జీవితంలో

నీడే బోధిస్తోంది.

పొరబాటు చేసానని కుమిలి పోవద్దు శైలీ. ట్రయల్ అండ్ ఎర్రర్ తెలుసు కదా. ఒప్పేదో తెలుసుకోవాలంటె చేయాల్సింది తప్పులే. ఒకవేళ' తప్పే జరిగింది' అనుకుందాం. వొదిలేయి. కాని, ఆశయాన్ని మాత్రం వొదలకు..అదే గనక జరిగితే, అసలైన తప్పు చేసిన దానవవుతావ్ ..

ప్రయత్నం విఫలమైందనే బాధొద్దు.

నీ ప్రయత్నం నువ్ చేయ్ . 'డూ ద థింగ్ అండ్ యూ విల్ హావ్ ద పవర్' అని అంటాడు ఎమర్సన్ ?

హెలో..నీకో సంగతీ తెలుసా? .

విషాహారం తిండం కంటేనూ ప్రమాదకరమైనదేమిటో తెలుసా? నీ మీద నువ్ జాలి పడ్డం. సెల్ఫ్ పిటీ. అర్జెంట్ గా. నువ్వది మానేసుకోవాలి.. ఒకే?

నీ వొంటరితనాన్ని పదే పదే గుర్తు చేసుకోకు.

***నిన్నందరూ వొదిలేస్తే వచ్చేది ఒంటరితనం. నువ్వందర్నీ వొదిలేస్తే కలిగేది ఏకాంతం.*** రెంటి రూపాలు ఒకటే. కాని, స్వభావాలు భిన్నం. . ఏది కావాలో! నువ్వే కోరుకో.

చివరిగా..

డాక్టర్ మార్ట్సన్ ఏమంటాడొ చెబుతా విను.

"జీవితంలో మనమందరం నటులం. మనం చేయాల్సిందల్లా . సరైన పాత్రని ఎంచుకోవడమే" అని అంటాడు. కరెక్టుగా నీకిది పూర్తిగా వర్తిస్తుంది ....ఇందాక జరిగిన సన్నివేశంలో, నువ్వు సరైన పాత్రనెంచుకోలేదంతే.

టైపింగ్‌లో తప్పులొచ్చాయని, కంప్యూటర్‌ని చెత్తబుట్టలో పడేస్తామా? అపస్వరం పలుకుతోందని వయొలిన్‌ని పారేస్తామా? తప్పు చేసావని నిన్ను నువ్వే తక్కువ చేసుకుంటావా?

నువ్ చేసిన తప్పులు- నీ చేత్తోనే దిద్దుకోబడాలి.

జీవితం ఒక ఆట. నీ ఓటమిలో ఎవరూ వుండరు. ఒరిగిపోతున్నప్పుడు నిన్ను నువ్ పడేసుకోకూడదు. నిలబెట్టుకోవాలి. అప్పుడే విజయాన్ని సాధిస్తావ్ .

ఇక విజయం లేదనే కదా నీ నిరాశంతా..?

" సక్సస్ లో ' సి ' ఏం చెబుతుంది?"

"సి స్టాండ్స్ ఫర్ కరేజ్ " చెప్పింది శైలి.

"యెస్ . చాలా సమయాల్లో- నమ్మకం ఇవ్వలేని విజయాన్ని- ధైర్యం ఇస్తుంది. నీకిప్పుడు సరిగ్గా కావాల్సింది కూడా ఇదే. మనసు నెమ్మది చేసుకో. అదెలా అనేది నీకు తెలుసు కదూ?"

తెలుసన్నట్టు తలూపింది. మనిషి నిఠారై కూర్చుంది. శ్వాస మీద దృష్టి సారించింది. తనలోని ఇన్‌స్ట్రక్టర్ ని అనుసరిస్తోంది.

ఆపత్కాలంలో ఆమె జపించే ఒకే ఒక మంత్రం. సెల్ఫ్ హిప్నాటిజం.

ఇప్పుడామెకి కొత్త ఊపిర్లందుతున్నాయి... శరీర కండరాలన్ని రిలాక్స్ అవుతూ..మనసంతా తేలికవుతూ..మెదడంతా ప్రశాంతత పొందుతూ..ప్రాణం హాయి తేలుతోంది. తుఫాను వెలిశాక, వాతావరణం ఎలా నిశ్శబ్దంగా వుంటుందో . ఆమె కూడా అంతే నిర్మలంగా కనిపిస్తోంది. మనసు ఇప్పుడు నిశ్చలమైంది.

ఆమె ఆత్మ స్థయిర్యాన్ని అభినందిస్తూ కావొచ్చు.-.ఒక చల్లని గాలి తెరొచ్చి చుట్టుకుందామెని.

అంత ఏకాగ్రతలోనూ ఆసక్తిగా... అనుకుంది

'వాళ్ళిద్దరూ లోపల ఏం మాట్లాడుకుంటున్నారో' అని.

******

అప్పటికి పదినిముషాల్నుంచి చెబుతోంది భర్తకి. శైలి గురించి, ఆమె పరిస్థితి గురుంచీనూ. మళ్ళీ అదే మాట చెప్పడంతో-

"ఏమిటంటున్నావ్ ?" అని అడిగాడు వింతగా.

"అవును ఆకాష్ . పాపం! ఆమె చాలా కష్టాల్లో వుంది" సానుభూతిగా అందామె.

ఫెళ్ళుమంటూ నవ్వొచ్చిందతనికి. కానీ, ఆపుకుంటూ అడిగాడు.

"అలా అని చెప్పిందా నీకు?"

"లేదు...... చెప్పలేకపోయింది" బాధగా అంది.

నిజమంతే! ఆడదాని హృదయ ఘోష సాటి ఆడదానికే బాగా అర్థమౌతుంది. ఒక మగాడి కంటే కూడా! విషాదమేమిటంటే, స్త్రీ సహజమైన ఈర్ష్యయో, అభద్రతా భావమో నోరు నొక్కేయడం తో- స్త్రీ కి స్త్రీ నే శత్రువవుతోంది. అంతే.

మరో చిత్రమేమిటంటే..దేవకిలో అలాంటి గుణాలే కనిపించవ్ ..

ఆమెదంతా-

'బి గుడ్ . డూ గుడ్ పాలసీ. కాకుంటె, చాలామందికి పాటవుతుంది. దేవకి మాత్రం పాటిస్తుంది. అదే తేడా.

తన చుట్టూ వున్న వారిలో- మంచిని మాత్రమే చూడ్డం, మంచి మాత్రమే చేయడం ఆమె సహజ లక్షణాలు.

అందుకే, అతనికి భార్యంటే అమిత గౌరవం. ఆమె వ్యక్తిత్వం ఆమెకిప్పించిన హోదా అది.

తదేకంగా అమెనే చూస్తున్నాడు.

సోఫాలో కూల్‌గా జార్లబడి కూర్చున్న ఈ ప్రకాషేనా .. నిప్పులు చెరిగిన ప్రకాష్ ? అంటే ఎవరూ నమ్మరేమో!

అతను నీరైనప్పుడు వెచ్చటి సెగ అవుతుంది. అతను నీరైనప్పుడు నీళ్ళు జల్లి చలారుస్తుంది. 'భార్య' అనే పదవిలో వున్నవారికి వుండాల్సిన ముఖ్య లక్షణం- భర్తలో బలహీనతలని అర్థం చేసుకోవడం. మార్చడానికి ప్రయత్నించడం. భర్తని బానిసగా చేసుకోడం ఏ భార్యకైనా తేలికే కావొచ్చు. కాని, బాధ్యత నేర్పించడం కష్టం.

ఆమెకి భర్త మనస్తత్వమేమిటో బాగా తెల్సు. అందరికీ - అతని కోపమే తెలుసు.. ఆమెకి మాత్రం- 'కోపం వెనక కారణం' వుంటుందని తెలుసు.. చాలామంది- అతనొక రాయి అనునుకుంటారు. కాని రాతిలో నీళ్ళుంటాయని ఆమెకి మాత్రమే తెలుసు.

అందుకే, అతను శైలి గురుంచి చెప్పిన నేరాలాన్నీ వింది. అతన్ని మాట్లాడించింది. తను విన్నది. సగం అక్కడ కూల్ అయ్యాడు. విన్న తర్వాత చెప్పింది. 'శైలి అలా మాట్లాడకుండా వుండాల్సిందని.' హమ్మయ్య. అతని కోపం చప్పున చల్లారిపోయింది. భార్య తనని అర్థం చేసుకుంది. చాలు. అతనికిప్పుడెంత హాయిగా వుందంటే, తాపమైన శరీరానికి చల్లని చందనం అలిమినంత హాయిగా వుంది.

అతను శాంత పడ్డాడనుకున్నాక....శైలి గురుంచి చెప్పడం మొదలు పెట్టింది..

ఒకే సమస్యని ఇద్దరాడవాళ్ళు ఎంత భిన్న రీతిలో టాకిల్ చేస్తారో గమనిస్తున్నాడతను.

ఆమె తన భార్య అయినందుకు ఎంతో గర్వమనిపించింది అతనికా క్షణంలో.

అతని ఆలోచన్లతో సంబంధం లేకుండా తన దారిలో తాను చెప్పుకుపోతోంది. "ఆమెని ఒక వ్యక్తిగా పక్కనొపెడదాం. ఆమె పరిస్థితుల కోణం లోంచి ఆలోచించి చూద్దాం. వెళ్ళిపొమ్మని చెప్పామే అనుకో, ఒంటరిగా ఎక్కడికెళ్తు ంది? ఈ రాత్రి ఎలా గడుపుతుంది? ఎదో హోటెల్ లో వుంటుందనుకుందాం. అందమైన ఆడది. పైగా ఒంటరిది.. ఏదైన అత్యాచారం జరిగితేనో, ఎవరైనా అఘాయిత్యం చేస్తేనో.. లేదా విరక్తితో మే ఏమైనా అయిపోతేనో..! మనకా సంగతి తెలిసిందే అనుకో..అప్పుడు మనం..!?" ఆమె చెప్పడం పింది.

నిజమే. ఎన్ని చూడ్డం లేదనీ, స్త్రీల మీద జరుగుతున్న ఘోరనేరాలు.

ఛ.! ఆమెకి అలా జరగకూడదు. దేవకి చెప్పినట్టు, అలాంటిదేదైనా జరిగితే, జీవితాంతం నేర భావం వెంటాడుతుంది.

"అందుకే మన వంతు సాయం మనం చేద్దాం. వ్యక్తికి చేసే మేలే- సమాజానికి చేసిన సేవవుతుంది." చెప్పడం పూర్తి చేసి, రెస్పాన్స్ కోసం అతని ముఖంలోకి చూస్తోంది..పరీక్ష రాసి, ఫలితం కోసం ఎదురుచూసే విద్యార్థి లా..వుందామె పరిస్థితి.

దేవకి మాటలకి అతను పూర్తిగా కన్విన్స్ అయ్యాడు కాని...నిర్ధారణకే రాలేకపోతున్నాడు..కారణాలనేకంగా ఏకమౌతూ..అతన్ని కన్ఫ్యూజ్ చేస్తున్నాయి.

అతను మౌనంగా వుండిపోయాడు..

ఇంతలో- అతని భుజం మీద మెత్తని ఆమె చేతి వేళ్ళ స్పర్శ కి.. చూసాడు ఆమె వైపు అభావంగా..

"ఆకాష్ ! నువ్ దేని గురుంచి ఆలోచిస్తున్నావో నాకు తెలుసు. నీ భయమంతా నా గురించే. కదూ? !ప్రామిస్ నీకెలాంటి సమస్యా రానీయను. ట్రస్ట్ మి" చెప్పింది. నిజాయితీగా. అది కాదు అతన్ని వివశిన్ని చేస్తోంది..తన మనసుని ఎలా చదవగల్గుతుందా అని!.

అతనిమనసు మీద ఏ దిగులు మబ్బులు కమ్ముకోకుండా భర్తని భద్రంగా చూసుకుంటుంది. అందుకే

అతడి కళ్ళు తడవుతాయి. .

దేర్ షి ఈజ్ ..

తన సమాధానం కోసం చూస్తున్న ఆమెతో అన్నాడు.

"సరే. అలాగే కానీయి."

హమ్మయ్య అనుకుంది. అతనొప్పుకోడంతో.

"ఐతే, ఒక మాట" అతనేదో చెప్పబోయాడు. "ఒకటో, రెండో నాకు తెలీదు బాబు. అన్నీ మీరే మాట్లాడుకోండి ఆమెతో. భోజనం తయారు చెయ్యాల్సిన పనులున్నాయి నాకు.." అంటూ నడుంకి కొంగు చుట్టుకుంటూ అక్కణ్ణుంచి హడావుడిగా వెళ్ళిపోయింది.

గాయం చేసినవారే మందు రాయాలి.

బాధించిన వారే బాధితుల్ని ఓదార్చాలి.

శైలిని వెళ్ళొద్దని, ప్రకాషే చెప్పాలి. అదీ ఆమె అభిప్రాయం.

నిజమే కదా! ఇద్దరి వ్యక్తుల మధ్య ఇనపగోడల నిశ్శబ్దాన్ని పగలకొట్టే పరికరాలంటూ ఏవీ లేవ్ , మాటలు తప్ప. ఘోర శత్రువుల్ని సైతం మిత్రులుగా మార్చే శక్తి ఏ మాయాలకీ లేదు. ఒక మంతనాలకు తప్ప.

ఒంటరిగా మిగిలిపోయిన శైలి అక్కడ ఎంత వేదన చెందుతోందీ.. దేవకి ఊహించగలదు. ఆమె హృదయానికి అన్నీ తెలుస్తూనే వుంటాయి.

స్త్రీని దేవతగా సృష్టించాడట దేవుడు. మగాడే ఆమెని రాక్షసిగా మార్చాడట. ఎవరో అంటే విన్నా.

అతను సోఫాలోంచి అయిష్టంగా కదిలాడు. " దేవీ.. ఆమె పేరేంటీ అన్నావ్ ?"

"శైలి" లోపల్నుంచి చెప్పింది.

"గయ్యాళి కాదూ?..పేరు బాగానే వుంది. మనిషే మిరపకాయి. ఐనా, గట్టిగా పట్టుకుంటే, గుప్పిట్లోకి రాని ఈ పిల్లకి అంత అహమెందుకో!' తన కామెంట్‌కి తనే నవ్వుకున్నాడు.

బైటకొచ్చి, ఆమెకోసం చూసాడు.

అక్కడ బెంచీ మీద, వొళ్ళో చిన్నానెత్తుకుని,, వాడి తలమీద చుబుకమానించి , కళ్ళుమూసుక్కూర్చునుంది శైలి. ఆమెనలా చూసే సరికి..ఒక్క క్షణం జాలేసింది..

.."ఒక నిస్సహాయురాలు మన నీడ కోరి వచ్చింది. అసలు కారణాలు తెల్సుకోవడంకంటే, తెలుసుకున్న కష్టాన్ని దూరం చేద్దాం. ఏమంటావ్ , ఆకాష్ ?" దేవకి మాటలు గుర్తొచ్చాయి.

ఎంత బాగా చెప్పింది!

అతను గొంతు సర్దుకున్నాడు. తన ఉనికిని ఎరుకపరుస్తూ.

ట్రాన్స్ లోంచి బయటకొస్తున్న దానిలా..కళ్ళు తెరిచి చూసింది. వండర్ ! అతనామెకి చాలా సమీపంలో నిలబడున్నాడు. ఠీవీగా చేతులు కట్టుకుని

తన కళ్ళని తనే నమ్మలేక పోతోంది...ఆశ్చర్యపోతూ లేచి నిలబడి. 'హలో..న..మస్తే.." ఎలా స్పందించాలో అర్థం కావడం లేదు.

తడబడుతూ.. కొంగుని భుజాల చుట్టు కప్పుకుంది. అతనంటే తనకెంతో గౌరవమని చెప్పే ప్రయత్నంలో భాగంగా అని అనుకుందేమో...

కాని అతనికి కనిపిస్తోంది వేరు. అప్పటి దాక పైట మడతల్లొ దాగిన ఆమె సొగసులు వొంటి పొరలో ద్విగుణీకృతమౌతున్నయి.

యెద పొంగుల మీది వెన్నెల తెరను వేళ్ళ కొసలతో తొలగించాలనే ఒకలాంటి ఉద్వేగం..అతనిలోనూ కలిగింది. అదీ ఒక క్షణం పాటే.

అతని చూపొచ్చి గుచ్చుకోడం ఆమెకి తెలుస్తూనే వుంది. గత అనుభవం గుర్తుంది కాబట్టి. ఆమె ఏ మాత్రం మురిసిపోదల్చుకోలేదు..

"సారీ. వెరీ సారీ. నేను కావాలని ...అలా మాట్లాడ లేదు అదంతా తెలీకుండా జరిగిపోయింది.. అసలు నేనేం చెప్పాలనుకున్నానంటే.."

ఆగిపోయింది. అతను ఆపమన్నట్టు చెయి చూపించడంతో ."సరే. జరిగిందేదో జరిగింది. వొదిలేయండి. దేవీ నాకంతా చెప్పాక.. కాదనలేకపోతున్నా. మీరిక్కడ వుండొచ్చు."

అంతే. అది వినీ వినటంతోనే, ఎగిరి గంతేయాలనిపించిందామెకి. సంతోషం ఉప్పెనైంది..

ఆమె కళ్ళు నక్షత్రాల్లా మెరిసాయి. ముత్యంలా మెరుస్తోంది నవ్వు,..

స్వయంగా అతనే వొచ్చి ఇలా చెప్పడం. ఆమెనెంత ఆనందోద్వేగానికి గురిచేస్తోందంటే అతని చేతులు పట్టుకుని కదిపేయాలనేంత ఎమోషనల్‌గా కదిలిపోతోంది. షేక్ హాండ్స్ ఆమెకి చాలా అలవాటైన అలవాటు..'..ఈ తిక్కలోడితో మనకెందుకులే' అనుకుందో ఏమో చేతుల్ని వెనక్కి తీసుకుంది. తీసుకుని, చెప్పింది.

"థాంక్సండి. మీకెలా థాంక్స్ చెప్పాలో తెలీడం లేదు.. అసలీ రోజుల్లో మీలాంటి మంచి...." ఆమె గిపోయింది. అతను చాలన్నాట్టు సైగ చేయడంతో.

ఆమె అన్ని సార్లు థాంక్స్ చెప్పడం, పొగడటం అంతా ఇబ్బందిగా అనిపిస్తోంది అతనికి.

అదలా వుంచి, ఇప్పుడీమె చూపిస్తున్న అణకువ, నెమ్మదితనం అంతా కృత్రిమంగా తోస్తోంది. అతని కో గొప్ప డౌట్‌గా వుంది. .శైలి మరో పార్శ్వం గురించి కాదు. ఒరిజినల్ కాపీ గురించి. మనకెవరికీ తెలీని ఆమె అసలు స్వరూపం మరోకటేదో వుందనేది- అతని ప్రగాఢమైన సందేహం.

ఎందుకలా అంటే ఏం చెప్పలేం.

కొన్ని ముఖారవిందాలు చేసుకున్న పుణ్యాలంటారు చూసారూ.. అవి అంతే.

అందుకే అంటారు. ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్ అని.

మనకు చాలా కావాలసిన వ్యక్తికి- మనలోని ఏ బలహీనతలైతే తెలీకూడదనుకుంటామో, సరిగ్గా అవే, ఏవో కారణాల వల్ల తెల్సిపోతూన్నప్పుడు..,

అరువు తెచ్చుకున్న మంచి ముసుగు, అతిజాగ్రత్తపు ప్రవర్తనలో జారిపోతూన్నప్పుడు వ్యక్తి పరిస్థితి ఎలా వుంటుందో..అచ్చు అదే అవస్థాస్థితిలో వుంది - శైలీనూ.

అతనింకా చెప్పదలచుకున్నది పూర్తి కాలేదన్నట్టు.., అసలు విషయానికొచ్చాడు -"ఐతే, ఒక షరతు."

ఆమె వినయంగా వింటోంది.. తలాడిస్తూ..

"మీకు 'మరో ఇల్లు దొరికే వరకే' మీరిక్కడ వుంటారు. అది ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. మరో షరతు-" అంటూ చుట్టూ చూసాడు. అక్క డెవరూ తమ మాటలు వింటం లేదని నిర్ధారించుకున్నాక చెప్పాడు. -"నా భార్యకు సాధ్యమైనంత దూరంగా వుంచాలి చిన్నాని." .

అతడెంత గొంతు తగ్గించి చెప్పినా, రాతి శాసనంలా వినిపించింది. మనసుని కఠినంగా తాకింది. బాధ కాని, కోపం కాని కళ్ళల్లో కనిపించకుండా జాగ్రత్త పడింది. అందుకామెకి చీకటి తెర కూడా సాయం చేసింది.

"ఒకే?" అధికారంగా అడుగుతున్నాడు ఆమె అంగీకారాన్ని.

'సరే' అంటూ తలూపింది. అతి భక్తితో ఆమె భుజాలు వొంగి వున్నాయి. బాస్ ముందు యెస్సార్ అంటున్న బంటులా..వుందామె భంగిమ.

అతనూ తల పంకించాడు.

"టేక్ కేర్ " అంటూ వెళ్ళబోతున్న వాడల్లా.. ' ధబ్ 'మన్న చప్పుడుకి గబుక్కున వెనక్కి తిరిగి చూశాడు..

*********

## 5

**ధబ్ ..ధబ్ ధబ్ ..**

మళ్ళీమళ్ళీ ధబ్ మంటున్న శబ్దాలు వినొస్తున్నాయి..

ఆ పాటికే, ఆమె అటుగా వెళ్తోంది వేగంగా.

అతనూ గబగబా అడుగులేసుకుంటూ వచ్చాడు.

గాలివానకు, కొబ్బరి గెలలు రాలిపడుతున్నప్పుడు గుండెలు గుభేల్మనేలా..

ఒకదాని వెనక ఒకటిగా లోపలకొచ్చి పడుతున్నాయి, ఎత్తైన గోడమీంచి హైజంప్ చేసుకుంటూ.

ఒక పెద్ద సూట్‌కేస్ , ట్రాలీ బాగ్స్, , కారీ బాగ్స్ ,వాటర్ బాటిల్స్ ..

వాట్ని చూస్తూ చూస్తూనే ఆమె కెవ్వ్ మంది.

అతనికేం అర్థం కావట్లేదు. కనుబొమలు ముడిచి - "ఏవిటివీ?" అడిగాడు..

"నా సామాను" గొల్లుమంది. .

"సామానా! ఇక్కడికెలా వొచ్చి పడ్డాయీ ?" అతని ప్రశ్నకి పిచ్చి చూపులుచూస్తోంది.

సరిగ్గా అప్పుడే బైట నుంచి ఆటో స్టార్ట్ ఐన చప్పుడైంది.

ఆ ఇంజెన్ మోత - మెదడు మీద ఎలా పనిచేసిందంటే..గతజన్మగుర్తొస్తున్నప్పుడు సినిమాల్లో వినిపించే బాక్ గ్రౌండ్ మ్యూజిక్ లా పనిచేసింది.

క్షణంలో అంతా గుర్తొచ్చి...తెలివిలోకొచ్చింది. అంతే, అర్జునుడు ఎక్కుపెట్టి వొదిలిన బాణంలా "ఒరేయ్ ..ఆగరా..ఆగు" అంటూ గోడ దిశగా పరుగుతీసింది అతివేగంగా. అలా పరుగుతీస్తూనే తిట్ల దండకం మొదలెట్టింది..." ...దున్నపోతు సచ్చినోడ..ఏం రోగం వచ్చిందిరా నీకు..నీ చేతులు పడిపోను..నా సామాన్నే పారేసి పోతావ్రటా....చంపేస్తా..వెధవా..దుర్మార్గుడా దుష్ట ముఖమా..ఎంత ధైర్యం రా నీకు..మక్కెలిరగతన్నిస్తా..ఒరేయ్ ..ఆగరా ఆగు. ." అంటూ పూనకం వచ్చిందానిలా వూగిపోతూ..అరుస్తోంది,

అక్కడ ప్రకాష్ అనే వ్యక్తి వున్నాడన్న స్పృహ అస్సలే లేదు.

అతనికి వింతలమీద వింతలిస్తోందన్న సంగతి అప్పుడామెకి తెలీలేదు.

అతనికి ఇంట్రెస్ట్ కల్గించే మరో విషయం ఏమిటంటే..హఠాత్తుగా భాష మారిపోడం. . .

ఖచ్చితంగా అది హిందీ, ఉర్దూ కాదు. మరాఠి అనుకుంటా..అవి మోటైన తిట్లని ఆమె హావభావాల్ని బట్టి అర్థమైపోతోందతనికి.

తనకో ఫ్రెండ్ వుండేవాడు. వెంకూ అని. తాగినప్పుడు మాత్రమే ఇంగ్లీష్ దంచేవాడు. అదీ అనర్గళంగా. . పడనివాళ్ళని గుర్తుచేస్తే చాలు, భలే తిట్లు తిట్టేవాడు. ఆ యాస ప్రాస వినడం కోసమే ..వాణ్ణి పిల్చుకుని మరీ తాగించి తను తాగకుండా గ్లాస్‌లు ముందు పెట్టుకుని కుర్చునేవాడు. వింటూ నవ్వుకునేవాడు.

నిషాలొ వున్నవాడి మాటలు నిషా లేని వాడికే నవ్వు తెప్పిస్తాయి. నిజమే కదా.

భలే వినోదంగా వుండేది.

శైలిని చూస్తే గుప్పున కారెక్టర్ గుర్తొచ్చిందతనికి.

మళ్ళీ ఇన్నాళ్ళకు అలాంటి ఎంటర్టెయిన్‌మెంట్ దొరుకుతున్నందుకు. .

ఇప్పుడతనికి అర్థం కాని మరో విషయమేమిటంటే -

ఆరడుగుల కాంపౌడ్ వాల్ మీదనుంచి దూకి పోవాలనో ఏమో..నానా రకాల ఫీట్స్ చేస్తూ ముప్పతిప్పలు పడుతోంది.

ఐదు అడుగులైనా లేని ఈమె మరీ అత్యాశకి పోతోందేమో అనుకుంటూ..

ఒక్క అంగలో దగ్గరకెళ్ళి ..అలవోకగా గోడ మీంచి బైటికి చూసాడు

ఆటో వెళ్ళిపోతూ కనిపించింది. మామూలుగా కాదు. ఆఘమేఘాలమీద పడిపోతూ... ఎవరో తరుముతున్నట్టు, శరవేగంతో పరుగుతీస్తోంది. పోతూ పోతూ..డ్రైవర్ వందోవంతు ముఖ భాగాన్ని వొంచి.. తొంగి చూసాడు. తననెవరో పసిగడుతున్నారని గ్రహించి, మరింత వేగంతో మాయమై పోయాడు, చూస్తుండగానే.

"వొస్తున్నాడా?" యాసపడుతూ అడుగుతోంది.

'ఏమిటీ వొచ్చేది?' అతనికి సీన్ అస్సలు అర్థం కాకపోడంతో.."లేదండి వెళ్ళిపోయాడు." అన్నాడు.

"వెళ్ళనీయొద్దు. వాణ్ణి పట్టుకోండి. ఎలాగైనా సరే.. జుట్టుపట్టుకుని, వొంగదీసి మరీ తన్నండి. రాస్కేల్ , స్కాండ్రెల్ ..ఎంత ధైర్యం.. అసలు నన్నేమనుకుంటున్నాడు?"

ఎగిరెగిరిపడుతోంది మనిషి. ఎగొసెగసిపోతొంది ఎద.

కోపంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. చెంపలు ఎర్రగా అయ్యాయి. బొంగురుపోయిన గొంతులోం చి మాటలు జీరపోతూ..తమషాగా వినిపిస్తున్నాయి. .

ఎత్తైన ఆ గోడని వున్నపాళాన ఎక్కేసి, పైన దూకేసి.. ఆటో వాడ్ని పట్టుకోవాలన్న ఆమె ఆత్రం బానే వుంది కాని, సాధ్యమా? అమెది మరీ దురాశ కాకపోతే!

పోనీ సన్నటి నడుం మీద చెయ్యేసి, ఓ పట్టుపట్టి సాయం చేద్దామేటీ? అన్న ఓ చిలిపి ఆలోచన మెరిసి మాయమైంది..

.. "చూడండి. ముందు మీ ఎత్తుకి మించిన పని మానండి." అన్నాడు నింపాదిగా, ఆమె వంక నిశితంగా చూస్తూ.

ఎవరో మీట నొక్కినట్టు తందనాలు ఆగిపోయాయి.

అతని ప్రశ్న ఒకటే. ఆటో వాళ్ళు ఇంత లగేజ్ తీసుకురారు. ఒకవేళ వచ్చినా..హాఫ్ మీటరో, డబల్ మీటరో డిమాండ్ చేస్తారు. .

'ఇప్పుడే వస్తానని' వెళ్ళిన పాసింజెర్ ఎంతకీ రాకపోతే.. డ్రైవర్‌కి వొళ్ళు మండి, కిరికిరి చేస్తాడు. గలాటా పడతాడు. లేదా రగడ చేస్తాడు.

అతను ఏ దొంగో ఐతే, సామానుతో ఉడాయిస్తాడు.

ఔను కదా!?..మరి ఇతనేమిటీ, ఇలా సామాన్ని గిరాటేసి పోయాడు, తీరిగ్గా ఆలోచనలో పడ్డాడు.

ప్రకాష్ తీరే అంత. ఏం జరిగినా దానికి మూల కారణ మేమిటా అని వెతుకుతాడు.

చటుక్కున ఆమె ముఖంలో చూస్తూ సందేహంగా అడిగాడు.

"ఏమైనా గొడవ పడ్డారా ?"

అవునన్నట్టు తలూపింది.

''తిట్టారా ఏవిటీ..కొంపతీసి..''

''తిట్టటం కాదు. చెప్పు చూపించా.'' అప్పటి దృశ్యం గుర్తొచ్చి..మరింత ఆవేశంగా వూగిపోతూ అంది.

తనని ప్రశ్నిస్తోంది ప్రకాష్ అనే ధ్యాస లేకుండా మాట్లాడేస్తోంది.

పరీక్షగా చూశాడామె వైపు.

తలకేసుకున్న పోనీ జారి పోయింది. జుట్టంతా విడిపోయి విరబోసుకున్నట్టుంది.. నడుంకి గట్టిగా పైట బిగించుకుని, చీర కుచ్చిళ్ళు పైకెగదోసుకుని, రంగైన హైహీల్స్‌తో ... క్షణంలో అతనికెలా కనిపిస్తోందంటే...'అచ్చు హైటెక్ లేడీ రౌడిలా లేదూ..' అనుకున్నాడు మనసులో.

'ఇంకేం. ఈమె నోరు పారేసుకునుంటుంది. అతను సామాను పారేసి పోయాడు.. సరికి సరి' లోలోపలే గుంభనగా నవ్వుకున్నాడు.

శైలి లేచిన వేళా విశేష మేమిటో కాని...

గెటౌట్ అనిపించుకుని అరగంటైనా కాకముందే.మొహం మీద కొట్టినట్టు..ఈ ఇన్సిడెంట్ జరగడం... 'నువ్వెక్కడికెళ్ళిన ఇదే అన్నమాట..' అతను నోటితో అనలేదు కాని, నొసలు సరిగ్గా అలాగే అడుగుతున్నాయి ఆమెని.

అతని కనుబొమలు చిత్రంగా కదిలాయి, అన్ని రకాల భాషల్లోనూ మాట్లాడుతూ .

కొంతమందంతే. మాట్లడకపోయినా అన్నీ అర్థమౌతునే వుంటాయి, అయిన వారికి.

చురుకు పెట్టినట్టుగా..స్పృహలో కొచ్చిపడింది. చటుక్కున సిగ్గేసింది, తన అసలవతారానికి. 'తనేవిటిలా బైటపడిపోయింది అతని ముందు, అసహ్యంగా ?' ముందు ఇక్కడి నుంచి దూరంగా పారిపోయి, తనెక్కడైనా దాచేసుకోవాల నిపిస్తోంది అర్జెంట్ గా ..

నిజమే. ఇదే సంఘటన అతని ముందు కాకుండా ఇంకెవరి ముందు..ఎప్పుడెలా జరిగినా.. ఇంత బాధుండేది కాదేమో.

జరిగిన విషయం కంటే కూడా.. తన వీరంగాన్ని చూసాడే అనే బాధ ఎక్కువైందామెలో.

కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

అతనికాపాటికే పూర్తిగా అర్థమై పోయిది. ఆమె పట్ల అతని అంచనాని ఆటొ వాడు నిజం చేసినట్టయింది. అతననుకుంటునట్టు ఆమె కయ్యాలమారే అని రుజువైపోడంతో ఆనందంగా వుందతనికి.

అందుకే, కావాలనే నవ్వాడు ఆమె ముఖంలో ముఖం పెట్టి చూస్తూ.

ఆమె వుడుకెత్తిపోయింది. మీదపడి కొట్టా లనేంత రోషం ముంచుకొచ్చింది.

నిజానికి అప్పటిదాక అతనికి జరిగిందంతా చెప్పాలని పించింది..

తను వొద్దుంటున్నా వినకుండా ఆ టో డ్రైవర్ లగేజంతా లోపలకెక్కించడం..

తనకి దారి తెలీదన్నా తనున్నానంటు అభయమిచ్చి తీసుకురావడం..

అడ్రెస్ సరిగా చెప్పలేకపోడంతో అతను విసుక్కోవడం. ఆ విసుగు.. తనకి కోపం తెప్పించడం.

వాడకూడని లాంగ్వేజ్ వాడటం.... తను చేయి చేసుకునేదాక వెళ్ళడం ..అంతా చెప్పాలని, అనిపించింది.

ఆ అవకాశమే లేదన్నట్టు..అంత సమయం అతనివ్వలేదు. పైగా..వ్యంగ్యంగా ఆ నవ్వొకటి. కారం జల్లుతున్నట్టు..

ఇవేం పట్టనివాడిలా అతనక్కన్నుంచి కదిలాడు. .

బోల్తా పడ్డావే చిన్నదానా' ...ఇంకా నవ్వితే ఏడ్చేస్తుందేమోనని..నవ్వాపుకుంటు ఇంట్లోకి నడిచాడు. లోపలికి వెళ్తు..వెళ్తూ ..

అలా భుజం మీంచి వెనక్కి చూసాడు ఓరగా..

ఆమె ఇటే చూస్తోంది. నిలువు గుడ్లేసుకుని.

'అంతే. భళ్ళుమంది నవ్వు.. ఇక ఆపుకోలేనివాడిలా..పకపకా నవ్వుకుంటూ చటుక్కున లోపలికొచ్చి పడ్డాడు..

కాని, ఆమెకి స్పష్టంగా అంతా కనిపిస్తూనె వుంది, అతని వాలకం.

ఆపుకున్న నవ్వుతో పొంగిన చెంపలు..

కెరటాల్లా ఎగురుతూ భుజాలు..

కదిలిపోతూ..వెనక వెన్ను..

అతను నవ్వే ప్రతి నవ్వూ ఆమెని గేలి చేస్తునే వున్నాయి. వెక్కిరిస్తూ రెచ్చగొడుతున్నయి.

రోషం పెరిగి, మరింతగా వుడుక్కుంది...

కాళ్ళతో నేలని తన్నుకుంటూ..కింద పడ్డ సామాన్ని ఏరుకోసాగింది..ఒక్కత్తే.

*******

రయ్ య్ న పోతోంది ఆటొ. తనలో తను కాకుండా..పైకే మాట్లాడేసుకుంటున్నాడు యాద్గిరి.

అతనికి ఇద్దరు పెళ్ళాలు. కొమరమ్మ, మైసమ్మ.(రాజుగారికి ఇద్దరు భార్యలు అన్నట్టు లేదూ కథ?))

సహజంగా ఇద్దర్లో ఒకరు - కొద్దో గొప్పో మంచి వాళ్ళై ఉండడం మనం చూస్తూ వుంటాం కథల్లో, సినిమాల్లో.

కాని యాద్గిరి విషయంలో అలా జరగలేదు. ఇద్దరికీ ఇద్దరే.

రోజుకొకసారో, రెండుసార్లో ....

ఇద్దర్లో - ఒకరో లేదా ఇద్దరో.. విడివిడిగానో.. జాయింట్ గానో ..మొత్తానికి అతనికి బాగానే ముట్టచెబుతుంటారు.. ముద్దులు కాదు. గుద్దులు. పిడిగుద్దులు. ఎదురు మాట్లాడాడో ఇక బాక్సింగే!

చెంచాలనుంచి సత్తెప్పాళ్ళు, చీపుళ్ళ నుంచి సుత్తుల వరకూ.. 'కాదేదీ అనర్హం కట్టుకున్నోణ్ణి కొట్టడానికంటూ' స్త్రీ లోకానికి చక్కని సందేశాన్నిస్తున్న ఘన సతులు వాళ్ళిద్దరూ.

ఇంటికి త్వరగా రాకపోతే, - పెద్ద పెళ్ళాం కొడుతుంది.

ఆలస్యంగా వస్తే - చిన్నపెళ్ళాం బాదుతంది.

ఇద్దరి పెళ్ళాల మధ్య మద్దెలై పోయింది అతని జీవితం..

పాపం! ఏం చేస్తాడు! చేసుకున్నాక? ' చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంతా' అని వూరికే అన్నారా?!

పెళ్ళికి నిర్వచనం ఏమిట్రా బాబూ అని ఎవరైన అడిగితే..'పెళ్ళాం తో దెబ్బలు తినడం' అని స్పాంటేనియస్‌గా చెప్పి, సోక్రటీస్ లా నవ్వేస్తాడు.

వీళ్ళ వీర బాదుళ్ళతో బ్రతుకు మరీ ఆటో కుదుపులా సలుపెత్తిపోతోంది ఒళ్ళంతా.

ఎలా అంటే -.

సాయంత్రమయ్యే సరికి ఆటో నడిపిన డబ్బులు ఇద్దరికి చెరో సగం ఇవ్వాలి. లెక్క తేడా అయ్యిందో..మక్కెలిరగతంతారు.

బండి అద్దె పోను, వొచ్చే పైసలు రెండు కాపురాలకి సరిపోక నానా అగచాట్లుగా వుంది పరిస్థితి.

మందు చుక్కా లేక, మటన్ ముక్కా లేక..లేని సీసా కోసం, రాని నిషా కోసం కన్నీళ్ళు లేని ఏడుపేడుస్తున్నాడు.

ఈ బండ బతుక్కి తోడు..శాలిబండలా తగిలాడు - ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గాడొకడు.

రోజూ ఆబిడ్స్ చౌరాస్తా దాటంగానే తనకోసమేనన్నట్టు కాపు కాస్తాడు. వందా పెట్టాల్సిందే చేతిలో, వాడి బొందకి. ఇలా లేట్ అయినరోజున ఇంకా ఎక్కువ గుంజుతాడు. ఇవ్వనంటే జేబులోంచి చేయిపెట్టి మరీ లాగేసుకుని పోతాడు. ఇక మిగిలేది మన్నే.

మీటర్ మోసం చేసి సంపాయిద్దామంటే పాసింజెర్ ఊరుకోడు.

ఇలాంటి పరిస్తితుల్లో అతనికి ఒకటే మార్గం కనిపించింది. మీటర్ కాకుండా...ఇన్ని పైసలని గుత్తంగా మాట్లాడుకుని, లాభం చేసుకోవాలని.

అందుకు ఆ రోజే శ్రీకారం చుట్టాడు.

నాలుగు డబ్బులొస్తాయి, నాలిక తడుపుకుందామని ఆశపడ్డాడు కూడా..కానేం జరిగింది?

..హమ్మో! జరిగింది గుర్తుకురాగానే వొళ్ళు గగుర్పొడిచింది. వెంటనే చెంప రుద్దుకున్నాడు.

అతన్ని లోచన్లని బ్రేక్ చేస్తూ..ఇంతలో ఎవరో చేయూపారు. ఆగమన్నట్టు. సడన్ బ్రేక్కి అరఫర్లాంగ్ దూరం వెళ్ళి ఆగింది ఆటో.

పరిగెత్తుకుంటూ వొచ్చి ఎక్కేసిందా శాల్తీ ..

యాద్‌గిరి ఠక్కున మీటరేసాడు..

అతనికి చెప్పుకోడానికో మనిషి దొరికినట్టు..అంతా చెప్పుకుంటూ పోయాడు.

ఆటో డ్రైవర్లంటే దిల్లగీ లాగుంది సార్ , వీళ్ళకి.

పొద్దుననంగా ఎంగేజ్ చెసుకుంది సార్ ఆటోని, ఇల్లు తెల్వదు, ఆడికి..చెప్పిన అడ్రెస్సుల్ల తిరుగతనే వున్నా..పార్సిగుట్ట నుంచి జగద్‌గిరిగుట్ట దాక ..దునియా అంతా తిప్పింది సార్ ..

సగం దార్లో కిరికిరి పెట్టుకుని, నాకు కమీషనెర్ తెల్సు ఈ కమీషనెర్ తెల్సు..పోలీస్‌కి చెప్పి కేస్ బనాయిస్తా..జైల్లో పెట్టిస్తా..అంటు మీదకొచ్చింది సార్. ఆగదేం ఆడది? (చొక్కా గుంజి, చెంప పగల్గొట్టిందని మాత్రం చెప్పలేక పోయాడు. (ఎందుక్కొట్టింది అని అడిగితే, తను పేలిన పేలుళ్ళు చెప్పాల్సివస్తుందని ) ఇప్పటికీ అతనికి అర్థం కాని మరో సీనేమిటంటే..కాలర్ పట్టుకుని పైకి లేపితే అంతెత్తు ఎలా లేచిపోయాడా తను అని!

తనకి తను పెద్ద హీరో అనుకుంటాడు కాని, పిట్ట కొంచెమే. లేకపోతే ఆడవాళ్ళ చేతిలో కీలుబొమ్మెలా అవుతాడూ పాపం!

"మరప్పుడేం చేసావు?" అడిగిందా శాల్తీ.

"ఏం చేస్తాం సార్. నాకసలే ఈడ ట్రాఫిక్ వాడితో పెద్ద తల నొప్పి తగలడింది.. మళ్ళీ మరో తలనొప్పెందుకని, గమ్మునున్నా సార్ "

"అంతేలే. ఏంచేస్తావ్ పాపం నువ్వు మాత్రం"

"ఎందుకు చేయలేదండి. సామాను గిరాటేసి చక్కా వొచ్చా.."

"మరామె కంప్లయింట్ ఇవ్వదంటావా?"

"ఇవ్వదు సార్. నా ఆటో నెంబెర్ ఆమెకి తెల్వదు కద ".

" ఇల్లెక్కడన్నావ్ ?"

"అదే సార్ . ఇంటిముంగట బాగ చెట్లుండి..పెద్ద కుక్క వుండ్లా....గదే." అడ్రెస్ కూడా చెప్పేసాడు. వెనక కూర్చుంది ఆ కాలనీవాడేనని గ్రహించలేదా క్షణంలో.

మాటల్లో ఆబిడ్స్ రానే వొచ్చింది. .

"ఎక్కడ సార్ మీరు వెళ్ళాల్సింది?" వినయంగా అడిగాడు యాద్‌గిరి.

"ఎక్కిన చోటుకే" తాపీగా చెప్పిందా శాల్తీ.

"హా..ఏందంటున్నావ్ సార్ ?"

"అవును. నేనిక్కిన కాలనీకే వెళ్ళాలి"

"అక్కడే ఐతే ఆటో ఎందుకెక్కవ్ సార్ ?"

"ఇల్లు మర్చిపోయా. నీకేమైనా తెలుసేమోనని ఎక్కా..."

"ఎవరిల్లు.?" భయంగా అడిగాడు.

"నా ఇల్లే."

'తాగాడా ఏంది.ఏ లెక్కనో మాట్లాడు తున్నాడు?'

"మరి. ఆణ్ణే చెప్పలి కద్‌సార్ ?"

" నువ్వడగాలిగా..నే చెప్పేందుకు. నువ్వేదో కష్టం చెప్పుకుంటుంటే వింటూ కూర్చున్నా.. ఇక పద వెనక్కి"

ఆ మాటలకి వొళ్ళుమండింది యాద్‌గిరికి. గౌలిగూడా లో అతనిల్లు. ఇంటికెళ్ళి నాలుగు తన్నులతో బాటు నాల్గు మెతుకులూ తిని పడుకుంటే తెల్లారిపోతుందని తాపత్రయపడుతున్నాడు. ఈయనిచ్చే రెండొందలు తీసికెళ్ళి, ఇద్దరికి సర్ది చెప్పి, ఇంత తిని బ్రతుకు జీవుడా అని తొంగుందామనుకుంటున్న అతని సుందర స్వప్నాన్ని ఈ శాల్తీ కొల్లగొడు తున్నాడు.

తీరా చూస్తే కథ రెడ్డొచ్చే మొదలాయే అన్నట్టుంది... ఇక సహనం పోయి తిక్క రేగి, నిజావతారంలోకి మారాడు.

"రాన్సార్ . నువ్వు వేరే ఆటో మాట్లాడుకో"

"కుదర్దు. ఇది వన్ వే. మరో ఆటో దొరకదు. ఎక్కడికి అని అడక్కుండా నన్నింత దూరం తెచ్చింది నువ్వు కాబట్టి నువ్వే తిరిగి దించాలి." శాసించిందా శాల్తి.

హుకుం వినంగానే వొళ్ళుమండి,. బండిని పక్కకాపి, సీట్లోంచి దిగాడు. దిగి, విసురుగా.."ఏంది సార్ రూల్స్ చెబుతున్నవ్ ? నే రాను. ఏం చేస్తావ్ ?"

"ఏం చేయను. నాకు నా ఇంటి నెంబర్తో సహా..నీ ఆటో నెంబర్ కూడా గుర్తే " హెచ్చరించాడు.

"పాగల్ లెక్కన మాట్లాడు తున్నవేంది సార్ ..దిగు ముందు" చొక్కా చేతుల్ని మడుస్తూ మీదకెళ్ళాడు.

పాగల్ అనే మాటకి చాలా బాధేసిన ఆ శాల్తీ తాపీగా ఆటో దిగి..దూరంగా కనిపిస్తున్న ట్రాఫిక్ పోలీస్ని పిలుస్తున్నాడు.

యాద్గిరి కళ్ళు బైర్లు కమ్మి తేలిపోగా..

దిమ్మ తిరగ్గా గిర్రున ..హోష్ పోకుండా..కిందపడిపోకుండా వుంటం కోసం..'షా భాష మాట్లాడుకో సాగాడు.

చుట్లు చుట్టుకుని తిరుగుతూ..వెర్రి నవ్వులు నవ్వుతూ..వొంగివొంగి దణ్ణాలు పెడుతూ.."వూరికే అన్నా సార్ . పదండి పోదాం" అంటూ. ఏడుస్తున్న యాద్గిరిని చూసి

'పాపం పిచ్చివాడనుకుంటా.!" అని జాలిగా చూసాడతని వైపు- మిస్టర్ లూ..

******

అప్పటికి ఇంట్లోకొచ్చి వారం అవుతోంది. ఒక్క క్షణం కూడా తీరికలేని పన్లతో తిరుగుతోంది శైలి..

వొద్దంటున్నా దేవకి ఇంటికి రంగులేయించింది ఇల్లంతా క్లీన్ చేయించి, చిన్నచిన్న మర మత్తులు చేయించుకుంది తనకు వసతిగా వుండేలా.

ట్రాన్స్పోర్ట్ లో వొచ్చిన సామాన్లని విప్పడం, ఎక్కడివక్కడ సర్దుకోడం..గాస్, ఫోన్ కనెక్షన్స్ కోసం తిరగడం..చిన్నా కోసం డే కేర్ సెంటర్ వెతుక్కురావడం..

బాంక్ పనులు చూసుకోడం లాంటి బిజీ పన్లతో కాలం సరిపోయింది.

ఈ పన్లన్ని చకచకా చేసుకుందీ అంటే..అది దేవకి పుణ్యమే.. చిన్నాని ఆమెకొదిలేసి వెళ్ళమనేది. మొదట మొహమాట పడింది కాని, అదే సులువని తేలిపోయింది. రెండు రోజుల తర్వాత..అడక్కపోయినా ఆమె దగ్గరొదిలేసింది. వాడూ అంతే . ఇష్టంగా వెళ్ళిపోతున్నాడు.

శైలికి అలసటగా వుంది.

మధాహ్నం --

చెట్టు నీడలో వాలుకుర్చీ వేసుకుని, పాటలు వింటూ..కళ్ళు మూసుకుని రిలాక్స్ అవుతోంది..సన్నటి మగత నిద్ర మత్తుగా కమ్ముకుంటుంటే.. హాయిలో మునిగిన శైలి..

సెల్ ఫోన్ మోగడంతో వులిక్కిపడి, చేతిలోకి తీసుకుంది..

కొత్త నెంబర్ ...

బటన్ నొక్కి అంది మెల్లగ.

"హాలో"

ఒక సెకన్ తర్వాత..

"నేను." అంటూ వినిపించింది అవతల వైపునుంచి. మాట మెత్తగా వున్నా, కటువైన జీర గొంతు విని గతుక్కుమంది శైలి..

*****

## 6

**"నిషా?!" ప్రశ్నార్థకంగా అడిగింది ' నువ్వేనా?' అన్నట్టు.**

"నేనే.ఏం, మర్చిపోయావా?" సూటిగా అడిగిందా గొంతు- మందంగా వినిపిస్తూ.

ఎప్పుడూ నోట్లో ఏ గడ్డో , గట్టి రాయో నములుతున్నట్టుంటుందా స్వరం. పేరు తెలీని ఒక చిక్కటి ద్రవమేదో బొట్లు బొట్లుగా గొంతు లోంచి జారుతున్నట్టుంటుందా కంఠం.. అప్పుడప్పుడు, మాటలు జీరపోతూనో, లేదా గుభేల్మనే పగిలిన సీసం పెంకుల శబ్దం చేసుకుంటునో ..వినిపిస్తూ వుంటాయి ఆమె మాటలు. మొత్తానికి, గొంతు ఎప్పుడు విన్నా, ఎన్నాళ్ళకి విన్నా.. సంతకం ఆమెదే !

"ఏంటీ మాట్లాడవూ?" అదే స్వరం. పంటి కింద పచ్చి వక్క ముక్క పెట్టుకున్నట్టు..

"నిషా!.కొంచెం ఆలస్యం అవుతోంది.." సంజాయిషీగా చెప్పింది శైలి.

"ఈ ముక్క నువ్వెప్పుడు చెప్పాలో తెలుసా..నేను నీకు ఫోన్ చేయకమునుపే, నువ్వు- నాకు.. ఫోన్ చేసి చెప్పాలి. అవునా?! .."

"సారీ నిషా. నువ్ చెప్పింది నిజమే. కానీ, కావాలని చేసిన ఆలస్యం కాదు.అసలేమైందంటే.." కారణాన్ని వివరించేలోపే.. కట్ చేస్తూ అవతల్నుంచి ఆమె అందుకుంది.

"బస్..బస్..బస్. ఇంకేం చెప్పొద్దు. నా సహనం, నీ సమయం రెండూ వేస్ట్ కాకుండా..అసలు విషయం చెప్పు. ఎప్పుడు?, ఎక్కడ?, ఎలా?. అంతే." ఖరాఖండిగా అడిగింది.

"రెండు రోజులు చాలు.". ఎప్పటిలానే.. గొంతు తడారిపోతూంటే అంది శైలి.

"ష్యూరా?"

" యా. ష్యూర్ .. " అభయమిచ్చింది శైలి.

"ఊ! ఐతే సరి" అంది కొంచెం మెత్త బడుతూ.

ఏం గయ్యి మంటుందో అని హడలిపోయింది, అలాంటిది కొంచెం టైం ఇచ్చినందుకు తేలిగ్గా వూపిరి పీల్చుకుంది శైలి.

అమె కనిపెట్టలేదు కాని, ఉఛ్వాస నిశ్వాసలు.. మనిషికి వినిపించి కాబోలు..

అవతల్నుంచి ఫకాల్మన్న నవ్వు వినిపించింది కంకరాళ్ళు దిమ్మరిస్తున్నట్టు.. ముఖం చిట్లించి, చెవికానించుకున్న సెల్‌ని దూరంగా జరుపుతూ అనుకుంది కసిగా. ..'నువ్ నవ్వుతావు కూడానా!' అని.

కొన్ని సెకన్ల తర్వాత ఆదేశించిందా గొంతు.

"మనం అనుకున్నది అనుకున్నట్టు జరిగేలా చూడు."

"తప్పకుండా"

"టైం లేదు. అవసరం కూడా.. మర్చిపోకు." వార్నింగ్ ఇచ్చింది.

"మర్చిపోను. ప్రామిస్. రెండు రోజులు చాలు." తన వేడుకోలంతా మూటకట్టినట్టు చెప్పింది.

" మర్చిపోయా. నా సెల్ మారింది. ఇదే కొత్త నెంబర్. సేవ్ చేసుకో. నీకో సంగతి చెప్పాలి. ఫోన్‌లో నన్నెవ్వరూ అడగరు. 'నువ్వేనా' అని 'అలా అడిగే వాళ్ళంటే నాకు వొళ్ళు మంట." 'తెలిసిందా'' అని అనకనే అంటూ అడుగుతున్న తీరుకి ఏం బదులివ్వాలో తెలీక, అర్థం లేని నవ్వొకటి నవ్వేస్తూ...." అలాగే నిషా. .మరిక వుండనా?" అంటూ వొద్దికగ, సెలవడిగి తీసుకుంది.

నిషా ఏం జవాబు చెప్పకుండానే సెల్ ఆఫ్ చేయడంతో 'హుఫ్.." అనుకుంటూ..వూపిరి తీసుకుంది శైలి.

ఈ తలనొప్పి వ్యవహారాన్ని ఎలాగైనా సరే, వెంటనే వొదిలించుకోవాలనే నిర్ణయానికొచ్చిందామె. దానికో మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ కుర్చీలో వెనక్కి వాలి, కళ్ళిప్పి ఆకాశంలోకి చూస్తూ..దీర్ఘాలోచనల్లోకెళ్ళి పోయింది..

జీవితం ఒక పజిల్. ఎన్ని గళ్ళు పూర్తి చేసినా.. ఎప్పటికప్పుడు కొత్త గడి మిగిలే వుంటుంది.

ఎన్ని సమస్యలు పూరించినా.. ఏ రోజుకారోజు. కొత్త ప్రశ్నపుడుతూనే వుంటుంది.

గత కొద్ది కాలంగా ఆమెని వేధించే ఒకే ఒక్క చిన్న ప్రశ్న ఎదురయి నిలేస్తోంది. అంతకంతకూ రాకాసిలా పెరిగిపోతూ..! అదే - 'ఇప్పుడెలా?' అని.

కాని, అనుకోని మరో చిక్కులో ఆమె ఎలా చిక్కుకో బోతోందంటే-

వెనక కొద్ది దూరంలో -

తలొంచుకుని -తోట పని చేస్తూనో లేక చేస్తున్నట్టు నటిస్తూ నో వున్న శివని ఆమె గమనించక పోడం. అదే గనక జరిగి వుంటే మాట్లాడే టప్పుడు జాగ్రత్త పడి వుండేదేమో! . కాని అలా జరగలేదు.

తనని చూస్తున్నాడని కానీ, తమ సంభాషణంతా వింటున్నాడని కాని ఆమెకి తెలీదు.

జీవితంలో అప్పుడప్పుడు మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాలే, పెద్ద పెద్ద ప్రమాదాలకి దారి తీస్తాయి.

ఇదీ అంతేనేమో!?.. తెలీదు.

నిజమే! జరిగే దాక ఏవీ తెలీవు. జరిగాక తెలిసేదే కథ అవుతుంది. జీవితానుభవమౌతుంది.

******

జడలో పెట్టుకున్న పూల కంటేనూ.. దేవుని పాదాల మీది పుష్పాలే ఎక్కువ సేపు వికసించి వుంటాయి.

అన్ని రుతువుల్లోనూ కొకిల బ్రతికే వుంటుంది. కాని, వసంతంలోనే రాగం తీస్తుంది. ఎందుకనీ?

మండే ఎండ కాలంలో-

మల్లెపూవు ఓ గొప్ప అనుభూతినిస్తుంది మనిషికి.

వెన్నెల్లో వేసుకున్న చల్లని పక్కే చక్కని సేదనిస్తుంది శరీరానికి..

తీవ్ర గ్రీష్మ ప్రతాపానికి, గొంతెండి పోతున్న ధరణికి- దాహార్తి తీర్చే తొలి వానచుక్కే అమృతం. అపురూపం. అతి మధురమూనూ!

దేవకికి అంతే. ఇప్పుడామె ఆనందమూ అలాగే వుంది.

ఆమెకి చిన్నా, ఇట్టే మాలిమైపోయాడు.

వాడికి తనంటే ఇష్టం అని వాడి రాకే చెబుతుంది. ప్రియంగా చూస్తాడు. సిగ్గుగా నవ్వుతాడు. చిన్ని చిన్ని ఎర్ర పెదాలేసుకుని.

చేతులు వెనక్కి పెట్టుకుని, కర్టెన్ల వెనకల కొౘ్చి నుంచునే వాడు అప్పుడప్పుడు నిశ్శబ్దంగా..

హఠాత్తుగా చూసిన దేవకికి వాడు తనకోసం వెతుకుతున్నాడనే భావనే పులకించిపోయేది. సంబరంలో "రా రా కన్నా.." అంటూ రెండు చేతులూ జాపి .. దగ్గరికి తీసుకునేది. ఎత్తుకుని ఇల్లంతా తిప్పేది. వంటింట్లో కిచెన్ కౌంటర్ మీద కూర్చో పెట్టి తిండానికి ఏం కావాలో అడిగి తెలుసుకునేది.. వాడేం అడిగితే అది క్షణాల్లో చేసిపెట్టేది. వాడికి తినిపిస్తూ వుంటే, ఆనందమేసేది. ఏమిటో, తన కడుపు నిండిపోయినట్టు అనిపించేది.. వాడు వొద్దూ వొద్దంటే కూడా, బలవంతం చేసి మరీ తినిపించేది. వాడి చిన్ని బొజ్జ నిండిందో లేదో అని ఒకటే సందేహపడిపోయేది.. తనకెలా తెలుస్తుందని !

'తల్లి అనుభవమేం లేదుగా' అనుకుంటూ.. చిన్నపోయేది.

నిజానికి, ఏ తల్లికైనా వుండాల్సిన ఒకే ఒక్క గుణం.. బిడ్డకి ఆకలి తీరలేదేమోనన్న దిగులు.. తపన పేరే అమ్మ ప్రేమ అని ఆమెకు తెలీదు. !!

అందుకనీ, కాసేపాగాక, వాణ్ణి తీరిగ్గా వొళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దు చేస్తూ- జీడిపప్పు పలుకులో, క్రీం బిస్కెట్లో, చీజ్ లేయెరో వాడి నోటికందించేది

వాడింటికెళ్తాననకుండా వుండటం కోసం కార్టూన్ నెట్వర్క్ చూపించేది.

అది కాకుంటే, ఇంగ్లీష్ రైంస్ నీ, పిల్లలు పాడుకునే చిన్ని చిన్ని పాటల్నీ వినిపించేది.

కాసేపలా తోటలోకి తీసుకెళ్ళి వుయ్యాల లూపి డించి, మురిపించేది.

చెట్ల మీద వాలే చిలకలతో మాట్లాడిస్తూ, ఉడతలతో పరుగులెత్తిస్తూ..కాకి కథలు చెబుతూ..జాంపండు కొరికిస్తూ, బాదం పండు పగలగొట్టి, పప్పు తీసి పెడుతూ.. ..వాడితో మాటలు పెంచుకుంది.వాడి లేత మనసుని ఇట్టే ఆకట్టుకుంది.

అలా వాడికిప్పుడు అనుబంధమైంది.

ఆమె అంతకుముందే బందీ అయిపోయింది.

వాణ్ణి భుజానేసుకుని, జో కొడుతున్నప్పుడు.. లేత బుగ్గలు చెంపల్ని తాకుటూంటేనూ..

వాడి చిన్ని చేతులు మెడను చుట్టుకున్నప్పటి గులాబీ రేకుల స్పర్శలు గిలిగింతలిడుతుంటేనూ...

ఎద మీద తలంచుకుని వాడు హాయిగా నిద్రపోతూంటేనూ....

దేవకి తనని తాను మరచిపోయేది. 'ఒరే, కన్నా! ఏ జన్మ బంధం రా మనది, ఇంత ప్రేమ అయిపోయావు!?.. ఎప్పుడు కాని, నన్ను విడిచి వెళ్ళిపోవు కదూ..' అలా అనుకుంటేనే కన్నీళ్ళు పొంగుకుంటూ వొచ్చేసేవి. కళ్ళు తుడుచుకుంటునే.. వాణ్ణి బెడ్ రూంలో పడుకోబెట్టేది అతి సున్నితంగా..

దుప్పటి కప్పి, వాడి జుట్టు సవరిస్తూ ఆప్యాయంగా .వాడి ముఖంలోకి చూస్తూండిపోయేది అపురూపంగా.

అలాగే చిన్నా పక్కనే,, చోటు చేసుకుని, వాడి మీద చెయ్యేసుకుని పడుకుండిపోయేది.. నిద్రలో వాడి కాళ్ళొచ్చి తన నడుం మీద పడ్డప్పుడు చూడాలి..దేవకి సంబరం!

అనుకోకుండా దృశ్యాన్ని చూసిన ప్రకాష్కి మాత్రం .. గుబులుగా వుండేది.

ఎందుకంటే..అతను చూస్తున్న క్షణాలు సొంతం కావని అతనికి బాగా తెలుసు. అంతే కాదు, దక్కని వాటి మీద మనసు పారేసుకునే మనస్తత్వం కూడా కాదతనిది.

తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడంటే ఇదేనేమో.

'జీవితంలో మనమేదైతే జరగకూడదని అనుకుంటామో, సరిగ్గా అదే జరిగిపోతూ వుంటే..తప్పించటం ఎవరి తరమూ కాదంటారు. బహుశా ఇందుకేనేమో! .!' అనుకుంటూ.. గాఢంగా నిట్టూరుస్తాడు.

ప్రస్తుత పరిస్థితుల్లో అతను చేయగలిగింది కూడా అంతకంటే ఇంకేమి లేదు మరి.

నిట్టూర్పు–

విషాద సాగరంలో–

ఎగసే నిరాశా కెరటానికీ..కెరటానికి మధ్య ఓ విరామం లాంటిది.

రెండు సమస్యలకి మధ్య ఒక కామా లాంటిది కూడా.

***************

చీకటంతా చిమ్మేసి, ప్రాంగణాన కళ్ళాపు జల్లుకుంటోందేమో.. తడి తడిగా వుంది ఆకాశం.

చుక్కలెళ్ళిపోయాక, మబ్బులు పక్కలు చుట్టేసుకుంటూంటే..

ఉషా కన్య..సొగసుగా కదిలి గంగలో మునిగొస్తోంది..హొయల నడకలతో..ప్రశాంతమైన సౌందర్యంతొ..ఎంతో పవిత్రంగా కనిపిస్తోంది..ప్రభాతం.

అరచేతిలో సిందురాన్ని, వేళ్ళతో ఫాలభాగాన అద్దుకుంటున్నప్పటి ముఖ వర్ణం తొలి కిరణం..

వేకువ కువకువలన్నీ, మేల్లుకొలుపు వాయిద్యాలవుతూ వుంటే..

ప్రభు పాదాలను చేరాలని కాబోలు..పుష్పాలన్నీ, తొలి పరిమళాలను విరజిమ్ముతున్నాయి..

ఎంత బాగుంది ఈ వుదయం!

ఉఠి కిరణ్‌కీ లెహర్ సున్ రీ.......

ఎంత బాగుంది! ఆలాపన..మీరా గానంలా...

జైసె పావన్ గంగా జల్..

గంగ ప్రవాహం సాగిపోతూ వుంది.. స్వచ్ఛంగా...

అర్పణ్ కె పల్ హర్ సింగార్..

ఎంత మధురంగానో వింపిస్తోంది, భావం!

మన్ ఆనంద్ ఆనంద్ చ్ఛాయో.

మనసుని ప్రశాంతంగా మెల్కొలిపే రాగం..

అద్భుత రాగానికి, సాహిత్యానికి....పాడుతున్న ఆషా భోస్‌లేకి..అందరూ గ్రేటే..మరి వినిపిస్తున్న శైలీ?!.

కళ్ళు మూసుకునే నవ్వుకున్నాడతను, చిత్రంగా.

ఆమె వచ్చినప్పటినుంచి వింటున్నాడు..ఏ పొద్దూ ఐ పాడ్ లోంచి పాటలు వినిపిస్తూనే వుంటాయి.. మధురగీతాలు ..అలా అలా గాల్లో తేలుతూ వొచ్చి, చెవులని తాకి , హృదయానికి సోకి మనసుకంతా తెలీని వింత హాయిని కలిగిస్తున్నాయి. .

ఆమె పాటల అభిరుచిని మాత్రం అతను మెచ్చుకోకుండా వుండలేకపోతున్నాడు. అందుకు - అతనూ సంగీత ప్రియుడవడం ఒక కారణమైతే, పాటలన్నీ సమయానుకూలంగా వుండటం మరో కారణం.

తనకిష్టమైన పాటలన్ని ఎంచక్కా ఒక చోట పేర్చుకు వింటుంది శైలి..

అతన్ని కట్టుకున్న మరో విషయం ..ట్యూన్ చేసే విధానం..

..అమెకొక స్టైలుంది పాటలు వినడంలో. నిజానికి అలా సంగీతాన్ని ఎంజాయ్ చేయడమూ ఒక కళే.

కిటికీలోంచి లోపలికి పరదాలను తీసుకుంటూ.. తోసుకొచ్చే చిరుగాలి తనతో పాటు రాగాలనీ మోసుకుస్తూ వుంటె...మనసులో ఆనంద వీచికలు వీస్తున్నట్టుంటుంది..

మ్యూజిక్ ఈజ్ ద పొయిట్రీ ఆఫ్ ద ఎయిర్..అని అందుకే అంటారు.

మరపైన గత జన్మ జ్ఞాపకాలు మెరిసి, గుండెను నొక్కి వొదులుతున్నట్లుగా తీయని బాధేస్తూ వుంటుంది.

కొన్ని పెయిన్స్ అంతే. బాధ లేకపోతే, బావుండవు.. అతనికీ అంతే.

కొన్ని సమయాలలో ఐతే గీతాల మాధుర్యానికి..ప్రాణం లేచొచ్చినట్టయి..అమాంతం లేచొచ్చి.. బాల్కనీలోనే నిలబడిపోతాడు వింటూ..

ఎందుకంటే, మనసుని ఆకాశంలోకి ఎగరేసే కొన్ని భావాలకు పదాలు వుండవు. పాటలే వుంటాయి.

ముఖ్యంగా రాత్రిళ్ళు తరచుగా వినిపించే పాత చిత్రాల్లోని పాటల మెలోడీస్‌కి అతను పూర్తిగా బానిసైపోయాడు..వినడానికి.

గిటార్ తీగెల మీద వెన్నెల చిట్లిన చప్పుళ్ళు మరి మరి గుండెని బాధిస్తే బావుండుననిపించేలా..

విషాద గంధం చిమ్మి పోయే పరిమళాన్ని మరింతగా ఆస్వాదించాలని కోరుకుంటున్నాడు..

విషాదం కూడా సమపాళ్ళల్లో తీసుకుని తాగితే, -వూరేసిన పాత ద్రాక్షా రసంలా మంచి కైపునిస్తుందిట. అతనెక్కడో చదివాడు.

నిజమే. కొన్ని అనుభవాలు మరుగున పడతాయే తప్ప, మరపుకు రావు.

అలా అన్ని రకాల పాటలు వింటూనే..కాఫీ తాగి, పేపర్ చదివి లేచాడు..వొళ్ళు విరుచుకుంటూ ..

వినిపిస్తున్న 'మావ మావ మావా..'పాటతో తనూ గొంతు కలిపి పాడుతున్నాడు.'కట్టకుండా పట్టుకుంటే తప్పు కాదా.."

వింటున్న దేవకి వంటింట్లోంచి వొచ్చి అంది." ఆకాష్‌ణ. నువ్ తప్పు పాడుతున్నావ్..అలా కాదనుకుంటా."

"ఏమిటి తప్పు..?"

"వుండుండు చెప్తా .." పాట సాహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ.." కట్టకుండా పట్టు కుంటే కాదు..ఊ...తాళి..కట్టకుండా ముట్టుకుంటే తప్పు కాదా..' అది కరెక్ట్ ."

"పోవోయి. ముట్టుకున్నాక, ఎప్పటికైనా చేయాల్సిందీ పట్టుకోడమే కదా..నడుంని .. ఇలా.." అని - సన్నటి నడుంని చుట్టుకుంటూ కన్ను కొట్టాడు అల్లరిగా.

'సూర్యుణ్ణి ఆపి, చంద్రుని ఆపి..వెన్నెల రోజంతా కాచింది

పగలూ రేయన్నదే అసలే లేదన్నదీ..కలలే వొద్దన్నదీ..'

పాట వొస్తోంది.

'వింటున్నావుగా' అని - కనుబొమలెగరేస్తూ అడిగాడు."ఏవంటావ్?" అని ఆశగా!

ఆమె నవ్వి, అతన్ని ఎదమీదకు తీసుకుని చెంపల మీద పెదాలానించింది.."ఏమిటి సంగతి? తమరికి- పగలే రేయయి పోతోంది ఇలా?" అంది మురిపెంగా.

"ఎన్నేళ్ళయి పోయిందిరా..నిన్నింత ఆనందంగా చూడక." అతని చూపులు మెరిసే కళ్ళను ఆప్యాయంగా తడిమాయి.

ఇంకా అలాగే చూస్తే తన భావం మెకెక్కడ అర్థమైపోతుందేమోననే భయం కామోసు.. కళ్ళు మూసుకుని అలాగే వుండిపోయాడు కౌగిలి హాయిని అనుభవిస్తూ...

హగ్..

హాపినెస్ ఈజ్ యాన్ అనెక్స్‌పెక్టెడ్ హగ్ అంటాడు ఓ రచయిత.

కౌగిలి..

రెండు గుండెల ఒక జాబిలి

ఇద్దరు ఒకరయి కలిసి విహరించే ప్రేమ లోగిలి..

అదో పూల వెన్నెల లాహిరి..

అప్పుడప్పుడు..అతనలా అడిగినప్పుడు...కావాలనుకుంటున్నప్పుడు.. వలపు పుష్ప గుచ్ఛాన్ని, ఎదకెదచేర్చి - గుండె గుడిలో పదిల పరచడం ఆమెకి అలవాటె.

- ‘‘కొంత కాలం కొంత కాలం..కాలమాగి పోవాలి..నిన్న కాలం మొన్న కాలం రేపు కూడా రావాలి..‘ సరిగ్గా క్షణంలో వినిస్తున్న సాహిత్యం తమ సొంతమౌతున్న అనుభూతి కల్గుతోందతనికి.

ఇంతలో కల్లోంచి ఎవరో తోసినట్టు..హఠాత్తుగా..అతన్ని నెట్టెస్తూ అందామె."అరె. చిన్నా వొచ్చాడే! రా రారా కన్నా.." అంటూ ప్రకాష్ నుంచి వీడి వెళ్ళింది వాడి వైపుకి.

వాణ్ణి దగ్గరికి తీసుకుని ఏదో అడుగుతోంది..వాడేమొ ఆమె చెవిలో ఏమిటో చెబుతుంటే..శ్రద్ధగా విని, తలూపి లోపలకెళ్ళింది.

"వీడు నాకు కాంపిటీషనై పోతున్నాడు. వుండు. వస్తున్నా నుండు. నీ పని చెబుతా." అను కుంటూ వాడి వైపు అడుగులేసాడు.

దగ్గరకొస్తున్న ప్రకాష్‌ని చూస్తూనే. వాడు ఉడత పిల్లలా తుర్రుమన్నాడు లోపలకి.

అతనికెందుకో నవ్వేసింది..అలా పరుగులు తీస్తున్న వాణ్ణి చూసి.

ఆకాశానికి చుక్కలు, ఇంటికి పిల్లలు అందమె. వాడలా గదులన్నీ తిరగాడుతూ వుంటే, అతని కళ్ళకి ముచ్చటగానే వుంటొంది మధ్య.

ఇక ఆఫీస్ కెళ్ళే కార్యక్రమాలు మొదలుపెట్టాడు హడావిడిగా. గంటలో రెడీ అయిపోయి..

బేస్మెంట్‌లోంచి కారు తీసుకుని మెట్ల దగ్గరో క్షణం ఆగి, అలవాటుగా మెట్ల పైకి చూసాడు..భార్య కోసం.

రోజూ అతను వెళ్ళే టప్పుడు చేయూపి సాగనంపుతుందతన్ని. ఓ క్షణం ఆలస్యమౌతోంది..

ఔట్ హౌజ్ వైపు చూసాడు. తలుపులేసున్నాయి. పాటలు కూడా వినిపించడం లేదిప్పుడు. దేవకి చెప్పిందో సారి. అవి వినిపించడం లేదూ అంటే..శైలి ఇంట్లో లేదనే అర్థంట.‘ ఇంకేం! ఆఫీస్ కెళ్ళుంటుంది పెళ్ళి కూతురూ‘ అనుకున్నాడు. ఎందుకో హుషారైంది మనసు.

అప్పుడే అక్కడకొస్తున్న దేవకితో అన్నాడు బిగ్గరగా..

'దేవీ..ఈమె గారి మొగుడుం గారు ఎవరూ, ఏమిటీ, ఎక్కడా..అని అడిగావా?..అహ..అసలు వున్నాడా..లేకపోతే వదిలేసి పారి పోయాడా పాపం అని..ఎందుకంటే..ఈమె ధాటి నీకు తెలీదులే..హ..హ్హా..'' అంటూ పక పకా నవ్వి, చూసాడు.

దేవకి అప్పటికే సైగ చేయడం అతను చూళ్ళేదు. చూసే సరికి..ఆమె కళ్ళు పెద్దవి చేసుకుని నోరు నొక్కు కుంటోంది. అవ్వ! అంటూ!.

అతనికో క్షణం సేపు ఏమీ అర్థం కాకపోడంతో. ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడుచుకున్నాయి.

మరో క్షణమయ్యాక...

అప్పుడు చూసాడు..

ఐదడుగుల దూరంలో - చలనం లేని బొమ్మలా నిలబడిపోయిన శైలి కనిపించిదతనికి ..రేర్ వ్యూ మిర్రర్ లోంచి..

అంతే.!! అతను నిశ్చేష్టుడై పోయాడు.!!

*****

## 7

**అతడు తేరుకునే లోపే.. ఐదు అడుగులూ ముందుకేసుకుని వచ్చేసిందామె...**

కారు విండోలోంచి..అతని ముఖం లోకి సూటిగా చూస్తూ...''ఏమిటి అంటున్నారు? మళ్ళీ అనండి, చెబుతా...'' అంటూ తీక్షణంగా నిలేస్తున్నాయి చూపులు.

ఎరక్కపోయి అన్నా...ఇరుక్కుపోయా.....ఇప్పుడేం సమాధానం చెప్పి తప్పించుకోవాలి!?

నోరు జారిన పాపానికి రెడ్ హాండెడ్‌గా పట్టుబడ్డ నేరస్థుడిలా వుందతని పరిస్థితి...

అయిందేదో అయింది.

ముందు ఇక్కడ్నుంచి బయట పడాలి. భార్యకి కనిపించకుండా.. ఆమె ఇదంతా చూస్తోందంటేనే అతనికి ఎంబరాసింగ్‌గా వుంది. ఆమె ఎప్పుడూ హెచ్చరిస్తూ వుంటుంది...తమాషాకైనా ఎవర్నీ విమర్శించొద్దని.

ఏం చేయాలో తెలీక, హఠాత్తుగా శైలి వైపు చూసి నవ్వాడు.''హలో శైలీ! ఆఫీస్ కేనా?..కమాన్ ఐ విల్ డ్రాప్ యు'' అంటూ కార్ డోర్ తెరిచాడు ఏమీ ఎరగని వాడిలా.....

అతని ప్రవర్తనకి ఆమెకంత బాధలోనూ ఆశ్చర్యమేసింది..

అతనికీ ఆశ్చర్యంగానే వుంది, బ్రెయిన్ పని చేయక పోయినా ఎలా మాట్లాడుతున్నా నా అని!.

ఆమె కదలక పోడంతో మళ్ళి అడిగాడు. ఈసారి మరింతగా మన్ననగా - ''శైలీ, ప్లీజ్..వచ్చి కుర్చోండి..'' తొందర చేసాడు..

ఓ క్షణం తటపటాయించి.. వొచ్చి కూర్చుంది.

కార్ స్టార్ట్ చేస్తూ.. భార్య వైపు తిరిగి-' ..డోంట్ వర్రీ ' అన్నట్టు చేయూపబోయాడు కానీ, ఆశ్చర్యం! ఆమె అక్కడ లేదు. అప్పటికే లోపల కెళ్ళిపోయింది.

క్షణంలో దేవకి అక్కడ లేకపోడమే మంచిదనిపించింది.

*********

కారు రోడ్ మీదకి రాగానే...హమ్మయ్య! అనుకున్నాడు. ఒక దీర్ఘ నిశ్వాస తర్వాత....

డ్రైవ్ చేస్తూనే కంటి చివర్లనుంచి శైలిని గమనిస్తున్నాడు.

ఆమె మాత్రం సీరియస్‌గా బయటకి ఎటో చూస్తోంది. ఆమె నిజంగానే బాధ పడుతోంది..

వొంటరి ఆడదంటే ఈ మగాళ్ళకెందుకనీ, ఇంత అలుసు!? ఒంటరి స్త్రీని ఏ రకంగానూ వొదలరు, బ్రతకనివ్వరు!

ప్రకాష్ నోరు జారాడని కాదు, తన వెనక అందరూ అనుకునే మాటలే ఇవి..

కాని..

తన విషయంలో తన తప్పేం వుంది? తనకీ అందరిలానే ఆశలున్నాయి. మొగుడితో కాపురం చేసుకుంటు ..పిల్లా జెల్లాతో ఝూమ్మని తిరగాలనే వుంది..దర్జాగా బ్రతకాలనే వుంది. కాని తన కలలన్నీ మొగ్గలోనే తుంచుకు పోయాయని, చివరికి ఏ ఆశా లేకుండా ఇలా మోడులా బ్రతకాల్సి వస్తోందని ఎలా చెప్పాలి..!

చివరికి...ప్రకాష్ కూడా తనని అంత మాట అనగలిగాడు అంటే..తనకు మగతోడు లేక పోబట్టే కదూ!..అమెకి గతంతో బాటు..తన దీనస్థితి గుర్తొచ్చింది. ఒక్కసారిగా పోటెత్తినట్టు దుఃఖం ముంచేసింది.

ఏడ్చే వాళ్ళంటే అతనికి భయంతో బాటు చికాకు కూడా. భయం ఎందుకంటే.. ఓదార్చడం రాదతనికి.

ఇక చికాకు ఎందుకంటే- వీళ్ళూ- ఆటో వాళ్ళనీ, కూర్ల వాళ్ళని చీర్ల వాళ్ళని చీల్చి చెండాడేస్తారు, ఏ మాత్రం మోసం జరిగినా! మరి ఇంతే వీరోచితంగా జీవితాన్ని అన్యాయం చేసిన వాడిని ఎదిరించరెందుకో అర్థం కాదు. అందుకు చికాకు! ఈ విషయం శైలికి అర్థమయ్యేలా చెప్పాలనిపించేంత ఆవేశం వచ్చిందతనికి. కాని, ఎలా చెప్పడం!? అసలామె సమస్యేమిటో తెలిస్తే కదా!

ఆమె వైపు మళ్ళీ చూసాడు..కర్చీఫ్‌తో కళ్ళద్దుకుంటోంది..నిశ్శబ్దంగా..

అది చూసిన క్షణం లో ఆమె మీద - విపరీతమైన జాలేసింది. ఓదార్పుగా తల మీద చెయ్యేసి.. దగ్గరకు తీసుకోవాలని అనిపిస్తోంది..

'ఒరేయ్..ప్రకాశం! మగాడంటే - ఆడదాని చేత కన్నీళ్ళు పెట్టించే వాడు కాదురా..కళ్ళ నీళ్ళు తుడిచే వాడు..తెల్సిందా.." హఠాత్తుగా తల్లి మాటలు గుర్తొచ్చాయి..

గొంతు సవరించుకుంటూ ఏదో చెప్పబోయాడు...కాని, అంతలోపే - "ప్రకాష్..కార్ ఆపుతారా!" అని అడిగింది.

యాంత్రికంగా ఆమె చెప్పినట్టే చేసాడు కాని, అది ఆమె వెళ్ళాల్సినల్సిన గమ్యం కాదని, ఆమె తన ఉనికి భరించలేక మధ్య దార్లోనే దిగిపోతోందని గ్రహించాడు. ఆమె తన గుండెల మీంచి తొక్కు కుంటూ వెళ్ళిపోతోంది మొట్టమొదటి సారిగా అనిపించింది - ఇంకొంచెం సేపు తన పక్కనే వుంటే ఇంత బాధ వుండేది కాదేమో..అనీ!

ఆమె వెళ్ళిపోతూ కనిపిస్తోందే, కాని హృదయం లోకి వొస్తోందని అప్పుడతనికి తెలీదు..

భారంగా డ్రైవ్ చేసుకుంటూ కదిలాడు.

మగాడి బలమే కాదు అప్పుడప్పుడు బలహీనత కూడా..ఆడదే

*****

లక్‌డీ కపూల్ చౌ రాస్తా కొచ్చి గాడు మిస్టర్ లూ.

చేతికున్న అంకెల వాచీ లోకి టైం చూసుకున్నాడు.

అతనికి బాగా గుర్తు.. తను రెండు గంటల్నుంచి నడుస్తున్నాడు.

గుర్తుకు రానిదొకటే. కారెక్కడ పార్క్ చేసిందీ అన్న విషయం. పూర్తిగా మర్చిపోయాడు..

వెతికి వెతికి విసిగొచ్చేసింది. ఏం చేయాలా అని ఆలోచనలో పడ్డాడు.. అలవాటుగా నడినెత్తి మీద మీద- వేళ్ళతో తబలా మొదలుపెట్టాడు..... 'అలా చేసీ చేసీ..అంత మేరా బట్ట తలై కూర్చుంది.' పెళ్ళం కోప్పడ్డం గుర్తొచ్చి చేయి లాగేసుకున్నాడు.

కనిపించని కారు కోసం తను తలని మద్దెల వాయించే బదులు.....ఓ పని చేస్తేనో!?..మెరుపులాంటి ఆలోచనొచ్చింది..

కారు పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఓ కంప్లయింట్ పడేస్తే పోలా?.. ఎక్కడున్నా వాళ్ళే పట్టుకు తీసుకొచ్చి ఇంట్లో పడేసి పోతారు.. కదా!. 'సెభాష్! ఒరేయ్ లూ! ఎంత గొప్ప ఐడియా రా నీది' తన్ని తాను తెగ మెచ్చేసుకున్నాడు.

రోడ్ క్రాస్ చేసుకుని, ఎదురుగా కనిపిస్తున్న స్టేషన్ వైపు అడుగులేసాడు ఉత్సాహంగా..

జనం హడావుడిగా వున్నారు. వాతావరణమంతా రణగొణ ధ్వనిగా వుంది.

ఒకరి వెనక ఒకరు వరసగా బారులు తీర్చి వున్నారు.

అక్కడో కానిస్టేబుల్, ఇక్కడో కానిస్టేబుల్ ఖాకీ దుస్తుల్లో బిజీగా తిరుగుతూ కనిపిస్తున్నారు.

కంప్లైయింట్ పడేయడానికి ఇంత హైరానా పడాలా! నిజమే మరి... కాలం మారింది.. జనాభా పెరిగింది. నేరాలూ పెరిగాయి. కుటుంబాల నుంచి కుంభ కోణాల దాకా ఎక్కడ చూసినా దగా, మోసం సరి కొత్త నేరాల సంఖ్యతో అట్టుడికి పోతోంది సమాజం. పుట్ట లోంచి బయట పడుతున్న చీమల్లా .బాధితులు - ఇలా పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు

క్యూ తప్పదు అనుకుంటూ వెళ్ళి నుంచున్నాడు వరుసలో.

వెయిటింగ్ అతని ఒంటికి పడదు. పరమ విసుగు. ఎందుకంటే కాలం వృధా అయిపోతుందని. ఇండియాలో..పనులన్నీ ఆలస్యం కాకుండా వెంటవెంటనే కనక జరిగిపోతే , మేధావులకు మరింత సమయం దా అవుతుందని.. అది దేశాభి వృద్ధికి మరింత మేలు చేస్తుం దనీ.. లూ చెప్పేది నూటికి నూరు పాళ్ళు నిజం. .

అలా ఎంత సేపయిందో సేపయిందో మరి....

"మాస్టారూ..ముందుకెళ్తారా?" వెనకనుంచి అడిగాడు అపరిచితుడు.

అలా రెండు సార్లు విన్నాకా కొంచెం ముందుకు రెండడుగులేసాడు లూ.

"ఇం కొంచెం సార్.." అన్నాడు అపరిచితుడు.

ఇందాకటి క్యూలోనే నుంచుని చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తకుండా మరో రెండడుగులేసాడు.

"ఇంకా సార్..ఇంకా.." డైరెక్షన్స్ ఇస్తున్నాడు వెనక నుంచి.

లూ కి తిక్క రేగింది..

ఢబ్ మంటూ పుస్తకం మూసేసి..వెనక్కి తిరిగి అపరిచితుణ్ణి నిలువునా చూస్తూ అన్నాడు తనదైన స్టైల్‌లో..

"అసలు మీ వుద్దేశం ఏమిటి? అహ.. నాకు తెలీకడుగుతా. నేనూ క్యూ లోనే కదా వున్నా..? నడూ నడూ అంటూ తోస్తున్నావ్? నే వెళ్ళి నా ముందు వాణ్ణి అతుక్కుని నిలబడితేనే అది క్యూ అన్నట్టా!? లేకపోతే నేను క్యూలో లేనట్టా? అహ నువ్వు చెప్పు..నే వింటా"

లూ ముఖ కవళికలకు తోసుకొస్తున్న నవ్వాపుకుంటూ చెప్పాడు."అది కాదు సార్.. నా వెనక నుంచి అప్పుడే ఓ వంద మందొచ్చి వెళ్ళి పోయారు.. పాపం! మీకు సాయం చేద్దామని.." అంటూ ఆగాడు.

"నువ్ చేస్తున్న సాయానికి థాంక్స్. కాని క్యూ పాటించడం అంటే అందర్నీ తోసుకుంటూ నిలబడ్డం కాదు.."

"నిజమే సార్. కాని, మీ ముందు చూడండి.."

చూసాడు లూ.

ఎవ్వరూ లేరు. వెనక చూసాడు. క్యూ పెరిగి పోయి వుంది.

కౌంటర్‌లోంచి కళ్ళద్దాల మనిషి తనని భస్మమై పోయేలా చూస్తున్నాడు.

లూ వెంఠనే ముందుకు కదిలి ఏదో అడిగే లోపు..

" చెప్పండి. ఎక్కడికి?" అడిగాడు విసుగ్గా..

లూ కి అతని ప్రశ్నే అర్థం కాలేదు. ఎక్కడి కేమిటీ. వీడి బొంద.. అనుకున్నాడు.

"త్వరగా డబ్బులు తీయండి సార్ తీసి చెప్పండి..ఎక్కడికి ?" తొందర పెడుతున్నాడు.

"ఎక్కడ అంటే ఏం చెబుతాను. ఎక్కడ పోయిందో పోయింది." అన్నాడు తన ధోరణిలో.

"పోయిందా..ఏమిటి పోయింది?"

"కారు."

వెనకనుంచి యధాలాపంగా వింటున్న అపరిచితుడు ఇప్పుడు శ్రద్ధగా వినసాగాడు..లూ సంభాషణని.

"కారా?!..కార్లో వెళ్తారా? మరి స్టేషన్ కెందుకొచ్చారూ?"

"తమాషాగా వుందా? పోలీస్ స్టేషన్‌కి ఎవరైనా ఎందు కొస్తారు?" తనకూ వచ్చు తిరిగి అడగడం అన్నట్టుగా చొక్కా చేతుల్ని మడిచాడు..

అంతే! తల పట్టుకున్నాడు.టికెట్ కౌంటర్లో కళ్ళజోడతను...

వెనక నుంచి అంతా వింటున్న అపరిచితుడుకి మాత్రం - కళ్ళు గిరగిరా తిరిగాయి. దిమ్మ తిరిగిపోయిన వాడిలా చుట్టూ చూసాడు. తనిప్పుడు ఎక్కడ వున్నాడూ అని నిర్ధారణ చేసుకోడం కోసం..చేతిలోని రైల్వే రిజర్వేషన్ ఫాం వైపు చూసాడు..

తను కరెక్టే. ఇది రైల్వే స్టేషనే. తను తిరుపతి కెళ్ళాలని వెంకటాద్రి టికెట్స్ రిజర్వేషన్ కోసం నిలబడ్డాడు..

మరి- ఈయనో!?..!!?..

ఐతే తను ఇప్పటి దాక మాట్లాడింది ఎవరితో!?. అర్థమైనట్టుంది. కెవ్వున అరిచి పడిపోయాడు అపరచితుడు.

అది చూసి " పాపం పిచ్చివాడనుకుంటా" అనుకున్నాడు జాలిగా - లూ! మిస్టర్ లూ!!

*********

నీటికి నాచు చేటు.. నోటికి మాట చేటు అంటారు అందుకేనేమో!..

పొద్దున జరిగిన సంఘటన మూలంగా అతను మనశ్శాంతిని కోల్పోవాల్సి వచ్చింది.

ఆమె కన్నీళ్ళు అతని వెంటాడుతునే వున్నాయి..

దుఖ పూరితమైన ఆమె గొంతు..శోక భరితమైన ఆమె రూపు గుర్తుకొస్తున్న కొద్దీ..మనసంతా కకలా వికలమై పోయింది..

స్థిమితంగా కూర్చో లేకపోతున్నాడు..

అవాళ్టి మీటింగ్స్ అన్నీ కాన్సిల్ చేసేసాడు.

ఓ గంట దాక తనకి ఏ కాల్ కనెక్ట్ చేయొద్దని చెప్పాడు.

భరించలేనంత తల నొప్పిగా వుంది.

సీట్లో జార్లబడి, వేళ్ళతో కణతలు రుద్దుకుంటూ, కళ్ళు మూసుకున్నాడు..

"తల నొప్పిగా వుందా!" లాలనగా అడుగుతున్న స్వరానికి, ఉలిక్కిపడి, చూసాడు.

తన కళ్ళని తనే నమ్మలేని వాడిలా..తెల్లబోయి, తేరుకుని చటుక్కున లేచి నిలబడ్డాడు.

ఎదురుగా నవ్వుతూ నిలబడి వుంది... కుందన బొమ్మ.

"శై..లీ..! ను వ్వు?" అమితాశ్చర్యం తో ఆగి పోయాడు.

"అవును నేనే" అంటూ తలూపి చెప్పింది. "మీరిలా బాధ పడకూడనే వచ్చా.." అంది నవ్వుతూ..

"కష్టం లోనే కదా స్నేహితులు రావాలి. ఏమంటారు? నిజమా కాదా?" తమాషాగ కళ్ళెగరేస్తూ అడిగింది.

ఎదురుగా కనిపిస్తోంది, వినిపిస్తోందన్న మాటే కానీ, బదులు చెప్పలేని ఆనందావస్థలో వున్నాడు.

ఇప్పటి దాక అతను పడ్డ నరకాన్ని, కేవలం ఆమె తన చిరునవ్వుతో తుడిచేసిందంటే.. ఆమె తప్పకుండా తన స్నేహితురాలే..

ఆ భావనకే అతని మనసు ఉప్పొంగింపోయింది..

'నేస్తం!

నీ ఆంతర్యంతో కదూ నాకు పరిచయం

మరి ఎలా అవుతావ్ నువ్ దూరం

చెరిపేసుకుందాం..

ఇద్దరి మధ్య పేరుకున్న నిశ్శబ్దం

మౌన ప్రమాణంగా ఇక మనం చేయీ చేయి కలిపేసుకుందాం.

ఎదలోని ఆమే - ఎదురై వచ్చి అడుగుతోంది 'మావి చెంత..తీగలా జరిగి సుంత'

అతను భావోద్వేగంతో సముద్రమై పోయాడు.

"ప్లీజ్ వెల్కమ్ ఫ్రెండ్" అంటూ చేతులు జాచి ఆహ్వానించాడు. మరుక్షణంలో రెండు చేతుల మధ్య ఆమె- అతని గుండెలకి చాలా సమీపంగా వచ్చి ఆగింది. .

వెస్టన్ స్టైల్‌లో ఆమెని హగ్ చేసుకుంటుంటే.. ఈసారి ఆశ్చర్యపోవడం ఆమె వంతైంది.

అతని స్నేహ పూరిత స్పర్శ హృదయాన్ని తాకుతోంది వెచ్చగా! కొన్ని క్షణాలు అలాగే దొర్లిపోయాయి.. నిశ్శబ్దంగా

ఆమెని వొదిలేస్తూ నవ్వి అడిగాడు..

"శైలీ! నువ్విలా రావడం ఎంత అద్భుతంగా వుందో తెలుసా?"

"తెలీదు. ఎలా తెలుస్తుంది? ఈ నాలుగ్గోడల మధ్య?"

"అంటే?"

"బయట కెళ్దాం. సంతోషాన్ని సెలెబ్రేట్ చేసుకొవద్దా మనం?" ప్రపోజ్ చేసింది.

"వండ్రఫుల్ ఐడియ! ఐ యాం రెడీ .." వెంటనే సిద్ధమైపోయాడు..

మనిషంతా ఉత్సాహంలో ముంచి తీసినట్టు కనిపిస్తున్నాడు.

" మరి తలనొప్పి?" అదిగింది సందేహంగా.

"ఇట్స్ గాన్" అడ్వర్టైజ్‌మెంట్ డైలాగ్ విసిరాడు.

"అవునూ, నీ పేరుకి ముందు కాని, వెనక కాని 'ఔషధం' అని వుందా?"

"లేదే! .ఎందుకని?"

"నువ్వు రాగానే తలనొప్పి మాయమై పోతేనూ.."

"ఇంకా నయం 'నువ్వు జండూ వారి మేనకోడలివా' అని అడిగారు కాదు.."

ఆమెతో బాటు అతనూ కలిసి నవ్వుతూ ఇద్దరూ బయట కొచ్చారు.

వాళ్ళని అలా చూసిన స్టాఫ్ ఒక్కసారిగా ఉలిక్కిపడి ఇద్దరి వైపొకసారి చూసి తల లొంచేసుకున్నారు..

'బాస్ గాళ్ ఫ్రెండ్ అదిరింది' అనుకున్నారు కొందరు.

అటు వాళ్ళు వెళ్ళగానే..కొందరు రిసెప్షనిస్ట్ దగ్గరికి పరుగు తీసారు.."ఎవరామె?" అంటూ రహస్యంగా అడుగుతూ తనకూ తెలీదన్నట్టు పెదవి విరిచింది.

ఏ-వన్ మాగజైన్ మోడలో, లేదా కొత్త సిన్మా స్టార్ పేరో చెబుతుందనుకున్న వాళ్ళకి పాపం! నిరాశే మిగిలింది.

ప్రకాష్ కోసం ఒక సౌందర్య రాశి రావడం.. ఆమెతో నవ్వుతూ అతను అలా వెళ్తుంటే చూడ్డం వాళ్ళకి అదే మొదటి సారి !

నిజానికి-

శైలి -అక్కడికి రావడానికి - కారణం ఎవరో కాదు దేవకి.

అసలేం జరిగిందంటే..

*********

దేవకి కంగారు పడుతోంది. ఎందుకంటే- ఆమెకి అతని నైజం తెలుసు కనుక.

అక్కడ అతను స్థిమితంగా లేడు.. తనకు తెలుస్తోంది! తన మనసుకి బాగ తెలుస్తోంది.

కొందరు పైకి రాతి గుండె వారిలా కఠినంగా కనిపిస్తారు కాని, మనిషిలో ఎక్కడో సున్నితత్వం వుంటుంది. లోతుగా పరిశీలిస్తే తప్ప.. అంతరంగం అర్థం కాదు..అందుకు సూక్ష్మ దృష్టి కావాలి. అర్థం చేసుకునే అవగాహన కావాలి. మగాళ్ళ అదృష్టం కొద్దీ ఈ సుగుణలన్నీ భార్యల కిచ్చాడు దేవుడు.

ప్రక్కాష్‌కి దేవకిని ఇచ్చినట్టు!

తనేం చేస్తే అతని బాధ తగ్గుతుందా అని తపన పడుతోంది

ఫోన్ చేసి ఓదార్చొచ్చు. కాని, అతని అభిమానం దెబ్బ తింటుంది. అతని బాధ తగ్గక పోగా తను షేం ఫీలవుతున్నాడన్న సంగతి తను గ్రహించిందని తెలిసి..ఇంకా బాధ పడొచ్చు..

పోనీ..శైలి కి ఫోన్ చేసి అడిగితే!?

ఊఁ ? చేసి?!..ఏవడుగుతుంది? "మీ ఆయన నిన్నొదిలేసి పారిపోయాడని అన్నందుకు..మా ఆయన చాల బాధ పడుతున్నాడమ్మా నువ్ కాస్త వెళ్ళి పరామర్శించి వస్తావా" అని అడుగుతుందా?

ఛ! అలా కాదు కాని, మరో విధంగా ఐనా..సరే శైలినే అడగాలని నిర్ణయించుకుంది.

వెంటనే..ఫోన్ చేసింది..కాని, లిఫ్ట్ చేయలేదు. మాట తేడా వొచ్చినప్పుడు..అవతలవారి మౌనం కూడా అవమానిస్తుంది

మనల్ని. ఎంత సేపు అలా గడిచిందో!

క్షణం క్షణం భారంగా - ఆమె కూడా భర్త లాగానే వ్యధ చెందుతోంది..

అగ్నికీ సెగకీ వున్న బంధమే వారిద్దరిదీనూ...

ఇంతలో సెల్ మోగింది. అది శైలి నుంచి! - గబుక్కున అందుకుంది..

"హలో..అక్కా? ఫోన్ చేసారా?"

"....."

"సారి అక్కా.. పొద్దునుంచి మీటింగ్స్ జరుగుతున్నాయి..ఊపిరి తీసుకునే టైం కూడా దొరకడం లేదు...ఇప్పుడే మీ కాల్ చూసి, వెంటనే చేస్తున్నా.." అంటూ గింది. ఫోన్ చేసిన కారణం వినడం కోసం!

గొంతు సరిచేసుకుంటూ అంది దేవకి. "శైలీ! నాకో సాయం చేయాలి..చేస్తావా! " ఎంత జాగ్రత్త పడ్డా.. మాటల్లో ఆర్ద్రత పొంగుకుంటూ వొచ్చింది.

"అదేమిటక్కా.. అలా అడుగుతున్నారు? మీరు చేసిన మేలుకి ప్రతిఫలంగా నేనేం చేసినా అది సేవే అవుతుందే తప్ప సహాయం కాదు..నేనెంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అక్కా..! చెప్పండి మీరేం కావాలన్న చేస్తా!."

శైలి మాటల నిండా కృతజ్ఞతా భావం తొణికిసలాడుతోంది..

వింటున్న దేవకి కి ధైర్యం వచ్చింది. తను అడగదల్చుకున్నది అడిగేయటానికి!

"శైలీ!.."

" చెప్పండక్కా!"

" నువ్వొక్క సారి ప్రకాష్‌ని కల్సి వస్తావా?..ప్లీజ్.." అడగలేక అడిగింది.

వింటునే అదిరి పడింది శైలి. నోటి పొగరతన్ని, తల తిక్క మనిషిని కల్సి రావాలా ?

ఎందుకూ? అతను నవ్వే వొక్క నవ్వూ చాలు మనసుని ఎంత గాయమైనా చేసేందుకు..

తన జీవితమే ఒక గాయం. అది రేగకుండా వుండాలంటే ఇలాంటి వ్యక్తులకి దూరంగ వుంటమే మంచిదని నిర్ణయించుకుంది. అలాంటిది.. ఇప్పుడు దేవకి అతన్ని చూసి రమ్మంటొందంటే?!.. అర్థం కావటం లేదు.

" నే వెళ్ళ మంటోంది..నా కోసం రా.. పొద్దుటి నుంచి.. గుండెల్లో బాధగా వుంది శైలీ!..అక్కడ ప్రకాష్.దేనికో దిగులు పడుతున్నాడు..అది నాకు తెలుస్తోంది, కానీ" దేవకి ఆ పైన మాట్లాడ లేక పోయింది.

" అక్కా.." శైలి కదిలిపోతూ చెప్పింది. " ప్లీజ్ మీరు బాధ పడొద్దు. నే వెళ్తాను. సరేనా.."

"నిజం? నిజంగానే అంటున్నావా?" దేవకి కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

"ప్రామిస్.. ఒక అరగంటలో వెళ్తాను....అడ్సరే.. వెళ్ళి ఏం చెప్పనూ?" సందేహంగా అడిగింది.

" ఏం చెప్పినా ఫర్వాలేదు కాని, నేను నిన్ను పంపినట్టు మాత్రం అస్సలు తెలీయ కూడదు. సరేనా..?"

"సరే. మీరేం వర్రీ కాకండి. అంతా నేను చూసుకుంటాను" అంటూ ధైర్యం చెప్పింది.

"థాంక్స్ రా శైలీ..అదిగో చిన్నా వచ్చేసాడు..స్కూల్ నించి! నేనిక వుంటా." ఫోన్ పెట్టేసింది.

వెళ్తానని అభయమైతే ఇచ్చింది కానీ.. వెళ్ళాలంటే మాత్రం కాళ్ళూ చేతులూ వొణుకుతున్నాయి.

నిజమే. అవమానించి, హేళన చేసే వారికి ఎదురవ్వాలీ అంటే అదో అగ్ని పరీక్షే!

అవతలి వారు ఏమిటొ మనకు అస్సలు తెలీనప్పుడు స్నేహం కోసం చేయి చాచడం చాలా ఈజీ కానీ,

అతను బద్ధ శత్రువు అని పూర్తిగా తెలిసాక కూడా వెళ్ళడం వల్ల ఫలితం కన్నా పరాభవమే ఎక్కువగా వుంటుంది.

అయినా తప్పదు.

దేవకి కోసం..

కాదు - అక్క కోసం తను వెళ్తోంది!

వెళ్ళాక..తనెలా ప్రవర్తించాలో ప్లాన్ చేసుకో సాగింది.

ఆ తర్వాత-

ఆమె ఊహించని రీతిలో అతను స్పందించడంతో - ఇప్పుడామె ఒక సరికొత్త ప్రకాష్‌ని చూస్తోంది..

*********

సాయంత్రం చల్లగా జారుకుంటున్న సూర్యబింబాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తుంది!

మధ్యాహ్నం మండి పోయిన ప్రచండుడు ఇతడేనా అని..

సరిగ్గా అలాగే అనుకుంటోంది శైలి కూడా..

తన ఎదురుగా కూర్చుని ప్రపంచంలో సంగతులన్ని చెప్పి తాను నవ్వుతూ, తనని నవ్విస్తున్న ప్రకాష్‌ని చూసి..

ఎనీ థింగ్ కెన్ హాపెన్ ఓవర్ కప్ ఆఫ్ కాఫీ

కెఫే కాఫీ డేలో కూర్చుని..ఒకరి వైపు ఒకరు ఇష్టంగా చూసుకుంటూ..గలగలా నవ్వుకుంటూ మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దరూ ..

కళ్ళు చికిలించి కసిగా చూస్తోంది మరో యువతి!!

ప్రవరాఖ్యుడులా తనకు ఫోజ్ కొట్టిన ప్రకాష్..శైలికి ఇలా దాసోహుడై పోయాడన్న మాట!..ఊహూ... సిరిపతిని కొంగున కట్టుకునే కుట్రన్న మాట!

ఇదా శైలి ప్లాన్..

కొదమ సింహాన్ని పట్టడానికా తనని వలలా వాడుకుంది?!.

అతను చిక్కాడు..

తనని వదిలించుకుంది

కాని తను వదుల్తుందా?!.. వదలదు.

తోక తొక్కిన సర్పంలా బుసలు కొడుతోంది -.

ఓ కార్నర్‌లో కూర్చుని సిగరెట్ దమ్ము కొడుతూ - ఆమె!

**ఆమె- నిషా!..**

*******

## 8

**ఆ రోజు -**

గార్డెన్లో కూర్చుని, పుస్తక పఠనంలో లీనమై పోయిన ప్రకాష్ "ఎక్స్ క్యూజ్ మి " అన్న ఓ అపరచిత మగ గొంతు

వినిపించడంతో

'ఎవరా?' అని చూసాడు.

ఎవరితను? తనెప్పుడూ చూళ్ళేదె ఇంతటి నీటుగాణ్ణి!

"అయాం సందీప్ వాడె సీనియర్ ఎక్జిక్యూటివ్‌ని. ఓ! సారీ! చెప్పడం మరిచా..శైలి నేనూ ఒకటే ఆఫీస్ " నవ్వుతూ చేయి చాస్తూ అన్నాడతను తనని తాను పరిచయం చేసుకుంటూ.

"ఓ! శైలి కొలీగా! ప్లీజ్ కం..ప్లీజ్ కం" అంటూ ఎదురుగా వున్న కేన్ కుర్చీ చూపించాడు!

సందీప్ అందమైన హిందీ హీరోలా వున్నాడు. చూడ్డానికి హుందాగా అగుపిస్తున్నాడు.

ఇతనింత అర్జంట్‌గా తనని కలవడాని ఎందుకొచ్చినట్టు? ప్రకాష్‌కి అర్థం కావడం లేదు.

సందీప్ గొంతు సర్దుకుని అన్నాడు.

"నేనో ముఖ్యమైన విషయం మీతో మాట్లాడాలని వొచ్చాను"

"ముఖ్యమైన విషయమా!?దేని గురించి?" అడిగాడు ప్రకాష్

"శైలి గురించి"

శైలి గురించా! గుడ్ ! ఏదో సమాచారం మోసుకొచ్చాడన్న మాట! వినేందుకు తెగ ఉత్సాహ పడుతూ అన్నాడు."చెప్పండి చెప్పండి" అన్నాడు గబగబా చేతిలో పుస్తకం మూసి పక్కన పడేస్తూ.

ఓ క్షణ కాలం తర్వాత సందీప్ అన్నాడు. మెల్లగా.."నేను శైలిని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను. ఏమంటారు?" అని.

"వాట్ ?" అదిరి పడ్డాడు ప్రకాష్

"అడగంగానే మీరిలా ఆశ్చర్య పోతారని నాకు తెలుసు. అసలు మీకే కాదు నాకూ వింతగానే వుంది ఇప్పటి నా పరిస్థితి.

ఒకో వ్యక్తి పట్ల ఒకో రకమైన ఇష్టం కలుగుతూ వుంటుంది కదూ మనకు! ఇష్టంతోనే - కొందరితో కొంచెం సేపు, మరికొందరితో ఇంకొంచెం ఎక్కువ సేపు గడుపుతూ వుంటాం ఔనా! కాని, జీవితమంతా కలసి గడపాలనే గాఢమైన కోర్కె మాత్రం ఒక్కరి మీద.. కేవలం ఒక్కరి మీదే కలుగుతుంది. ఎప్పుడంటే, ప్రేమించినప్పుడు, ప్రేమని శాశ్వతంగా దక్కించుకోవాలనుకున్నప్పుడు..పెళ్ళి చేసుకోవాలనిపిస్తుంది!..నేను శైలిని ప్రేమించడం తప్పంటారా?! యెస్ . ఐ లవ్ హర్" తను చెప్పదల్చుకున్నది చెప్పేసి ప్రకాష్ వైపు ఆత్రంగా చూడసాగాడు బదులు కోసం!

ప్రకాష్ తేరుకున్నాక " మీ ప్రేమ గురించి ఆమెకి తెలుసా?" అని అడిగాడు.

"తెలుసు. ఆమె ఆఫీస్‌లో జాయిన్ అయిన సాయంత్రమే చెప్పేసాను."

'ఓహో ! అంత ఫాస్టా?' అని మనసులో అనుకుంటూ "చెప్పాక ఏమంది?"

"ముందు నవ్వి వూరుకుంది. తర్వాత తన గురుంచి తెలుసుకోమంది. తెలుసుకోడానికి ఏముంటుంది. ఆమె ఏదో చెప్పబోతే కూడా నే వినలేదు. అదంతా అనవసరం అన్నాను. ఎందుకంటే అందమైన వారి గురించి - 'వెనక చెప్పుకునే' కథలెలా వుంటాయో నే వూహించగల్ను కాబట్టి.

ఇక వేచి వుండటం లో అర్థం లేదనిపించింది. ఎవరితో మాట్లాడమంటావో చెప్పు అని నిన్న గట్టిగా అడిగితే..ఇదిగో మీమ్మల్ని కలిసి మాట్లాడమంది. ఇప్పుడు చెప్పండి! మా వాళ్ళనెప్పుడొచ్చి కలవమంటారు మిమ్మల్ని!? పెళ్ళి అంతా మీ పద్ధతి ప్రకారమే జరుగుతుంది. ఇక శైలి విషయాని కొస్తే - ఆమెని పువ్వుల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత నాది. ప్రామిస్. నమ్మండి." అంటూ అతను

ఉద్వేగంగా చెప్పుకు పోతున్నాడు.ప్రకాష్ ఎక్కడ వొద్దంటాడొ అనే కంగారు, శైలి తనకెక్కడ కాకుండా పోతుందో అనే తపన స్పష్టంగా తెలుస్తోంది అతని మాటల్లో.

అతని నిజాయితీని మెచ్చుకున్నాడు ప్రకాష్ .

ఇంతలో తెల్ల కుందేలు వెనక పరిగెత్తుతూ తోటలో కొచ్చాడు చిన్నా.

కేరింతలతో చురుగ్గా..తిరుగుతున్న చిన్నాని ముచ్చటగా చూస్తూ అడిగాడు సందీప్ . "మీ అబ్బాయా! భలే ముద్దొస్తున్నాడు! మీ పోలికలు బాగా కనిపిస్తున్నాయి సుమా!."అన్నాడు మురిపెంగా చిన్నా వైపే చూస్తూ.

వచ్చిన పని సానుకూలంగా సాగాలంటే ఇంటి యజమానితో వారి పిల్లల్ని పొగుడుతూ వుంటారు చాలా మంది.

ఆ సంగతి ప్రకాష్‌కీ తెలుసు. అందుకే నవ్వి చెప్పాడు.

"వాడి పేరు చిన్నా. అవునూ! శైలి మీకేం చెప్పలేదా?"

"ఎవరి గురుంచి?"

"చిన్నా గురుంచి."

"లేదే! చిన్నా ఎవరు?"

"హి ఈజ్ సన్ ఆఫ్ శైలి"

"వ్వాట్ !"..సందీప్ మొహం ఎర్రబడటం ప్రకాష్ గమనించాడు. అతనింకా నమ్మలేని వాడిలా.. శైలికి ఇంతకు ముందే పెళ్ళయిందా? ఒక బిడ్డ తల్లి కూడానా!? నెవెర్. తను చేస్తే నమ్మడు. తనే కాదు. శైలి అందాన్ని చూసిన వాళ్ళెవ్వరూ కూడా నమ్మరు.. ఆమె తన కోసమే పుట్టింది. తన కోసమే ఇక్కడకొచ్చింది. కేవల తనకి మాత్రమే జీవితం పంచుకోడం కోసమే ఆమె తనకు అగుపించింది. అలాంటి శైలి గురించీ ఇదేమిటీ? ప్రకాష్ ఇలా మాట్లాడుతున్నారేమిటి? వున్నట్టుండి - కళ్ళు తిరిగి, వొళ్ళు తూలుతున్నట్టనిపించింది.

" సారీ సందీప్. అయాం హెల్ప్‌లెస్" అన్నట్టు చూసాడతని వైపు ప్రకాష్ .

కాసేపు చెట్ల వైపు చూసుకుంటూ ఏమీ మాట్లాడ లేని వాడిలా వుండిపోయాడు సందీప్ .

దేవకి వీపుమీదెక్కి, ఉప్పాటాడుకుంటున్న చిన్నానీ, ఆమెని మార్చి మార్చి చూస్తూ.."వారు?" అంటూ సందేహంగా అడిగాడు.

"నా భార్య దేవకి"

"మరి పిల్లాడు?"

"చిన్నా. మా అబ్బాయి కాడు. చెప్పానుగా."

"మరి ఇంత క్లోజ్ గా మీ ఇంట్లో ఎలా పెరుగుతున్నాడు!?"

'హూష్ ! తనిక చెప్పలేడు ఇతనికి. బ్రహ్మ దిగొచ్చి చెప్పినా నమ్మేట్టు లేడు' అనుకుంటూ తల పట్టుకున్నాడు ప్రకాష్ .

నిజంగానే షాక్ అయి వున్నాడు అతను.

తను ఆయన్ని విసిగిస్తున్నాడని గ్రహించిన సందీప్ లేచి నిలబడ్డాడు. వెళ్ళడానికన్నట్టు.

కదల్లేని అతని అవస్థని గమనిస్తున్నాడు ప్రకాష్ .

రెండడుగులేసి, మళ్ళీ వెనక్కి వొచ్చి చెప్పాడు. "ఆమెకి ఇంతకు ముందే వివాహమైనా, ఒక కొడుకు వున్నా నాకభ్యంతరం లేదండి. ఈ పెళ్ళి విషయం గురించి మళ్ళీ ఎప్పుడు కలవ మంటే అప్పుడు కలుస్తాను. ఏమంటారు?" అని ఆశగా చూసాడు.

ప్రకాష్ సూటిగా అతని మొహంలోకి చూసాడు.

అతని కళ్ళల్లో నిరాశతో బాటు శైలిని ఎలాంటి పరిస్థితుల్లోను వదుకోలేని పట్టుదల కూడా కనిపిస్తోంది.

ఇతను నిజంగానే శైలిని ప్రేమించాడు. నిండా మునిగి తేలుతున్న అతని వాలకమే అందుకు సాక్ష్యం. మరి శైలి నిజాన్ని ఎందుకు దాచింది, అతనితో చెప్పకుండా! అంత కంటే మరో ముఖ్యమైన సంగతి! అసలు సందీప్ ని తన దగ్గరికి ఎందుకు పంపినట్టు?

వెళ్ళిపోతున్న వాణ్ణి పిల్చి మరీ అడిగాడు ప్రకాష్ సందేహంగా.. "ఎక్స్‌క్యూజ్ మి. నన్ను కలిసి మాట్లాడమని చెప్పింది శైలే కదూ!?"

అతనలా అడిగే సరికి అనుమానమేసి "మీరు ప్రకాషే కదా..?" అని అడిగాడు.

అవునన్నట్టు తలూపాడు.

"మీరు తన బావ గారని, తన మంచి చెడ్డలన్నీ మీరే చూసుకుంటారని చెప్పింది. ఏం! అలా అడిగారు?"

"ఏం లేదు..వూరికే..జస్ట్ అడిగా అంతే.." తడబడ్డాడు.

అదేం పట్టించుకోని సందీప్ పొలైట్‌గా అడిగాడు. "మనం త్వరలో కలుస్తున్నం కదూ!"

"తప్పకుండా. ఐతే, శైలితో మాట్లాడి చెబుతా. ఓకె? ఆల్ ద బెస్ట్ " ప్రకాష్ నవ్వాడు చేయి కలుపుతూ.

అతను మాత్రం నవ్వు మర్చిపోయిన వాడిలా భారంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు.

వెంటనే శైలితో మాట్లాడ్డం కోసం సెల్ చేతిలోకి తీసుకున్న ప్రకాష్‌కి - ఆమె మెసేజ్ కనిపించింది. 'బావ గారూ! బాగున్నారా?' అంటూ!

చదివి హాయిగా నవ్వుకున్నాడు. పిలుపుకో, పిలుపులోని కొత్తదనానికో తెలీదు.

****

పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ధర్మవీరం పరిస్థితి క్షణ క్షణానికి దయనీయంగా మారిపోతోంది. కారణం - లూ నుంచి సరైన సమాచారాన్ని రాబట్టలేక. విషయం స్పష్టం గా అర్థమౌతోంది పక్కనే నిలబడ్డ కానిస్టేబుల్ సుందరానికి. సీన్ ఆసక్తి కరంగా వుండటంతో చెవులతో బాటు కళ్ళూ ముక్కూ కూడా నిక్కబొడుచుకుని మరీ వింటున్నాడు. అలా వింటున్నాడనే వొళ్ళు మండి పోతోంది ధర్మ వీరానికి.

ఒక్కసారిగా వూపిరి తీసుకుని వదిలి, కళ్ళు మూసుకుని పది సార్లు లెక్క పెట్టాక తెరిచి - ఎంతో సౌమ్యంగా అడిగాడు. అదే చివరి సారి అన్నట్టుగా కూడ!

"సార్ . ఇప్పుడు చెప్పండి. మీ కారు ఎప్పుడు, ఎక్కడ పార్క్ చేస్తే పోయిందంటారు?"

అప్పటికి అతను అలా అడగడం లెక్క కడుతునే వున్న మిస్టర్ లూ కి తిక్క రేగింది.

"మీరిలా అడగడం ఎన్నో సారో తెలుసా? అహ తెలుసా అంట? ఇరవై ఏడో సారి. ఇంకా ఎన్ని సార్లు అడుగుతారు? ఎక్కడా ఎప్పుడూ అంటూ? 'ఆయనే బ్రతికుంటే' అన్న సామెతలా..నాకే గుర్తుంటే మీ దగ్గరకెందుకొస్తాను?..మీ ప్రశ్నకి నేనూ సరైన ప్రశ్నే వేస్తున్నా కాచుకోండి. ఈ కంప్లెయింట్ తీసుకుంటున్నారా లేదా? తీసుకుంటే ఎప్పుడు?, ఎన్నాళ్ళల్లో నా కారు నాకు తిరిగి తెచ్చిస్తారు? చెప్పండి. లేదంటే..విషయం కమీషనర్ దాక తీసుకెళ్ళాల్సి వస్తుంది." కాలు తీసి కాలు మీదేసుకుంటూ హెచ్చరించాడు లూ.

వింటున్న కానిస్టేబుల్ ' ఎస్పైని ఇంకా నాలుగు చివాట్లు పెడితే బావుణ్ణు' అన్నట్టు ఆశగా చూస్తున్నాడు లూ వైపు.

అది చూసిన ధర్మ వీరానికి వొళ్ళు మండ లేదు. తగలడి పోయింది.

"కానిస్టేబుల్ " పిలిచాననుకున్నడు కాని, అరిచాడు కోపంగా.

లూ వైపు తన్మయత్వంగా చూస్తున్న కానిస్టేబుల్ వులిక్కిపడి.."యెస్సార్ " అన్నాడు.

"వెళ్ళు. వెళ్ళి సార్‌కి నాకు, రెండు కూల్ డ్రింక్స్ పట్టుకురా..ఇంతలో మరి కొంత సమాచారం తీసుకుంటా. సరేనా?" అన్నాడు.

"యెస్ . సార్ " అంటూ గదిలోంచి బయట కొచ్చి, ధబేల్ మంటూ హెడ్ కానిస్టేబుల్ టేబుల్ మీద వాలి పడీ పడీ నవ్వసాగాడు.

హెడ్ కేం అర్థం కాక "ఏమైందిరా. అట్లా నవ్వు తున్నావ్ ?" అంటూ అతన్ని బలవంతంగా లేపి నించో బెట్టాడు.

"లోపల భలే సీన్ జరుగుతోంది అన్నా !." అంటూ మళ్ళీ భొల్లు మన్నాడు.

"ఏం సీన్ ?" రహస్యంగా అడిగాడు హెడ్ .

"మన ఎస్పైకి భలే కేస్ దొరికింది. ఒక తిక్కలాయన కార్ పోగుట్టుకున్నాడు. ఎక్కడ అంటే చెప్పనంటున్నాడు. కంప్లెయింట్ తీసుకోను అంటే కమీషనర్ దగ్గరకి పోతా నంటున్నాడు. మన వీరం దీనంగా బ్రతిమలాడుకుంటున్నాడు. 'చెప్పు నాయనా, తండ్రీ' అంటూ.." అంటూ పొట్ట చెక్కల య్యేలా నవ్వసాగాడు.

"బాగా అయింది. మన గురించి, ప్రమోషన్ గురించి ఎప్పుడడిగినా మర్చి పోయినట్టు ఫోజ్ పెడతాడు.. చెప్పనంటూ దాటేస్తాడు..ఇప్పుడు తెలుస్తుంది - కాలడం అంటే ఏమిటో!" కసిగా అన్నాడు హెడ్ .

"అవునవును." వంత పాడాడు.

"సర్లే. త్వరగ వెళ్ళు. చూస్తే నిప్పులోసుకుంటాడు" తొందర చేసాడు హెడ్ .

"వెళ్తా. లేకపోతే గొప్ప కామెడీ మిస్సయి పోనూ!?" నవ్వుకుంటూ వేగంగా వెళ్ళాడు కూల్ డ్రింక్స్‌కి, పనిలో పని తనూ తాగి రావొచ్చని.

లోపల్నుంచి మాటలేం వినిపించకపోడంతో మరింత సస్పెన్స్‌గా వుంది హెడ్‌కి.

ధర్మవీరం రెండు కళ్ళూ తడి చేసుకుంటూ అడిగాడు లూని. "ఒక్కసారి.. ప్లీజ్ సార్ ఇంకొక్కసారి జ్ఞాపకం తెచ్చుకుని చెప్పండి కారు ఎక్కడ పోగుట్టుకున్నారో"

"మీకేమైనా పిచ్చా? తెలీదని చెప్పట్లా?" విసుక్కున్నాడు లూ.

"పూర్తి వివరాలతో కనీసం నీకు కంప్లెయింట్ తీసుకోడం కూడా రాదు. నువ్వేం ఎస్పైవి?" అంటున్న ఆఫీసర్ గొంతు వినిపిస్తోంది రీ సౌండ్‌లో.

ఇటు చూస్తే శూన్యంలోకి చూస్తూ లూ!

ఇంతలో- ఇద్దరాడ వాళ్ళు యాద్‌గిరిని రెక్కల కింద చేతులేసుకుని, జబర్దస్తిగా మోసుకొచ్చి పడేసారు.

నేల మీంచి లేచి, "నమస్తే యె అన్నా!" అంటూ గుక్క పట్టాడు యాద్గిరి.

"ఏమైంది?" అడిగాడు.

"చూడన్నా. ఈ ఇద్దరాడ వాళ్ళు నన్నిక్కడికి బలాత్కారంగా గుంజుకొచ్చారు."

"నీ బొంద. అది బలాత్కారంగా కాదులే కాని, ఇద్దరూ మఫ్టీలో వున్న లేడీ కానిస్టేబుల్స్! ఏం చేసాడూ?" అంటూ ప్రశ్నించాడు.

"ఆటో! వస్తావా? అంటే సార్ , "ఎంతకీ" అని అడుగుతున్నాడు సార్ ఈ వెధవ సచ్చినోడు! అందుకే ఏసుకొచ్చాం. ఎంతోకొంత ఇద్దామని.." రెండు గుప్పిళ్ళు బిగిస్తూ అన్నారు.

ముక్కు మీద వేలేసుకున్నాడు ధర్మవీరం. "ఏరా అన్నావా?"

"అవ్వవ్వవ్వ..ఇద్దరి పెళ్ళాల వాణ్ణి నాకా ఉపదేసం వుంటుందా అన్నా!"

"ఉపదేశం కాదు. ఉద్దేశం"

"అదే ఏదో దేసం..నాకుంటుందా చెప్పు." అంటూ గభాల్న లూ వైపు చూసి కెవ్వున కేకేశాడు.

"అన్నా! కావాలంటే ఈయన్ని అడుగు. నేనెంత నీయత్ గలోణ్ణో చెప్తాడు ఈ అన్నా." అంటూ లూని చూపిస్తూ.."సార్ బాగున్నార?" అని అడిగాడు పలకరింపుగా.

లూ కి గుర్తు రావడం లేదు. ఎవరబ్బా అని చూస్తున్నాడు.

"గుర్తు పట్ట లేదా సార్ . నేను ఏ పి 10 5217"

వెంటనే ట్యూబ్ లైట్ వెలిగింది. " ఓ! యాదగిరా! ఏమిటిలా వొచ్చావ్ ?" .

వెంఠనే ఎస్సై కెవ్వున అరిచాడు. "ఏమిటీ నీ కీయన తెలుసా!"

"తెల్సు. మరుద్దామన్నా 'మరపు రాని మనిషి."

"ఒరేయ్ . నీకు పుణ్య ముంటుంది. యన కారెక్కడ పోయిందో కూడా నువ్వే అడిగి చెప్పించరా" వేడుకుంటూ అడిగాడు ధర్మ వీరం.

ఎస్సై లాంటి వాడు అలా అడగడంతో ఉప్పొంగి పోయాడు యాద్గిరి. "ఎక్కడ అని చెప్పించలేను కాని, కారు నెంబర్ చెప్పేస్త" అంటు, లూని అడిగాడు -"సార్ మీ కార్ నెంబర్ 1001 కదూ?"

"ఎవరా అన్నది? బుద్ధి లేని వాళ్ళు? కాదు. నెంబర్ అది కాదు. ఇది" అంటూ అసలు నెంబర్ చెప్పాడు.

వెంఠనే నోట్ చేసుకున్నాడు ధర్మవీర్ .

'చూశారా! నా ప్రతాపం.' అన్నట్టు ఓ లుక్ పడేస్తూ అన్నాడు యాద్గిరి " ఈ సార్ ది అంకెల భాస. కార్ పని మీరు చూసుకోండి. నేనీయన్ని ఇంటి కాడ దింపి అడ్రస్ గట్ల తెచ్చి పెడతా" భరోసా ఇచ్చాడు.

ఎస్సై పరమానంద భరితుడై పోతూ..యాద్గిరికి దగ్గరుండి మరీ కూల్ డ్రింక్ పట్టించాడు ప్రేమతో.

"ఒరేయ్! భగవంతుడు నీ లాంటి కానిస్టేబుల్ని ఒక్కణ్ణిచ్చినా, ఈ ధర్మ వీరం - చక్ర వీర లెవెల్ లో ఎదిగిపోయి వుండే వాడ్రా!" అంటూ ఎస్సై ఎమోషనై పోతూ వుంటే..

'హమ్మయ్య. గండం గడిచింది. కేస్ లేకుండా' పోయిందీ అని ఆనంద పడిపోయాడూ యాద్గిరి.

లూ ని ఇంట్లో దింపడానికి వెంటపెట్టుకుని వెళ్ళి పోయాడు.

**********

కేఫ్‌లో ఓ కార్నర్ లో కూర్చుని, సెల్‌ఫోన్లో ఈ మెయిల్స్ చెక్ చేసుకుంటున్న శైలి..''హాలో. బిజీ నా?'' అన్న మాటలకి వులిక్కిపడి తలెత్తి చూసింది.

ఎదురుగా..నిషా!

గుండాగినంత పనైంది.

ప్రకాష్ ఏ క్షణం లో నైనా రావొచ్చు. ఈమెతో కలిసి తనని చూసి అపోహ పడొచ్చు..నిలదీస్తే చెప్పడానికి జవాబే లేదు.కంగారుతో బాటు కోపం కూడా వచ్చింది.

''ఎందుకొచ్చావ్ ?''

''రాలేదు. రప్పించావ్ '' కుర్చీ లాక్కుని కూర్చుంటూ అంది నిషా.

నిషా వాలకం చూస్తే తనని ఇరుకులో పడేయడం కోసమే వచ్చినట్టు తెల్సిపోతోంది.

''నిషా ప్లీజ్ వెళ్ళిపో. నువ్ నాకు తెలిసినట్టు ప్రకాష్‌కి తెలియ కూడదు.''

''కదా!, అందుకు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సింది నువ్వా?, నేనా?'' బబుల్ గం నములుతూ అంది.

''ఇంకేం జాగ్రత్త పడమంటావ్. నీ ఒప్పందం ప్రకారం నీ కంతా అప్పచెప్పేసానుగా!''

''కాని, నీకు మాత్రం అంత కంటే ఎక్కువే దక్కుతోందిగా..ప్రకాష్‌తో సహా!''

''నిషా! హద్దు మీరుతున్నావ్ ''

''వున్న మాటే అంటున్నా. నువ్ అతన్ని ఆస్థితో సహా దక్కించుకునే అవకాశాన్ని ఇచ్చింది నేనన్న సంగతి నువ్వు మర్చిపోయినప్పుడల్లా..నేనిలా గుర్తు చేస్తునే వుంటా.నువ్వెక్కడున్న సరే! నేనడిగింది అడిగినంతా ఇవ్వనప్పుడలా నిన్నిలా వెంటాడుతూనే వుంటా. అవసరమైతే ప్రకాష్ ముందైనా సరే వెనకాడను. మాటల్లో కాదు, చేతల్లో చూపిద్దామని వచ్చా.., .'' అంటూ తీరిగ్గా..హాండ్ బాగ్ జిప్ తెరిచి దేని కోసమో వెదుకుతూ..

శైలికి కాళ్ళు చేతులూ ఆడ్డం లేదు. తల తిప్పి, గ్లాస్ విండోలోంచి బైటకి చూసింది. కార్ పార్క్ చేస్తూ కనిపించాడు ప్రకాష్ .

అంతే. గుండే గుభేల్ మంది. ఏదో ఒకటి చెప్పి, నిషాని ఇక్కణ్ణుంచి పంపేయాలి తొందరగా అనుకుంది.

''నిషా. ప్లీజ్ రేపు కలిసి మాట్లాడుకుందాం. ఇప్పటికి వెళ్ళి పో. ప్లీజ్ '' ఆమె చేతులు పట్టుకుని బ్రతిమలాడింది.

''నాకేం అభ్యంతరం లేదు. వెళ్ళిపోడానికి. కాని రేపు ఎంత తెస్తున్నావో చెప్పు. వెళ్ళిపోతా .''

''ఎంత వుంటే అంతా ! ప్రామిస్. నన్ను నమ్ము.'' మాటిచ్చింది.

''సరే ఐతే. ఎక్కడా? ఎన్నింటికి?''

శైలి నోటి కొచ్చింది చెప్పింది, గబగబా.

'సరే' అన్నట్టు తలూపి, నోట్లో ఓ బిళ్ళ విసిరేసుకుని, లేచింది అక్కణ్ణుంచి. వెళ్తు వెళ్తూ..శైలి వైపు కళ్ళు చికిలించి చూస్తూ అదోలా నవ్వి, ''ఎంజాయ్ ..'' అంటూ వెళ్ళిపోయింది.

అంత త్వరగా వదిలిపోయినందుకు..హమ్మయ్యా అనుకుంటూ గట్టిగా వూపిరి తీసుకుని వదిలింది శైలి!

లోపలకొస్తున్న ప్రకాష్ హాయ్ చెబుతున్న నిషాని చూసి మొహం చిట్లించుకున్నాడు.

వెలిసిపోయిన జీన్ పాంట్ , నలిగిపోయిన టీ షర్ట్ వేసుకుని వుంది. సంస్కారం లేని జుట్టు చిందరవందరగా వుంది.

ఆమె అంటేనే అతనికి చికాకు. ఆమె పలకరింపుకి తిరిగి జవాబైనా చెప్పకుండా వచ్చేసి, శైలి ఎదురుగా కూర్చున్నాడు.

శైలిని చూసి షాక్ అవుతున్న వానిలా..''శైలి! ఏమిటలా వున్నావ్ ?'' అంటూ కలవరంగా అడిగాడు.

నుదిటి మీద చిరుచెమట్లు తుడుచుకుంటూ..''ఏం లేదే! బాగానే వున్నా'' అందే కాని, గొంతు వొణకడం, మనిషిలో తొ్రటుపాటు తనం అంతా అతని దృష్టి దాటి పోలేదు.

ఎప్పుడూ లేనిది - పాలి పోయిన ఆమె మొహంలో వెలిసిపోతున్న నవ్వు అతని కేమి అంతు పట్టకుండా వుంది.

చేతిలో కాఫీ కప్పు వణకకుండా గట్టిగా పట్టుకున్న ఆమె చేతి వేళ్ళ వైపు చూశాడు నిదానంగా.

చొరవగా కప్పు తీసుకుని, పక్కన పెడుతూ. ఆమె చేతుల్ని తన రెండు చేతుల్లోకి దాచి, నవ్వుతూ చూశాడు కళ్ళల్లోకి.

''ఇప్పుడు చెప్పు! ఎందుకలా వున్నావ్ ?''

ఆమె చటుక్కున తల తిప్పుకుంది. ఎక్కడ కన్నీళ్ళొచ్చి నిజం చెప్పేస్తాయో నని. అతని స్నేహ పూరితమైన స్పర్శ..కి గాలి తాకిన మేఘంలా మారింది ఆమె మబ్బు గుండె

దాపరికాలేవీ లేకుండా, వున్నదున్నట్టు అంతా చెప్పేయాలనిపిస్తోంది.

ఫ్రెండ్ ! నేను ఇది, నా పరిస్థితి ఇది. తప్పులుంటే మన్నించు. నిందించు. కాని, దూరం మాత్రం చేయొద్దు. నాకు నువ్ తప్ప ఈ ప్రపంచంలో ఇంకెవరూ లేరు - అని చెప్పాలి. నిజం! ఇప్పుడే చెప్పాలి.

ఇప్పుడు కాకుంటే ఇక ఎప్పటికీ చెప్పే అవకాశం రాదేమోనన్నంత తొందర పడుతోంది ఆమె మనసు. చెప్పడానికి నోరు తెరిచింది. ''ప్రకాష్ ..నన్ను మీరు..'' గొంతు లోంచి మాట పెగల్డం లేదు.

అతను అడ్డు పడుతూ అన్నాడు.'' నిన్ను నేను ఏమీ అడగను. ప్రామిస్. సరా!.'' మాటిచ్చాడు.

''ఇప్పుడే కాదు శైలి, ఇంకెప్పుడూ అడగను. ఎందుకో తెలుసా? ఒకటి నీ గతం నాకనవసరం కాబట్టి. రెండు - స్నేహానికి పునాది నమ్మకం కాబట్టి. నీ మీదా, నీ నిజాయితీ మీదా నాకు నమ్మకం వుంది, పూర్తిగా. అందుకే నిన్నేమి అడగడం లేదు. నువ్ చెప్పినా వినకూడదని కూడా నిర్ణయించేసుకున్నా..'' తన అభిప్రాయాన్ని స్థిరంగా చెప్పేసాడు.

బరువు తీర్చుకుందామన్న ఆమె గుండె మరింత బరువు పెంచుకుంది.

ఒకోసారి మంచి తనం కూడా మోసే ఓపిక వుండదేమో మనసుకి.

విషాదంగా నిట్టూర్చింది.

ఆమె తన చేతుల్ని వెనక్కి తీసుకుంటూ అంది. ''వెళ్దామా?'

ఆమెకి మాట్లాడే మూడ్ లేదని అర్థమైందతనికి.

''వెళ్దాం. ఇంటికి కాదు. కాసేపు ఎటైనా.'' అంటూ ఆమె అనుమతి కోసం చూసాడు.

సరే నంటూ తలూపింది.

ఇద్దరూ వెళ్ళి కార్లో కూర్చున్నాక..

దేవకి ఫోన్ చేసింది.

''హలో'' అన్నాడు.

''ఆకాష్ ! నీకో గుడ్ న్యూస్ .''

''ఏమిటి?''

ఆమె చెప్పింది. విన్నాక, సెల్ ఆఫ్ చేసి, శైలి వైపు తిరిగి చెప్పాడు.

"మనం ఇంటికెళ్తున్నాం."

"అదేం?"

"మీ అమ్మగారు వచ్చారుట..దేవి వెంటనే రమ్మంది."

ఆమాట వింటూనే శైలి నిలువునా వణకి పోయింది.. అనుకోని పెనుగాలికి కదలి పోయే పూల రెమ్మలా వుందామె.

అమ్మ రావడమేమిటి?!..దేవకితో మాట్లాడ్డం ఏమిటి? కళ్ళు గిర్రున తిరిగాయి. మెదడు పని చేయడం ఆగిపోయింది.

"ప్రకాష్! నే త్వరగా ఇంటికెళ్ళాలి. ప్లీజ్ " అంటూ కారుదిగి..అతను పిలుస్తున్నా వినకుండా ఆటో వైపు పరిగెత్తింది వేగంగా..చాలా వేగంగా.

*******

౨

ఆఘమేఘాల మీద వొచ్చి ఆగింది ఆటో ఇంటి ముందు. అది ఆగీ ఆగక ముందే ఒక్క అడుగులో దిగి, గేట్ తోసుకుని, మరొక్క అంగలో లోపలకొచ్చింది శైలి. పెను తుఫానులా కదులుతోంది.

తల్లి కనిపించింది. ఏదో చెబుతోంది. దేవకి శ్రద్ధగా ఆలకిస్తోంది. అంతే. అది చూసిన శైలికి ఆవేశం పొంగుకొచ్చింది .."అమ్మా" అంటూ పిలిచింది.. అది పిలుపులా లేదు. కేక పెట్టినట్టుంది. ఏదో ప్రమాదాన్ని చూసినప్పుడు అనుకోకుండా గొంతులోంచి వచ్చే ధ్వనిలా వుందది.

అవును మరి. శైలి పరిస్థితి అలాంటిదే మరి. ఆవిడ ఇక్కడికి రావడం కంటే కూడా తను లేనప్పుడు దేవకితో మాట్లాడ్డం ప్రమాదం కాబట్టి.

"అదిగో శైలి వచ్చేసింది" ఆనందంగా అంటోంది దేవకి. తల్లి ఇటు తిరిగే లోపే మెరుపులా వచ్చి, తల్లి చేయి పట్టుకుని గబగబా ఇంట్లోకి లాక్కుపోయింది శైలి.

ఆ వెనకే తలుపులూ మూసుకున్నాయి.

ఎప్పుడూ లేని ప్రవర్తనకి దేవకి తెల్లబోయి చూస్తూ వుండిపోయింది.

ఆమెకి ఎంతకీ అర్థం కాని విషయమేమిటంటె..ఇన్నాళ్ళకి వాకిట్లోకి కన్న తల్లొస్తే.. ముఖంలో ఆనందానికి బదులు అంత ఆ-ందోళనకు గురవడమెందుకో..ఆమెకి పజిల్‌గా వుంది.

ఆ వచ్చినావిడ నిజంగా శైలికి తల్లేనా!? శైలి మీద సందేహం కల్గింది. అదీ మొట్ట మొదటి సారిగా.

దీర్ఘంగా ఆలోచిస్తూ ఔట్ హౌస్ వైపూ చూస్తూ వుంది.

****

"చెప్పేసావా..అంతా చెప్పేసావా?" లోపల కొచ్చీ రావడం తోనే తలుపులు మూసి, రొప్పుతూ అడిగింది.

తనేం చెప్పలేదంటూ ఆవిడ తల అడ్డంగా వూపింది.

" అసలైనా, ఎందొకొచ్చావ్?" అంటూ కూతురు నిలదీస్తోంటే నోట మాట రానిదిలా అయిపోయింది.

"నిన్నే! ఎందుకొచ్చావ్ ఇక్కడికి?" సూటిగా చూస్తూ ప్రశ్నించింది.

"చూసి పోదామని." సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు చెప్పింది.

"ఏం చూద్దామని? శైలి బ్రతికుందా లేదా అనా? లేక, బ్రతికుంటే ఇంకా ఎందుకు చచ్చి పోలే దా అనా? ఏం చూద్దామనొచ్చావ్?"

కూతురు అంత కఠినంగా మాట్లాడ్డంతో ఆమెకి దుఃఖం పొంగుకొచ్చింది. "శైలీ! ఏమిటా మాటలు. నేను శత్రువుని కాను. నీ కన్న తల్లిని. ఏ తల్లయినా ఎందుకొస్తుంది బిడ్డని చూడ్డానికి?

నేనే కాదు, నిన్ను చూడాలాని మీ నాన్న కూడా వచ్చారు..తెలుసా?" ఆశగా చెప్పింది.

శైలి పెద్దగా నవ్వేసింది.."అచ్చా?! ఆయన కూడా వచ్చారా!? ఏమిటి నా కోసం మీ ఆయన్ని కూడా తీసుకొచ్చావన్న మాట! అహో! ఎంత శుభ వార్త మోసుకొచ్చావమ్మా?!"

ఆ మాటల్లో వ్యంగ్యానికి, కోపమొచ్చి, "శైలీ! ఆయన నీకు తండ్రి అన్న విషయం మరిచి పోతున్నావ్." గుర్తుచేసింది.

"హు" పెదవి విరిస్తూ అంది. "తండ్రి..! అందుకే కదమ్మా ఆ రోజు గుండె బద్దలయ్యే నిజాన్ని మోసుకుని మీ ఇంటికొచ్చాను. కన్న తండ్రి - నా విషాదాన్ని విని, వోదారుస్తాడని, నా బిడ్డ బాధ్యతల్ని తన తన భుజాల కెత్తుకుంటాడనే కదమ్మా వచ్చాను!

కన్నతల్లివి, నా శోకం చూసి చలించి, విధాతని నిందిస్తావను కున్నా. సీతమ్మని కడుపులో దాచుకున్న భూదేవిలా నువ్వునూ అనుకునే వచ్చాను కదమ్మా 'అమ్మా అంటూ' చేతులు జాచాను?

నా కథంతా విని మీరేమన్నారో తెలుసా!? నీకు గుర్తు లేదేమొ. కాని, నాకు మాత్రం మరపుకు రాదమ్మా!

నా దీనగాధకి - నీళ్ళు నిండాల్సిన ఆయన కళ్ళు నిప్పులు చెరిగాయి. ద్రవించాల్సిన మీ గుండెలు పాషాణాలుగా మారాయి.

నా కోసం, నా బిడ్డ కోసం మీరు ఎలాంటి సహాయమూ చేసే స్థితిలో లేరని అర్థమై పోయింది. మా కంటే మీకు పరువే ముఖ్యమన్న సంగతీ తెలిసింది. నాతో మీకెలాంటి సంబంధం లేదని, జన్మలో కనిపించొద్దని శాసించారు!

అప్పుడు ఆయన మాట్లాడిన ప్రతి మాటా..ప్రతీ క్షణం నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వుంది. మన మధ్య మిగిలిన సన్నని దారం లాంటి బంధం మీద ఒక శిల పెరుగుతూనే వుంది.

ఈ గుండె అప్పుడే బండై పోయిందమ్మా! ఎప్పుడైతే మీ గడప దాటి బయట కొచ్చానో అప్పుడే. అప్పుడే నేను అనాధనై పోయాను.

నాకంటూ నాకెవరూ లేరు. నేనంటూ నేనెవరికీ మిగిలీ లేను.. ముఖ్యంగా మీకు నేను ఆ రోజే చచ్చి.."

"శైలీ" విడ కూతురి నోటి మీద చేయుంచింది. "అంత మాట అనకమ్మా.. ఒక్క గా నొక్క కన్న బిడ్డవి. కళ కళ లాడుతూ మా కళ్ళ ముందు తిరగాల్సిన దానివి. మమ్మల్ని కాదని వెళ్ళి,

చేతులారా జీవితాన్ని బుగ్గి పాలు చేసుకున్నావని ఆయనకి కోపం, వేదన! అంతే కాని, నిన్ను దూరం చేసుకోవాలని కాదు. అదే నిజమైతే, నిన్నింత దూరం వెతుక్కుంటూ వస్తామా చెప్పు!

దిక్కు లేని దానిలా ఇలా ఔట్ హౌస్‌లో పడుండాల్సిన ఖర్మ నీకేమిటమ్మా..పద..మనింటికెళ్దాం..జరిగిందంతా పీడ కలగా మర్చిపోదాం. నువ్ సరే అంటే నాన్న కూడ లోపలకొస్తారు.. పిల్చుకు రానా?" ఆశగా అడిగింది.

ఎలాగైనా తండ్రీ కూతుళ్ళని కలిపి, పుట్టెడు దుఖంలో వున్న కన్న కూతుర్ని ఇంటికి తీసుకెళ్ళాలని తపిస్తోందా కన్న తల్లి.

"అలాగే నమ్మ. అలాగే పిల్చుకురా. ఆయనొచ్చే లోపే నీ కూతురు ప్రాణాలతో వుండ కూడదనుకుంటే అలాగే తీసుకురా.." స్థిరంగా చెప్పింది.

కూతురి మాటలకి భోరున ఏడ్చేసిందా విడ. "ఎందుకే, మీ ఇద్దరు నన్నిలా చంపుకు తింటున్నారు. జీవితంలో అన్నీ వున్నా ఏమీ లేని దాన్ని చేసారు!"

"అమ్మా! ఇక ఏ డ్రామాలూ వొద్దు. మీకు పరువు నష్టం కాకుండా, నా ప్రాణం పోకుండా వుండటానికి నాకో సాయం చేస్తావామ్మా!" ఆర్ద్రం గా అడిగింది.

తల్లి కళ్ళు మెరిసాయి. కొత్త ప్రదేశంలో డబ్బు కోసం ఏ ఇబ్బంది పడుతోందా అని ఆవిడ మనసు కొట్టుకుంటోంది. సాయం అన్న మాట వినంగానే ఆశ కల్గింది. ఇలా అయినా కూతుర్ని ఆదుకున్నట్టుంటుందని. "చెప్పమ్మా! నీకేం కావాలంటే అది చేస్తాను" అంది.

శైలి రెండు చేతులూ జోడిస్తూ చెప్పింది "ఇంకెప్పుడూ ఇక్కడకి రాకమ్మా. కనీసం నా గొంతులో ప్రాణం వున్నంత వరకైనా ..రాకమ్మా, ప్లీజ్.."

బాణం దెబ్బ తిన్న పక్షిలా కొట్టుకుంది తల్లి ప్రాణం. "శైలీ!!" అంటూ రోదించసాగింది. కూతురి మొండి తనం, పట్టుదల ఆ-మెకి బాగా తెలుసు. అయినా, కడుపు తీపి ఇక్కడి దాకా లాక్కొచ్చింది.

కూతురు తమని క్షమించదు. కారణం ఆమె మనసుకి బాగా తెలుసు.

ఆ రోజూ.. అక్కున చేర్చుకోవాల్సిన ఆడ పిల్లని నిర్దాక్షిణ్యంగా అవమానించి పంపిన పాపం వూరికే పోతుందా ! తప్పదు. అనుభవించక తప్పదు. పశ్చాతాపంతో బ్రతుకంతా ఇలా కుమిలిపోడమే తమకు శైలి విధించిన శిక్ష!

తెలిసి చేసే పాపాలకు కన్నీళ్ళే ప్రాయశ్చిత్తాలేమో!

దుఖిస్తున్న తల్లిని ఓదార్చే ప్రయత్నమేం చేయక పోగా..తలుపు తీసి నిలబడింది శైలి - నీదే ఆలస్యం వెళ్ళడాని కన్నట్టు.

ఒక్కసారి కూతుర్ని ప్రేమగా చూసుకుంది. అదే చివరిసారేమో నన్నంతగా! కళ్ళు వర్ష ధారలవుతుంటే.. నోటికి కొంగడ్డుపెట్టుకుని, పరుగు లాంటి నడకతో మౌనం గా అక్కడ్నుంచి వెళ్ళిపోయిందావిడ..

తలొంచుకు వెళ్ళి పోతున్న ఆవిణ్ణి - చివరిదాకా చూస్తూ నిల్చున్న దేవకి దగ్గరికి వొచ్చాడు ప్రకాష్.

"ఆవిడేనా శైలి అమ్మగారూ?" మెల్లగా అడిగాడు.

అవునన్నట్టు తలూపింది.. "అలా వెళ్ళిపోతున్నారేమిటీ!?" సందేహంగా అడిగాడు చాల రహస్యంగా.

బయట కారులో స్టీరింగ్ మీద తల వాల్చుకుని కూర్చున్న ఒకాయన్ని చూసిన సంగతి కూడా చెప్పాడు భార్యకి. ఆమేం మాట్లాడలేదు.

"బహుశా ఆయన తండ్రేమో!" తిరిగి అతనే అన్నాడు.

మరో క్షణంలో బయట కారు స్టార్టయి వెళ్ళి పోయిన చప్పుడైంది.

వాళ్ళు వెళ్ళి పోయారు.

వీళ్ళిద్దరూ ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

చిన్నా కేమీ అర్థం కావడం లేదు కాని, జరుగుతున్న దేదో కాని, వాడికి సంతోషాన్నిస్తున్నట్టు లేదనుకుంటా.. బిక్కబోయి, దేవకి చీర కుచ్చిళ్ళలో దాక్కున్నాడు.

ప్రకాష్ – వెళ్ళి పోయిన వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాడు. ఏం జరిగి వుంటుందా అని.

కాని, దేవకి మాత్రం శైలి గురించి ఆలోచిస్తోంది. ఎలా వుందా అని.

ఆమె హృదయం ఆత్ర పడుతోంది. వెంటనే వెళ్ళి చూడ్డం కోసం.

చిన్నాని ప్రకాష్‌కి అప్ప చెబుతూ అంది. "ఇప్పుడే వస్తాను. వీడ్ని నీ దగ్గరే వుండనీ" అంటూ శైలి దగ్గరకెళ్ళి పోయింది.

ప్రకాష్ నిట్టూర్చి, చిన్నా వైపు చూశాడు. వాడి మీదా జాలేసింది అతనికి.

చిన్నా లాంటి వారి జీవితాలలో...ఆనందం కంటే..వేదనలే చోటు చేసుకోడం నిజంగా విషాదకరం. కారణాలేవైనా కాని, తల్లి తండ్రులు పిల్లల్ని

ఇలా వొంటరి వాళ్ళని చేసి హింసించడం నిజంగా దారుణం కదూ! ఆ క్షణంలో అతనికి శైలి మీద చికాకేసింది.

ఇంత తెలివి గల అమ్మాయి కూడా జీవితాన్ని ఎంతగా కాంప్లికేట్ చేసుకుంటోందా అనే అతని బాధంతా.

అసలతనికి ఈ మెలోడ్రామాలంటేనే పడ వు. అతని పాలసీ ఒకటే. జీవితం ఒక అందమైన ప్రయాణం. ప్రమాదాలు జరగ కుండా చూసుకోవాలి. దురదృష్ట వశాత్తు జరిగినా..వెంటనే కోలుకోవాలి. నవ్వుతూ తిరిగి మళ్ళీ యానం సాగించాలి. అంతే కాని, అదే కష్టంలో కూలబడి పోయి, నిరంతరం శోకిస్తూ..అకారణంగా అందర్నీ నిందించుకుంటూ..తనని తాను శపించుకుంటూ.. చీక ట్లో బ్రతికే వాళ్ళంటే అతనికి చచ్చేంత కోపం.

చిన్నాని దగ్గరికి తీసుకున్నాడు నవ్వుతూ..

"నువ్వూ నేనూ దోస్త్.. సరేనా" అనాడు బొటన వేలు చూపిస్తూ.

ఎప్పుడూ లేనిది ప్రకాష్ అలా స్నేహంగా మాట్లాడ్డంతో వాడూ సందేహం లో పడ్డాడు.

ఆ చిన్ని కళ్ళు అమాయకంగా చూస్తున్నాయి. ఎప్పట్లా అవి మెరవడం లేదు. క్షణంలో వాడి మీదున్న జాలి కాస్త – మమకారంగా మారింది. . "చిన్నా. దిగులు పడకురా కన్నా! నీకు నేనున్నాగా!" అంటూ చిన్నా ని గభాల్న గుండెలకి హత్తుకున్నాడు. హఠాత్తుగా అతని కళ్ళు తడి బారాయి.

ఎప్పుడూ లేనిది..వాడి పట్ల అతనికి పితృభావం కల్గింది. వాడికి తను తండ్రిననే భావం పుట్టుకొచ్చింది మొట్ట మొదటి సారిగా.

"పద. మనం వెళ్ళి బోలెడు చాకీస్, బాల్స్ కొనుక్కొచ్చు కుందాం" అంటూ వాడ్ని భుజానేసుకున్నాడు.

బాల్ మాట వింటూనే వాడి మొహం వెలిగి పోడం గమనించిన ప్రకాష్ హమ్మయ్యా అనుకుంటూ..మాటల్లోకి దించు తున్నాడు. "నీకు క్రికెట్ సెట్ కొంటాను. మనం రోజూ గ్రౌండ్ కెళ్ళి కొంచెం సేపు క్రికెట్ ఆడుకుందాం. వస్తా టూ మరి నాతో"

"ఓ. వస్తా. నే బౌల్ చేస్తా. కాచ్ కూడా చేస్తా.." ఇక వాడు ఆగ కుండా మాట్లాడుతూనే వున్నాడు.

కార్లో వాణ్ణి అలా పక్క సీట్లో కూర్చో బెట్టుకుని, వాడి భాషలో మాట్లాడుకుంటూ డ్రయివ్ చేస్తూ వుంటే చిత్రమైన అనుభూతి నిస్తోంది. అనుకున్నాడు.. తను ఇన్నాళ్ళు చిన్నాని ఎలా మిస్సయ్యా డా అని..

పిల్లలు లేని లేమితనం ఎలాంటిదో ఇప్పుడు అనుభవంలో కొచ్చిందే మో!

భారం గా నిట్టుర్చాడు.

****

లోపల కొచ్చింది దేవకి.

మోకాళ్ళ మధ్య ముఖం దించుకుని, చేతులు చుట్టుకుని కూర్చున్న శైలి కనిపించింది.

నిశ్శబ్దంగా రోదిస్తోంది.

'అక్కా' అంటూ నవ్వుతూ తిరిగే శైలిని అలా శోక మూర్తిలా చూస్తూ వుంటే ఆమె మనసు ద్రవించి పోయింది.

ప్రతి మనిషికీ ఒక గతం వుంటుంది. గుండెకి వెతా వుంటుంది. కాని, ఏ మనిషి కైనా చెప్పుకో డానికి ఎవరూ లేని తనమే గొప్ప విషాద మౌతుంది.

చప్పుడు లేకుండా వెళ్ళి మంచం మీద కూర్చుని, మెల్లగా ఆమె తల మీద చేయేసి, "శైలీ" అంటూ పిలిచింది. ఎంతో ఆర్ద్రంగా!

వులిక్కి పడి తలెత్తి చూసిన శైలికి ఎదురుగా కరుణా మూర్తిలా దేవకి రెండు చేతులు జాస్తూ కనిపించింది.

తనకు తెలీకుండానే..ఆమె గుండె గండి తెగిన చెరువై.."అక్కా" అంటూ ఆమె వొళ్ళో వాలి పోయింది. దేవకి ఆమెని అనునయిస్తూ, వెన్ను నిమిరి ఓదార్చుతున్న కొద్దీ, ఆమె దుఃఖం మరింత ఉధృతం కాసాగింది.

ఎన్నేళ్ళుగా అణగ దొక్కిన దుఖమో అది మరి..ఈ రోజుకి పోటెత్తిన సముద్రమైంది. పెను తుఫాను తాకిడికి మనిషంతా ప్రకంపించి పోతోంది. భీతిల్లిన ప్రకృతి కాంతలా..

ఆమె మామూలు స్థితి లోకి రావడం కోసం కాలంతో బాటు తనూ మౌనంగా వుండి పోయింది దేవకి. పసిపాపలా ఆమెని ఓదారుస్తూ...

ఎంత సేపైందో ఏమో..

శైలి వెక్కుతూ లేచి కూర్చుంది తనని తాను మామూలు స్థితిలో తెచ్చుకునే ప్రయత్నంలో లోపల కెళ్ళొచ్చింది. రెఫ్రెష్ అయి.

తననే తదేకంగా పరీక్షగా చూస్తున్న దేవకి చూపులు కొత్త గా వున్నాయామెకి.

"సారీ అక్కా" అంటూ గొంతు సవరించుకుంటున్న శైలిని సూటిగా అడిగింది దేవకి.

"నువ్ నన్ను నిజంగానే అక్క అని అనుకుంటే..నీ బాధ నెప్పుడోనే పంచుకునే దానివి నాతో. అవునా?" దేవకి గొంతులో బాధతో బాటు సీరియస్‌నెస్ కనిపిస్తోంది.

శైలి తలొంచుకుంది.

"ఐనా నేనెప్పుడూ నీ వ్యక్తి గత విషయాల్ని అడగ లేదు. నువ్వు ఏమిటీ? ఎక్కడ్నుంచి, నీ వెనక ఎవరున్నారు, చిన్నా తండ్రి ఎక్కడ.. వంటి ప్రశ్నలెప్పుడూ వేయలేదు. మాట వరసకైనా ఆరా తీయలేదు. నీ చేత చెప్పించే ప్రయత్నమూ చేయ లేదు అవునా?"

అవునన్నట్టు తలూపింది.

"ఎందు కడగలేదో తెలుసా? నాకు నీ గతం కంటే నువ్వు ముఖ్యం అనుకున్నా. అక్కా అని నోరా రా పిలిస్తే...నువ్ నాకు నిజంగా చెల్లివనుకున్నా..అవునా కాదా?"

"అవును" నిజాయితీగా చెప్పింది.

"ప్రేమ వున్న వారి మీద హక్కు కూడా వుంటుంది కదూ?"

'వుంటుంది ' తలూపింది శైలి.

"అందుకే! హక్కుతోనే నిన్ను - ఒకే ఒక్క ప్రశ్న అడగు తున్నా చెబుతావా?" అంటూ ఆగింది..శైలి ముఖంలో మారుతున్న ముఖ కవళికలని గమనిస్తూ.

శైలి ఖంగు తింది. ఏమడుగుతుంది. తను రోజూ ప్రకాష్ని కలుస్తున్న సంగతి గురించి అడుగుతుందా?, తనకు తెలీ కుండా కలుసుకుని మాట్లాడుకునే చనువేమిటి మీ ఇద్దరి మధ్యా అని నిలేస్తుందా.. తనని అపార్థం చేసుకుని, 'నమ్మి శ్రమమిస్తే..నా కింత ద్రోహం చేస్తావా' అని నిలదీస్తుందా?

లేకుంటే...

చిన్నా తండ్రి ఎవరో చెప్పి తీరాల్సిందే నని పట్టు పడుతుందా ? వీటిలో ఏ ప్రశ్న అడిగినా తన దగ్గర సరైన సమాధానం వుందా? వెతుక్కుంటోంది - తత్తర బడుతూ! దేవకి ముందు తేలిపోకుండా వుండాలని..పైకి గంభీరం గా కనిపిస్తోంది.

"అడుగు అక్కా ఫర్వాలేదు" అంది.

ఒళ్ళంతా చెవులు చేసుకుంది శైలి.

ఆమె కళ్ళ లోకి చూస్తూ అడుగుతోంది దేవకి.

"నీకు, చిన్నా తండ్రికి మధ్య ఇంకా సంబంధ బాంధవ్యాలు వున్నాయా?"

ఆమె ప్రశ్న విన్నాక తేలికగా వూపిరి తీసుకుంది.

"లేవక్కా!. ఈ జన్మకిక వుండవు కూడా" స్థిరంగా జవాబిచ్చింది.

"నే నడుగు తోంది మానసిక పరమైనవి కాదు. చట్ట ప్రకారంగా!."

"దేవుని మీద ప్రమాణం చేసి చెబుతున్నా..నేను నా వాళ్ళందరితోనూ అన్ని విధాలా ముడి పడి కాదు.. విడి పడి వున్నా. ఒక్క చిన్నా తప్ప నాకీ ప్రపంచం తో నే ఎలాంటి సంబంధాలూ లేవ్..:" స్పష్టం చేసింది. .

తన కావాల్సిన జవాబు దొరికడంతో సంతృప్తి గా నిట్టూర్చింది దేవకి.

శైలి భవిష్యత్తుని తీర్చి దిద్దల్సిన బాధ్యేతేదో తను తీసుకున్నట్టు నిశ్చయంగా కదిలింది. ఇక నువ్వు నిశ్చింతగా వుండు అన్నట్టు చూసి నవ్విందామె.

మనసంతా నిండిన కృతజ్ఞతతో తనూ బదులుగా నవ్విందే కానీ, ,,,,

అక్క పెదవుల మీది ధరహాసానికి అర్థం ఏమై వుంటుందా అని ఆలోచనలో పడింది శైలి.

***********

లూని ఇంటి దగ్గర దింపి, తిరిగొస్తున్న యాద్‌గిరికి ఏడు పొక్కటే తక్కువగా వుంది. ఇంటి కెళితే వొంట్లో ఎముకలిరిగేలా కొడతారు పెళ్ళాలిద్దరూ. ఎందుకంటే ఆ రోజు బేరం లేదు. వచ్చింది వచ్చినట్టు పెట్రోల్‌కే పోశాడు.

ఇంతలో మందు షాప్ కనిపించడంతో అతని మనసంతా పాడై పోయింది.

జేబులో వున్న ఒకే ఒక్క వంద నోటు చూసి కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నాడు. కొమరమ్మా, మైసమ్మా మీదకి దూసుకొస్తున్నట్టు కంపించారు. దాంతో తాగాలన్న కోర్కె మరీ ఎక్కువై పోయింది.

ఎందుకో తెలీదు కాని, ఈ మధ్య యాద్‌గిరికి ఎదురు తిరగాలనుంది పెళ్ళా లిద్దరి మీదా.

బాగా తాగెళ్ళి ఇద్దర్నీ ఏక ధాటిన దంచాలనే కక్ష కూడా పెరిగి పోతోంది.

పెళ్ళాల మీదా రెవెంజ్ తీసుకునే సమయం కోసం కాచు కున్నాడంటేనే మనకర్థ మవుతుంది.

వాళ్ళు గుర్తు కు రాగానే, కసి గా వెళ్ళి, ఓ క్వార్టర్ సీసా కొని, జేబులో వేసుకున్నాడు.

ధైర్యే సాహసే యాద్‌గిరే అనుకుంటూ..లోయర్ టంక్‌బండ్ కొసకల్లా పోయి, ఓ పక్కగా ఆటో పార్క్ చేసుకున్నాడు.

వెనక సీట్లో ప్రశాంతంగా వాలి, తాపీగా సీసా తెరచి, మూతని విస్సి రి కొట్టాడు దూరంగా.

ఇక సోడా తాగినట్టు తాగడం మొదలెట్టాడు.

ఒక్కో గుటక్కి రెండింతల కిక్కెక్కు తోంది. బుర్ర కూడా చాలా పదునెక్కు తోంది. ఇక చురుగ్గా ఆలోచిస్తున్నాడు.

ఒకళ్ళు కాదు, ఇద్దరు.. ఇద్దరు పెళ్ళాల అరాచ కత్వానికి ఎలా స్వస్తి చెప్పాలా అని.

ఏ మగాళ్ళ కైనా మాట వినని పెళ్ళా లుంటారు. వంట చేసి పెట్టని వాళ్ళుంటారు. పోని, అధమా లేచి పోయే పెళ్ళాలుంటారు.

హవ్వ. తన బతుకు బత్కమ్మ కానూ. తనకి మల్లే, దంచు కునే పెళ్ళ లెవరి కైనా వుంటారా. తన నసీబ్ కాకుంటే..మరో గుట కేసుకుని, కళ్ళు తుడుచు కున్నాడు పాపం!

అతనికి కొంచెం దూరంలో చెట్టు కింద ఒక సాధువు కూర్చుని కనిపించాడు.

అతని ముందు ఒక చిన్న అట్ట మీద రాసి వుంది. చేయి చూసి జాతకం చెప్ప బడును అని.

అంతే. ఒక్క గెంతులో వెళ్ళి అతని ముందు వాలాడు.

ఎక్కింది కొంచెమే అయినా, యెక్కిళ్ళు మాత్రం ఎక్కువన్నట్టు..తూలుతూ వెళ్ళి " నమస్తే సన్యాసన్నా!" అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

విస్కీ వాసన తగలడంతో సన్యాసి ప్రాణం లేచొచ్చింది. చేతిలో సీసాని అమాంతం లాక్కుని ఒక్క ధారగా గుటకేయాలనిపించింది .

బాగోదని వూర్కున్నాడు. మౌనంగా! అవును మరి సన్యాసి కదా!

యాద్ణ గిరి కళ్ళల్లో నీళ్ళు చూసి నిజంగానే చలించాడు సన్యాసి.

"ఏది, నీ చేయివ్వు" అంటూ లాక్కుని మరీ పరీక్షగా చూడ సాగాడు."ఎంత గండం చేసుకున్నవ్ తమ్మీ" జాలి గా అన్నడు సన్యాసి.

అంతే బావురు మన్నాడు యాద్గిరి.

"బాగా చెప్పవన్నా"

"నీ ప్రాణానికి ఒకళ్ళు కాదు రా శత్రువులు."

"బాగా చెప్పావన్నా..ఇద్దరు..ఇద్దరు. ఇద్దరూ పెళ్ళాలే"

"చచ్చాం ఫో. ఇక బతుకు తొట్టెలో బల్లే" అంటూ ధబ్ మటూ చేయి వొదిలేసాడు.

"సరిగ్గా చెప్పావన్నా. అన్నా! సన్నాసన్నా ! నువ్వే నా రాత మార్చాలే....నీ కాల్మొక్కుతా...ఎలాగైనా వీళ్ళ ధండా..నుంచి, గూండా గిర్నుంచి తప్పించవే."అంటూ వేడు కున్నాడు.

గెడ్డం సవరించు కుంటూ నవ్వాడు సన్యాసి.

"హు. సాలెగూట్లో సాలీడుకి తప్పించుకునే మార్గ మేముంటుంది నాయనా.. ఒక్క పెళ్ళం వున్న వాడికే సాధ్యం కానిది, ఇద్దరున్న వాళ్ళకి అస్సలికే శూన్యం" వేదాం తం చెప్పాడు.

"అన్నా! అంత మాటనకన్నా!" అంటూ మరో పెద్ద గుట కేసి విలపించాడు యాద్గిరి.

"నేననడం కాదు నాయన. బ్రహ్మ లిఖితం. ఎవరూ తప్పించ లేరు. ఐతే నీ గడ్డు పరిస్థి తి మాత్రం ఎలా వుందో నీ కళ్ళకు కట్టినట్టు మాత్రం చెప్పగలను. ఇంట్లో కూర్చో లేవు. బయట పడుకో లేవు. కదూ?"

"సత్తెం చెప్పావన్నా"

"పైసా తెచ్చినా తంటే, సమంగా పంచకున్నా తంటే కదూ"

" అహా ఏం చెప్పావన్నా"

"వాళ్ళ నోళ్ళకు ఎదురిడితే వాళ్ళు చేతులతోనే కాదు, కాళ్ళతో కూడా తంతారు. అవునా"

"అన్నా నువ్ సన్నసివి కాదన్నా..నన్ను చూసిన కన్నువి.." సీసా ఎత్తి చెప్పాడు.

"ఇంకా చెబుతా విను. వాళ్ళు నిన్నొదలరు. . ఎలాంటి పరిస్థితుల్లో నైనా సరే వదలరు. నువ్వొదుల్తానంటే అస్సలూరుకోరు. ఇంకా పడి దంచుతారు. నాలుగు రోజులు కాపురం చేయ కుంటే రగులుతారు. కాలే కట్టెలతో వాతలు పెట్టి మరీ కాపురం చేయ మంటారు. అవునా..?"

"అన్నా.. ఏం చెబుతున్నా వన్నా.. " అంటూ సీసా పక్కన బెట్టి కాళ్ళ మీద పడి పోయాడు.

వాడు లేచే లోపూ గబుక్కున సీసా మొత్తం తాగి ఖాళీ సీసా దూరంగా విసిరేసాడు సన్నాసి.

"నా గురించి నీ కివన్ని ఎలా తెల్సన్నా" భక్తిగా చేతులు జోడించి అడిగాడు యాద్గిరి.

"ఎందు కంటే నాయానా.." అనే లోపు అక్కడ ఇద్దరు లేడీ పహిల్వాన్లు ప్రత్యక్ష మయ్యారు.

సన్నాసి, భూతాల్ని చూసిన వాడిలా భయంగా లేచి నిలబడ్డాడు..

ప్రత్యక్ష దైవం పారి పోతాడేమోనని భయంగా రెండు కాళ్ళు లపక్కుమని పట్టుకుని ఆపాడు యాద్గిరి.

" వొదల్రా తమ్మీ! ఒకటి కాదు రెండు సునామీలొస్తున్నాయి" లబో దిబో మన్నాడు సన్నాసి.

కాషాయం కట్టు తప్పి, ఖాకీ లాగు కంపించింది.

ఇంతలో ఇద్దరూ " ఇక్కడ సచ్చాడు అక్కోయి." అంటూ సన్నాసిని చెరో రెక్క పట్టుకునీడ్చుకెళ్ళారు.

" న్నేనాను.. తమ్మీ హెల్ప్..హెల్ప్.." అంటూ అరుస్తున్నాడు సన్నాసి..ప్రాణ భయంతో!

దెబ్బకి ఎక్కిన చుక్క దిగడంతో..బిత్తర పోయాడు యాద్గిరి.

"సంసారం చేయ కుంటేనే కాదన్నా.. సన్నాసి అయినా పెళ్ళాలు వూరు కోరు..ఇంకా దంచుతారు. రాసి పెట్టుకో" అంటూ..అరిచి చెప్పాడు. కొత్త ఫిలాస్ఫీని.

గయ్యాళి పెళ్ళామున్న ప్రతివాడూ సన్యాసె ఐతె, రాక్షసి లాంటి భార్యున్న ప్రతి ముగుడు సోక్రటీసే మరి.

యాద్గిరి తన మందు సీసా కోసం వెతికాడు. అది ఖాళీ అయి పడుండటం చూసి, "ఓరి సన్నాసీ" అనుకున్నాడు బాధగా.

కాని అతనికొక తృప్తి మాత్రం కల్గింది. ఈ ప్రపంచం లో తనలాంటి జీవి మరొకడున్నాడని!

*******

జరిగిన సంఘటనని చెరిపేసుకుంటూ పోతోంది కాలం. బాధ కూడా ఇపుడిప్పుడే మరుగున పడుతోంది.

గాయం చేసి పోయే విషాదాలకి , కాలమే లేపన మౌతుందేమో!

బాధల్ని మర్చి పోడానికి, శైలి ఎప్పుడూ ఎంచుకునే ఒకే ఒక మార్గం. పనిలో రాక్షసిగా మారి, తనని తాను పూర్తిగా అందులో ఐక్యం చేసుకోడం.

గత వారం రోజులుగా వూపిరి తీసుకునే సమయం కూడా లేనంత గా మునిగి తేలుతోంది.

కొంచెం సేపు బ్రేక్ కోసం సీట్లోంచి లేచింది.

ఇంతలో ప్రకాష్ ఫోన్ చేసాడు.

"హెల్లో! ఎలా వున్నారు?" అడిగింది పలకరిస్తూ.

"నాతో బయట కొస్తారా?" అతని గొంతు ఎప్పట్లా జాలీ గా లేదు. అంతే కాదు. ఎప్పుడూ లేనిది బహువచనంలో పిలవడం కొంత ఆశ్చర్యాన్ని కూడా ఇస్తోంది.

ఓ క్షణం ఆలోచించి చెప్పింది. "వస్తా. ఎప్పుడు?"

"ఇప్పుడే" - ఖంగున మోగింది అతని గొంతు.

"ఇప్పుడా!..ఎక్కడికి?"

"కిందకి. లిఫ్ట్ దిగొస్తే చాలు."

"అంటే, మీ రెక్కడున్నారిప్పుడు?" త్రంగా అడిగింది.

"మీ ఆఫీస్ బయట. కార్లో  కూర్చునున్నా..వస్తే బయల్దేరుదాం" అన్నాడు. అతను శాసిస్తున్నాడో, స్వతంత్రిస్తున్నాడో తెలీడం లేదామెకి.

తనకూ కొంత విరామం కావాలనిపిస్తోంది. అన్నిటి నుంచి..రిలాక్స్ అవడానికి..  అందుకే వెంటనే చెప్పింది.

"రెండు నిముషాల్లో వస్తున్న. సరేనా.?" అంది.

అది విని చెప్పాడు.. "థాంక్యు. ఐ విల్ వెయిట్" అంటూ. ఈ సారి అతని గొంతు మెత్తగా వుండటాన్ని గమనించింది.

ఇన్నాళ్ళ అతని పరిచయంలో, అతనెంత స్నేహంగా వున్నా,  అతనెప్పుడూ హద్దు మీర లేదు. ముఖ్యంగా ఒంటరిగా వున్నప్పుడు కాని, నిండా అవకాశం వున్నా కానీ..కనీసం తాకే ప్రయత్నం కూడా చేయడు. అలాంటి ప్రకాష్ తన ఆఫీస్‌కి  చెప్పాపెట్టకుండా రావడం, తనతో బయటకి రమ్మని ఆహ్వానించడం..వండర్‌గా వుంది. ఏమై వుంటుంది!?

కొంత ఆనందంగా, మరి కొంత సస్పెన్స్‌గా వున్న సరి కొత్త భావమేదో..

ఆమె కార్లో  కొచ్చి కూర్చోగానె, ఎప్పటిలా ఒక కొత్త పరిమళం పరుచుకుంది లోపలంతా.

ఎప్పుడూ అడుగుదామనుకుంటాడు...  పెర్ఫ్యూం పేరేమిటా అని! ఇప్పుడైతే, అడిగే మూడ్‌లో అస్సలు లేడేమో..కామ్‌గా వుండి పోయాడు.

తను హలో అంటూ పలకరించినా, అతను గమనించలేదు. బదులుగానైనా, కనీసం  నవ్వలేదు.

అలవాటుగా  మంద్ర స్థాయిలో ఎప్పుడూ  వినిపించే సంగీత రవళులూ వినిపించడం లేదు. .

ఇంకా చెప్పాలంటే ప్రకాష్‌లో ఎప్పట్లా స్నేహ పూరితమైన కదలికలే లేవు..

'తన పై అలిగాడా, ఏమిటీ'  నవ్వొచ్చింది. ఇంత   సీరియస్‌గా వుండే అప్పటి ప్రకాష్‌ని చూస్తే ఒళ్ళు మండి పోయేది. అదేమిటో   తమాషా! ఇప్పుడు మాత్రం  నవ్వొస్తోంది.

"ఏమిటి నీలో నువ్వే నవ్వు కుంటున్నావ్?" ముఖమంతా ఎర్రగా చేసుకుంటూ అడిగాడు.

"ఏదో గుర్తొచ్చి, నవ్వుకున్నా. తప్పైతే మన్నించండి" అంది నవ్వి,  అతని వైపు చూస్తూ.

"పెద్ద వాళ్ళు. తప్పులు చేయరు. తప్పించుకుని తిరుగుతారు. అసలు విషయాలన్నీ రహస్యంగా  దాచి పెట్టి.." అతనేం అడగాలనుకున్నడో ఏమో కాని, 'రహస్యం' అన్న మాట కి మాత్రం ఆమె ఉలిక్కి పడింది.

"ప్రకాష్!" అంటూ అర్థోక్తిగా చూసింది.

అప్పటికే నగరం పొలి మేర దాటి, ఒక చిన్న గ్రామంలోకొచ్చారు.

చుట్టు పొలాలు, మరో పక్కగా చిన్న చెరువు కనిపిస్తోంది.

రోడ్‌కి ఓ పక్కగా కారాపి, అడిగాడు. "నువ్వు నా గత ప్రవర్తనని, అవమానాలుగా తీసుకుని, మర్చిపోలేక పోతున్నావు కదూ?"

తన మనసుని చదివినట్టు మాట్లాడుతున్నాడు. కానది నిజం కాదే! ఆమె కను బొమలు ముడుచుకున్నాయి.

"మీకెందు కొచ్చిందా సందేహం?"

"కొత్త కొత్త సంగతులు వింటున్నాను కాబట్టి"

ఆమె గుండె ఝల్లు మంది. ఏం విన్నాడి త గాడు? నిషాకి నిన్న టైం ఇచ్చింది. కాని, అనుకున్న మొత్తం దొరక్క ఆగి పోయింది. ఒక వేళ ఆమె గాని, ఇతన్ని కలిసిందా? లేక ఫోన్ చేసి అంతా చెప్పేసిందా? తనని బెదిరిస్తోందనుకుందే కాని, అన్నంత పనీ చేస్తుందను కోలేదు..లేక శివ గాని..అమె మనసు పరి పరి విధాల పోతోంది.

ఇక వూరుకో లేక అడిగేసింది.

"నా గురించి మీరు 'అంత కష్టపడి తెల్సుకున్న' కొత్త సంగతేమిటో నే తెలుసుకోవచ్చా ప్రకాష్ గారూ!" అడిగింది నిష్టూరంగా.

ఆమెనొకసారి, నిశితంగా చూస్తూ అన్నాడు. "ఏమీ తెలీని దానిలా తిరిగి నన్నే అడుగుతున్నావా?" ఈ సారి అతని మాటల్లో బాధ ధ్వనించింది.

"నిజంగా నాకు తెలిదు. ప్లీజ్ చెప్పండి"

"నువ్వు వేరే ఇల్లు చూసుకుంటున్నావట కదా!?" అలా అడుగుతూనే ..ముఖమంతా విచారంగా మారి పోయింది.

వింటున్న శైలికి మైండంతా బ్లాంకై పోయింది.

'తనా? ఇల్లు చూసుకుంటొందా.' లేదే' అనబోతూ ఆగి - "మీకెవరు చెప్పారు?" అని అడిగింది.

"ఏజెంట్. రియలెస్టేట్ ఏజెంట్. నిన్నొచ్చి పర్సనల్‌గా చెప్పి పోయాడు. నువ్వు సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్ కోసం వెదుకుతున్నావని. నీ సెల్ స్విచాఫ్ వుందని, స్వయంగా తనే వొచ్చాడు. తీసుకెళ్ళి చూపిద్దామని."

"ఏ జెంట్..!? ఓ! సాయి కుమారా. వొచ్చాడా." గుర్తుకొచ్చింది. అసలు సంగతి. ఫక్కున నవ్వు కూడా వచ్చింది. కాని ఆ-పుకుంది.

తను ఫ్లాట్ వెతుకుతున్న మాట నిజమే. కానది తన కోసం కాదు. దిలీప్‌కి. కాని, ఈ అసలు విషయం అతనితో చెప్ప బుద్ధి కాలేదు. అతను పడుతున్న వర్రీ చూసాక. అది మనసుకెంతో ముచ్చటగా తోచడంతో!

అందుకే కామ్‌గా వుండి పోయింది. అతను ఇంకొంచెం బాధ పడితే బావుడ్ను అని కూడా ఆశగా అనిపిస్తోంది లోపల్లోపల.

ఆమేమీ మాట్లాడక పోడంతో అతనే అన్నాడు.

"శైలీ! త్వరగా ఇల్లు చూసుకుని వెళ్ళమని నేనన్నది నిజమే. కాని, అదంతా, మనం స్నేహితులం కాకముందటి మాట. . అప్పుడు నేనేమన్నానో.. నాకు గుర్తు లేదు. ఇవాళ పొద్దున ఏజెం టొచ్చి చెప్పేదాకా..అప్పటినుంచి ..నాకేం తోచడం లేదు. నిన్నెలా అడగాలా అని.." అతను గాడు.

అతన్ని జాగ్రత్తగా వింటోంది శైలి. అతని ప్రతి మాట లోను..స్వర స్వరానికి మారుతున్న గొంతు అత్యంత అద్భుతంగా వినిపిస్తూ వుంటె...

అతను కంటిన్యూ చేస్తున్నాడు సంభాషణ్ణి.

"శైలి, ప్లీజ్..నువెళ్ళొద్దు.. అని చెప్పడానికే నిన్నిక్కడికి తీసుకొచ్చాను."

ఎంత బెంగ తొంగి చూస్తోందో గొంతులో!

బయటెటో చూస్తూ..నిశ్చిరై కూర్చున్న అందగాని వైపో సారి చూపులు సారించింది.. ప్రవరుడ్ని వరించిన వరూథునిలా!.

కోటేరేసిన ముక్కు, చురుకైన కళ్ళు, లేత నేరేడెరుపు రంగు పెదవులు..ఆమె అక్కడ ఆగి పోయింది.

వెనక్కి చేతులేసుకుని, సీట్‌కి జార్లబడి, కళ్ళు మూసుకుంది. పదే పదే అతని రూపం కళ్ళలో కనిపిస్తూ వుంటే..వింతైన నవ్వు మెరిసి పోతోంది..ఆమె పెదవుల మీద..

సడెన్‌గా ఆమెనలా చూసి అతను విస్తు పోయాడు. తనింత హార్ట్‌ఫుల్‌గా, నిజాయితీగా మనసు విప్పి మాట్లాడుతోంటే,

స్పందించాల్సింది పోయి..తనలో తానిలా నవ్వు కుంటోందంటే అర్థం? తనని నవ్వు లాటగా తీసుకుంటోందా..!?

రోషమేసి, అడిగాడు. "అసలు నువ్వు నన్ను వింటున్నావా?, లేదా?" అని.

"వింటున్నా. అంతా వింటున్నా. కళ్ళు మూసుకుని చూస్తున్నా కూడా"

"మరేమంటావ్?" ఆత్రంగా అడిగాడు.

ఓ క్షణం నిశ్శబ్దం తర్వాత అంది మెల్లగా..

"ఐ లవ్ యు"

"వాట్?" అదిరి పడ్డాడు.

ఆమె ఏ మాత్రం తన భంగిమలోంచి తొణక్కుండా, తన్మయత్వంగా చెప్పింది.

"యెస్! ఐ లవ్ యూ." ఈసారి మరింత స్థిరంగా చెప్పింది.

ఊపిరందని వాడే అయ్యాడు అతనా క్షణంలో!

*******

## 10

***ఆ రాత్రి -***

అతనికి నిద్ర పట్టక, పక్క మీద అసహనంగా అటూ ఇటూ కదులుతున్నాడు. కళ్ళు మూసినా, తెరిచినా అదే దృశ్యం కనిపిస్తూ, కలవర పెడుతోంది..

శైలి ఐ లవ్ యూ చెప్పిందనే సంతోషం కంటే, సందేహమే ఎక్కువగా వుంది. 'ఎందుకనీ అలా అంది?' అనే ఆలోచిస్తున్నాడు.

ఆమె అంటే అతనికిష్టం లేదని కాదు. అలా అని, అమె పట్ల తనకున్న హద్దులు కాదని వెళ్ళేంతా కాదు.

జీవితంలో ఎదురయ్యే కొంతమంది వ్యక్తుల పట్ల ఒక్కోసారి కలిగే అభిమానాలకు పేర్లుండవు చెప్పడానికి.

ఆమె అంటే అతనికో చిత్రమైన ఇష్టం. విచిత్రమైన అనురాగం. అలాంటి ఒక స్నేహితురాలు వుండాలని! అంతే.

ఎంత నిష్కల్మషంగా మాట్లాడుకుంటూన్నా, అప్పుడప్పుడు..చూపులు కలిసి నిలిచిపోడం, హఠాత్తుగా కళ్ళల్లో మెరుపులు మెరవడం.. చాలా సహజం.

అంత మాత్రాన అది ప్రేమే అయి తీరాలని లేదు. మరి శైలి ఎందుకు ఐ లవ్ యూ చెప్పినట్టు?

ఇక్కడ ప్రకాష్ కూడా అందరి మగాళ్ళ లాగానే నిజం ఒప్పుకోలేకపోతున్నాడు కాని, ఒక భార్యతో బాటు ఒక ఆరాధకురాలూ వుండటం అతనికీ ఇష్టమే! శైలికి తనంటే ఇష్టమని తెలుసు. అందుకే అతనికి ఆమె అంటే అంత ప్రత్యేకమైన అటెన్షన్! ఐతే అందుకు పూర్తిగా ఆమె అందమే కారణం కాదు..ఆమె వ్యక్తిత్వం. స్వాభిమానం, ఆత్మ గౌరవం, అన్నిటికంటే ప్రత్యేకమైన విషయం....ఆమె తన కుటుంబానికి తెలీకుండా చేస్తున్న మేలు!

ఒక్కసారి తలతిప్పి చూశాడు. దేవకి ఎంతో ప్రశాంతంగా నిద్రపోతోంది , ఆమె పక్కనే చిన్నా!

ఆమె మెడను చుట్టుకుని వాడు, వాణ్ణి చేతులతో దగ్గరకు తీసుకుని ఆమె!

నిజమైన తల్లీ బిడ్డల్లా.. ఒకరి నుంచి మరొకర్ని విడదీయలేనంతగా వాళ్ళిద్దరి మధ్య ప్రేమబంధం పెరిగిపోయింది...

ఈ బంధాన్ని మొదట్లోనే తుంచేయాలనుకున్నాడు. కాని, వాడు ఆమె ఆనందానికి మాత్రమే కాక ఆరోగ్యానికి కూడా ఔషధంలా పనిచేయడంతో వెనకాడాడు.

"ప్రమాదాలు జరుగుతాయని ప్రయాణాలు మానేస్తామా! రేపు మరణిస్తామని, ఇవాళ జీవించకుండా వుంటామా!

ఇది అంతే. ఎప్పుడో దూరమౌతాడని, అది భరించుకోలేమని, ఇప్పటినుంచే మీరు చిన్నాని దూరం చేయాల్సిన అవసరం లేదనుకుంటా, ఆమె మానసికంగా కుదుట పడి, కోలుకుంటున్న ఈ పరిస్థితుల్లో, మీరు అలాంటి నిర్ణయం తీసుకోకపోడమే మంచిదనుకుంటా.." అంటూ డాక్టర్ ఆనంద్ సలహా ఇచ్చాడు..

ఇంతలో శైలితో తన స్నేహం కూడా పెరుగుతూ వచ్చింది. ఇక ఆ విషయానికి అంత ప్రాధాన్యత ఇవ్వలేదు.

చిన్నా ఆమెకి మరింత దగ్గరయ్యాడు అంటే అది కేవలం దేవకి చూపే ప్రేమ వల్లే. ఇప్పుడు వాడు పగలూ రాత్రి కూడా పూర్తిగా ఆమె పెంపకంలోనే పెరుగుతున్నాడు.

మొదట్లో శైలి మొహమాట పడేది. చిన్నాని తీసుకెళ్తనంటూ వచ్చేది. వాడింకా తింటున్నాడనో, తర్వాత కధలు వింటున్నాడనో, తర్వాత నిద్ర పోతున్నాడనో..కారణాలు చెప్పేది. పైగా 'నువు వాణ్ణి నాకొదిలేసి, నీ ఆఫీస్ పని చూసుకో' అంటూ ఒక సలహా కూడా ఇచ్చేసేది.

మొత్తానికి రోజులో ఇరవై నాలుగ్గంటలూ వాడు దేవకి దగ్గరే వుంటాడు. శైలి వూసే ఎత్తడు. దేవకి కనిపించక పోతే ఇల్లంతా వెతుక్కుంటాడు.

నిజం చెప్పాలంటే, శైలికి చిన్నా బాధ్యతే లేదు. ఆమె ప్రాణం హాయిగా వుంది.

ఇద్దరాడ వాళ్ళ పరిస్థితి బాగానే వుంది సరే, మధ్యన తను ఇరుక్కుపోయాడే ! అతనికి నవ్వొచ్చింది ....శైలి ప్రేమిస్తున్నానని చెప్పడం గురించి.

ఇలాంటివన్నీ ఒకప్పుడు భలే థ్రిల్లిచ్చేవి. వెంటపడే అమ్మాయిలూ, వాళ్ళ ఆత్రాలు, ఆరాధనలు, తన కోసం వాళ్ళు పడే తపనలు..అన్నిట్నీ ఎంజాయి చేసిన వాడే అతను!

అదొక సరదా గేమ్. అదొక పిల్లీ ఎలకల చెలగాటం.. ఆమె చేత ఐ లవ్ యూ చెప్పించుకుని, 'అయ్యో నువ్వలా అనుకున్నావా! నా కలాంటి భావాలే లేవ్ ' అంటూ ఏడిపించడం చాలా మందికి సరదా. అదో ఆట. గెలిచాక గొప్ప ఆనందమేస్తుంది. కాని, ఇక్కడ గెలుపునిచ్చేవి ఒక స్త్రీ కన్నీళ్ళు. అని అప్పుడు అర్థం కాదు.

నవ్వుతూ చేసే పాపాలే శాపాలవుతాయన్నట్టు..కొన్ని నిజాలు అనుభవంలో కొస్తేనే కాని తెలీవు.

మనిషికి అనుభవాలే మంచి గురువులు.

దేవకి అతని జీవితంలో కొచ్చాక, ఇలాంటి సిల్లీ పన్లన్నీ మానేసాడు.

చాలా యేళ్ళ తర్వాత, తనని అడుగుతున్న మరో స్త్రీ శైలి. ఆలోచిస్తున్నాడు. ప్రేమిస్తున్న వారికి యెస్ అని చెప్పడానికి ఎన్నో పద్ధతులుంటాయి. కాని, నో అని చెప్పడానికి ఏ మార్గమూ కనిపించదు. అవతలి వ్యక్తి గాయపడకుండా చెప్పడం నిజంగా ఒక కళ.

'నీ అంత అద్భుతమైన మనిషి ఎదురై, ఐ లవ్ యూ అన్నాక కూడా నో అని ఎవరైనా అన్నాడూ అంటే అతను నిజంగా దురదృష్టవంతుడే అని ఒప్పుకుంటూ..వుంటా మిత్రమా!'' అని చెప్పొచ్చు. తన దగ్గర జవాబు లేక కాదు.

అంత కంటే ముందుగా అతడాలోచిస్తోంది ..ఆమె అంత హఠాత్తుగా తనకు ఐ లవ్‌యూ అని ఎందుకు చెప్పాల్సి వచ్చిందా అని! తనకి సమాధానం కావాలంటూ ఈ అర్థరాత్రి వరకూ టైమిచ్చింది. ఎందుకనీ? అనుకోకుండా కళ్ళు కాలెండర్‌ని చూసాయి. అంతే! ఒక్క సెకను కూడా ఆలస్యం చేయలేదతను.

అతను చటుక్కున లేచి, సెల్ తీసుకుని బాల్కనీలో కెళ్ళాడు.ఆమెకి మెస్సేజ్ ఇవ్వడంలో మునిగి పోయాడు.

'అప్పుడప్పుడు ఫూల్స్ కూడా నిజాలే చెబుతారని ఒప్పుకోక తప్పదు. యెస్ . యూ ఆర్ రైట్ ! నువ్వన్నదీ నిజం. నే ఒప్పుకోనిది అబద్ధం'

అతని మెస్సేజ్ చదివి నవ్వుకుంటూ బయట కొచ్చింది శైలి. బాల్కనీలో అతన్ని చూసి, నవ్వుతూ చేయి వూపింది గుడ్ నైట్ సంకేతంగా!

అతనూ నవ్వి లోపలకొచ్చేసాడు. ఇప్పుడు మనసెంతో హాయిగా, ప్రశాంతంగా వుంది.

కాని, ఒక ప్రశ్నే మిగిలింది..ఆమె తనని నిజంగా ప్రేమించడం లేదా అని!

ఆ రాత్రి - ఏప్రిల్ ఫస్ట్‌కి మారడానికి అప్పటికింకా కేవలం ఒకే ఒక్క సెకను కాలం మిగిలి వుంది.

***********

దేవకి తన స్నేహితురాలు రేవతి గురించి ఎలాంటి చెడ్డ వార్త విన కూడదని వెయ్యి దేవుళ్ళకి మొక్కు కుంటూ ఆసుపత్రికి వొచ్చింది.

స్పెషల్ వార్డ్ రూం బయట రేవతి భర్త సుబ్రహ్మణ్యం కనిపించాడు.

ఆమెని చూస్తూనే, భోరుమన్నాడు. "చూశారా! మీ ఫ్రెండ్ నా కెంత అన్యాయం చేసి పోదామనుకుందో!" అంటూ బిగ్గర గా ఏడ్చేస్తున్నాడు.

"వూరుకోండి." చిన్నపిల్లాడిలా తల్లడిల్లిపోతున్న అతన్ని ఎలా వోదార్చాలో తెలీడం లేదామెకి.

రేవతీ ఆమే బాల్య స్నేహితులు. ఇద్దరివీ ఒకటే క్లాస్, ఒకటే బెంచ్. ఒకటే అభిరుచి. పెరిగి పెద్దవుతున్న కొద్దీ ఎవరి జీవన పరిస్థితులెలా వున్నా, వారి స్నేహం మాత్రం అలాగే వుంది. చెక్కు చెదరకుండా.

వాళ్ళిద్దరికి మరో విషయంలో కూడా పోలిక వుంది. ఇద్దరికీ సంతానం కలగకపోడం! కలిసినప్పుడల్లా రేవతి ఆ విషయం గురించే మాట్లాడేది. ఈ మధ్య ఆ బాధ ఆమెని ఎక్కువగా వేధిస్తోందని చెప్పింది. ఆర్నెల్ల నుంచి హఠాత్తుగా నిశ్శబ్దమై

పోయింది. ఇంతలో ఫోన్ చేసి పిడుగులాంటి వార్త చెపాడు సుబ్రహ్మణ్యం. రేవతి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుందని, హాస్పిటల్‌లో ఎమెర్జెన్సీ వార్డ్‌లో వుందనీ!

"ఇప్పుడెలా వుంది? లోపలకెళ్ళి చూడొచ్చా?" అడిగింది ఆందోళన పడుతూ. అతను కళ్ళు తుడుచుకుంటూ, వెళ్ళొచ్చు అన్నట్టు తలూపాడు.

పాపం! సుబ్రహ్మణ్యం..! అతని మీద జాలి పడుతూ లోపలకొచ్చింది.

తలుపు మూసుకుంది.

బెడ్ మీద రేవతి నిర్జీవంలా పడుంది.

దగ్గర కెళ్ళిపిలిచింది మెల్లగా " రేవూ! నేనూ! నేనొచ్చా! ఒకసారి ఇలా చూడూ!" అంటూ పిలిచింది ఆర్ద్రంగా!

చేతిలో ప్రియనేస్తం స్పర్శకో ఏమో, ఆమె కళ్ళు విప్పి చూసింది. దేవకిని గుర్తు పట్టిపట్టడంతోనే దుఖం పొంగుకొచ్చింది.

దేవకిని పేరు పెట్టి పిలుస్తూ కదిలాయి ఆమె పెదవులు. గొంతు పైకి రావడం లేదు కాని, కన్నీళ్ళు మాత్రం పొంగి పొంగిపోతున్నాయి.

ఆ పరిస్థితిలో తన ప్రియసఖిని చూసి కదిలిపోయింది దేవకి. వస్తున్న దుఖాన్ని ఆపుకుంటూ "ఎందుకు చేసావీ పిచ్చిపని?"

రేవతి మౌనంగా చూస్తూ వుంది.

"సుబ్బూ ఎంత ఏడుస్తున్నాడో తెలుసా నీ కోసం!?" ఈసారి కోపంగానె అంది.

రేవతి విరక్తిగా నవ్వింది.

"చెప్పు ఎందుకింత ఘోరం చేసావ్ ? ఏం సాధించాలని ఇదంతా చేస్తున్నావ్ ? కనీసం నాకైనా చెప్పకుండా వెళ్ళిపోదామనుకుంటున్నావా?" ఎంత ఆపుకుందామన్నా దేవకికి దుఖం ఆగ లేదు. .

కొన్ని క్షణాల మౌనం తర్వాత రేవతి సైగ చేసింది. దగ్గరకి రమ్మంటూ..

ఆమె ముఖం మీదకు వొంగింది.

అస్పష్టంగా వినిపిస్తున్న రేవతి మాటల్ని వొళ్ళంతా చెవులు చేసుకుని వింది.

రేవతి ఆయాస పడుతూ..ఒక్కో మాటని ఏరుకుని ఏరుకుని, చెప్పలేక చెప్పలేక చెబుతోంది. ఆమె గుండెని తవ్వు కుంటూ వస్తున్న నిజాలు..వింటూ.. హతాశురాలై పోయింది.

వెంటనే, రేవతి తలకింద చేతులేసి, గుండెకి హత్తు కుంది..'రేవూ! ఎంత పని జరిగింది !?" అంటూ వోదార్పుగా ఆమె తల నిమిరింది.

కనీసం స్నేహితురాలైనా అర్థం చేసుకుంది, ఇక చాలు ఈ జీవితానికి అన్నట్టు.. ఆమె వెనక్కి వాలి పోయింది. . విశ్రాంతి కోసం. శాశ్వత విశ్రాంతి కోసం!

దేవకి కంగారు పడుతూ పిల్చింది అక్కడున్న నర్సుని. పరిగెత్తు కుంటూ వస్తున్న స్టాఫ్‌తో బాటు సుబ్బు కూడా వచ్చాడు లోపలికి పరిగెత్తుకుంటూ!

క్షణంలో డాక్టర్లతో నిండి పోయింది గదంతా! రేవతిని పేరుపెట్టి పిలుస్తున్నారు. చెంపల మీద చరుస్తున్నారు.. నాడిని పట్టుకున్నాడు ఒక డాక్టర్. మరో డాక్టర్ గుండె శబ్దం ఏమైనా వినిపిస్తుందేమోనని చూస్తున్నాడు. అదెప్పుడోనే ఆగిపోయిందని దేవకికి తెలుస్తోంది.

ఐదు నిముషాల తర్వాత ఆమె మెడ వరకున్న తెల్లటి దుప్పట్ని ముఖం మీద కప్పేసారు. "సారీ" అంటూ..

సుబ్బు, అమాంతం శవం మీద పడి ఏడుస్తున్నాడు.

అందరూ అతని వైపు పాపం అన్నట్టు చూసారు.

దేవకి కూడా.! ఐతే సుబ్బు వైపు కాదు. తన నెచ్చెలి వైపు.!!

ఎంత జ్వలించావ్ , బడ బాగ్నిలా..

ఎంత రగిలావు, ఆరని నిప్పు కొండలా..

ఎంతలా పొగిలావ్ , పొంగిన సముద్రంలా..

నేస్తం! చివరి శ్వాస వరకు నువ్ పడ్డ నరకం చాలు.

నీ సుఖం కోసం ప్రాణాలు తీసుకోవాలనుకున్నావ్ !

మిత్రమా! నీ ఆత్మకి శాంతి కలుగుగాక..సాంత్వన చేకూరు గాకా!!

కలలో నడుస్తున్న దానిలా అక్కడ్నుంచి కదిలింది.

ఇల్లెలా చేరిందో ఆమెకే తెలీదు. గదిలో బెడ్ మీద అలా వాలిందో లేదో..అప్పటి వరకు ఆగిన దుఖం గండి తెగిన చెరువులా.. పొంగింది.

ఇంతలో ఖంగుమంటూ వినిపించింది ఆడగొంతు.

"ఇంట్లో ఎవరూ లేరా ఏమిటీ? అమ్మయి, దేవకీ? వున్నావా?" అంటూ.

ఆవిడ పేరు రవణమ్మ. ఆ వీధిలోనె వుంటుంది. పది రోజులకోసారొచ్చి, నెల రోజులకు సరిపడా కూరలు, కాయలు, పళ్ళూ కోసుకు పోతుంది తోటలోంచి.

మనిషి మహా (అతి) తెలివైనది. ఆ విషయం ఆవిడే స్వయంగా చెప్పుకుంటుంది. మాటల్లో తన ముత్తాతలు తిక్కన్నగారి సంతతని, ఈ అనర్గళత అక్కడ్నుంచే వచ్చిందనీ చెబుతూ వుంటుంది.

అసలు తను వొచ్చేది, అశాశ్వతమైన కూరకీ నారకీ ఆశపడి కాదన్నట్టు, దేవకి సౌభాగ్యం కోసం, సంతానం కలగడం కోసమన్నట్టు నాలుగు రకాల పూజలూ, నోములూ, వ్రతాలూ, పిల్లల కోసం దర్శించాల్సిన ప్రదేశాలు అంటూ ( తను టీ వీలో చూసినవే) సంగతులు, కబుర్లూ చెప్పి పోతూంది. ఆవిడ ఎప్పుడొచ్చినా మాటల కుంభవృష్టి. వెళ్ళేప్పుడు మరి కొన్ని ఆరాలు, కూపీలు లాగి కొంగుకి ముడికట్టుకు పోతుంది. మరోచోట వూదడానికి పనికొస్తాయని.

దేవకికి ఆవిడ మనస్తత్వం గురించి తెల్సినా, బయట పడదు. "రండి పిన్ని గారూ" అంటూ ఆహ్వానిస్తుంది.

కాని ఈ రోజు ఆ మూడ్‌లో లేదు. స్నేహితురాల్ని కోల్పోయిన దుఃఖంలో వుంది.

రవణమ్మ సరాసరి వచ్చి, గదిలోకి తొంగి చూస్తూ..

"పడుకున్నావా? ఏమిటీ, వొంట్లో బాగోలేదా, అయ్యో! కన్నీళ్ళేమిటీ" అంటూ వొచ్చి, దేవకి పక్కన కూర్చుంది.

దేవకికి ఆవిణ్ణి భరించే శక్తి లేక,

"ఏం లేదు లేండి. కొంచెం తల నొప్పి. అంతే. తోటలోకెళ్ళి, మీక్కావల్సినవి తీసుకోండి..." అంటూ శివాని పిల్చింది. 'ఈ మహా తల్లిని తీసుకెళ్ళు' అన్నట్టు.

"శివా ఎందుకమ్మా! నేనసలొచ్చింది ఆ పాడు కూర్లకీ, పళ్ళకీ కాదు. నీ గురించే వొచ్చా. నెల రోజుల్నుంచి నీకు చెప్పాలని.. కాపురంలో కలతలొస్తాయని వూరుకున్నా కాని, ఇప్పుడు నీ కన్నీళ్ళు చూసాక ఇక నే వూర్కోలేను చెప్పకుండా" అంటూ తడిలేని కళ్ళు తుడుచుకుంది.

యధాలాపంగా వింటున్న దేవకికి ఆవిడ ఏదో నిజం చెప్పడానికి వచ్చిందనిపించింది. లోకం అనుకున్నంత చెడ్డది కాదని ఆమె నమ్మకం. ఆ నమ్మకంతోనే అడిగింది రవణమ్మని సందేహంగా.."దేని గురించి పిన్ని గారూ, మీరంటోంది" అని.

ఆవిడ అటూ ఇటూ ఓ సారి చూసింది.

"మీ ఆయన కానీ, ఇంట్లో లేడుగా" అని అడిగింది గొంతు తగ్గించి.

ఆవిడ చాలా తెలివిగలది. ప్రకాష్ వెళ్ళడం చూసే వస్తుంది. ఎందుకంటే అతనికి ఈవిడంటే చికాకు. చూస్తేనే తెలుస్తుంది. మంధరకి మేనమామ కూతురని.

దేవకికి కూడా చెప్పాడో సారి. ఈవిడ్ని ఎక్కువగా రానీయొద్దని. అలా ఆమె చెప్పలేనితనం ఇచ్చిన ఆసరా తోనే ఈ రోజు రవణమ్మ ఆమె గుండెల్లో నిప్పు రాజేయడానికి అవకాశం వచ్చింది.

"ఏం లేదమ్మా. మీ ఆయన.. మీ ఇంట్లో అద్దె కుంటోంది చూడు.. టిప్పులాడి.."

"ఎవరూ, శైలా!"

"అది శైలి కాదు. నీకు సవితి .. సవితి అవుతుందేమో చూసుకో!" ఆమె వూదాల్సిన సంగతి గుప్పున వూదేసింది.

" పిన్ని గారు!" అంటూ కోపంగా, మంచం మీద లేచి కూర్చుంది దేవకి. మొట్టమొదటిసారిగా రవణమ్మ మంధర మేనమామ కూతురిలా కాదు, అచ్చు మంధరలానే కనిపించింది.

"నాకు తెల్సు. నువ్వు నమ్మవని. మీ మొగుడూ పెళ్ళాలు ఎంత ప్రేమగా వుంటారో నాకు తెలుసు కనకే చెబుతున్నా. బంగార ముద్ద కనిపిస్తే ఎవరైనా దోచుకోవలనుకుంటారు. అది బంగారం తప్పు కాదు. కాజేయాలనుకున్న వాడి కాళ్ళు విరగ్గొట్టయినా, మన వస్తువుని మనం జాగ్రత్త చేసుకోవాలి. నీ అలుసు చూసుకునే అది రెచ్చి పోతోంది. పిల్లాడ్ని నీ కప్ప చెప్పి, నీ మొగుడ్ని బుట్టలో వేసుకు పోదామనుకుంటోంది. నిన్న మా అబ్బాయి వాళ్ళిద్దర్నీ చూసొచ్చిన కాడ్నుంచీ ఒకటే బాధ పడిపోతున్నాడు. వాళ్ళిద్దరూ ఎక్కడ పడితే అక్కడ వూరంతా ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నారు.. అక్కగారికీ విషయం ఎలాగైనా చెప్పాలమ్మా అని...బిడ్డ కొట్టుకుపోయాడంటే నమ్ము! ఏదో, ఇరుగు పొరుగూ వాళ్ళం. నాకు బిడ్డలాంటి దానివని చెబుతున్నా.. తర్వాత నీ ఇష్టం..వస్తానమ్మా..బాధ పడకు " అంటూ పొడి కళ్ళని మరోసారి తుడుచుకుంటూ వెళ్ళి పోయింది. బయటకి కాదు, తోటలోకి. ఇంటికొచ్చి వుత్తి చేతులతో వెళ్ళడమే! చెప్పాల్సింది చెప్పాక,. వాళ్ళ కూరలు తింటున్నందుకు మాత్రం విశ్వాసం చూపించిన తన మానవత్వానికి తనే పొంగి పోతోంది కానీ,

ఆవిడకి మనసులో ప్రకాష్ అంటె కసి. తనని చూస్తూనే కళ్ళు చిట్లిస్తాడని, ముఖం మాడ్చుకుంటాడని.. అతని మీద కసి తీర్చుకునే ఈ అవకాశాన్ని వదలదల్చుకోలేదు. ఆవిడ కడుపుబ్బరం తగ్గాక, ప్రాణం హాయిగ అనిపించింది.

రవణమ్మ అక్కడ్నుంచి ఎప్పుడెళ్ళి పోయిందో కూడా ఆమెకి తెలీదు.

ఆవిడ మాటలు మాత్రం చెవిలో మళ్ళీ మళ్ళీ మారుమోగుతున్నాయి.

' నీ కళ్ళు మూసి, వాళ్ళిద్దరూ వూరంతా తిరుగుతున్నారు తెలుసా..అది శైలి కాదు. నీకు సవితి..".

ఆమెకి చచ్చి పోయిన రేవతి గుర్తొచ్చింది. పోతూ పోతూ చెప్పిన కథ కూడా.

వూపిరి తీసుకోడం కూడా మరిచి పోయిన దానిలా రాయిలా వుండి పోయింది.

************

బ్రిటీష్ లైబ్రరీ నుంచి బయట కొస్తూ చూసింది శైలి.

రెండు చేతుల్లో పుస్తకాల మూటల్ని మోయలేక అవస్త పడుతున్న మిస్టర్ లూని.

ఒకేసారి ఇన్నేసి బుక్స్ చదివి పడెయ్యాలన్న తపన కాకపోతే.. పాపం! అనుకుంటూ....ఆయన చేతిలోంచి కొన్ని బుక్స్ తీసుకుంది.

చూసిన వెంటనే ఎవ్వర్నీ గుర్తుపట్టని లూ సైతం శైలిని ఇట్టే గుర్తుపట్టేసి, నవ్వుతాడు. మగాళ్ళకి అందమైన ఆడపిల్ల గుర్తున్నంత బాగా, పెళ్ళాం పుట్టిన రోజూ కూడా గుర్తుండదు. అందులో మిస్టర్ లూకి శైలి ఎందుకంతగా గుర్తుంటుందంటే..

గణిత శాస్త్రంలో చోటూ చేసుకోకుండా పొరబాటున జారిపోయిన ఒక అపురూపమైన ఫిగర్‌గా అతనికి అలా గుర్తుండి పోయింది. ఆ లెక్కల్లో కనిపించని ఒక అపురూపమైన నెంబరేదో గుర్తొస్తుంది అతనికి ఆమెని చూస్తే. అదే చెప్పడొక సారి ఆమెతో " నేనిన్ని ఫిగర్స్ చూసాను కానీ, మీ లాంటి ఫిగర్ని మాత్రం ఎక్కడా చూడ లేదండీ" అని.

ఆయన నిర్మొహమాటంగా, తన అందాన్ని అలా వర్ణించి చెప్పడం ఆమెకి బాగ నచ్చింది. ఆయన శైలితో ఎక్కువ సేపు మాట్లాడ్డానికి కారణం కూడా..ఒకటే. శైలి ఆయన సబ్జెక్ట్స్ గురించి, ఆయన రాయ బోయే బుక్స్ గురించే మాట్లాడుతుంది.

వాళ్ళిద్దరూ లైబ్రరీ బయట పార్క్‌లో కూర్చుని ఇప్పుడా సంగతులే మాట్లాడుకుంటున్నారు.

"మీరడిగారు కాబట్టి నేనెక్కన్నుంచి చెబుతానంటే" ....అంటూ ఇక మొదలు పెడతాడు.

క్రీస్తుపూర్వం ఎవరు, ఎప్పుడు ఈ గణితాన్ని కనుగొన్నది, ఎలా విస్తరించింది, గణితంలో సంపూర్ణ పాధాన్యతగల 'సున్నా నీ కనుగుని ఘనత వహించింది మన భారతీయులేననీ..' ఒక పాఠంలా చెబుతున్నాడు.

"మరి ఈ సున్నా లేకుండా, ఎలా సాగేది లెక్క?" అని అడిగింది చిన్న పిల్లలా.

విధ్యార్థి ఎంత సందేహిస్తే అంత పండగ లూ లాంటి వాళ్ళకి.

ఇక చరిత్ర చెబుతున్నాడు. పిథాగరస్ రేఖా గణితం నుంచి .. ఎక్కడి కెళ్ళాడంటే.. అర్థమెటిక్ నుంచి ఆల్‌జీబ్రా, పైథాగరస్ సిద్ధాంతాల నుంచి, ఫిలోమథిక్ వరకూ వివరించాడు. తర్వాత, సంగీతానికి జోస్యానికి లెక్కలతో గల సంబధం నుంచి ఇంట్రాపొలేషన్ న్యుమెరికల్ అనాలిసిస్ వరకు వెళ్ళాడు. చివరకు ముగింపుగా చెప్పాడు..

మాథెమటిక్ లవర్‌నే ఫిలోమథేన్ అంటారు. అంటె ఇక ప్రపంచంలో ఇంకేది ప్రేమించలేనంత లవ్ అని చెప్పొచ్చు. నవ్వి చెప్పాడు లూ..

'సముద్రమంత విజ్ఞానానికి ఆయన మెదడు సరిపోక మతిమరుపొచ్చిందేమో పాపం.' ప్రకాష్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి ఆమెకి.

"చాలా చీకటై పోయింది. నేనిక వెళ్తాను. లేకపోతే మా ఆవిడ కంగారు పడుతుంది. ఎవరెవరింటికో వెళ్ళి, రోజుకో తలనొప్పి తెస్తున్నానని..." ఆయన వెళ్ళడానికి లేచాడు.

శైలి ఫక్కున నవ్వింది ఆయన మాటలకి. ..ఇంత తెలివైనవాడు మన తెలుగువాడు అయినందుకు మనసులోనే అభినందించింది.

లూ వెళ్ళాక గమనించింది. ఒక పుస్తకాల బాగ్ అక్కడే మరిచి పోయాడని.

అప్పటికే ఆయన వెళ్ళిపోడంతో, దాన్ని తనే మోసుకుని తన టూ వీలర్‌కి తగిలించుకుని బయలు దేరింది,

దారిలో ఆగి లూ ఇంటి ఇంటికెళ్ళింది. వీధి గుమ్మం తలుపు తీసేవుంది. ఆమె లోపల కడుగు పెట్టిచూసింది. ఎవరూ లేరు. లోపల్నుంచి మాటలు వింపిస్తున్నాయి. మిసెస్ లూ - గొంతు చించుకుని అరుస్తోంది

"నీ కసలు బుద్ధుందా అంట! కార్ ఎక్కడో పారేసి, వెతికి పెట్టమని పోలీస్ కమ్ప్లెయింట్ ఇస్తావా? నీ నిర్వాకాన్ని టీవీలో చూపించారు తెలుసా? నువ్ ఫలానా అని బయోడాటాతో సహా చూపించారు. నీ మతిమరుపుల పురాణాలు ఎన్ని రకాలో నీ యూనివర్సిటీ పిల్లలు చెప్పి నవ్వారు. నీ జబ్బుని ఏమంటారో ఆ పక్కనుంచి డాక్టరు చెప్పారు. అందరూ - నీ వెధవ మతిమరుపు గురించే చెప్పుకోడం.. తెలిసిన వాళ్ళు, తెలీని వాళ్ళు నాకు ఫోన్లుచేసి నవ్వుతున్నారు. నా బ్రతుకు నలుగురిలో నవ్వుల పాలై పోయింది. నా పరువు ఇవాళ టీవీల కెక్కింది. రేపటినుంచి నేనేం ముఖం పెట్టుకుని తిరగాలి ఈ వీధిలో?

"అది కాదు సరూ! అసలేమైందంటే..!?"

"ఫోండి. ఇక్కన్నుంచి ఫోండి. నాకు మీ ముఖం చూపించొద్దు.." ఆవిడ సోఫాలో పడి ఏడుస్తోంది.

అప్పటి దాక పెళ్ళాన్ని బ్రతిమ లాడుతున్న లూ - అవమానం భారంతో అక్కడినుంచి లేచి, గదిలో కెళ్ళి తలుపు లేసుకున్నాడు..

శైలికి ఆ దృశ్యం చాలా బాధ కలిగించింది.

మనసంతా లూ పట్ల విపరీతమైన జాలితో నిండి పోయింది.

అక్కడ్నుంచి శబ్దం లేకుండా బయటకొచ్చి, ఆ మేధావికి తను ఎలాంటి మేలు చేయగలదా అని ఆలోచిస్తూ ఇల్లు చేరింది. తర్వాత ఒక నిర్ణయానికొచ్చిన దానిలా నిట్టూర్చింది.

***********

ఆ సాయంత్రం ఇంటి కొచ్చినప్పటినుంచి దేవకిని గమనిస్తున్నాడు ప్రకాష్ ఆమె రోజూలా ఉత్సాహంగా లేదు! పొద్దున తను చూసిన దేవికీ, ..వెయ్యి లంఖణాలు చేసిన మనిషిలా తయారైంది. అది చూసే అతనికి ఓ క్షణం పాటు వెన్ను జలదరించింది. .

ఈ మధ్య ఆమెతో ప్రేమగా మాట్లాడక చాలా కాలమై పోయింది. ఆమేం తింటోందో, ఏం చేస్తోందో, ఎలా వుంటోందో..అవన్ని కాదు కదా, అసలెలా వున్నావని కూడా అడగడం లేదతను. చెప్పలంటే ఆమె గురించే మరిచి పోయాడు. ఒక్క క్షణం పాటు పశ్చాత్తాపంతో హృదయం తలొంచుకుంది.

ఆమె పక్కనే నిద్రపోతున్న చిన్నాని ఎత్తుకుని పక్క బెడ్ మీద పడుకోబెట్టాడు. వాడి పక్కనే ఒక టెడ్డీ బేర్ వుంచి, దుప్పటి కప్పి, వాడి తల నిమిరాడు ప్రేమగా.

మొట్టమొదటిసారిగా అతన్ని పరిశీలనగా గమనిస్తోంది.

ఒకప్పుడు చిన్నా వైపు కన్నెత్తి ఐనా చూడని వాడు, ఇప్పుడు ప్రేమగా దగ్గర తీసు కుంటున్నాడు. కారణం?

ప్రకాష్ వచ్చి దేవకి పక్కనే కూర్చున్నాడు.

ఇక నిద్ర నటించలేక ఆమె కూడా లేచి కూర్చుని, కళ్ళు వాల్చుకుంది.

"ఏమిట్రా నాతో మాట్లాడ్డం లేదు? నా మీద కోపమొచ్చిందా!"

"........"

"నీ కిష్టంలేని పనేమైనా చేసానా? తెలీకుండా నిన్నేమైనా బాధపెట్టానా? ఊ?" అంటూ అడిగాడు లాలనగా.

అదే మనిషి. అదే గొంతు. అదే గుండె అదే ప్రేమ. అదే స్పర్శ. కాని తనో!?

చప్పున అతని గుండెల్లో ముఖం దాచుకుని దుఃఖిస్తూ చెప్పింది.

"ఆకాష్ ! రేవతి..ఆత్మహత్య చేసుకుంది"

"ఎలా? ఇదెలా జరిగింది?" నమ్మలేని వాడిలా అడిగాడు.

"చంపేసాడు. సుబ్బు చంపేసాడు. దానికి తెలీకుండా మరో పెళ్ళి చేసుకుని, వేరే కాపురం పెట్టాడు. ఇద్దరి పిల్లల తండ్రి కూడా అయ్యాడు. ఈ విషయం దానికి తప్ప బంధువులందరికి తెలుసు. అత్తగారు, మావగారు దగ్గరుండి మరీ రెండో పెళ్ళి జరిపించారు. భర్తే లోకంగా బ్రతుకుతున్న పిచ్చిది ఈ కటిక నిజాన్ని తెలుసుకుని బ్రతక లేక విషం తాగి చచ్చిపోయింది." ఆమె ఏడుస్తూనే చెప్పింది.

"సుబ్బూ ఇంత పనిచేసాడా!" అతడు దిగ్భ్రాంతిగా చూసాడు.

అమాయకమైన రేవతి ముఖం కళ్ళల్లో మెదిలింది.

'అన్న య్యా! ఓ వంద గజాల స్థలంలో నేనూ, మా ఆయనా, పుట్టబోయే మా ముగ్గురు పిల్లలూ వుండటానికి ఓ నాలుగంతస్థుల బిల్డింగ్‌ని డిజైన్‌చేసి ఇవ్వవా!" అంటు అడుగుతున్నట్టే వుంది. ప్రతి రాఖీ పండగకీ వొచ్చి, రాఖీ కట్టేది. 'అన్నయ్యా! వచ్చే ఏడాది నీ పిల్లలు నన్ను అత్తా అని, నా పిల్లలు నిన్ను మామయ్య అని పిలవాలి. సరేనా.."అంటూ నవ్వేది.

అలాంటి రేవతి ఆత్మహత్య చేసుకుందా! ఏం మాట్లాడలేని వాడిలా వుండి పోయాడు..

"ఎందుకింత పిచ్చిపని చేసింది" వేదనగా అన్నాడు.

భార్య గొడ్రాలైతే, భర్తకి ఎన్ని రకాల ఆలోచనలైనా వస్తాయి. తన సుఖం కోసం, తను తండ్రి కావడం కోసం బ్రతికున్న భార్యని ఒంటరిని చేస్తాడు. శవంలా చూస్తాడు. ఆమెని ఆత్మహత్యకి పురి గొల్పుతాడు. ఇలాంటి భర్తలు వుంటారనడానికి సుబ్బూ ఒక్కడు చాలు.

మరి ఆకాష్ ! నువ్వు..నువ్వెందుకనీ ఒక్కసారైనా అందరి మగాడిలా.. కలలో ఐనా అలా ఆలోచించ లేకపోయావ్ ?...

అతని మంచితనానికి, మించిన ప్రేమాను రాగాలకి ప్రతిఫలంగా అతనికి అన్యాయం చేస్తోందన్న భావన కలుగుతోంది.

ఆమె కన్నీళ్ళు తుడుస్తున్న చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ చెప్పింది.

"ఆకాష్ ! నేనెప్పుడూ నా గురించే ఆలోచించాను. నే తల్లిని కాలేక పోతున్నానే అని బాధపడ్డాను. ఏనాడూ నేను నీ వైపు నుంచి కనీసం ఒక్క క్షణమైనా ఆలోచించలేదు. నీకు మాత్రం తండ్రి కావాలన్న ఆశ వుండదా! రక్తం పంచుకు పుట్టిన పిల్లలతో 'నాన్నా' అని పిలిపించుకోవాలని వుండదా! అని .." ఆమె పూర్తి చేయక ముందే అతనందుకున్నాడు.

"వుండదు. నాకు వుండదు." కచ్చితంగా చెప్పాడు.

"కాని నాకుంది. నిన్నొక తండ్రిగా చూడాలనే ఆశ నాకుంది.! ప్రేమించిన వారి మీద ఆశలు పెంచుకోడంలో తప్పు లేదుగా!"

"అంటే?" అతని కనుబొమలు ముడుచుకున్నాయి..

"ఆకాష్ ! నువ్వు రెండో పెళ్ళి ఎందుకు చేసుకోకూడదూ?!" ఆమె మెల్లని గొంతుతోనే అడుగుతోంది కానీ, అతనికి మాత్రం బాంబ్ పేలినంత శబ్దమైంది చెవుల్లో. ..

******

## I I

**భార్య మాటలని వింటూ ఆమె మానసిక పరిస్థితిని అంచనా వేస్తున్నాడు ప్రకాష్.**

పిల్లల కోసమని తను పెళ్ళి చేసుకోవాలని, అదీ - శైలినే వివాహమాడాలని అడుగుతోంది ఎందుకనీ?

అమ్మలక్కల మాటలు నమ్మి తన మీద అపోహలు పెంచుకునేంత అల్పురాలు కాదామె! ఆ సంగతి తనకు బాగా తెలుసు.

తన కంటే అందగత్తె కాబట్టి, శైలి ప్రలోభంలో పడి పోయాడేమో అని పరీక్ష చేసేంత నెరజాణత్వం ఆమెకు లేదు. తీగ లాగి డొంక కదిల్చి ఇలా పరీక్షలు పెట్టి, అసలు గుట్టు రాబట్టి, తర్వాత జీవితాంతం మొగుణ్ణి సాధించుకు తినే గయ్యాళి తెలివి (?) తేటలకు ఆమె చాలా చాలా దూరం. ఇంత వరకు తను కచ్చితంగా చెప్పగలడు.

మరి!? మరెందుకని, శైలి ఆ ప్రసక్తి తీసుకొచ్చినట్టు?

తనను తండ్రిగా చూడాలనే కోరిక అంత అర్జెంట్‌గా పుట్టుకు రావడం వెనక కారణం ఏమై వుండొచ్చు! ఆమె కోణం లోంచి ఆలోచిస్తున్నాడు. కొంత సేపు అలా మౌనంగానే గడిచిపోయింది. తర్వాత అతను గొంతు సవరించుకుని అడిగాడు.

"దేవీ, నిన్నొక ప్రశ్నడుగుతాను. నిజం చెబుతావా?"

"ఏమిటది!"

"మనకి సంతానం కలగపోడానికి కారణం..నేనే" అంటూ ఆమె వైపు చూసాడు. అప్పటికే ఆమె విలవిల్లాడుతూ చూస్తోంది. "అహ! సపోజ్ నేనే కారణం అని అనుకుందాం. అప్పుడు నేను నిన్ను కూడా ఇలాటి కోరిక కోరాననుకో.."అతని మాటలు పూర్తి కాకముందే.ఆమె చప్పున అతని నోటి మీద చేయుంచి

"ఆకాష్! ఏమిటా పిచ్చి మాటలు" అంది గాయపడ్డ దానిలా కదిలిపోతూ!.

"నా మాటలు విండానికే అపవిత్రంగా వుంది కదూ!" అంటూ దించుకున్న ఆమె తలని పైకి లేపి, ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు. "మళ్ళీ పెళ్ళి చేసుకోమన్న నీ మాటలు వింటూన్నప్పుడు నాకూ ఇలాగే అవమానంగా ..సిగ్గుగా అనిపించింది దేవీ! ఎలా అంటే.. నువ్ పెళ్ళి చేసుకుంటే తప్పేమిటీ అన్నావ్ కాని నాకైతే వ్యభచరిస్తే అన్నట్టు వింపించింది..నేనేమిటో తెల్సిన నువ్వు సైతం..." గొంతు జీర బోవడంతో అతనిక మాట్లాడలేక పోయాడు.

ఆమె చప్పున అతని గుండెలో ముఖం దాచుకుని దుఖించ సాగింది.

ఎప్పుడూ లేనిది అతని కళ్ళకీ నీళ్ళొచ్చాయి. ఒక చేత్తో ఆమెని చుట్టుకుని, తలనిమురుతూ అన్నాడు ఓదార్పుగా.

"దేవీ, మనమిలా ఒకరినొకరం మోసపుచ్చుకుని, మభ్య పెట్టుకునే మాటలు మాట్లాడు కోవద్దు. పిల్లల వంకతో మరో స్త్రీ ని కోరుకునేంత దుర్మార్గపు ఆలోచనలు నాకు లేవు. ఇప్పుడు కూడా నువ్వీ కోరిక ఎందుకు కోరావో నాకు తెలుసు. శైలి ని కాకుండా నేనెవరినో వివాహమాడినా నువ్ చిన్నాని దూరం చేసుకోవాల్సి వస్తుంది. అది నువ్ భరించ లేవ్. కదూ!"

తన మనసుని అద్దం లో చదువుతున్నట్టు చెబుతున్న భర్తని చూసి మరింత పశ్చాత్తాపం చెందింది. ఆమె దుఖం మరింతైంది. దేవకి మనసేమిటో ఆమె కంటే అతనికే బాగ తెల్సు. కాకుంటే బుజువు చేసుకోవాలనుకున్నాడు అంతే.

"దేవీ. నువ్వెప్పుడూ అంటుంటావ్ కదూ! శైలి నీకు చెల్లెల్లాంటిది అని"

అవునన్నట్టు తలూపింది.

"మరి మీ చెల్లెలికో మంచి పెళ్ళి సంబంధం చూసి పెళ్ళి చేసి, ఆమె జీవితాన్ని చక్క దిద్దితే ఎలా వుంటుందంటావ్!"

ఆమె కళ్ళు తుడుచుకుంటూ "అదే నేనూ ఆలోచిస్తున్నా..కానీ చిన్నా.." అంటూ ఆగింది సందేహంగా..

"సరిగ్గా అదే నేనూ అంటున్నా. చిన్న బాధ్యత ఆమెకి తప్పించేస్తే..ఈ శుభకార్యం ఇంకా సులువుగా జరిగిపోతుంది."

"అంటే, ఎలా?"

అతనో క్షణం ఆగి అన్నాడు స్థిరంగా.."చిన్నాకి మనం తల్లి తండ్రులవుదాం. వాణ్ణి మన వంశోద్ధారకుడిగా చేసుకుందాం."

భర్త మాటలు వింటూ ఆమె ఉప్పొంగి పోయింది.

ఎప్పట్నుంచో ఆమె ఇలాగే ఆశ పడుతూ వస్తోంది. ఇప్పుడు అతని నోటినుంచి వినడంతో..ఆమె ఉద్వేగంతో కదిలి పోతూ..గబుక్కున అతని రెండు చేతులు తీసుకుని కళ్ళ మీదుంచుకుంది. కొన్ని కృతజ్ఞతాను రాగాలు తెలియచేయడానికి మాటలు వుండవు. చాలవు కూడా!

"రేపే శైలితో మాట్లాడతా ఈ విషయం గురించి. సరేనా? ఇక నువ్వు ప్రశాంతంగా నిద్రపో." అంటూ ఆమె తల కింద దిండు సరిచేసాడు.

లైటార్పి "గుడ్ నైట్" అంటూ అతనూ నిద్రలోకి జారుకున్నాడు.

ఆమె భర్త చేతిని చెంపలకాంచుకుని నిశ్చింతగా నిద్ర పోయింది.

ఎటొచ్చీ కనురెప్పలమీద నిద్ర కాటేసినట్టు.. ఆ రాత్రి కళ్ళు తెరుచుకుని గడుపుతోంది మాత్రం ఆమె ఒక్కత్తే, శైలి!

ఇంట్లో లైట్లు వెలుగుతుండటంతో, చిన్న కోసం వచ్చింది. గది బైట నుంచి వాళ్ళ సంభాషణంతా విన్నాక నిశ్శబ్దంగా అడుగులేసుకుంటూ అక్కడ్ను ంచి మాయమైంది.

అమితమైన ఆనందమో..విషాదమో..రెండు కలసిన సాగరమో..అన్నట్టు ఆమెకే తెలీని ఒకానొక అస్థవ్యస్థాను స్థితిలో..పడి కొట్టుకుపోతోంది శైలి!

ప్రపంచాన్ని జయించాక కలిగే ఆనందం మనిషిని కదిపేయదు. కుదిపేస్తుంది.

ఆ విజయం ఒక నిర్వేదానికి గురి చేస్తుంది. మంచు పర్వతంలా ఒంటరిని చేస్తుంది. కన్నీటిని సైతం ఘనీభవిస్తుంది.

ఆమె అలాగే కూర్చుండి పోయింది. కళ్ళు విప్పుకుని నల్లటి చీకట్లోకి చూస్తూ.

*******

శైలి చెప్పేదంతా చాలా శ్రద్ధగా విన్నాడు డాక్టర్ ఆనంద్.

అతనో ప్రముఖ సైకియాట్రిస్ట్ కాబట్టి పేషెంట్‌ణగురించి చాలా సమాచారాన్నే రాబడతాడు.

చిత్రం, మిస్టర్‌ణలూ విషయంలో తనెప్పుడూ ఈ కోణం నుంచి ఆలోచించ లేకపోయాడు.

కారణం అతను తన భార్య గురించి ఒక్క మాటైనా తూలకపోడం.

శైలి తన దగ్గరకొచ్చి, తన పేషేంట్ గురించి ఏదో చెప్పాలనుంది అంటే అతను తేలిగ్గా కొట్టిపారేసాడు కాని, నిజానికి ఆమె చెప్పిన సంగతి అతనికెంత ఉపయోగమొ అప్పుడే వచ్చిన ఒక ఫోన్ కాల్ వల్ల తెలిసింది.

"హలో"

"...."

"అవునా? ఎలా జరిగింది?" విస్మయంగా అడుగుతున్నాడు.

"....."

"ఊ! వస్తున్నా. ఇప్పుడే వస్తున్నా.." అని ఫోన్ పెట్టేస్తూ శైలితో అన్నాడు.

"మీరు చెప్పిన మనిషి నిద్ర మాత్రలు మింగేసాడట. ఇక్కడే ఆరో ఫ్లోర్‌లో అడ్మిట్ చేసారు. నే వెళ్తున్నా. పేషెంట్‌ని చూస్తారా?!" అప్పటికే ఆయన సీట్లోంచి లేచాడు.

ఆ వార్త వినగానే నిర్ఘాంత పోయింది. . లూని చూడ్డం కోసం ఆనంద్‌తో కలిసి ఆమె కూడా వెళ్ళింది.

బెడ్ దగ్గర డాక్టర్ని చూడంగానే, లూ భార్య గభాల్న ఏడ్చేసింది.

లూతో కలిసి వచ్చినప్పుడు చూసిన పరిచయం వుండడం వల్ల . "ఎలా జరిగిందమ్మా, ఇదంతా?" అని అడిగాడు

"గదిలోకెళ్ళి తలుపేసుకున్నారండి. మర్నాడు తెల్లారాక, ఎంతకీ బయటకి రాకపోతే, అనుమానమేసి చూసాం. ఆయనది మామూలు నిద్రలా లేదని.."

"ఎప్పుడన్నారు..?"

"రెండు రోజులైంది.."

లూని పరీక్షించాడు. కేస్ షీట్ చూశాడు. "ఏం ఫర్వాలేదమ్మా. ప్రమాదం తప్పింది." ఆమెకి ధైర్యం చెబుతూనే లూని నిద్ర లేపాడు. "ఎలా వున్నారు"? అంటూ కొన్ని కుశల ప్రశ్నలేసాడు.

మర్చిపోయి తను ఎక్కువ మాత్రలేసుకున్నట్టు నవ్వి చెప్పాడు లూ.

"హు! పాపం" అనుకుంది శైలి మనసులోనె.

భర్త మాటలు వింటు తప్పు చేసిన దానిలా తలొంచుకుంది అతని భార్య.

ఫిజిషియన్‌తో కొన్ని నిముషాలు మాట్లాడి తిరిగి తన కాబిన్ కొచ్చేసాడు.

శైలి కూడా ఆయన వెనకే వొచ్చి కూర్చుంది.

"మీరు చెప్పింది నిజమే! ఆయన ఎంత తెలివైన వాడో, అంత సున్నిత మనస్కుడు." శైలితో చెప్పాడు.

"అందుకే, ఈ విషయాన్ని మీతో పర్సనల్ గా చెబుదామనిపించింది.."

ఆయన గట్టిగా నిట్టుర్చి చెప్పాడు. "థాంక్స్ శైలి! మీరు నా పేషేంట్ కోసం చేస్తున్న సాయానికి మీకు నేను చాలా థాంక్స్ చెప్పాలి."

"మీరు కాదు. నేనే మీకు చెప్పాలి. నే విన్నదీ, నాకు తెలిసినదీ మీతో చెప్పే అవకాశాన్ని ఇచ్చి, విన్నందుకు. మేధావి బాధని ఏ మాత్రం తగ్గించగలిగినా..చాలనే ప్రయత్నం తప్ప మరొకటి కాదు.."

ఆయన కూడా అవునన్నట్టు తలూపి "నేనూ అదే ఆలోచిస్తున్నా ఏం చేయాలా అని"

"సరే డాక్టర్. మరి నే వుంటా.." అంటూ సెలవు తీసుకుని బయట కొచ్చేసింది. ఆమెకిప్పుడు మనసులో భారం తొలగినట్టుంది. ఒక మంచిపని చేసిన తృప్తి కలిగింది.

ఆమె వెళ్ళిన వెంటనే లూ భార్యకి ఫోన్ చేసి చెప్పాడు. ఒకసారొచ్చి కలవమని.

తనిన్నాళ్ళు పేషెంట్ పడుతున్న బాధలకు మాత్రమే ట్రీట్‌మెంట్ ఇస్తూ వచ్చాడు.

బాధకు కారణమైన వారికి ట్రీట్‌మెంట్ ఇవ్వడం బహుశా ఆయన కెరీర్‌లో ఇదే మొదటిసారేమో ..

లోపల కొస్తూనే ఆమె ఆందోళనగా అడిగింది "డాక్టర్ ! ఆయనకేం ప్రమాదం లేదుగా.." అని.

ఆమె వైపు ప్రశాంతంగా చూస్తూ "కూర్చోండి. మీతో మాట్లాడాలి" అన్నాడు డాక్టర్.

డాక్టర్ వైపు అయోమయంగా చూస్తూ కుర్చీలో కూలబడి పోయింది మిసెస్ లూ.

*******

ఇంటికొచ్చి, రిలాక్స్ అవుదామనుకున్న శైలికి..

ఇంటి ముందు కుర్చీలో వెనక్కి చేతులు విరుచుకుని కూర్చున్న నిషా కనిపించడంతో పై ప్రాణం పైనే ఎగిరిపోయినట్టయింది.

"ను..వ్వా? ఇక్కడికెందుకొచ్చావ్.." అంటూ భయంగా చూసింది భవనం వైపు.

నిషాకి భలే మజా వేసింది. ఆమె అలా వొణకడాన్ని చూసి.

కుర్చీ కెదురుగా వున్న స్టూలు మీద జాపుకున్న రెండు కాళ్ళు ఆడిస్తూ మగరాయుడిలా నవ్వింది.

"వాళ్ళెవ్వరూ ఇంట్లో లేర్లే. శివా కూడా ఇప్పుడే వస్తా నంటూ బయటకెళ్ళాడు. మరి తేల్చుకో. వాళ్ళు వచ్చే లోపు నన్ను పంపిస్తావో, లేక అందరి ముందూ నీ

గుట్టు విప్పు మంటావో!..అంతా నీ ఇష్టానికే వొదిలేస్తున్నా. నీకు తెలుసు కదా నేనెంత మంచి దాన్నో!" అంటూ సిగరెట్ పొగ మె ముఖం మీద కూది, విలనీలా నవ్వింది.

శైలి గుండె గుభేల్ మంది.

ముందీమెని ఇక్కణ్నుంచి తీసుకెళ్ళాలి, ఎవ్వరి కంటా పడకుండా..అందుకు తొందర పడుతోంది. "నిషా! . మనం బయటకెళ్ళి మాట్లాడు కుందాం పద " అంది కంగారుగా.

"నేను రాను. నువ్ వెళ్తానంటే వెళ్ళు. కావాలంటే నువ్వొచ్చే దాకా ఇక్కడే వుంటా. ఏమంటావ్?"

ఆమె కదిలేలా లేదు. ఆమెని పంపాలంటే, డబ్బు..డబ్బు ఇవ్వాలి. ఆమెకి వందలు చిల్లర పైసలు. వేలు..కనీసం పాతిక వేల నుంచి ఆమె లెక్క మొదలౌతుంది. ఇప్పుడెక్కన్నుంచి తేవాలి అంత డబ్బు తను!

శైలి నిస్సహాయంగా చూస్తూ.. "నిషా! నేనిక నీకు డబ్బివ్వలేను. నన్నొదిలేయ్..ప్లీజ్ నన్నొదిలేయి..ఇంకెప్పుడూ..నా జోలికి రావొద్దు.." ఆమె చేతులు జోడించబోతూ..

దుఃఖం పొంగుకు రావడంతో..చేతుల్ని ముఖం మీద కప్పేసుకుంది.

"నేనొచ్చింది నీ ఏడుపు చూసి పోదామని కాదు. నా కావల్సింది నాకిచ్చేయి. లేకుంటే.."

ఆమె మాటలు పూర్తి కాకుండానే " లేకుంటే, ఏం చేస్తావ్?" అంటూ కంచులా ఖంగుమంది ప్రకాష్ కంఠం.

ఇద్దరూ ఒక్క సారిగా వెనక్కి తిరిగి చూసారు ఉలిక్కి పడుతూ.

నిప్పులు చెరిగే కళ్ళతో నిషా వైపు అడుగులేసాడు ప్రకాష్ "కాలితో స్టూల్ నొక్క తన్ను తన్నాడు. అది గాల్లో కెగిరి పల్టీలు కొట్టి కింద పడింది..

ఖంగు తిన్న నిషాని చూస్తూ అన్నాడు. "ఆడదానివని చూస్తున్నా..లేక పోతేనా! మెడపట్టి గెంటేవాణ్ణి. తెల్సిందా.."

"ప్రకాష్. తొందర పడుతున్నావ్ నీ మేలు కోరి వచ్చాను. . ఈమె ఒక ఛీట్ ..అది.."

"షటప్ అండ్ గెట్ అ..వ్..ట్.." ఆమెని గేట్ దాక ఈడ్చుకెళ్ళి వీధిలో విసిరేస్తాడెమో నన్నంత కోపంతో వూగిపోతున్నాడు.

కింద పడ్డ హేండ్ బాగ్ అందుకుని, అక్కడ్నుంచి కదలుతూ . "చూస్తాను.మీ అందరి అంతూ చూస్తాను. ఒక్కళ్ళనీ వొదల్ను." కసిగా అంది.

"గెట్ ద హెల్ ఔటాఫ్ హియర్. డోంట్ యు ఎవెర్ డేర్ కం విథిన్ టెన్ మైల్స్ రేడియస్ క్లోజ్ టు శైలి. యు డోంట్ వాంట్ టు సీ ద అదర్ సైడ్ ఆఫ్ మి. అండర్ స్టాండ్? నువ్వింకోసారి శైలి జోలికొచ్చినా..ఈ ప్రాంతాల్లో కంపించినా..ఖబడ్దార్! పోలీసులకి పట్టించి జైల్లో పెట్టిస్తా జాగ్రత్త!"

పోలీసులు, జైల్ మాటలకి వెనక్కి జంకి, అక్కడ్నుంచి కదిలింది.

ఇదంతా చూస్తూ రాయిలా నిలబడి పోయింది శైలి.

నిషా అక్కడ్నుంచి వెళ్ళిపోయినా, ఆమె ఇంకా వొణుకుతూనే వుందంటే కారణం ప్రకాష్! అతన్నింత ఆవేశంలో ఎప్పుడూ చూళ్ళేదామె.

అసలితను ఈవేళప్పుడు ఇంటికెలా వొచ్చాడు? ఇక్కడ నిషా వుందని అతనికి తెలిసే అవకాశమేదీ?

ఆమె అటు చూసింది. శివా కనిపించాడు. గేట్ మూసి, వస్తూ..ఆమె వైపు చూసి తలూపాడు. ప్రకాష్ కి వార్త అందించిందెవరో మెకర్థమైంది.

గతిగా నిట్టూర్చి, ఇటు తిరిగే సరికి, ప్రకాష్ ఆమెకి అతి సమీపంగా నిలబడి వునాడు. అంత దగ్గరగా అతన్ని చూసి ఆమె వులిక్కిపడింది.

నిజం చెప్పల్సిన పరిస్థితి నుంచి ఇక తను తప్పించుకోలేదేమో!..

తన వైపు భయంగా చూస్తుంటే అన్నాడు.."భయపడకు. ఆమె నీకెలా తెలుసు? ఎందుకొచ్చింది? దేని కోసం నిన్ను భయపెడుతోంది?..మీ ఇద్దరి మధ్య జరుగుతున్న విషయమేమిటి? అని నిన్ను అడగను. నువ్వు నాకు జవాబు చెప్పా ల్సిన పనీ లేదు. కానీ, ఒకటి మాత్రం గుర్తు పెట్టుకో. నిప్పుని అరచేతిలో దాచకూడదు. అది మనిషినే కాదు, జీవితాన్నీ దహిస్తుంది." అన్నాడు సీరియస్‌గా. "ఆమె ఎలాంటిదో నాకు తెలుసు. డ్రగ్ ఎడిక్ట్. ఒక ముఠాతో కలిసి వున్నట్టు ఈమె మీద పోలీస్ కేసులు కూడా వున్నాయి. ఈమెతో నీకేమైనా పూర్వ పరిచయాలుంటే వెంటనే తెంచేసుకోడం మేలు." ఒక హెచ్చరికగా, హితబోధగా చెప్పాడు.

నిషా గురించి కొత్త సంగతులు వింటుంటే ఆమె కనుబొమలు భయంగా ముడుచుకున్నాయి.

నిషా వెనక ఇంత చరిత్ర వుందని ఆమెకి తెలీదు. తెలిసాక అనిపిస్తోంది. తనెంత ప్రమాదం నుంచి బయట పడిందా అని. పోలీసులు, జైల్ అంటే అందుకేనా ఆమె జంకింది! ఓ గాడ్! అలాంటి స్త్రీ తన కోసం వచ్చిందని తెలిసాక...తన ముఖం ఎలా చూపిస్తుంది అతనికి..ఈ పాటికే తన మీద ఎలాంటి అభిప్రాయం కలిగి వుంటుంది! లోలోనే చితికి పోతోంది.

తలొంచుకుని నిలబడిన ఆమె వైపు జాలిగా చూసాడు ఆ క్షణంలో ఆమెనలా దీనంగా చూడ్డం ఇష్టంలేని వాడిలా...ఆమె దిగులు పోగెట్టే ప్రయత్నంగా అన్నాడు.

"అయినా శైలీ! నాకు తెలీకడుగుతాను..నువ్వు నిషాకి భయపడ్డ మేమిటీ, నిన్ను చూసికదా ఆమె భయపడాలి ?" అన్నాడు అల్లరిగా..

హఠాత్తుగా అతనలా సంభాషణ మార్చే సరికి ..చటుక్కున తలెత్తి చూసింది.

అతను నవ్వుతూ కంపించాడు.

కొంత సేపటి క్రితం ప్రకాష్‌కీ, ఇప్పటి ఇతనికీ స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఎప్పట్లా ప్రశాంతంగా వున్నాడు. ఎప్పట్లానే కళ్ళు నవ్వుతున్నాయి అల్లరిగా.

ఎర్రబడ్డ చెంపలు అతని కళ్ళ పడకుండా తలొంచుకుని చెప్పింది. "సారీ, ప్రకాష్!" అని.

"ఇట్స్ ఓకె..ఇట్స్ఓకే.. ఏం ఫర్వాలేదు. ఇక నీ జోలికి రాదులే " అంటు ధైర్యం చెప్పి వెళ్ళి పోతున్న అతని వైపు చూస్తూ అనుకుంది. " ఇంకెప్పుడు ఇలాంటి తప్పు చేయను ప్రకాష్! చేయను. నీకు తెలీదు ఇక నాకెలాంటి తప్పులు చేసే అవకాశం లేదు అంటే..నీ వల్లే. అదంతా నీ చలవే..ఎలా చెప్పను నీకు నా కృతజ్ఞతని! థాంక్యూ ప్రకాష్..థాంక్ యూ.." ఆమె కళ్ళు కృతజ్ఞతా భావాలతో నిండి పోయాయి.

********

శైలికి తను ఆ మాత్రం సాయమైనా చేసినందుకు శివా పొంగి పోతున్నాడు.

కారణం శైలి తనకు చేసిన గొప్ప సాయం. నిజానికి ఆమె తనకు చేసింది సహాయం అంటే చాలా చిన్నమాటే అవుతుంది.

శైలి కదలికలు తనకెప్పటికప్పుడు చెప్పమంటూ శివకి లంచ మిచ్చేది నిషా.

ఒక రోజున లంచంతో బాటు చిన్న పొట్లం కూడా ఇచ్చింది. అందులో పంచదార లాంటి పొడి వుంది. నోట్లో వేసుకుంటే స్వర్గం కనిపిస్తుంది..అప్పుడు శైలి దగ్గరకెళ్ళి బెదిరిస్తే మరింత డబ్బు దక్కుతుందని కూడా చెప్పింది.

ఆమె చెప్పినట్టే చేసాడు.

ఆ రోజు అర్థ రాత్రి దాటాక ఆమె గదిలోకి ప్రవే శిం చాడు.

మందు ప్రభావమో, మరేమో కాని..ఆమె మీద దాడి చేసాడు. ఆమె ప్రతిఘటిస్తూ విసిరిన ఫ్లవర్ వేజ్ వెళ్ళి గాజు కిటికీకి తగిలి ఫెళ్ళుమంది. చీకటి నిశ్శబ్దంలో అది రెట్టింపుగా ప్రతిధ్వనించడంతో..ఇంటి నిండా లైట్లు వెలిగాయి.

ప్రకాష్ ఏకంగా గన్ తీసుకుని ఔట్ హౌస్ కొచ్చేసాడు బద్దలయ్యేలా తలుపులు బాదుతున్నాడు .

"శైలీ, ఆర్యూ ఓకే..?" అంటూ. .

శివాకి మత్తంతా వదిలిపోయింది..ప్రకాష్ గొంతులో కమాండ్‌కి.

అతను శైలి వైపు చూసాడు దీనంగా. వెంఠనే.. "నువ్ తప్ప నాకిక వేరే గతి లేదు" అన్నంతగా ఆమె పాదాల మీద పడి శరణాగతిని కోరాడు.

ఆమె మనసు కరిగిందో ఏమో..అతన్ని లాక్కెళ్ళి కిచెన్ సింక్ కింద అరలోకి తోసి తలుపులు మూసింది.

లోపలకొచ్చిన దేవకి ప్రకాష్‌లు ఆమె క్షేమంగా వుండటంతో హమ్మయ్యా అనుకున్నారు. ఆమె ఏదో కథ అల్లి చెప్పింది.

ఆ రాత్రి ఆమెని ఇంట్లోకి తీసికెళ్ళిపోయారు. ఎందుకైనా మంచిదని.

శైలి మాత్రం వెళ్తూవెళ్తూ..తలుపుకి తాళం వేయకుండా దగ్గరకేసి వెళ్ళిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తూ..

తనామెకి చేసిన ద్రోహానికి ఆమె తనకు చేసిన మేలు అది. తనెంత తప్పు చేయబోయాడు. క్షమించి తనకింత బతుకునిచ్చింది.

ఆ కోపంలో ఆమే కనక తన యజమానికి చెప్పి వుంటే..నిలువునా కాల్చి పారేసే వాడు కాదూ? తన తండ్రి ఎప్పుడూ చెబుతూంటాడు. "సార్ మన పాలిట దేవుడ్రా..నువ్వే మాత్రం నిజాయితీ తప్పినా..ఆయన ముఖం సూడలేక వురి పోసుకుంటా" అని కళ్ళెంట నీళ్ళు పెట్టుకునే నాయనకి తనేం జవాబు చెప్పేవాడనీ..

ఇవాళ తనింకా యజమానికి కుడిభుజంలా చెక్కు చెదరని నమ్మిన బంటులా వున్నాడూ అంటే.. అదంతా దేవుని దయ కాదు. మున్మాటికీ కాదు.

ఈ దేవత చలవ. ఈ చల్లని తల్లి ఋణం తీర్చుకో గలనా అనుకున్నాడు.

నిషా ఫోన్‌లో బెదిరించడం తను చాలా సార్లు విన్నాడు. ఇవాళ ఏకంగా ఇంటికే రావడంతో..ఇక దీని భరతం పట్టి, శైలికి మేలు చేయాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ప్రకాష్ కెళ్ళి విషయమంతా చెప్పి, హుటాహుటీన తీసుకొచ్చాడు.

సార్ సంగతి వాడికి బాగ తెలుసు. రౌడీలకు రౌడీ, పెద్దలకు పెద్ద మనిషీ అని.

దాని బారినుంచి శైలిని బయట పడేసే ఉపాయం తన తట్టినందుకు శివ తనని తనే శభాష్ అనుకుని మెచ్చుకున్నాడు.

శైలి మాత్రం..`ఎంత ఎదిగి పోయావురా శివా..!` అనుకుంది కృతజ్ఞతగా అతని వైపు చూస్తూ!

ఇక నిషా తన జోలికి రాదు. వస్తే తనకు అండగా ప్రకాష్ వున్నాడు. అనుకుంటే ప్రాణం ఎంతో హాయిగా వుంది.

నిషా సమస్య ఇంత తేలిగ్గా పరిష్కారమౌతుందని ఆమె కలలో కూడా అనుకోలేదు.

అనుకోనివి కొన్ని - ఆనందాన్ని తెచ్చిపెడతాయి.

కాని మరి కొన్ని - విషాదాన్ని మిగిల్చి పోతాయి. ఆమె జీవితంలో సరిగ్గా అదే జరగబోతోంది. కాకుంటే ఆమె దాన్ని కలలో కూడా ఊహించి వుండదు. అదేమిటంటే -

మరి కొంత సేపట్లో తన గురించిన ఒక నిజం ప్రకాష్‌కి తెలియబోతోంది!

అది ఆమె ఉనికికే ప్రమాదమన్న విషయం ఆమెకీ తెలీదు.

ఐతే, ఈసారి కలగబోతున్న ప్రమాదం నిషా నుంచి కాదు..డాక్టర్..డాక్టర్ కపాడియా నుంచి!

******

**అప్పటికి వారం పైగా శైలి జ్వరంతో బాధ పడుతోంది.** తన కలవాటే. నెలకొకసారో, రెండు సార్లో తప్పదు..ఇలా సిక్ అవ్వడం!

కాని, ఈసారి, మందులకు లొంగక మొరాయిస్తోంది..

కళ్ళు మూసుకుని నీరసంగా పడుకున్న శైలికి నిద్రా భంగం కలిగిస్తూ.. ఇంట్లో, బయటా.. సందడి వినిపిస్తోంది.

బయట వాహనాలు ఆగి వెళ్తున్నాయి. అవేమిటో, వాటిల్లోంచి ఏం దిగుతున్నాయో తెలీడం లేదు. పని వాళ్ళ కేకలు అరుపులు.. వినిపిస్తున్నాయి.

"జాగ్రత్త, జాగ్రత్తగా దింపండి. ! లైట్లు, ఇక్కడికి రావాలి. వాటర్ ఫౌంటైన్ గార్డెన్ మధ్యలో అరేంజ్ చేయాలి. సరేనా.." అంటున్నాడు శివా.

" టెంట్ ఏమిటీ?, అలా మాసిపోయి వుంది? అదొద్దు. వేరేది తీసుకు రండి.." వాళ్ళను కోప్పడుతోంది దేవకి

."కుర్చీలన్నీ తోటలోకే! ..ఇక్కడేం అవసరం లేదు.." డైరెక్షన్స్ ఇస్తున్నారు వచ్చిన వాళ్ళకి వీళ్ళిద్దరూ.

ఇంతలో సెల్ మోగింది. దేవకి మాటలు విపిస్తున్నాయి. ఆమె మాట ల్ని బట్టి సంభాషణ కేటరింగ్ వాళ్ళతో అని అర్థమౌతోంది.

మొత్తం మీద వాతావరణమంతా పెళ్ళిపన్ల హడావిడిగా వుంది.

సంగతేమిటో కనుక్కోవాలని మనసు ఉవ్విళ్ళూరుతోంది. కాని, శరీరం సహకరించడం లేదు.

సరిగ్గా అప్పుడే శివా వొచ్చాడక్కడకి. సూప్ కప్ తెచ్చి, టీ పాయ్ మీద పెడుతూ అన్నాడు.

"మేడం మీకిచ్చి రమన్నారండి. సహించినా, సహించక పోయినా సరే, తాగాలిసిందే అని చెప్పమన్నారండి. తాగితే కొంచెం ఓపికొచ్చి, రేపు ఫంక్షన్ లో తిరగ గలుగుతారని కూడా చెప్పమన్నారాండి.." పాఠం అప్పచెప్పినట్టు చెప్పాడు.

"ఫంక్షనా!... ఫంక్షనేమిటీ..ఎవరిది?" కుతూహలంగా అడిగింది.

"భలేవారండి..మీకేం తెలీనట్టడుగుతారు! మన చిన్నా పుట్టిన రోజు ఫంక్షన్ .. బాగా జరగాలి, వొళ్ళు దగ్గర పెట్టుకుని పని చేయాలని చెప్పారు సార్ !...ఇప్పుడెళ్ళి..డెకరేషన్ సామాను తేవాలండి..ఇంకా నేమో.." వాడింకా ఏదో చెప్పే లోపే... కార్ హారన్ విని.."అయ్య బాబోయి..సారొచ్చేసారు..నే వెళ్తున్నా.." అంటూ పరుగు పెట్టాడు.

శైలి మెల్లగా జరిగి, వెనక దిళ్ళ మీద ఆనుకుని కూర్చుంటూ సూప్ అందుకుని, .మెల్లగా సిప్ చేస్తోంది.

విపరీతమైన గొంతు నొప్పితో బాధ పడుతోందేమో..వేడి వేడి సూప్ గొంతు దిగుతూంటే.. హాయిగా వుంది.

చిన్నాకి పుట్టిన రోజు చేస్తున్నారా..!? ఆమె కళ్ళల్లోకి తడొచ్చి చేరింది.

రెండు రోజులు కిందట తనకీ దేవకీకి మధ్యన జరిగిన సంఘటన కళ్ళ ముందు కదిలింది.

**********

"శైలీ! " వాత్సల్యమైన స్పర్శకి కళ్ళు విప్పి చూసింది. ఎదురుగా అక్క! తన నుదుటి మీద చేయి వేసి చూస్తూ..

"వారం నుంచి జ్వరం గా వుంటే నాకు మాట మాత్ర మైనా చెప్పవా???" ప్రేమతో మందలించింది.

ఈ మధ్య అమె కిటు వైపు తొంగి చూసె టైమే వుండటం లేదు. పెళ్ళిళ్ళు , పేరంటాలు అంటూ అన్ని శుభ కార్యాలకు పరుగులు తీస్తోంది. అన్ని చోట్లకి చిన్నాని కూడా తన వెంట తీసుకెళ్తోంది. .

మూడేళ్ళుగా ఆమె ఎవరు ఎంతగా పిలిచినా ఫంక్షన్స్ కి వెళ్ళడం మానేసింది. అలాంటిది ఇప్పుడు పిలవడం ఆలస్యం వెళ్ళేందుకు సిద్ధం అంటోంది. కారణం. చిన్నా!

వాడినెత్తుకుని, భర్త పక్కన నడుస్తూంటే.. ఆమెకిప్పుడెంత గర్వంగా వుంటోందో! మునపటి కంటే కూడా ఇప్పుడు అలంకరణలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడం అతని కెంతో ఆనందాన్నిస్తోంది.

ఈ సంగతులన్నీ ప్రకాషే చెప్పాడు శైలికి -

ఆ బిజీలో వున్న దేవకికి ఈ జ్వరం విషం తెలీలేదు.

"పద పద డాక్టర్ దగ్గరకెళ్దాం" తొందర చేసింది.

డాక్టర్ మాట వినగానే..వొంటి మీద బల్లి పడ్డట్టు..ఉలిక్కిపడింది.

"వొద్దక్కా.. డాక్టర్ అవసరం లేదు. నేను ఆల్రెడీ హాస్పటల్ కెళ్ళి చూపించుకున్నా. ఏం లేదు, మామూలు జ్వరం, తగ్గి పోతుందన్నారు."

'ఏది, నన్ను చూడని..' అంటూ నుదుటి మీద చెయి వేయబోయింది. ముఖం పక్కకి తిప్పుకుంటూ "వైరల్ ఫీవర్ ! మీకెవరికైనా అంటితే కష్టం" అంటూ ఏదో చెప్పి తప్పించుకోబోయింది.

"పోని, తల పట్టనా, కాస్త మందు రాసి?"

వొద్దంటూ తలూపింది.

"అదీ వొద్దా?.. వెయ్యి లంఖణాలు చేసిన దానిలా.. ఎలా ఐపోయావో తెలుసా! అద్దంలో చూసుకున్నావా? నీ వాలకాన్ని..అయ్యో పిచ్చి పిల్లా..? ఉండు. ముందా చింపిరి తలకి నూనె రాసి, జడ వేస్తే .అప్పుడు కాని సగం జబ్బు త గ్గదు.." అంటు నూనె సీసా కోసం చూస్తోంది..

శైలి మాత్రం దేవకి వైపే దీర్ఘంగా చూస్తోంది. ఆమె లోని అమ్మను చూస్తోంది. అమ్మ మనసుని చూస్తోంది.

నేనేమౌతానని..ఈమెకి తనంటే ఇంత ప్రేమ! ఈమెకేమిచ్చి తన ఋణం తీర్చుకో గలదనీ! అక్కా! మళ్ళీ జన్మంటూ వుంటే...

వెక్కెక్కి పడుతున్న శైలిని వోదారుస్తూ...

"వూరుకో! ఏమిటిది..చిన్న పిల్లలా.?" అంటూ ఆమె ముఖాన్ని తన వైపుకు తిప్పుకుంది.

"ఇటు చూడు. నీకేం కాదు. తగ్గిపోతుంది. రెండు రోజుల్లో లేచి తిరుగుతావ్ సరేనా? " అంటూ కళ్ళు తుడిచింది. అదే! సరిగ్గా ఆప్యాయతే మె గుండెల్ని తోడేస్తోంది.

ఆగమన్నా ఆగనంటూ ఒకటే దుఖం పొంగుకొస్తూ..

జ్వర తీవ్రత లోనో, లేదా పూర్తిగా తగ్గిన నీరసంలోనో.. మనిషిని ఒక రకమైన విషాదం ఆవహిస్తుంది. ఆ సమయంలో ఆ-ప్యాయత చూపే వారి పట్ల మనసు ఇట్టే కదిలి, కన్నీరవుతానంటుంది.

"ఎందుకురా..ఎందుకా దుఖం చెప్పు" లాలనగా అడిగింది.

తను చెప్పింది.

"అక్కా..యెల్లుండి చిన్నా పుట్టిన రోజు.." ఆమె గొంతు వొణికింది.

"అమ్మా నాన్నల ప్రేమకి వాడెలాగూ నోచు కోలేదు. ఏ ముద్దూ ముచ్చటా తీరనే లేదు. పోని నేను చూద్దామంటే ఇలా మంచానికి అంటిపెట్టుకుని..

చివరికి వాడు దిక్కు లేని కూనలా..." పైన మాటలు పెగలక దుఖంతో పూడుకు పోయింది స్వరం.

"ఏమిటా మాటలూ, నువ్వూనూ? !" ప్రేమగా కోప్పడింది. "వాడి గురించి ఇంకెప్పుడు ఇలాంటి మాటలు నా ముందు నువ్ మాట్లద్దు. నేను బ్రతికుండగా వాడు దిక్కులేని వా డెలా అవుతాడనుకుంటున్నావ్ ? "

చిన్నా మీద ఈగ వాలినా ఆమె కళ్ళు కన్నీళ్ళవడం గమనించి, ఉద్వేగంగా కదిలి

"అక్కా!" నా కొక మాటిస్తావా..? వాడిని ఎప్పుడూ వొదలనని మాటిస్తావా.. వాడికి నువ్వు కన్న తల్లి నౌతానని మాటిస్తావా అక్కా ప్లీజ్ .." అంటూ చేయి జాచింది.

ఆలడిగిన తీరుకి దేవకి హృదయం కదిలి పోయింది. చటుక్కున మె చేతిలో చేయ్యేసి చెప్పింది.

" శైలీ! .నువ్ అడిగావ్ కాబట్టి నిజం చెబుతున్నా వాడెప్పటికీ నా బిడ్డే చిన్నా అంటే ఎవరో తెలుసా..నా ప్రాణం. వాడు నా ప్రాణం. నా జీవం." దేవకి కదిలిపోతూ చెప్పింది.

ఊపిరి బిగపెట్టి, ఆమె చెప్పే ప్రతి మాటనీ వొళ్ళంతా చెవులు చేసుకుని విన్నాక, గుండె మీంచి కొండంత బరువు దిగినట్టు..దీర్ఘంగా నిశ్వసించింది.

మరు క్షణంలో కంటి కొసల నుంచి జల జలా మంటూ కన్నీటి ధారలు మౌన ప్రవాహాలై పోతున్నాయి.

అది చూసి దేవకి అనుకుంది..' ఛా! ఇదేమిటీ తనిలా? ఆమెని ఓదార్చాల్సింది పోయి, మనసు కష్ట పెట్టె మాటలేవో మాట్లాడి ..మరింత బాధ పెట్టింది?!" అనుకుంటూ స్పృహ లోకొచ్చింది.

గబుక్కున ఆమె చేతిలోంచి తన చేతిని విడదీసుకుంటూ అంది

"ఐనా, వింత కాకుంటే, కొత్తగా ఈ వాగ్దానాలూ, అప్పగింతలూ ఏమిటి? ఊ? చిన్నాని నాకప్పగించేసి నువ్వేటయినా వెళ్ళి పోదామనుకుంటున్నావా?" నవ్వులాటగా అంది.

"అవునక్కా...వెళ్ళి పో..వాలి. " అంది సీరియస్‌గా.

"ఎక్కడికి?"

"అమెరికా! అమెరికాకి. వెళ్ళాలి..ఈ సారి వారాలు కాదు. నెలలు పట్టొచ్చు.."

"వెళ్ళు. తల్లీ. హాయిగా వెళ్ళు. ఇష్టముంటే వెనక్కి రా. లేదంటే లేదు. కాని, చిన్నా మాత్రం రాడు. ఏమంటావ్ ?" అంది నవ్వించాలని.

కాని శైలి మాత్రం నవ్వ లేదు. 'నా కావాల్సింది అదే అక్కా' అనుకుంది మనసులో.

తర్వాత, మాటా ఈ మాటా మాట్లాడి, మరింత ధైర్యం చెప్పి వెళ్ళిపోయింది దేవకి.

రెండురోజుల్నుంచి.. తన తిండీ తిప్పలూ అన్నీ తనే చూసుకుంటోంది. పేషెంట్ కి ఎలాటి ఆహారం ఇవ్వాలో ఆమెకి బాగా తెలుసు. తాజా వంటలు వేడివేడిగా చేసి పంపుతోంది. గంటగంటకీ వొచ్చి చూసెళుతోంది. మధ్య మధ్యలో పాలు, పళ్ళరసాలు ..తనకేం తాగాలనిపిస్తే అవి అమర్చి పెడుతోంది.

ఆమె అనారోగ్యం నుంచి కొద్ది కొద్దిగా కోలుకుంటోంది.

రేపు ఓపిక తెచ్చుకుని, చిన్నాని కనీసం గుడికయినా తీసుకెళ్దామని అనుకుంది. కాని, వీళ్ళు వేడుక చేస్తారని తనూహించ లేదు.

చిన్నా భవిష్యత్తు గురించి ఆమె కన్న కల నిజం అవుతున్నందుకు చెప్ప లేనంత ఆనందంగా వుంది.!!

***************

ఆ రాత్రి - ఇంట్లో వెన్నెల ప్రవహిస్తున్నట్టుంది.

బిల్డింగ్ అంతా విద్యుత్ దీపాలంకరణలతో కళ కళ లాడిపోతోంది.

ఇంటిగేట్ నుంచి లోపల గార్డెన్ వరకు ప్రత్యేకంగా అమర్చిన తెల్లటి లైట్ల కాంతి కళ్ళని మిరిమిట్లు గొలుపుతోంది

ఇల్లూ వాకిలి అంతటా ఫంక్షన్ హడావిడే అలుముకుంది. వేడుక సంబరం వేగంగా ఊపందుకుంటోంది. .

పిల్లలు గుంపులు గుంపులుగా వచ్చి జేరి, ఉ త్సాహంగా డాన్సులు చేస్తున్నారు. పాటలు మారు మోగి పోతున్నాయి. .

ప్రకాష్ చెరగని చిరు నవ్వుతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు.

చిన్నా మధ్య మధ్యలో చిన్నా - అతని చెవిలో రహస్యాలు పోవడం..వెంఠనే వాణ్ణి ఎత్తుకుని ఇతనేదో చెప్పడం..వాడు సరేనంటూ తలూపి దిగి పోయి, పిల్లలతో కేరింతలూ..!

మల్లెపూలు చుట్టిన జడ ముడితో..హండ్లూం పట్టు చీరలో దేవకి తల్లి స్థానంలో మరింత హుందాగా వుంది. ఊపి రాడని సందడిలో ఆనందంగా మునిగి తేలుతోంది.

మిస్టర్ - లూ అలవాటులో పొరబాటు గా..తన భార్యనుకుని, వేరే ఆవిడ పక్కకెళ్ళి కూర్చున్నాడు.

ఆయన భార్య ఇంతకు ముందులా కాకుండా ..మురిపెంగా నవ్వుకుంటూ వెళ్ళి, భర్తను తెచ్చితన పక్కన కుర్చో బెట్టుకుంది. ఆయన భార్య వైపు ఆరాధనగా చూస్తున్నాడు. ఆమె అందంగా సిగ్గు పడుతోంది.

ఆయనకి మతి మరుపు తగ్గొచ్చు తగ్గకపోవచ్చు. ఆమె లో భర్తని సాధించే తత్వం మాత్రం పూర్తిగా తగ్గింది. జబ్బొకరికి, మందొకరికె అన్నట్టుంది.

శైలి నవ్వు కుంది లోలోనే.

ఇంతలో ప్రకాష్ , గిటార్ తీగెల్ని సరి చేసుకుంటున్నాడు.

మిమిక్రీ అర్టిస్ట్ తన ప్రదర్శన పూర్తి చేసాడు. మెజీషియన్ వస్తున్నాడు. పిల్లలు హుషారుగా విజిల్స్ ఊదుతున్నారు. మరో కార్నర్‌లో కేరికేచర్ అర్టిస్ట్ కూర్చున్నాడు. అతని ముందు బారులు తీసి మా బొమ్మ వేయ మంటే మా బొమ్మ ముందేయ మంటున్నారు. వాళ్ళల్లో పెద్ద వాళ్ళు కూడా వున్నారు. తన బొమ్మ సరిగా గీయలేదంటూ రవణమ్మ అతనితో వాదనకి దిగింది.

ఆవిడ కొడుకేమో..చూసీ చూడ కుండా అప్పటికే నాలుగు పెగ్గులు కానిచ్చేసి, స్నాక్స్ పని పడుతున్నాడు.

ఎఫ్ ఎం జాకీ యాంకరింగ్ చేస్తూ..ప్రోగ్రాం చేస్తున్నాడు.

పిల్లలు తమ చేతుల మీద టాటూలను సంబరంగా చూసుకుంటున్నారు.

చిన్నా ఐతే ఒక అద్భుతమైన ఆనంద లోకంలో తేలిపోతూ..తనెప్పుడూ చూడనంత సంతోషంలో మైమరచి వున్నాడు.

ఎవరో గుసగుసలు పోతున్నారు..

"పెంచు కున్నారా?".."కాదు..అతనికి కన్న కొడుకేట.." "అదెలా?..రెండో ఆమెకి పుట్టాడా.." "కాదనుకుంటా..సరోగట్ వుమన్ అని.."

మొత్తానికి చిన్నాని వారి బిడ్డ గా చెప్పుకుంటున్నారు..చాలు ఆమె కిప్పుడు ఎంతో తృప్తిగా వుంది.

ఇంతలో..కేక్ కట్టింగ్ సీన్ వచ్చేసింది.

అప్పటి దాకా అక్కడే ఓ మూలగా కూర్చుని ఈ వేడుకంతా చూస్తున్న శైలి.. టైంకి అక్కడ్నుంచి లేచి, గబ గబా అడుగులేసుకుంటూ వచ్చేస్తోంది.

సరిగ్గా అప్పుడు..అప్పుడు ఎదురయ్యాడు. డాక్టర్ ఆనంద్ . హఠాత్తుగా ఆమె నోట మాట రాని దానిలా నిర్ఘాంతపోయి చూస్తోంది. ఆయన్ని చూసి కాదు. యన పక్కనే నిలబడి తనని చూసి గుర్తు పట్టిన డాక్టర్ ..డాక్టర్ కపాడియాని చూసి.

ఆయన నోరు తెరిచి ఏదో అడిగే లోపే..ఆమె వేగంగా లోపలి కొచ్చి పడింది. అదిరి పడుతున్న గుండెల్ని అరచేత్తో అదిమి పట్టుకుంటూ!

***********

పార్టీ ఎప్పుడై పోయిందో తెలీదు. అర్థరాత్రి దాటి పోయింది. ఒక చిక్కటి నిశ్శబ్దంలోంచి ఆమెని మరింత భయ పెడుతూ అడుగుల శబ్దం వినిపిస్తోంది. చెవులు రిక్కించి వింటోంది.

అవి ప్రకాష్ అడుగులు. ఔట్ హౌస్ దిశగా వస్తూ వినిపిస్తున్నాయి. అతను తలుపు తెరుచుకుని లోపలకొచ్చేశాడు. తన కెదురుగా నిలబడ్డాడు. మండుతున్న మంటలా ఎర్రగా కనిపిస్తున్నాడు. సెగ కొడుతున్నాడు. పట్టలేని ఆగ్రహం వల్ల అతని ముఖ కండరాలన్నీ బిగుసుకుని వున్నాయి.

ఆమె మనసు కీడు శంకిస్తోంది. భయంగా లేచి నుంచుంది. బిక్కు బిక్కు మంటూ చూసిందతని వైపు. అతను తుఫాను ముందటి గంభీర మైన గొంతుతో అడిగాడు "నే విన్నది నిజమేనా.?"అని.

అయిపోయింది. డాక్టర్ కపాడియా చెప్పేసాడు. అంతా చెప్పేసాడు. ఆమె నిలువునా వొణికిపోతోంది.

"చెప్పు. నీకు ఆయన తెలుసు. అవునా?" అతని కంఠం ఖంగుమంది.

అవునన్నట్టు తలూపింది.

"ఆయన చెప్పింది కూడా నిజమేనా..?"

మరో సారి అవునన్నట్టు తలూపింది.

అంతే. చాచి చెంప పేలి పోయింది. అసలే బలహీనంగా వుందేమో..బలమైన తోపుకి విస్సురుగా మూలకెళ్ళి పడింది. ఒక చిన్న మూటలా ముడుచుకుని చతికిల బడిపోయింది.

"ఛీ! నీకు సిగ్గేయడం లేదూ? ఇలాంటి నీచమైన బ్రతుకు బ్రతకడానికి? నీ ముఖం చూడాలంటేనే నా కసహ్యమేస్తోంది. ఫో.. నా ఇంట్లోంచి తక్షణం వెళ్ళి ఫో. ఒక్క క్షణం నువ్విక్కడున్నా నే సహించను..ఇప్పుడే..ఈ క్షణమే నువ్వు నీ కొడుకుని తీసుకుని ఫో.." ఆమె జుట్టు పట్టుకుని పైకి లేవదీయ బోయాడు.."

ఆమె చటుక్కున అతని పాదాల మీద పడి పోయింది. "ప్లీజ్ నన్నేమైనా అనండి. నా బిడ్డ..నా బిడ్డని మాత్రం..దయ చేసి..ఏమీ అనొద్దు..వాడు నిప్పు..నన్ను నమ్మండి.." ఆమె వెక్కుతూ చెప్పింది.

అతను చప్పున ఇటు గోడ వైపుకు తిరిగాడు. చేతులు వెనక్కి కట్టుకుని. మనిషంతా వుద్రేకంతో వూగిపోతున్నాడు. కపాడియ మాటలు మళ్ళీ మళ్ళీ చెవిలో మోగుతున్నాయి. మారు మోగుతున్నాయి.

ఆయన బోంబే నుంచి ఆనంద్ కోసం వచ్చాడు. ఆనంద్ సరదాగా అయన్నిక్కడికి తీసుకొచ్చాడు. పరిచయమైనప్పటినుంచి గమనిస్తున్నాడు. ఆయన తనకేదో సీరియస్ విషయమేదో చెప్పాలనుకుంటున్నాడు. చివరికి ఆనంద్‌కి తెలీకుండా తన చెవిలో రహస్యంగా చెప్పి పోయాడు. జాగ్రత్తా అంటూ! .

విన్న క్షణం నుంచి అతని మనసు మనసులో లేదు. ఇప్పుడేమిటి చేయడం! బాధగా – కణతలు రుద్దుకున్నాడు.

ఇక ఆమె ఉనికిని ససేమిరా భరించలేని వాడిలా గబగబా నడుచుకుంటూ ఇంట్లో కెళ్ళి తలుపులు మూసేశాడు.

గదిలో మంచం మీద చిన్నాని గుండెలకు హత్తుకుని..నిద్ర పోతున్న దేవకిని చూసి మొట్ట మొదటిసారి..అతను నిలువునా కదిలి పోయాడు.

" దేవీ..నువ్వే కాదు, ఈ సారి నేనూ భ్రమ పడ్డాను. మన మిద్దరం మోసపోయాం.. మోసపోయాం.." అనుకుంటూ.. చిన్నా వైపు చూసాడు.

వాడు కూడా సర్పమే కదూ! అవును. పాము కడుపున పామే పుడుతుంది. పవిత్ర మైన గోవెలా పుడుతుంది..

రాత్రి అతని కంటి మీద కునుకే లేదు. అతని పాలిట కాళ రాత్రయ్యింది.

తెల్ల తెల్ల వారొస్తోంది. కలత నిద్రలో వచ్చిన పీడకలకి వులిక్కి పడి లేచాడు. కళ్ళు తెరవగానే - శైలి గుర్తొచ్చింది. ఆమె నిర్మలమైన నవ్వు గుర్తొచ్చింది. స్వచ్ఛ మైన ఆమె స్నేహం గుర్తొచ్చింది. చేయి చాస్తే అందేంత దూరంలో సైతం తనని దూరంగా వుంచిన ఆమె నిజాయితీ గుర్తొచ్చింది. నిజంగా ఆమె మోసగత్తే ఐతే..శీలం లేనిదే ఐతె..తననెప్పుడో నే ట్రాప్ చేసేది కాదూ? ఒక వేళ ఆమె అలాంటిదే ఐతే మాత్రం? ఆమె పై చేయి చేసుకునే హక్కు తనకెక్కడిదనీ, తనంత పని చేసాడు. తను చేసింది తప్పు అని తెలిసాక మనిషన్న వాడు మౌనంగా వుండ లేడు. ఆమె తన పాదాలు పట్టుకుని..దీనంగా వేడుకోవడం గుర్తొచ్చి, మరింత సిగ్గుతో చితికి పోయాడు. తన ప్రవర్తనకి కుంచించుకు పోతూ....కదిలాడు. ఔట్‌హౌస్ లోపలకొచ్చాడు.

"శైలీ" అంటూ మెల్లగా పిలిచాడు. పలక లేదు. చుట్టు చూసాడు ఆమె లేదు. అతను కంగారుగా ఇంటి నాలుగు దిక్కులా కలియ చూసొచ్చాడు. లేదు. ఆమె ఎప్పుడు పడుకునే బెడ్ వైపు చూసాడు. అక్కడ వుంది. ఒక బరువైన కవరు దిండు మీద పెట్టి వుంది. అతను మెల్లగ చేతిలోకి తీసుకుని విప్పాడు.

అది శైలి తనకు రాసిన లేఖ..

వొణుకుతున్న చేతులతో.. ఆత్రంగా చదవ సాగాడు..

**********

మీకు!

నేనేమని రాయాలి!మీకు నేనెవరని నా గతమంతా చెప్పాలి?..అని అనుకున్నా.

కాని, నా గురించి మీకు ఏదైతే తెలియ కూడదనుకున్నానో అదంతా మీకు తెలిసి పోయాక..ఇక నేనేమైపోతానో నాకే తెలీనప్పుడు..మీకు అంతా నా కథంతా చెప్పడమే మేలనిపించింది.

అందుకే ఈ లేఖ మీకు!

ఒక దేవుని ముందు నిజాన్ని దాచగలమా! కళ్ళు మూసుకుందని న్యాయ దేవత కన్ను కప్పగలమా! మంచి వాళ్ళు కదా అని మీ ఇద్దర్నీ మోసం చేయ గలనా!

ప్రకాష్ ! మీరు నాకు దేవుడు. దేవుడిచ్చిన దేవుడు.

అందుకే..భక్తితో రెండు చేతులూ జోడిస్తూ మీ ముందు మోకరిల్లి చెప్పేస్తున్నా. తప్పు చేసానని ఒప్పుకుంటూ కాదు. చేయని తప్పుని సైతం నేనెలా తప్పించుకోలేక పోయానో చె బుతున్నా..

అంత కంటే ముందుగా నన్ను ఓ నిజాన్ని కూడా ఒప్పుకోనీయండి. కన్నీళ్ళతో ఒప్పుకోనీయండి.

అవును. నిజమే. మీరు నా గురించి విన్నది నూటికి నూరు పాళ్ళు నిజం. డాక్టర్ కపాడియా మీతో చెప్పిన విషయం పచ్చి నిజం. యెస్ . హీ ఈజ్ మై డాక్టర్. గత రెండేళ్ళుగా నేను ఆయన దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న మాట వాస్తవం. రహస్యం ఎందుకు దాచానంటే.. అవసరం కోసం. నేను బ్రతకడం కోసం కాదు. చిన్నాకి బ్రతుకు నీయడం కోసం..నేను నిజం దాచానే తప్పు, అబద్ధమాడ లేదు.

అసలిదంతా ఎలా జరిగిందో చెప్పే ముందు.. నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాని గురించి మీకు చెప్పాలి.

అతని పేరు నవ్‌తేజ్ .

నా జీవితంలోకి ఒక కొత్త కాంతిలా జొర బడ్డాడు. జర జరా పాకే ఎండా కాలం నాటి వెలుగులా ప్రవేశించాడు.

తొందర తొందరగా నా ఆలోచనలను చుట్టుకున్నాడు. నా సమయాన్ని కాజేసాడు. నా నిద్రని కాటేశాడు. కలలోను, మెలకువలో సైతం.. నా గుండె చప్పుళ్ళ లో అతని పేరు కొట్టుకునేది. నా కంటి పాపలో అతని రూపం కదలాడేది.

నా ఊపిరిలో ఊపిరిగా మారాడు. నది ఆగి ఆగి సాగేది, సాగరుడ్ని చేరడం కోసమేనన్నట్టు..నేను పుట్టి పెరిగింది ఇతగాని కోసమే ననిపించేది. అతనితో కలిసి జీవించడం ఏ మాత్రం ఆలస్య మైనా ఇక బ్రతకననిపించిందీ అంటే గొప్ప తనం నాది కాదు. అతనిది. అతని నన్ను ప్రేమించిన వైనానిది. ఈ ప్రపంచంలో ఇంకెవ్వరూ అంత గొప్పగా నన్ను ప్రేమించ లేరు అన్నంతగా ప్రేమించాడు!

అది మాత్రం నిజం. ఎంత అదృష్టమో కదూ!

కాని అతనికున్న ఒకే ఒక్క బలహీనత.. అదృష్టాన్ని కాల రాస్తుందని కాని, మా జీవితాలని బలిగొంటుందని కాని..నేనే కాదు, అతనూ ఊహించి వుండడు.

వృత్తి రీత్యా అతనో పేరు మోసిన మోడల్. ఆరడుగుల అందగాడు. నన్నాకట్టుకున్నవీ అతని నీలి కళ్ళే. .

అతనితో నా పెళ్ళి మా వాళ్ళ కిష్టం లేదు. ససేమిరా వీల్లేదన్నారు. వాళ్ళ ఇష్టానికి వ్యతిరేకంగా, వాళ్ళు రాకుండానే నా పెళ్ళి అతనితో జరిగిపోయింది.

నన్ను ప్రాణంగా చూసుకునే వాడు. కాలు కింద పెడితే కంది పోతానేమో ననేంత అపురూపంగా చూసుకునే వాడు. ఒక్క క్షణం దూరంగా జరిగి కూర్చున్నా ఒప్పుకునే వాడు కాడు. అంత ప్రేమ నా పైన.

నాకూ అప్పటి దాకా తెలీలేదు. ఏమనంటే..అతను నన్నెంతగా ప్రేమిస్తాడొ..అంతే స్థాయిలో తన బలహీనతనూ ప్రేమిస్తాడని.

అతనో పచ్చి తిరుగుబోతు అని చెప్పను కాని, అవకాశమొస్తే మాత్రం వొదులుకోడు. వెనకా ముందూ కూడా ఆలోచిస్తాడు. బలహీనత మీద అతనికి కంట్రోల్ లేదు.

అతని వీక్ పాయింట్ నాకెప్పుడు తెలిసిందంటే-

పెళ్ళైన రెండేళ్ళల్లో..రెండు సార్లు మిస్ కేరేజ్‌లయిన తర్వాత మూడో సారి తొమ్మిది నెలలూ బేడ్ మీదే వుండాల్సి వచ్చింది. సిజరియన్ జరిగింది. చిన్నా పుట్టాడు. అతని ఆనందానికి అవధుల్లేవు.

ఇంటికొచ్చాను. పసివాణ్ణి కంటికి రెప్పలా చూసుకునే వాడు. వాడితో ఎన్నొ కబుర్లు చెప్పేవాడు. వాడి పనులన్నీ స్వయంగా అతనే చేసేవాడు.

మూడు నెలలు రెస్ట్ తీసుకున్నాక మామూలు మనిషయ్యాను.

మా సంసార నౌక సాగుతోంది..చాలా సంతోషంగా.

ఆ రోజూ మాత్రం పెను తుఫానుకి చెదిరి పోయింది.

జ్వరం వచ్చి, ఎన్నాళ్ళకి తగ్గక పోతే..డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. రక్త పరీక్షలు చేయించా. రిజల్ట్ చూసాక, షాక్ తిన్నవాడిలా చూసాడు డాక్టర్ నా వైపు..

క్షణంలో అక్కడ భయం కర మైన వాతా వరణం కమ్ముకుంది.

"ఏమైంది డాక్టర్ ..?" భయంగా అడిగా.

ఆయన చెప్పింది విన్నాక భూమి బద్దలవడం అంటే ఏమిటో...గుండె పగిలి ఏడుపు ఆగి పోవడమేమిటో స్వయంగా అనుభవించా..

అప్పుడు కపాడియా చెప్పిన మాటలు ఇప్పటికీ ప్రతి క్షణం నా చెవిలో వినిపిస్తునే వున్నాయి..

.............................

ఇంటికెలా వొచ్చానో ఏమో ...

వుయ్యాల్లో చిన్నా అమాయ కంగా నవ్వు తున్నాడు. అదృష్టం కొద్దీ వాడికి తల్లి పాలు లేవు. ఇవ్వాలని నేనెంతగా కోరుకున్నా దేవుడు లేకుండా చేసి..వాడికి ఆయుష్షుని ఇచ్చాడు.

వాడితో డుతున్న నవ్‌తేజ్ నా వైపు చూసాడు.

"ఏమైంది అలా వున్నావ్?" అడిగాడతను. ద్రోహి. ప్రాణాలతో జీవితాన్ని అంతం చేస్తూ కూడా ఏమీ ఎరగనట్టు.. ఎలా అడగగల్గుతున్నాడు. అతని మొహం లో కి ఎంతసేపు చూపు నిలిపానో తెలీదు .. నా చేతులకి అంత శక్తి ఎక్కణ్ణుంచొచ్చిందో తెలీదు..

ఈడ్చి చెంప మీద కొట్టా.. తర్వాత అతని ముఖం మీద ఎంత బలంగా దాడి చేసానంటే అతని ముక్కులోంచి రక్తం ధారగా కారేలా..

"చెప్పు. ఎందుకిలా చేసావ్? నువ్వు చచ్చి, నన్ను చంపి..వీడ్నేం చేద్దామనుకున్నావ్?" అడిగాననుకున్నా కాని, అరిచా. ఏడ్చా . కాదు. స్పృహ తప్పి పడి పోయా.

నా శోకం సముద్రమైంది. ముంబాయి నగరం మునిగి పోయింది.

అతనికి ఎయిడ్స్ సోకిందన్న సంగతీ అతనికె తెలీదు. తెలిసాకా మనిషి జీవశ్చవమై పోయాడు. నాకైతే మరణించిన వాడే అయ్యాడు. కారణం నాకన్యాయం చేసినందుకు కాదు. నా బిడ్డకు తల్లి తండ్రులు లేకుండా చేసినందుకు. అనాధను చేసి అనామకుడిగా మార్చి నిర్దాక్షిణ్యంగా కన్నబిడ్డని ఈ అరణ్యంలో వొదిలేస్తున్నందుకు.. నేనీ జన్మలో అతన్ని క్షమించదలచుకోలేదు. తిరిగి అతని ముఖం చూడ దలుచుకోలేదు. క్షణం ఆలస్యం చేయకుండా..వెంటనే చిన్నాని

తీసుకుని అమ్మ దగ్గరి కెళ్ళాను. విషయం చెప్పి భోరుమన్నాను.

నాన్న ఛీ కొట్టాడు.' రేపు నువ్ చస్తే ఏ జబ్బుతో పోయావ్ అంటే ఏం చెప్ప మంటావ్ " అని అడిగాడు. ఎప్పుడో చావాల్సిన నన్ను ఆ రోజే నన్ను చంపేసాడు తన మాటలతో. అమ్మ అసహాయంగా చూస్తూ వుండి పోయింది..కళ్ళు తుడుచుకుంటూ..

జీవితంలో మొట్ట మొదటి సారిగా అర్థమైంది. మనిషి సంఘ జీవి కాదు. ఒంటరి జీవి అని. కష్టాలలో మనకు తోడై వుండేవి కన్నవాళ్ళు కాదు. కన్నీళ్ళని. మన బాధని పంచుకునేవి బంధువులు కాదు బెంగలు మాత్రమే నని మొట్ట మొదటి సారిగా తెలిసింది. ఈ జబ్బు బ్రతికున్నం త కాలమే కాదు, చచ్చి పోయాక కూడా చచ్చిన వాళ్ళని బాధిస్తుందని.

పసివాడితో.. ఇల్లు వొదిలేసాను. నాకెవరూ లేరని తోడు రారని అర్థమై పోయింది. ఇప్పుడు పూర్తిగా అర్థమై పోయింది.

కన్న కడుపు తీపి సైతం నన్ను తరిమి కొడుతోందీ అంటే..నా కొచ్చిన ఈ వ్యాధి ఎంత హీన మైనదో అర్థమైంది. నా శరీరం మీద నాకే జుగుప్స కలుగు తోంది. వెళ్ళి పోవాలి. ఎక్కడికో తెలీదు. కాని వెళ్ళాలి. తీరంలేని ప్రయాణం... లేని గూడు కోసం శోధనం మొదలైంది.

ఆతర్వాత బ్రతుకు తెరువు కోసం వేట మొదలైంది.

నే చదువుకున్న చదువు – ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో వుద్యోగాన్నిప్పించింది.

అక్కడ నా కొలీగ్ రాజ్యలక్ష్మి – తన కజిన్ , హైదరాబాద్ నుంచి వచ్చింది అంటూ నిషాని నాకు పరిచయం చేసింది.

మాటల్లోఆమె ఎంతో అదృష్ట వంతురాలనీ, అంత మంచి ఇంటిగల వారు దొరకడం ఆమె చేసుకున్న పుణ్యమని చెప్పింది. అంత మంచి మనుషు ల్ని, పిల్లల్ని తల్లిలా ప్రేమించే ఆమె వంటి స్త్రీని కాని తను చూడ లేదని పొంగిపో తూ చెప్పింది నా కొలీగ్ .

నిషా కూడా అవుననట్టు తలూపింది.

ఆ క్షణం నుంచి..నేను ఒక్క క్షణం కూడా నిద్ర పోలే దు. నా పరిస్థితి చెప్పి, నా బిడ్డని మీకు అప్పచెప్పలను కున్నా. నా గురించి విన్నాక వాడి మీద మీకు సదభి ప్రాయం కలుగుతుందా..? ఒక వేళ కలిగినా వాణ్ణి అనాధలా దయతో చూస్తారే కాని, సొంత బిడ్డలా ప్రేమించ గలరా ఎవరైనా..

వాడ్ని మీ హృదయాలకు చేరువ చేయాలి. అందుకే నేనో మార్గం ఎంచుకున్నా...అందుకు నాకు నిషా తప్ప మరెవరూ సాయం చేయ లేరు. అందుకే నిషాని కోరాను.

" నిషా..కొన్నాళ్ళు నీ ఇంట్లో వుంటాను నీకేమైనా అభ్యంతర మా?" అని.

" ఏమీ లేదు. నువ్వొస్తానంటే..నేనా ఇల్లు ఖాళీ చేసి నీకిస్తా...." అంది.

నేనాశించని జవాబు నాకు కొత్త ఊపిరి పోసింది. అంతలోనే ఆమె మాటలు విని ఆగి పోయా.

"అయితే, ఎంతిస్తావో చెప్పు. ఇల్లు నేను ఖాళీ చేసి నీకివ్వడానికి " అంటూ డీల్ మొదలు పెట్టింది.

ఎంతైనా సరే..ముందు అక్కడ చోటు చేసుకోవాలి.. తర్వాత అక్క తో స్నేహం చేసుకోవాలి..నా మంచి తనం నిజాయితీ మీద నమ్మకం కలిగాక..నా బిడ్డని దేవత చేతిలో పెట్టి కళ్ళు మూయాలి.

అప్పటికి అదే నా జీవిత ధ్యేయం.

ప్రకాష్ ! ఈ లోకంలో పుష్కలంగా డబ్బు దొరుకుతోంది. కాని, మనుషులే దొరకడం లేదు. మనుషుల్లో ప్రేమ శూన్యం. అందుకే..ఎంత డబ్బు ఖర్చైనా సరే ..మిమ్మల్ని చేరడం కోసం ఆమెతో ఒప్పందం చేసుకున్నాను. వందల్లో కాదు..లక్షల్లో ఆమెకి ధనాన్ని అంద చేసాను. ఐతే.. ఆమె ఓ షరతు పెట్టింది. ఖాళి చేయడం వరకే తన బాధ్యతంది. ఔట్‌హౌస్ దక్కించుకునే అవకాశం నా అదృష్టానికే వొదిలేస్తున్ననంది. కారణం..నేను ఆమె తాలుకు మనిషి నని తెలిస్తే ఇల్లివ్వ డానికి మీరు ససేమిరా ఒప్పుకోరన్న రహస్యం అప్పుడు బయట పెట్టింది. సరిగ్గా ఆ క్షణం లోనే నాకు తెలిసిపోయింది. ఆమె మీద మీకు సదభిప్రాయం లేదన్న సంగతి. సరిగ్గా ఇదే పాయింట్‌ని ఆధారంగా తీసుకుని, నన్ను బ్లాక్ మెయిల్ చేస్తూ మరింత డబ్బు గుంజింది.

తర్వాత జరిగిందంతా మీకు తెలిసిందే

ప్రకాష్ ఇప్పుడు చెప్పండి..నేను చేసిన పని తప్పంటారా..ఒక వేళ తప్పే అనుకుంటే.. శిక్ష నన్నే అనుభవించ నీండి.

కానీ, చిన్నా ని మాత్రం..మీ గుండెల్లో పెట్టుకుని చూసుకోండి..

మీరెన్నో సార్లు నన్నడిగే వారు. దేవకి పూర్తిగా ఆరోగ్యవంతు రాలైందీ అంటే అది చిన్నా వల్లనే అని..అందుకు ప్రతి ఫలంగా ఏం కావలన్నా ఇస్తాననే వారు గుర్తుందా..

ప్రకాష్ ..ఇప్పుడడుగుతున్నా...నా బిడ్డకి మీ తండ్రి ప్రేమ కావాలి..ఇస్తారు కదూ..

మీకు వొదిలేసి వెళ్తున్న ఈ చిన్నా నాకెంత ప్రాణమో తెలుసా ప్రకాష్ ..

వాడ్ని మీకు దగ్గర చేయడం కోసం నేనెంత శ్రమ పడ్డానో తెలుసా మీకు! .

మొదట్లో మీరు వాడ్ని విదిలించి చూస్తున్నప్పుడల్లా నా గుండెల మీద చర్నాకోల చరిచి నట్టుండేది..అవమానంతో తల కొట్టేసినట్టు మెడ వాలి పోయేది...

వాడు వెళ్ళనంటున్నా మీ ఇంటి వైపుకు బలవంతంగా తోసే దాన్ని. వాడి బిక్క మొహం చూసి ఎంతగా కుమిలి పోయేదాన్నో! ..

వాడు మీ కోపాన్ని చూసి వెనక్కి తిరిగొచ్చినప్పుడు..గుండెలకు హత్తు కోవాల్సింది పోయి, తీవ్రంగా కొట్టేదాన్ని. ఏడ్చి నిద్ర పోతున్న పసికందుని చూసి..నన్ను క్షమించమని వాణ్ణి వేడుకుంటూ..నిస్సహాయంగా....!!

అలాంటి పరిస్థితిలో - వాడ్ని ఎత్తుకుని, యెదకి హత్తుకునే అక్క నాకు ప్రత్యక్ష దేవతలా కనిపించింది.

ఆమే వాడి తల్లి అని, అమెనే అమ్మా అని పిలవాలని వాడికి శిక్షణ నిచ్చా.

వాడు మెల్ల మెల్లగా అక్కకి ఒక్కో మెట్టు దగ్గరౌతున్న కొద్దీ నా శరీరంలోంచి ఒక్కో ప్రాణం దూరమౌతున్నంతగా విలవిల్లాడి పోయే దాన్ని.

"శైలీ" అంటూ నా పేరుతో పిలిపించుకుంటూ నే పడ్డ నరకం నీకు తెలీదు. వాడు 'అమ్మా' అని అక్కని పిలిస్తూ వుంటే వింటున్న నాకు ఓ వైపు మనసు ఆనంద సాగర మయ్యేది. మరో వైపు దుఃఖార్నవం గా మారేది.

ఇప్పుడు నాకు ఎలాంటి బాధా లేదు ప్రకాష్ ! వాడికి నా కంటే కూడా, మంచి అమ్మా నాన్న లనిచ్చా . ఆనందంతో..తృప్తితో వెళ్ళిపోతున్నా.

ప్రకాష్ ..ఒక్కసారి..ఒకే ఒక్కసారి నా కొడుకుని.. కాదు నీ కొడుకుని చూడ్డం కోసం మళ్ళీ వస్తానేమో.. అప్పుడు నన్ను ఛొమ్మనవుగా!

రానిస్తావ్ కదూ..

మళ్ళీ జన్మ అంటూ వుంటే..మీ అందరి తో కలిసి జీవితాన్ని పంచుకునే సౌభాగ్యాన్ని కోరుకుంటూ..

శైలి.

***********

శైలి రాసింది చదివాక చాలాసేపు మనిషి కాలేక పోయాడతను.

బయట కొచ్చి, ఔట్‌హౌస్ తలుపులు మూసేసాడు.

చాలా కొన్నాళ్ళ తర్వాత -

ఇప్పుడా ఇల్లు ఎవరికీ అద్దె కివ్వడం లేదు. అదలాగే పడుంది.

చిన్నా ఒకటి రెండు సార్లు ఇంటి ముందు తచ్చా డి, లోపలికి తొంగి చూసాడు. అంతా చీకటి తప్ప వాడి కక్కడ ఎవ్వరూ కనిపించ లేదు. తర్వాత వెళ్ళ డం మానేసాడు.

బాల్కనీలో కూర్చున్న ప్రకాష్‌కి మాత్రం మె తరచూ శైలి వినే పాట గాల్లోంచి తేలి వినిపిస్తూ వుంటుంది.

' మెరి పెహ్‌చాన్ కా ఎక్ షక్ ఇసీ షె హర్ మే హై..

మై భీ జిందా హు జర ఉస్‌కో బతా దే కోయి..

మేరే ఖాబోన్ కా హర్ ఏక్ నక్ష్ మిటా దే కోయి..

సుఖే పత్తోం కా బచ ఢేర్ జల దే కోయి '

శైలి ఇప్పుడు ఎక్కడ వుందీ!..దిగులుగా అనుకున్నాడు.

అవును. ఎక్కడుంది!?

*************

సముద్రం ఎప్పటిలా లేదు. ఒక చిన్న సంద్రపుటల అలా కదిలింది. చాలా సాధారణంగా...సీసిమిక్ .. విధ్వంసాన్ని మోసుకొస్తోంది.

ఆమెకి అర్థమైపోయింది..!

అది మామూలు సముద్రపు పోటు కాదు..కనీ వినీ ఎరుగని విపత్తు...సునామి...జలప్రళయ సృష్టి..కాదు లయ..

తన జీవితంలో తన ప్రమేయం లేకుండా జరిగిన ఒక చిన్నతప్పుకి దేవుడు వేసే శిక్ష కూడ ఇలాగే విధ్వంసమే మిగిల్చి పోతుందా...

అయిపోయింది..సముద్రం రెండుగా చీలింది..ఒకటి కుంగుతూ..మరొకటి పొంగుతూ..

కను రెప్పపాటులో అనూహ్యంగా జరిగిపోయిన దుర్ఘటనలో అప్పటికే సగం జనం కొట్టుకుపోయారు...

మిగిలిన జనం పరుగులు తీస్తూ హహాకారాలతో భీతిల్లుతున్నారు. ప్రాణ భయంతో పరుగులు తీస్తున్నారు..

తరుముతున్న మృత్యువంత వేగంగా అతను పరిగెత్తలేక అతడు భయంతో పడిపోయాడు. రెండుకాళ్ళూ తడి ఇసుకలో లోతుకల్లా ఇరుక్కుపోయాయి. బయట పడాలన్న అతని ప్రయత్నాలన్ని బెడిసికొట్టాయి...

ఆమె అలాగే చూస్తోంది.. అతడి కళ్ళల్లో కనిపించిన చావు చూపు సునామి కంటేనూ భయానకంగా వుంది..

ఆ మరు క్షణంలో - ఆమె ఎక్కు పెట్టి వొదిలిన బాణంలా లేచింది. త్వరత్వరగా అడుగులేస్తోంది- స్థిరంగా చాలా స్థిరంగా.

ఐతే- సముద్రానికి దూరంగా మాత్రం కాదు.

అభిముఖంగా!

సునామిని తనలోకో..

తనలోని సునామిలోకో...

ఆహ్వానించుకుంటూనో, ఆలింగనం చేసుకుంటూనో..

అంతకంటె ముందే ఆమెని కప్పేస్తూ..కాదు..కాటేస్తూ- సముద్రం వురికింది.

తర్వాత -

ఇప్పుడక్కడ ఎవ్వరూ లేరు- అతను కాని.. ఆమె కానీ..జనం కాని..

ఏవీ లేవు-- భూమి కానీ, ఆకాశం కానీ..అణువు కాని, పరమాణువు కానీ.

ఇక అక్కడ ఎటుచూసినా..

సముద్రం తప్ప.!!

(సమాప్తం)